
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 309

గురువారం 30-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




### యమున నీటిని తాగే దమ్ముందా?

అమిత్ షా, రాహుల్‌కు కేజ్రీవాల్ సవాలు

-6లో

### 'ఆప్'ను ప్రజలు క్షమించరు

కేజ్రీవాల్‌పై మోదీ మండిపాటు

-6లో



## మెడికల్ పీజీలో లోకల్ కోటా రాజ్యాంగ విరుద్ధం

- పీజీకి దేశమంతా ఓపెన్ కేటగిరీ
- స్థానిక కోటా ఎంబీబీఎస్‌కే పరిమితం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో రాష్ట్రాలు స్థానికత ఆధారంగా కోటాను అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. స్థానిక కోటాను అనుమతిస్తే.. అది అభ్యర్థుల ప్రాథమిక హక్కులను అతిక్రమించడమే అవుతుందని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భాటిల ధర్మాసనం పేర్కొంది. 'మనం దరం భారత్‌లోని ఏదో ఒక ప్రదేశంలో స్థానికులమే. భారతీయ పౌరులం.దేశంలో నివసించే వాళ్లమే. దేశ పౌరులుగా దేశంలో ఎక్కడైనా

మిగతా 3వ పేజీలో ▶

## 'ఇస్రో' సెంచరీ

# 100



జీఎస్ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతం

ఇప్పటివరకు 100 ప్రయోగాలను పూర్తి చేసి **548** ఉపగ్రహాలను నింగిలోకి పంపిన ఇస్రో

దిగ్విజయంగా కక్ష్యలోకి చేరిన నావిక్-02 ఉపగ్రహం

అందుబాటులోకి రానున్న అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థ

- వివరాలు 6లో ▶



### వక్ఫ్ ముసాయిదా నివేదికకు జేపీసీ ఆమోదం

**అభ్యంతరం వ్యక్తంచేసిన విపక్షాలు**

వక్ఫ్ సవరణ బిల్లును సమీక్షించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఎట్టకేలకు తమ ముసాయిదా నివేదికను బుధవారం ఆమోదించింది. ముసాయిదా నివేదిక ఆమోదం కోసం నిర్వహించిన ఓటింగ్‌లో 15 మంది సభ్యులు అనుకూలంగా, 11 మంది వ్యతిరేకంగా ఓటేశారు. నివేదికను గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేస్తాం అని, శుక్రవారం మొదలయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఇరుసభల్లో ప్రవేశపెట్టనున్నట్లు బీజేపీ నేత జగదాంబికాపాల్ చెప్పారు.

- వివరాలు 6లో ▶

# 'మహా' విషాదం

**కుంభమేళాలో తొక్కిసలాట | 30 మంది మృతి | 60 మందికి గాయాలు**



తెల్లవారుజామున మూడు గంటల సమయం.. బ్రహ్మ ముహూర్తంలో పుణ్యస్నానాలు చేసేందుకు 'సంగమ్ నోస్' ఘాట్ వద్ద వేచిచూస్తున్న లక్షలాది మంది భక్తులు.. ఒక్కసారిగా బారికేడ్లకు అటువైపు పెరిగిన భక్తుల రద్దీ.. వారంతా పక్కన కూర్చున్న వారిపై పడటంతో అంతా హాహాకారాలు.. ఏం జరిగిందో తెలియని పరిస్థితి.. పోలీసులు కిందపడినపోయిన 90 మందిని తాత్కాలిక సెంట్రల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో 30 మంది ప్రాణాలు వదిలారు. 60 మంది గాయపడ్డారు. అత్యంత పవిత్రమైన మౌని అమావాస్య రోజు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిద్దామని మహాకుంభమేళాకు వచ్చిన కొందరు భక్తులు అనూహ్యంగా జరిగిన తొక్కిసలాటకు బలవటం విషాదాన్ని మిగిల్చింది. స్నానఘట్టాల్లో భక్తకోటి శరణుఘోషకు బదులు మృత్యుఘోష వినిపించింది.

తొక్కిసలాటలో గాయపడిన భక్తులను ఆస్పత్రికి తరలిస్తున్న భద్రతా సిబ్బంది. (ఇన్‌సెట్) విలపిస్తున్న బాధితులు

6 లో

## సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి

**నేటి యువత '4సీ' సూత్రాన్ని పాటించాలి**

- ఏ రంగంలోనైనా కాలానుగుణంగా మార్పులు సహజం.. మార్పులు, సవాళ్లు ఎదుర్కొనేందుకు యువత సిద్ధంగా ఉండాలి
- ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు సొంతం చేసుకుంటూ ముందుకుసాగాలి
- ఇన్ఫోసిస్ కూడా 20 ఏళ్ల సాదాసీదా కంపెనీగానే కొనసాగింది .. ఐటీలో నిరంతర కొత్త నైపుణ్యాలు దశాబ్దాలుగా వస్తూనే ఉన్నాయి
- ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఏ మాత్రం సరికాదు

**'సాక్షి' ఇంటర్వ్యూలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈఓ ఎస్‌డీ శిబులాల్**

డి.ఎస్.పవన్‌కుమార్, సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్



మారుతున్న పరిస్థితుల్లో ఏ రంగంలోనైనా కాలానుగుణంగా మార్పులు సహజమని, వీటిని ఎదుర్కొనేందుకు యువత సిద్ధంగా ఉండాలని ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆ సంస్థ మాజీ సీఈఓ ఎస్‌డీ శిబులాల్ చెప్పారు. అవసరమైనప్పుడల్లా కొత్త నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు, కెరీర్‌లో ముందుకు సాగేందుకు కృషి చేయాలని అన్నారు. ఇన్ఫోసిస్ లాంటి అగ్రశ్రేణి సంస్థ కూడా తొలినాళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, పాతికేళ్లు సాధారణ ఐటీ సంస్థగానే ఉందని తెలిపారు. వ్యక్తులకైనా, సంస్థలకైనా సవాళ్లు సహజం అంటూ, వాటిని ధీటుగా ఎదుర్కొనే సామర్థ్యాన్నిసొంతం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత సహనం, ప్రణాళికలతో అడుగులు వేయాలని చెప్పారు. శిబులాల్ కుటుంబం ఫిలాంత్రఫిక్ ఇనిషియేటివ్స్ పేరుతో ఓ ఎన్‌జీఓను నెలకొల్పింది. 'విద్యాధన్' పేరుతో.. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు

మిగతా 2వ పేజీలో ▶



### జమ.. ఖర్చుల్లో.. ఆమె ఎక్కడ?

మహిళలకు బడ్జెట్‌లో స్థానం కల్పించాలని 'జెండర్ బడ్జెటింగ్' పేరుతో ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ప్రపంచానికి వినిపించేలా గళమెత్తింది. ఆ ప్రాధాన్యాన్ని గ్రహించిన దేశాలు భారత్ సహా జెండర్ బడ్జెట్ మీద దృష్టిపెట్టాయి! కానీ కొన్నేళ్లుగా మన దగ్గర ఆ పదం వినిపించకుండా పోవడమే కాదు... బడ్జెట్‌లో మహిళలు కనిపించడమూ తగ్గుతోంది. ఫిబ్రవరి 1న కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్న సందర్భంగా 'జెండర్ బడ్జెటింగ్' మీద పలు రంగాల్లోని మహిళా నిపుణుల అభిప్రాయాలు...

- వివరాలు 13లో ▶

## 10లోగా పర్యాటక పాలసీ

**బహుళజాతి కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా రూపొందించండి**

- టూరిజం శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో విధానాలపై అధ్యయనం చేయండి
- కవ్వాల్, అమ్రాబాద్‌లలో సఫారీ టూరిజం.. మేడారం-రామప్ప-లక్నవరం సర్క్యూట్.. సాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్‌లు
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డు సత్వరం ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సంబంధించి సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి పదో తేదీలోగా సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాలను ప్రాతిపదికగా చేసుకొని పాలసీని రూపొందించాలని సూచించారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం ఈ అంశంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న పర్యాటక పాలసీలపై అధ్యయనం చేసి, అనుసరించదగ్గ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రానికి దేశీ, విదేశీ పర్యాటకులు వచ్చేలా చూడాలన్నారు. పర్యాటక రంగంలో బహుళ జాతి కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీ ఉండాలని, దీనితో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు ఏర్పడి, పర్యాటకులను

మిగతా 12వ పేజీలో ▶

### 2న 'సమగ్ర సర్వే' నివేదిక

- మంత్రివర్గ ఉప సంఘానికి అందజేస్తామన్న అధికారులు
- ఈ అంశంపై సమీక్షించిన సీఎం రేవంత్

- 5లో ▶



పర్యాటక పాలసీపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి, సీఎస్ శాంతికుమారి, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్

### మోగిన 'ఎమ్మెల్సీ' నగారా

- ఏపీ, తెలంగాణలో పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు ఎన్నికలు
- ఫిబ్రవరి 27న ఆరు స్థానాలకు పోలింగ్, మార్చి 3న కౌంటింగ్
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

2 లో



### తిలక్.. పైపైకి..

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్, హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో తిలక్ ఒక స్థానం మెరుగుపరుచుకొని మూడు నుంచి రెండో స్థానానికి చేరుకున్నాడు. తిలక్ ఖాతాలో 832 రేటింగ్ పాయింట్లున్నాయి.

- వివరాలు 14లో ▶



## రైతులకు 'సౌర' పంట!

**సొంత భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు**

- 3 వేల మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు రైతులకు అవకాశం
- ఎస్‌హెచ్‌జీలతో వెయ్యి మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు
- ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించిన రెడ్కో
- ఒక మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు రూ.2.97 కోట్ల వ్యయం
- ఎస్‌హెచ్‌జీలకు 90%, రైతులకు 70% రుణ సదుపాయం
- యూనిట్ విద్యుత్ రూ.3.13కు డిస్కంల కొనుగోలు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించింది. రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, రైతుల గ్రూపులు, నీటి వినియోగ సంఘాలు, డెవలపర్లు, ఎస్‌హెచ్‌జీల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరింది. రైతులు, ఇతరుల ఆధ్వర్యంలో 3 వేల మెగావాట్లు.. ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో 1,000 మెగావాట్ల సామర్థ్యంగల ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

**సొంత భూముల్లో కరెంటు ఉత్పత్తి**



ఎస్‌హెచ్‌జీలు, రైతులు వ్యక్తిగతంగా లేదా ఇతరులతో కలిసి తమ పొలాల్లో 0.5 మెగావాట్లు నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పటానికి అవకాశం కల్పించారు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ భూములను లీజుకు ఇచ్చి ప్లాంటు పెట్టించవచ్చు. లీజుకు ఇస్తే లీజు డబ్బును డిస్కంలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తాయి. ఒక మెగావాట్

మిగతా 5వ పేజీలో ▶

### ఇదంతేసంగతి




ఢిల్లీ ఎన్నికల్లో కూడా మన సహకారం అందించి గెలిపించమంటున్నాడ్సార్

# బంగారు కొండే!




**రోజురోజుకు కొత్త రికార్డులతో దూసుకెళ్తున్న పుత్తడి ధర**

- ట్రంప్ సుంకాల మోత.. ఆర్థిక అనిశ్చితి ఎఫెక్ట్
- అమెరికా ఫెడ్ రేట్ల కోత, పాజ్ చేయడం కూడా కనకానికి సానుకూలమే
- రూపాయి విలువ తగ్గడంతోనూ ధరలకు ఆజ్యం
- ఈ ఏడాది అంతర్జాతీయంగా ఔన్సు 3,150 డాలర్లను తాకవచ్చంటున్న విశ్లేషకులు
- తులం బంగారం లక్ష రూపాయలను తాకడం ఖాయమనే అంచనాలు

సాక్షి, బిజినెస్ డెస్క్

బంగారం వెలుగులు విరజిమ్ముతోంది. తగ్గేదేలే అంటూ రోజురోజుకు కొత్త రికార్డులతో దూసుకుపోతోంది. తాజాగా ఢిల్లీలో తులం మేలిమి బంగారం ధర రూ.83,750కు ఎగబాకింది. ఇది ఇన్వెస్టర్లకు కనకవర్షం కురిపిస్తుంటే.. కొత్తగా నగలు కొనుక్కోవాలనుకునే వారికి మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. దీంతో కనకం ఇంకెన్ని కొత్త శిఖరాలకు చేరుతుందోనన్న ఉత్కంఠ పెరిగిపోతోంది.

**ఎందుకీ ర్యాలీ..:**

అంతర్జాతీయంగా చూస్తే బంగారం ఔన్స్ (31.1 గ్రాములు) ధర ఈ నెల 24న సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 2,822 డాలర్లను తాకింది. గత ఏడాది నవంబర్ 5న నమోదైన 2,541 డాలర్ల కనిష్ఠం నుంచి ఏకంగా 281 డాలర్లు ఎగబాకింది. ముఖ్యంగా ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలకు మళ్లీ తెర తీస్తారనే భయాలు పెరిగిపోయాయి. అనుకున్నట్లే ముందుగా కెనడా, మెక్సికోలపై దిగుమతి సుంకాల మోత మోగించారు. చైనా, భారత్‌తోపాటు మరిన్ని దేశాలపైనా సుంకాలు పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. ఇది అంతర్జాతీయంగా ఆర్థిక

మిగతా 12వ పేజీలో ▶

▶ మొదటి పేజీ తరువాయి

స్కాలర్‌షిప్పులు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం హైదరాబాద్‌కు వచ్చిన శిబులాల్‌తో.. 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

### మార్పులు ఆహ్వానించాలి

- ఒకే సంస్థలో ఉన్నా హోదా మారే కొద్దీ విధుల్లో మార్పులు, కొత్త సవాళ్లు, కొత్త అంశాలను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత సహజం. దీన్ని నేటి యువత గుర్తించాలి.
- ఇన్ఫోసిస్‌లో మూడేళ్లకోసారి నా హోదా మారేది. అలా మారినప్పుడల్లా ఆ హోదాకు తగినట్లుగా విధులు నిర్వర్తించేందుకు వీలుగా కొత్త అంశాలు నేర్చుకున్నా.

### ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్.. నాట్ ఫర్ ఎవ్రీబడీ

- ప్రస్తుతం దేశంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంస్కృతి పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే నా ఉద్దేశంలో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఈజ్ నాట్ ఫర్ ఎవ్రీబడీ'. ఈ మాట ఎందుకు అంటున్నానంటే.. సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలంటే అత్యంత కీలకమైన లక్షణం సహనం. నేటి యువతలో అది లోపిస్తోంది.
- చాలామంది ఇన్‌స్టంట్ ఫలితాలు ఆశిస్తున్నారు. అందుకే పలు వెంచర్స్.. ఫెయిల్యూర్ వెంచర్స్‌గా మారుతున్నాయి.
- మా రోజుల్లో ఫండింగ్ సంస్థలు లేవు. కానీ ఇప్పుడు పదుల సంఖ్యలో ఏంజెల్ ఇన్వెస్టర్స్.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రొడక్ట్స్‌ను అందించే స్టార్టప్స్‌కు ఫండింగ్ ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. కానీ స్టార్టప్ ఔత్సాహికుల్లో సహనం ఉండట్లేదు. ప్రణాళిక ఉండట్లేదు.

### ఏఐతో కొత్త ఉద్యోగాలు

- ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఏ మాత్రం సరికాదు. ఈ సాంకేతిక నైపుణ్యాన్ని పొందితే లక్షల ఉద్యోగాలు లభిస్తాయని గుర్తించాలి.
- ఐటీలో నిరంతరం కొత్త టెక్నాలజీల ఆవిష్కరణ అనేది దశాబ్దాలుగా జరుగుతోంది. ఉదాహరణకు కంప్యూటర్స్‌నే పరిగణనలోకి తీసుకుంటే మొదట్లో కంప్యూటర్స్ అంటే కేవలం డేటా సేకరణకే వినియోగించారు. తర్వాత అవి.. డేటా క్రియేషన్, డేటా ఇంటర్వెన్షన్ ఇలా ఎన్నో విభాగాలకు విస్తరించాయి.

# సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి



### సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడం వల్లే టాప్‌లోకి..

ఇన్ఫోసిస్ తొలినాళ్లలో ఎన్నో ఒడిదుడుకులకు గురైంది. ముఖ్యంగా క్లయింట్స్‌కు ఐటీ ఆవశ్యకతను వివరించడం, వారిని మెప్పించడం, వాటికి మా సంస్థ ద్వారా సేవలకు అంగీకరింపజేయడంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. పాతికేళ్ల సంస్థ చరిత్రలో దాదాపు 20 ఏళ్లు సాదాసీదా కంపెనీగానే ఉంది. కానీ అన్ని సవాళ్లను ఎదుర్కోగలిగే సమర్థవంతమైన బృందంగా పని చేయడం వల్ల ఇప్పుడు టాప్ కంపెనీగా గుర్తింపు పొందుతోంది. ఇప్పుడు మనం చూస్తున్న ఇన్ఫోసిస్ ప్రస్థానాన్ని ఇన్ఫోసిస్ 2.0గా చెప్పొచ్చు.

- ఐటీలో కూడా కంప్యూటర్ ఆపరేషన్స్‌తో మొదలై.. ఇప్పుడు కోడింగ్, ప్రోగ్రామింగ్‌లు ఎంత ముఖ్యంగా మారాయో మనం చూస్తున్నాం.

### 4'సీ' సూత్రాన్ని పాటించాలి

- నేటి తరం యువత కెరీర్‌లో ముందుకు సాగేందుకు 4సీ సూత్రాన్ని (కరేజ్, కేపబిలిటీ, కెపాసిటీ, కమిట్‌మెంట్) అమలు చేసుకోవాలి.
- మానసికంగా ఈ లక్షణాలు ఉంటే వృత్తి పరంగా ఎలాంటి నైపుణ్యాలనైనా ఇట్టే సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా సమస్యలను, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం లభిస్తుంది.
- దేశంలో కెరీర్ పరంగా ఇప్పుడు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికీ 80 శాతం మంది ఎంప్లాయర్స్ జాబ్ రెడీ స్కిల్స్ ఉన్న యువత కోసం ఎదురు చూస్తున్నారు. ఈ స్కిల్స్‌ను సొంతం చేసుకుంటే.. ఉద్యోగ రేటు వృద్ధి చెందుతుంది.

### గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లిష్‌పై పట్టు ముఖ్యం

- ప్రస్తుత విద్యా వ్యవస్థలో బేసిక్ సైన్సెస్‌ను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. పాఠశాల స్థాయి నుంచే దీన్ని ఆచరణలో పెట్టాలి. ఫలితంగా విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరిగి, భవిష్యత్తులో పరిశోధనలు, ఆవిష్కరణలకు దారి తీస్తుంది.
- నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లోని ఫ్లెక్సిబుల్ లెర్నింగ్, మల్టీ డిసిప్లినరీ అప్రోచ్, స్కిల్ ట్రెనింగ్ వంటి అంశాలు పరిశీలిస్తే.. ఈ విధానం మన యువతకు ఎంతో అవసరం అనేది అవగతం అవుతుంది. ఇంగ్లిష్ మీడియం అనేది గ్లోబల్ లాంగ్వేజ్. దానిపై పట్టు సాధించడం నేటి పరిస్థితుల్లో ఎంతో ముఖ్యం.

### డ్రాపౌట్స్‌ను తగ్గించమే ప్రధాన లక్ష్యం

11, 12 తరగతుల స్థాయిలో డ్రాపౌట్స్‌ను తగ్గించడమే మా లక్ష్యం. 1990లలో భారత గ్రామీణ ప్రాంతంలోని తల్లిదండ్రులు..పదో తరగతి పూర్తయ్యాక మగ పిల్లలను పనికి తీసుకెళ్లాలని, ఆడ పిల్లలైతే పెళ్లి చేయాలనే ధోరణితో ఉండేవారు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఉండరనే ఉద్దేశంతోనే ఎస్ఎఫ్‌పీఐని ప్రారంభించాం. 11, 12 తరగతుల విద్యార్థులకు ప్రోత్సాహకం అందిస్తున్నాం.

### సైన్స్ అంటే ఇష్టం.. కానీ కంప్యూటర్స్‌లోకొచ్చా..

వాస్తవానికి నాకు బేసిక్ సైన్స్ అంటే ఇష్టం. మా నాన్న మాత్రం నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. అయినా నా ఇష్టాన్ని కాదనలేదు. కేరళ యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ చేశా. వెంటనే అప్పటి బాంబే ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ విధులు మాత్రం కంప్యూటర్స్‌కు సంబంధించినవి. నా జీవితంలో నాకు ఏమైనా సవాళ్లు, సమస్యలు ఎదురయ్యాయి అంటే నా తొలి ఉద్యోగంలోనే. వాటిని తట్టుకోవాలనే సంకల్పంతో, కంప్యూటర్ సైన్స్ భవిష్యత్తు ఆవశ్యకతను గుర్తించి అందులో పీజీ చదవడానికి సిద్ధమయ్యా. బోస్టన్ యూనివర్సిటీలో ఎమ్మెస్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశా. పత్ని కంప్యూటర్స్‌లో సిస్టమ్స్ ఇంజనీర్‌గా అడుగు పెట్టా. అక్కడే నారాయణ మూర్తితో పరిచయం ఏర్పడడం, ఇన్ఫోసిస్ స్థాపనలో పాలుపంచుకోవడం జరిగింది. ఇలా కెరీర్ అవసరాలకు అనుగుణంగా తమను తాము మలచుకోవడం నేటి యువతకు ఎంతో ముఖ్యం. అప్పుడే ఉన్నత స్థానాలు, కోరుకున్న హోదాలు లభిస్తాయి.

### సంపాదనలో కొంత సమాజ సేవకు

కేరళలో పుట్టి పెరిగిన నాకు.. చిన్నప్పటి నుంచి చదువు విషయంలో, ఇతర విషయాల్లో ఎందరో తోడ్పాటు అందించారు. అదే స్ఫూర్తితో మా సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు, అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలకు కేటాయించాలని భావించాం. అందుకే 1998లో శిబులాల్ ఫ్యామిలీ ఫిలాంత్రఫిక్ ఇనిషియేటివ్స్ (ఎస్ఎఫ్‌పీఐ) పేరుతో ప్రత్యేక సంస్థను నెలకొల్పి విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. విద్యార్థులకు తోడ్పాటునందిస్తే.. వారితోపాటు, దేశం కూడా వృద్ధి చెందుతున్న ఆలోచనతో విద్యా రంగాన్ని ఎంచుకున్నాం. ప్రస్తుతం పది వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోంది

**పార్టీ సొంతంగా బలపడడమే తొలి ప్రాధాన్యం**
**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**



మీడియాతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: శ్రామి క, అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఉద్యమ కా ర్యాచరణకు సిద్ధమవుతున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెల్లడించారు. ప్రజాసమస్యలపై కాంగ్రెస్ లేదా మరే పార్టీ అధికారంలో ఉన్నా రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శ్రామికవర్గానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని, రైతుభరోసా, కూలీ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు వంటి వాగ్దానాలు ఏవీ కూడా సరిగ్గా అమలు కాలేదని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని, కొత్త ఉద్యోగాల కల్పన ఊసేలేదన్నారు. బుధవారం ఎంబీభవన్‌లో సీపీఎం పూర్వ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఇతర నాయకులతో కలిసి జాన్‌వెస్లీ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారివర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సబ్‌ప్లాన్ నిధులు అమలు కావడం లేదన్నారు. బీసీల సమస్యలపై బాధిత వర్గాలను సంఘటితం చేసి బలమైన ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో సొంతంగా బలపడే కార్యాచరణ అమలే పార్టీ తొలి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ రూపంలో వస్తున్న ప్రమాదాన్ని గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడతామన్నారు. బీజేపీ పట్ల బీఆర్‌ఎస్ తన రాజకీయ విధానాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ పెరుగుదల వర్గపోరాటంపైనే ఆధారపడి ఉందని, మతోన్మాదం, సరళీకృత ఆర్థిక విధానాలు, కులవివక్ష వంటి వాటిపై సీపీఎం పోరాడుతోందని తమ్మినేని వీరభద్రం తెలిపారు. వెస్లీ దళితుడు కాబట్టి కార్యదర్శి చేశారనేది సరికాదని, చిన్ననాటి నుంచి ఎంఎల్ పార్టీలో, ఆ తర్వాత సీపీఎంలో రాజకీయ నిర్మాణ నైపుణ్యంతో ఎదిగిన తీరుకు ఆయన్ను ఏకగ్రీవంగా పార్టీ ఎన్నుకుందన్నారు.

**కలిసి పనిచేద్దాం.. జాన్‌వెస్లీకి టీపీసీసీ అధ్యక్షుడి అభినందన**

లౌకికభావ సిద్ధాంతాలతో కలిసి పనిచేద్దామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్.. సీపీఎం తెలంగాణ కొత్త కార్యదర్శి జాన్‌వెస్లీని కోరారు. నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీకి బుధవారం ఉదయం మహేశ్‌గౌడ్ ఫోన్ చేసి అభినందించారు. మతతత్వ శక్తులను, అవినీతిపరులైన నియంతలను ఓడించేందుకు కలిసి పనిచేద్దామని ఈ సందర్భంగా జాన్‌వెస్లీని కోరారు.

## 'ఇందిరమ్మ'కు ఏఐ సాంకేతికత

**మంత్రి పొంగులేటి ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అక్రమాలకు అవకాశం లేకుండా, లబ్ధిదారులకు మేలు కలిగేలా ఆధునిక సాంకేతికతను వినియోగించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు ఏఐని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం సచివాలయంలో ఆయన పథకం అమలుపై ఆయన సమీక్షించారు. లబ్ధిదారుల ఎంపికలో యాప్ కీలకంగా వ్యవహరించిందని, ఇప్పుడు ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ, లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెల్లింపులో ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలన్నారు. యాప్ ద్వారా గుర్తించిన లబ్ధిదారుల జాబితాలో ఇంకా అనర్హులు ఉంటే, ఆ వివరాలను ఏఐ ద్వారా నిగ్గు తేల్చాలని సూచించారు. 72 వేల మందికి ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసినందున, తొలివిడత ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా చూడాలని కోరారు.

## క్లుప్తంగా...

### గ్యారంటీలు, హామీలు అమలు చేయండి

**సీఎంకు బండి సంజయ్ బహిరంగ లేఖ**



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల హామీతోపాటు ప్రజలకు చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ఈ నెలాఖరులోగా అర్హులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను కేటాయించి తమ హామీని నిలబెట్టుకోవాలన్నారు. కేంద్రమే ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్న నేపథ్యంలో ఇది ప్రజలకు తెలిసేలా రేషన్ షాపుల వద్ద, రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటోను కూడా ఉంచాలని కోరారు. దీంతోపాటు పీఎంఏవైలో భాగంగా మంజూరయ్యే ఇళ్లకు ఆ పేరును కొనసాగించాలని సూచించారు. అలా జరగని పక్షంలో ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈనెల 26 నుంచి నాలుగు పథకాలు అమలు చేస్తామని ప్రకటించినా, ఈ పథకాలు అందించేందుకు రాష్ట్రంలో 12,991 గ్రామ పంచాయతీల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను మాత్రమే ఎంపిక చేయడం ఏమిటని బండి ప్రశ్నించారు.

### రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేద్దాం: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి కోసం పార్లమెంటు వేదికగా.. రాష్ట్ర ఎంపీలంతా కలిసి పని చేద్దామని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఆయన గాంధీభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.1.63 లక్షల కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి వినతి పత్రాన్ని ఇవ్వడాన్ని గుర్తు చేశారు. రైతు ధర్నా పేరుతో నల్లగొండలో బీఆర్‌ఎస్ చేపట్టిన ధర్నాను.. అక్కడి ప్రజలే పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. సద్విమర్శలు చేయకుండా.. ప్రతీ అంశాన్ని బీఆర్‌ఎస్ రాజకీయంగా చూస్తోందని ఆరోపించారు. దావోస్‌లో పెట్టుబడులపై కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. పద్మ అవార్డుల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ అలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన ఇంకా కార్పొరేటర్ కాదని 'చామల' ఎద్దేవా చేశారు.

### ఓబీసీ కులగణన జరిపించాలి

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్**



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కుల గణన జరిపించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ముంబైలోని బీఆర్ అంబేడ్కర్ సమాధి చైత్య భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ముంబైలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. ముంబై వలస జీవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను శ్రీనివాస్‌గౌడ్‌కు వివరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ ముంబై ప్రధాన కార్యదర్శి శివరాజ్ బొల్లె, కురుమ సంఘం నేత జెట్టా కృష్ణ తదితరులు ఉన్నారు.

## శాఖలవారీ పని విభజన

**బడ్జెట్ సెషన్‌లో ఒక్కో ఎంపీకి ఒక్కో అంశం అప్పగించనున్న కాంగ్రెస్**
**ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధులు తెచ్చేందుకు కృషి చేయాలని ఎంపీలకు సీఎం రేవంత్ సూచన**
**బీజేపీ ఎంపీలతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లే యోచన..**
**త్వరలోనే పార్టీ ఎంపీలతో సమావేశం**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్ట నున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అవసర మైన నేపథ్యంలో ఆ నిధులను రాబట్టేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ 'పనివిభజన' చేయనుంది. రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల వేదికగా ఈ నిధులను వీలున్నంతవరకు రాబట్టే దిశగా పార్టీకి చెందిన 8 మంది లోక్‌సభ, ఇద్దరు రాజ్యసభ ఎంపీలకు అంశాల వారీగా బాధ్యతలు అప్పగించాలని యోచిస్తోంది. ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్‌సిటీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీవరేజ్ మాస్టర్ ప్లాన్, ట్రిపుల్ ఆర్ చుట్టూ రైల్వేలైన్ తదితర అంశాల వారీగా ఆయా శాఖలకు చెందిన కేంద్ర మంత్రులను కలిసి నిధుల కోసం ఒత్తిడి తెచ్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధులు తెచ్చే బాధ్యతలను ఎంపీలు తీసుకోవాలని, ఆ దిశగా మంచి కృషి జరగాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే నిర్దేశించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పార్టీ ఎంపీలతో భేటీ అయి అంశాలు, శాఖల వారీగా పనివిభజన చేయనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రానికి నిధులు తెచ్చే విషయంలో ఎలాంటి భేషజాలకు వెళ్లేది లేదని, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో 8 మంది బీజేపీ ఎంపీలను కూడా ఈ విషయంలో సమన్వయం చేసుకుంటామని, ఎంఐఎం సభ్యుడిని కలుపుకొని ముందుకెళ్తామని ఒక కాంగ్రెస్ ఎంపీ వెల్లడించారు. గత ప్రభుత్వం తరహాలో మొండిగా వ్యవహరించబోమని, నిధులు రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

## అనుభవరాహిత్యంలో రేవంత్‌కు సాటి లేరు

**ఎమ్మెల్సీ మధుసూదనాచారి**



సాక్షి, హైదరాబాద్: అనుభవరాహిత్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి సాటి వచ్చే వారెవరూ లేరని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రేవంత్ పలాయనవాద వైఖరిని అవలంబిస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య, మెతుకు ఆనంద్‌తో కలిసి మధుసూదనాచారి బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసు, మాఫియా పాలన తెచ్చేందుకే పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రేవంత్ సమీక్షలు చేస్తున్నారన్నారు. దావోస్‌లో గతేడాది కుదిరిన రూ.40 వేల కోట్ల ఒప్పందాల్లో కనీసం రూ.10 వేల కోట్ల పెట్టుబడులు కూడా రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. అనంతగిరి అడవులను మేఘా సంస్థకు రేవంత్ రూ.వేయి కోట్లకు ధారాదత్తం చేశారని మెతుకు ఆనంద్ ఆరోపించారు. అనంతగిరి అడవుల పరిరక్షణ కోసం త్వరలో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.

## 'టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థుల విజయానికి సమైక్య కృషి'

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 27న జరిగే వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానం నుంచి అశోక్ కుమార్ విజయానికి సమైక్యంగా కృషి చేయాలని టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ సంఘాలు ఉమ్మడి అవగాహనకు వచ్చాయి. ఈ రెండు సంఘాల నేతలు బుధవారం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. ఇద్దరు నేతలు ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు చావా రవి తెలిపారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ నేతలు సీహెచ్ అనిల్ కుమార్, వెంకట్, తిరుపతి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరయ్యకు సీపీఎస్ ఉద్యోగుల మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ - మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్న మల్క కొమరయ్యకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం మద్దతు ప్రకటించింది. ఆ సంఘం నేతలు హన్మండ్ల భాస్కర్, పుప్పాల కృష్ణకుమార్ ఈమేరకు కొమరయ్యను కలిశారు. ఆయన విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎస్సీ వర్గీకరణ వ్యూహంపై చర్చ

**బీఆర్‌ఎస్ మాదిగ సామాజికవర్గ నేతల సమావేశం**
**వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ హాజరు**

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలక అంశంగా మారుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాదిగ సామాజికవర్గం నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ అంశంతో పాటు ఇతర అంశాలపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో బుధవారం ఉదయం జరిగిన అల్పాహార భేటీకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు హాజరయ్యారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, పార్టీ ఎమ్మెల్యేలు విజయుడు, మాణిక్‌రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, ముఖ్యనేత ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా సుమారు 15 మంది మాదిగ సామాజికవర్గం నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు అనుసరించిన వైఖరిపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసిన విషయం ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలోనూ తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎస్సీ వర్గీకరణ తమ పార్టీ ప్రాధాన్యతగా ఉంటుందని పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా ప్రకటన చేసిన విషయాన్ని నేతలు గుర్తు చేశారు.

## రైతులకు ఎన్ని వేల కోట్లు ఇచ్చామో చర్చిద్దామా?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ రూ.12 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ అంటున్నారని, తాము రైతులకు ఎన్ని కోట్లు ఇచ్చామో చర్చించేందుకు ఆ పార్టీ సిద్ధమా అని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సవాల్ విసిరారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హరీశ్‌రావు, కేటీఆర్ కేవలం బీఆర్‌ఎస్ నాయకుల కోసమే మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సీఎంగా ప్రజలను ఆదుకునేందుకు రేవంత్‌రెడ్డి యజ్ఞం చేస్తున్నారని, దాన్ని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని రవి ఆరోపించారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, తెలంగాణ బీజేపీ నేతల వైఖరిపై ప్రధాని మోదీ, అమిత్‌షాకు లేఖ రాస్తానని చెప్పారు. మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే గద్దర్‌కు కూడా అవార్డు ఇవ్వాలని రవి కోరారు.

## కేటీఆర్ ఏ మొహంతో ధర్నాకు వచ్చాడు

**కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకైనా వస్తాడో రాడో చెప్పాలి**
**ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా మీడియాతో మంత్రి కోమటిరెడ్డి**



గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఓ చిన్నారి సమస్య వింటున్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ ఏ మొహం పెట్టుకొని ధర్నా చేస్తానంటూ నల్లగొండకు వచ్చారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ధర్నాకు..తమ సభలకు పల్లీలు, ఐస్‌క్రీం అమ్ముకునేందుకు వచ్చేంత మంది కూడా రాలేదని మంత్రి ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన 'మంత్రితో ముఖాముఖి'కార్యక్రమానికి కోమటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బడ్జెట్ సమావేశాల్లోనైనా అసెంబ్లీకి వస్తాడో రాడో చెప్పాలన్నారు. ఒకవేళ రాకపోతే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మూతపడే పార్టీ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్ పనిచేస్తున్నప్పుడు బండి సంజయ్ ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. గద్దర్ గురించి సంజయ్ మాట్లాడడం సరైంది కాదన్నారు.

**అక్షర చిట్‌ఫండ్ స్కామ్ అగ్రిగోల్డ్ స్కామ్ లాంటిదే**

మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా అక్షర చిట్‌ఫండ్ బాధితులు మంత్రి కోమటిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఆయన డీజీపీకి ఫోన్ చేసి ప్రజలను మోసం చేసిన చిట్‌ఫండ్స్ ఎండీ పేరాల శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారాన్ని విచారించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. అక్షర చిట్‌ఫండ్ స్కామ్ అగ్రిగోల్డ్ కుంభకోణం లాంటిదేనన్నారు. మాజీమంత్రి ఎర్రబెల్లికి ఈ చిట్‌ఫండ్ యజమాని స్నేహితుడు కావడంతోనే ఇన్నాళ్లు కేసీఆర్ ఆయన్ను కాపాడారని వ్యాఖ్యానించారు. కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డికి దరఖాస్తులు ఇచ్చేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. మొత్తం 799 దరఖాస్తులు వచ్చాయని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

## మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

- ఏపీ, తెలంగాణలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- ఫిబ్రవరి 27న ఆరు స్థానాలకు పోలింగ్, మార్చి 3న కౌంటింగ్
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆరు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణలోని మూడు, ఏపీలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ జరగనుంది. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కానుండగా, అదే నెల 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11న, నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు గడువు విధించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మార్చి 3వ తేదీన నిర్వహిస్తారు.

- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలతోపాటు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం ఈ స్థానాలకు టి.జీవన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డిలు ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఏపీలోని తూర్పుగోదావరి-పశ్చిమగోదావరి పట్టభద్రుల స్థానం, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానం, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్టణం ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఖాళీ కానున్న ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఐలా వెంకటేశ్వరరావు, కేఎస్.లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలైన తక్షణమే ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది.

## రాజకీయ పక్షాల్లో ఎమ్మెల్సీ హడావుడి

**ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీజేపీ**

- త్వరలోనే ఖరారు చేయనున్న కాంగ్రెస్
- ఇంకా నిర్ణయం తీసుకోని బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ - నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం రాజకీయ పక్షాల్లో హడావుడి కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు ఈ ఎన్నికలో తలపడే అవకాశాలున్నాయి. బీజేపీ ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించగా, త్వరలోనే ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇప్పుడు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అభ్యర్థిని ఎంపిక చేసే కసరత్తును ముమ్మరం చేయనుంది. వారం రోజుల్లోపే అధికారికంగా అభ్యర్థిని ప్రకటిస్తామని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, అమిగోస్ విద్యాసంస్థల అధినేత ముస్కు రమణారెడ్డి ముందు వరుసలో ఉన్నారు. వెల్చాల రాజేందర్, ముదసం గంగాధర్, హరికృష్ణలు కూడా టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ తమ అభ్యర్థిగా అంజిరెడ్డిని ఇప్పటికే ప్రకటించగా, ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న అంశంలో బీఆర్‌ఎస్ ఇంకా ఊగిసలాడుతోంది. తాము పోటీ చేయకుండా ఎవరికైనా మద్దతిస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని గులాబీ పార్టీ సీరియస్‌గా పరిశీలిస్తోంది. ఒకవేళ పోటీ చేయాలనుకుంటే సర్దార్ రవీందర్ సింగ్, బి.ఎన్.రావు, రాజారాం యాదవ్, చిరుమళ్ల రాకేశ్, గెల్లు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌రెడ్డిల పేర్లను పరిశీలించనుంది.

**ఓటర్ల సంఖ్య ఇలా..**

| మెదక్ పట్టభద్రుల స్థానంలో | మెదక్ టీచర్స్ స్థానంలో | వరంగల్ టీచర్స్ స్థానంలో |
|---|---|---|
| 3,41,313 మంది | 25,921 మంది | 24,905 మంది |

## కమ్యూనిజాన్ని అంతం చేయాలని చూస్తున్న మోదీ, అమిత్ షా

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**



హనుమకొండలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

హనుమకొండ: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కమ్యూనిజాన్ని అంతం చేయాలని చూస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హనుమకొండలో సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజానాట్య మండలి ఆటపాటల మధ్య హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం అజేయమైనవని, వాటిని ఎవరూ అంతం చేయలేరన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులు ప్రజల్లోకి వచ్చి పని చేయాలని పిలుపునిచ్చారు. తుపాకీ ద్వారా రాజ్యాధికారం వస్తుందనే సిద్ధాంతాలపై గద్దర్ పనిచేశారని, కానీ తర్వాత బుల్లెట్ ద్వారా కాదు బ్యాలెట్ ద్వారానే సాధ్యమని మనసు మార్చుకున్నట్లు గుర్తుచేశారు. గద్దర్‌ను తూలనాడిన బండి సంజయ్ క్షమాపణ చెప్పాలన్నారు.



సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ముఖ ద్వారం

# కాపలా పనిలేదు.. చీడపీడల బాధలేదు

## సాగులో సరికొత్త ట్రెండ్.. అటవీ వ్యవసాయం

- సాధారణ వ్యవసాయానికి ప్రత్యామ్నాయం
- బీడు భూముల్లో వెదురు, సరివి, సుబాబుల్ తదితర మొక్కల పెంపకం
- ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తోడ్పాటు
- తోటల మాదిరి సాగుతో అధిక ఆదాయం

**గజ్వేల్:** భూములు కలిగివున్నా ఎప్పటికప్పుడు చూసుకోలేని, పంటల్ని కాపాడుకోలేని పరిస్థితుల్లో.. వ్యవసాయం చేయలేక బీడుగా ఉంచుతున్న రైతులకు అటవీ వ్యవసాయం చక్కని తరుణోపాయంలా మారుతోంది. ఇంతకాలం నిరుపయోగంగా ఉన్న భూముల్లో అటవీ మొక్కలను తోటల మాదిరిగా సాగు చేస్తున్నారు. సమయం చిక్కినప్పుడు వచ్చి చూసుకొని వెళుతున్నారు. సాధారణ వ్యవసాయంతో పోలిస్తే నామమాత్రపు పెట్టుబడి కావడం అధిక ఆదాయం లభిస్తుండటంతో దీనివైపు మొగ్గుచూపుతున్నారు. నేలలో సారం తగ్గకుండా కాపాడుతున్నారు. వాతావరణ కాలుష్య నియంత్రణకు దోహదపడుతున్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఈసీ) ఈ కొత్త తరహా సాగుకు శ్రీకారం చుట్టి ఈ మేరకు రైతుల్ని ప్రోత్సహిస్తోంది.

### సాగుకు సర్కారు అనుమతి

వెదురు, సుబాబుల్, శ్రీగంధం, సరివి చెట్లు గతంలో అక్కడక్కడా రైతుల పొలం గట్లపై మాత్రమే కన్పించేవి. అటవీ ప్రాంతాల్లోనే వెదురు ఎక్కువగా ఉంటుంది. తాజాగా వీటిని తోటల మాదిరిగా విరివిగా పెంచి అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ములుగులోని సీఈసీ గత రెండేళ్లుగా అటవీ మొక్కల్లో మేలైన రకాలను ఉత్పత్తి చేస్తూ రైతులకు అందిస్తోంది. తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల్లోని పలు పరిశోధన కేంద్రాల నుంచి మేలైన వెదురు విత్తనాన్ని తెప్పించి భారీగా మొక్కల ఉత్పత్తి చేపడుతోంది. ప్రధానంగా బీ-స్ట్రిక్టస్, తుల్డా పేరుతో ఉన్న అత్యంత నాణ్యత కలిగిన మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు నామమాత్రపు ధరకు విక్రయిస్తోంది. సిద్దిపేటతో పాటు యాదాద్రి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, వరంగల్, మెదక్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు చెందిన రైతులకు సరఫరా చేస్తోంది. వెదురు మాదిరిగానే శ్రీగంధం, సరివి, సుబాబుల్ మొక్కలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు.

### కేసీఆర్ ఫామ్‌హౌస్ లోనూ..

వ్యవసాయంలో వచ్చే మార్పులను నిరంతరం గమనిస్తూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగుపై దృష్టి పెట్టే మాజీ సీఎం కేసీఆర్ సైతం అటవీ వ్యవసాయం వైపు మళ్లారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో కూడా వెదురు పెంపకాన్ని చేపట్టారు. జగదేవ్‌పూర్ మండలంలో ఇటిక్యాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిరణ్ ఆరు ఎకరాల్లో సాగు చేసిన వెదురు తోటను స్వయంగా పరిశీలించి వివరాలను తెలుసుకున్న కేసీఆర్...ఫామ్‌హౌస్‌లో ఇటీవలే వివిధ రకాల మొక్కలను తెప్పించి నాటించారు.

### మొక్కలు నాటితే చాలు..

భూములు ఉన్నప్పటికీ ఇతర వృత్తుల రీత్యా బిజీగా ఉండటం, పంటలు వేసినా వాటిని పరిరక్షించుకోలేని పరిస్థితుల్లో చాలామంది బీళ్లుగా ఉంచేస్తున్నారు. ఇలాంటి వారికి అటవీ వ్యవసాయం చక్కని పరిష్కారంగా మారుతోంది. ఒకసారి మొక్కలు నాటితే చాలు ఈ తరహా మొక్కలు వాటంతట అవే పెరిగిపోతాయి. పైగా వీటిని చీడపీడలు ఆశించవు. ఎరువులు, క్రిమిసంహారకాల అవసరం లేదు. నీటి సదుపాయం కూడా పెద్దగా అవసరం లేదు. బిందు (డ్రిప్) సేద్యం తరహాలో అందిస్తే చాలు. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో ఈ మొక్కల పెంపకం వైపు ఆకర్షితులవుతున్నారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే అటవీ వ్యవసాయంతో భూముల్లో సారం స్థిరంగా ఉంటుందని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేలా ఆక్సిజన్ అత్యధికంగా ఉండే గాలిని వెదురు మొక్కలు అందిస్తాయని సీఈసీ అధికారులు చెబుతున్నారు. ఈ తోటలతో ఇతర పంటల మాదిరిగా వెంటనే ఆదాయం రాకున్నా..రెండు మూడేళ్ల తర్వాత మంచి, మెరుగైన ఆదాయం మొదలవు తుండటంతో భూముల్ని బీళ్లుగా ఉంచడం కంటే ఇది మేలని రైతులు భావిస్తున్నారు.


సిద్దిపేట జిల్లా ఇటిక్యాలలో వెదురు సాగు

### ఎన్ని సానుకూలతలో..

| | | | |
|---|---|---|---|
| ఒక్కసారి మొక్కలు నాటితే చాలు | నిరంతర పర్యవేక్షణ అవసరం లేదు | నీటి అవసరం అంతగా లేదు | భూసారం తగ్గనే తగ్గదు |
| చీడపీడలు సోకుతాయనే చింత లేదు | క్రిమిసంహారకాలు, ఎరువులతో పనే లేదు | వెదురుతో అత్యధిక స్థాయిలో ఆక్సిజన్ | |

### అటవీ వ్యవసాయానికి మంచి భవిష్యత్తు

అటవీ వ్యవసాయానికి మంచి భవిష్యత్తు ఉంది. ఇప్పటికే రైతులు ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో మేం కూడా మేలైన అటవీ మొక్కలను ఉత్పత్తి చేసి నామమాత్రపు ధరకే అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత విరివిగా ఈ ప్రక్రియ చేపట్టనున్నాం.

\- శ్రీధర్, ఉద్యానవన శాఖ ఏడీ (ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్‌చార్జి)



### వెదురుకు విదేశాల్లో మంచి గిరాకీ

నేను వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను. హైదరాబాద్‌లో ఉంటున్నా. మా స్వగ్రామం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాలకు వచ్చి వ్యవసాయం చేయాలంటే సమయం కుదరడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆరు ఎకరాల్లో వెదురు సాగు చేశా. సీఈసీ నుంచి తుల్డా రకం మొక్కలు తెప్పించి వేశా. ఏడాది గడిచింది. మరో రెండేళ్ల తర్వాత నాకు మంచి ఆదాయం వచ్చే అవకాశముంది. గృహాలకు సంబంధించిన ఫర్నిచర్, ఇతర ఉపకరణాల కోసం ఇతర దేశాల నుంచి వెదురు దిగుమతి చేసుకుంటున్నారని తెలుసుకొని ఇది సాగు చేశా. ఇక్కడ కూడా మంచి మార్కెట్ ఉన్నందువల్ల భారీగా లాభాలు రావచ్చని భావిస్తున్నా.

\- కిరణ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, ఇటిక్యాల, సిద్దిపేట జిల్లా

# గోదావరి బోర్డు చైర్మన్‌గా ఏకే ప్రధాన్

**సాక్షి, హైదరాబాద్:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా ఎ.కె.ప్రధాన్‌ను కేంద్ర జలవనరుల శాఖ బుధవారం నియమించింది. కేంద్ర జల సంఘంలో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ అధికారిగా ఉన్న ఆయనకు హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు పదోన్నతి కల్పిస్తూ.. ఈ మేరకు కొత్త పోస్టింగ్స్ కేటాయించింది. గతంలో ఆయన హైదరాబాద్‌లోని పోలవరం ప్రాజెక్టు అథారిటీలో జాయింట్ డైరెక్టర్ హోదాలో పనిచేశారు.

# ఇంటర్ బోర్డు అధికారుల వేధింపుల నుంచి కాపాడండి

## ప్రైవేటు ఇంటర్ కాలేజీల యాజమాన్య సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీసతీశ్

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్ బోర్డుకు చెందిన అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్య సంఘం ఆరోపించింది. ఆ సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్ బుధవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను అధికారులు రెచ్చగొట్టి, ప్రభుత్వంపై దండెత్తేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు నిబంధనల సడలింపునకు ప్రభుత్వం జీవో ఇచ్చినా, ఇంటర్ కార్యదర్శి అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జీ ప్లస్ వన్ భవనాలున్న కాలేజీలకు బోర్డు గుర్తింపు ఇవ్వమని చెప్పడం దుర్మార్గమన్నారు. అనుబంధ గుర్తింపునకు కాలేజీకి రూ. లక్ష, ప్రతీ విద్యార్థికి రూ.500, పరీక్ష ఫీజుకు రూ. 2,500 జరిమానా విధించడం అన్యాయమని మండిపడ్డారు. సీసీ కెమెరాలు పెడితేనే పరీక్ష కేంద్రాలు ఇస్తామని బెదిరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అధికారుల వేధింపుల నుంచి తమను కాపాడాలని గౌరీ సతీశ్ కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# 31 నుంచి ఏప్రిల్ సెషన్ దరఖాస్తులు

- జేఈఈ మెయిన్ సెషన్-2 దరఖాస్తుల తేదీ ప్రకటన
- ఏప్రిల్ 1 నుంచి 8 వరకు రెండు షిఫ్టులలో పరీక్షలు
- బుధవారంతో ముగిసిన జనవరి సెషన్
- పేపర్ కఠినత్వాన్ని బట్టి మార్కులు- పర్సంటైల్
- 'కీ'ని చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దు
- జేఈఈ శిక్షణ నిపుణుడు ఎంఎస్ రావు



**సాక్షి, ఎడ్యుకేషన్:** జేఈఈ-మెయిన్ ఏప్రిల్ సెషన్ పరీక్షలకు ఈ నెల 31 (శుక్రవారం) నుంచి దరఖాస్తు ప్రక్రియ మొదలు కానుంది. విద్యార్థులు ఫిబ్రవరి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8 వరకు ప్రతి రోజు రెండు షిఫ్టులలో నిర్వహిస్తారు. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటన విడుదల చేసింది. జనవరి సెషన్ బీటెక్ ప్రవేశ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. వీటికి సంబంధించి రెస్పాన్స్ షీట్, 'కీ'లను ఫిబ్రవరి 1 లేదా 2వ తేదీన ఎన్‌టీఏ విడుదల చేసే అవకాశం ఉంది.

### సులభమైన ప్రశ్నలే..

బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్ మొదటి షిఫ్ట్ పరీక్ష సులభంగా ఉందని విద్యార్థులు చెప్పారు. ఫిజిక్స్‌లో గడిచిన నాలుగు రోజుల్లో నిర్వహించిన పరీక్షల్లో అడిగిన ప్రశ్నలే ఎక్కువగా అడగడం గమనార్హం. ఈ సబ్జెక్ట్‌లో అధిక శాతం ప్రశ్నలు కాన్సెప్ట్‌లు, ఫార్ములా ఆధారితంగా ఉన్నాయి. ఎక్కువ ప్రశ్నలు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సిలబస్ నుంచే వచ్చాయి. మ్యాథమెటిక్స్ ఓ మాదిరి క్లిష్టతతో ఉందని, కెమిస్ట్రీ విభాగం సులభంగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. ఈ విభాగంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ టాపిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. రెండో షిఫ్ట్‌లో ఫిజిక్స్ క్లిష్టంగా న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలతో ఉందని, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీలో డైరెక్ట్ ప్రశ్నలు అడిగారని విద్యార్థులు చెప్పారు.

### మార్కుల మధ్య వ్యత్యాసం

జేఈఈ మెయిన్ జనవరి సెషన్ పరీక్షల్లో క్లిష్టత స్థాయిని బట్టి విద్యార్థులు పొందే మార్కుల్లో 35 నుంచి 60 మార్కుల వరకు వ్యత్యాసం ఉండొచ్చు. ఉదాహరణకు 2024లో క్లిష్టంగా ఉన్న పేపర్‌లో 176 మార్కులు వచ్చిన విద్యార్థికి 99 పర్సంటైల్ రాగా, ఓ మాదిరి క్లిష్టంగా ఉన్న పేపర్‌లో 224 మార్కులకు 99 పర్సంటైల్ వచ్చింది. దీంతో జనవరి సెషన్‌లో క్లిష్టమైన పేపర్స్ విషయంలో 170 నుంచి 150 మార్కులతో 99 పర్సంటైల్, ఓ మోస్తరు పేపర్‌లో 180-195 మార్కులతో 99 పర్సంటైల్ పొందే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు రెస్పాన్స్ షీట్స్, 'కీ'లను చూసి ఆందోళన చెందవద్దు. మొత్తం పది షిఫ్ట్‌లలో 25, 29 తేదీల్లో షిఫ్ట్-1 పేపర్లు, 28వ తేదీ షిఫ్ట్-2 పేపర్లు కఠినంగా ఉన్నాయి.

\- ఎం.ఎస్.రావు, జేఈఈ శిక్షణ నిపుణుడు

# ఏఐ సాయంతో సమగ్ర హెల్త్ ప్రొఫైల్: మంత్రి శ్రీధర్‌బాబు


మంత్రి శ్రీధర్‌బాబుకు జ్ఞాపికను ఇస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

**సాక్షి, హైదరాబాద్:** కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి రాష్ట్రంలోని ప్రతి పౌరుడి హెల్త్ ప్రొఫైల్‌ను సమగ్రంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం జూబ్లీ హిల్స్‌లో మాడ్యూర్ హాస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన 'ఎండీఆర్.మై డీజీ రికార్డ్' మొబైల్ యాప్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. 'ఇటీవలి కాలంలో వ్యాధిగ్రస్తులు ముందుగా అన్ని వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. చికిత్స తీసుకుంటున్నారు. నమ్మకం కుదరక మళ్లీ పరీక్షలను చేయించుకుంటున్నారు. ఫలితంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ అందుబాటులోకి వస్తే రోగులపై పడే అదనపు భారం తగ్గుతుంది. వేగంగా మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు సాయపడుతుంది. దీంతో భవిష్యత్‌లో రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడానికి వీలవుతుంది. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ఏఐ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా రూపొందిస్తాం' అని వివరించారు. ఆరోగ్య సమాచారాన్ని కచ్చితత్వంతో అందించేలా ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను రూపొందించిన మాడ్యూర్ హాస్పిటల్ సర్వీసెస్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య రంగంలో ఈ తరహా ఆవిష్కరణలు మరిన్ని రావాలని శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాడ్యూర్ హాస్పిటల్స్ సర్వీసెస్ చైర్మన్ మోటూరి కృష్ణప్రసాద్, సీఈవో సరోజ్ గుప్తా, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ క్రిస్ హంఫ్రెయ్స్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూలో కొత్త విభాగం

- భూపరిపాలన ఆవిష్కరణలు, న్యాయ సహకారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు
- భూ చట్టాలపై సుదీర్ఘ అనుభవం ఉన్న ముగ్గురితో ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త విభాగం ఏర్పాటైంది. భూపరిపాలన ఆవిష్కరణలు, న్యాయ సహకారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూ చట్టాల విషయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నిష్ణాతులైన ముగ్గురితో ఈ విభాగాన్ని ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం జీవో నెం.8 జారీ చేశారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ చదివి, భూమి సమస్యలపై న్యాయపరంగా కనీసం 20 ఏళ్ల అనుభవం ఉన్న నిపుణుడు ముఖ్య సలహాదారుగా, 10 ఏళ్ల అనుభవం ఉన్న ఇద్దరు సలహాదారులుగా ఈ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సెల్ ఏం చేయాలన్న దానిపై కూడా ఈ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. ఆ ఉత్తర్వుల ప్రకారం...

- రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న భూమి చట్టాల్లో సవరణలు సూచించడంతోపాటు అవసరమైనప్పుడు కొత్త చట్టాల రూపకల్పనకు ఈ సెల్ పనిచేస్తుంది.
- అన్ని రకాల భూమి సమస్యల పరిష్కారానికి ఏం చేయాలన్నది సూచిస్తుంది.
- ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న భూ రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డీఐఎల్ఆర్ఎంపీ కార్యక్రమాన్ని అధ్యయనం చేయడం ద్వారా తెలంగాణలో భూమి రికార్డుల కంప్యూటరీకరణ చేపట్టాల్సిన చర్యలను సూచిస్తుంది.
- ప్రస్తుత భూ, రెవెన్యూ వ్యవస్థలను పరిశీలించి మరింత మెరుగ్గా ఈ వ్యవస్థలను మార్చేందుకు అవసరమైన సలహాలు ఇస్తుంది.
- భూసంబంధిత అంశాల్లో అవసరమైనప్పుడు న్యాయసలహాలు అందజేస్తుంది.

# అధిక ఆదాయం ఇచ్చే పంటలపై పరిశోధన

## ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్


సదస్సులో మాట్లాడుతున్న పాఠక్

**సాక్షి, హైదరాబాద్:** రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలపై పరిశోధనలు నిరంతరంగా సాగుతున్నాయని వ్యవసాయ పరిశోధన, విద్య (డేర్) కార్యదర్శి, ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు. ఐసీఏఆర్, ఇక్రిశాట్ వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థల పరిశోధనల కారణంగా దేశంలో ఇతర రంగాలతో పోలిస్తే వ్యవసాయంలో వృద్ధి రేటు పదేళ్లలో 3.7 శాతం పెరిగిందన్నారు. వర్షాధార వ్యవసాయంపై హైదరాబాద్‌లోని క్రిడా(సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్)'లో మూడురోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన దేశ, విదేశాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు పరిశోధనలు చేస్తూ రైతాంగానికి మేలు చేసేందుకు పరిశోధన సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. దేశంలో వ్యవసాయంతోపాటు ఉద్యానవన పంటలు, మత్స్య పరిశ్రమలో ఉత్పత్తి గణనీయంగా పెరగిందని చెప్పారు. వర్షాధారిత పంటల సాగు 52 శాతానికి పెరిగిందన్నారు. పంటల్లో జన్యుపరమైన మార్పులు చేస్తూ ఐసీఏఆర్ కొత్త వంగడాలను రూపొందిస్తూ రైతులకు అందిస్తుందని చెప్పారు. 731 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా 2వేల కొత్త వంగడాలను రైతుల చెంతకు చేర్చినట్టు చెప్పారు. వికసిత్ భారత్ విజన్ 2047లో భాగంగా వ్యవసాయ రంగానికి సంబంధించి రోడ్‌మ్యాప్ తయారు చేసినట్టు హిమాన్షు పాఠక్ వివరించారు. తెలంగాణతో సహా దేశంలో ఎక్కడైనా వ్యవసాయంలో పంటల వైవిధ్యం తప్పనిసరి అన్నారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కే చౌదరి మాట్లాడుతూ వాతావరణ స్థితిస్థాపకత గల వ్యవసాయం దిశగా ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా 50వేల గ్రామాల్లో ఈ తరహా వ్యవసాయాన్ని సాగు చేయిస్తున్నట్టు తెలిపారు. పురుగుల మందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్రిశాట్ డీజీ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, ఐసీఏఆర్-క్రిడా డైరెక్టర్ వీకే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 'నీళ్లు-నిజాలు' పేరిట రౌండ్‌టేబుల్ సమావేశం రేపు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'నీళ్లు-నిజాలు' పేరిట ఈనెల 31న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్లు హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఈ టేబుల్ సమావేశంలో తిప్పికొడతామని తెలంగాణ జాగృతి సంస్థ స్పష్టం చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తి చేసుకుంటున్నా.. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయని నేపథ్యంలో.. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పిస్తారని బీఆర్ఎస్ తెలిపింది.



# మెడికల్ పీజీలో లోకల్ కోటా రాజ్యాంగ విరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

నివసించే హక్కు మనకుంది. అలాగే దేశంలో ఎక్కడైనా వృత్తి, వ్యాపారాన్ని కొనసాగించే హక్కు ఉంది. అలాగే దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని కోరే హక్కును కూడా మనకు రాజ్యాంగం కల్పిస్తోంది. విద్యాసంస్థల్లో స్థానిక రిజర్వేషన్లు కొంతమేరకే పరిమితం. ఆ రాష్ట్రంలో నివసించే వారికే సీట్లు కేటాయించడమనేది సరైనది కాదు. మెడికల్ కాలేజీల్లో కూడా స్థానిక కోటా ఎంబీబీఎస్‌కే పరిమితం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పీజీ ప్రవేశాల్లో దేశమంతా ఓపెన్ కేటగిరి కిందకు వస్తుందని స్పష్టం చేసింది. స్పెషలిస్టు డాక్టర్ల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని చూస్తే స్థానికత ఆధారంగా రిజర్వేషన్లను కల్పించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని పేర్కొంది. ఇలాంటి రిజర్వేషన్లను అనుమతిస్తే అది విద్యార్థుల ప్రాథమిక హక్కులకు భంగకరమని పేర్కొంది. భారత సమాఖ్యలోని మరో రాష్ట్రానికి చెందిన వారని చెప్పి.. వారిని సమానంగా చూడకపోవడం తప్పు. ఆర్టికల్ 14 చెప్పే సమానత్వపు హక్కుకు భంగకరం అని ధర్మాసనం తేల్చిచెప్పింది. చట్టం ముందు అందరూ సమానులేననడాన్ని నిరాకరించడం అవుతుందని స్పష్టం చేసింది. అఖిల భారత పరీక్షల్లో రాష్ట్ర కోటా సీట్లు, సంస్థాగత రిజర్వేషన్లు వర్తించే సీట్లు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలని స్పష్టం చేసింది.

చండీగఢ్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రవేశాలకు సంబంధించి పంజాబ్- హరియాణా హైకోర్టు ఈమేరకు ఇచ్చిన తీర్పును కొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. స్థానికత విషయంలో మెడికల్ కాలేజీ నిబంధనలు చెల్లవని పంజాబ్- హరియాణా హైకోర్టు తీర్పునిచ్చింది. చండీగఢ్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి మార్చి 28, 2019లో అడ్మిషన్లు ప్రారంభించారు. మొత్తం 64 పీజీ సీట్లను రాష్ట్ర కోటా కింద వర్గీకరించారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌కు స్థానికులైన వారికి లేదా ఇదే కాలేజీలో ఎంబీబీఎస్‌ను పూర్తిచేసిన వారికి ఈ 64 సీట్లను కేటాయిస్తామని నిబంధనలు పెట్టారు. ఈ 64 సీట్లలో సగం.. అంటే 32 సీట్లు అదే కాలేజీలో చదివిన వారికి రిజర్వు చేయడం సబబే అయినా... చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతవాసులకు మిగిలిన 32 సీట్లను కేటాయించడం సరి కాదని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది.

# 'సెట్' దరఖాస్తులపై తర్జన భర్జన!

## నేడు ఈఏపీ సెట్ కమిటీ భేటీ



**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ తేదీలను ఖరారు చేసేందుకు ఈఏపీ సెట్ కమిటీ గురువారం భేటీ అవుతోంది. ఇప్పటికే ఉమ్మడి ప్రవేశ పరీక్ష తేదీలను సాంకేతిక విద్య మండలి వెల్లడించింది. ఏప్రిల్ 29 నుంచి మే 5వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. అయితే, దరఖాస్తుల స్వీకరణ, సమగ్ర సమాచార బులిటెన్ ఇప్పటివరకూ విడుదల చేయలేదు. వీటిని ఫైనల్ చేసేందుకు సెట్ కమిటీ సమావేశమవుతోంది. దీనికన్నా ముందు ఇంటర్ బోర్డ్ అధికారులతో జేఎన్‌టీయూహెచ్ అధికారులు చర్చలు జరిపారు. ఇంటర్ హాల్ టిక్కెట్ల తేదీలను ఈఏపీ సెట్ దరఖాస్తులకు ప్రామాణికంగా తీసుకుంటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. వారి హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచాల్సి ఉంది. ఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసే విద్యార్థి సమాచారం మొత్తం ఇంటర్ హాల్ టికెట్ అనుసంధానంతోనే సాఫ్ట్‌వేర్ రూపొందిస్తుంది. ఇంటర్ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి జరుగుతాయి. పరీక్ష ఫీజు గడువును దఫదఫాలుగా పొడిగిస్తూ వచ్చారు. దీంతో హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా ఇంకా విడుదల చేయలేదు. దీనిపై స్పష్టత ఇవ్వాలని, దీని ఆధారంగానే ఈఏపీ సెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని సెట్ కన్వీనర్ ఇంటర్ అధికారులకు లేఖ రాశారు. హాల్ టికెట్లపై ఇంటర్ బోర్డ్ గురువారం స్పష్టత ఇస్తుందని ఆశిస్తున్నారు.

### కొత్త సీట్ల పంచాయితీ

ఇంజనీరింగ్‌లో గత ఏడాది కొత్త సీట్ల పెంపునకు కొన్ని ప్రైవేటు కాలేజీలకు కోర్టు అనుమతించింది. అప్పటికే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తవటంతో కోర్టు అనుమతితో పెరిగిన 6 వేల సీట్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఈఏపీ సెట్ తర్వాత కౌన్సెలింగ్ జాబితాలో ఆ ఆరు వేల సీట్లు చేర్చడమా? లేదా? అనే అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో బుధవారం సమావేశమయ్యారు. సీట్ల పెంపు వల్ల ఇబ్బందులు, ఇతర బ్రాంచీల్లో సీట్ల తగ్గింపు వల్ల సమస్యలను ఆమెకు వివరించారు. ఈ అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సీఎస్ భేటీ అవుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. పెంచిన 6 వేల సీట్లు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలోనే ఉన్నాయి. కన్వీనర్ కోటా కింద 70 శాతం సీట్లు భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ సీట్లకు ఎంపికైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. అలా ఇవ్వాలంటే ప్రభుత్వం ముందుగా ఇందుకు సంబంధించిన జీవోను విడుదల చేయాలి. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. సీట్ల పెంపును వ్యతిరేకిస్తూ ప్రభుత్వం గత ఏడాది కోర్టును కూడా ఆశ్రయించింది. మరోవైపు సీట్ల పెంపునకు అనుమతించవద్దని అఖిల భారత సాంకేతిక విద్య మండలికి సర్కారు లేఖ రాసింది. ఈ పరిస్థితుల్లో కొత్త సీట్లపై స్పష్టత వస్తేనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించాలని సెట్ కమిటీ భావిస్తోంది.



బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమ అనేది బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ



సాక్షి
గురువారం, 30 జనవరి 2025

# డీప్ సీక్ నేర్పుతున్న పాఠం

సాంకేతిక రంగంలో, అందులోనూ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ఇది సరికొత్త విప్లవం. కేవలం 200 మంది ఉద్యోగులతో, కోటి డాలర్లు వెచ్చించి, చైనాకు చెందిన చిన్న స్టార్టప్ కంపెనీ డీప్ సీక్ చేసిన మేజిక్ అగ్రరాజ్యపు బడా సంస్థల్ని సైతం ఆలోచనలో పడేసింది. డీప్ సీక్ ఇటీవల విడుదల చేసిన రెండు 'స్వేచ్ఛా వినియోగ' (ఓపెన్ సోర్స్) ఏఐ ప్రోగ్రామ్‌లు, ఛాట్‌బోట్‌లు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలై, ఈ 27న అప్‌డేట్ వచ్చిన డీప్ సీక్ గురించే చర్చ. భారత్‌లోనూ యాపిల్ యాప్ స్టోర్లలో ఛాట్ జీపీటీ, గూగుల్ జెమినీలను దాటేసి, అత్యధికంగా డౌన్‌లోడ్ అవుతున్న యాప్ ఇవాళ ఇదే. ఆర్1, వీ3 అల్గారిథమ్‌లను తక్కువ ఖర్చుతోనే తీర్చిదిద్దినట్టుగా చెబుతున్న డీప్‌సీక్ ఇప్పుడు ఏఐ వినియోగ సామర్థ్యంలో ఛాట్ జీపీటీ, గ్రోక్, క్లాడ్, లామా లాంటి తోటి ప్రత్యర్థుల సరసన పెద్ద గీతగా నిలబడింది. భారీగా పెట్టుబడులు పెడితే తప్ప, ఏఐలో సంచలనాలు సాధ్యం కావన్నది భ్రమ అనీ, ఆలోచన, ఆచరణ ఉంటే అద్భుతాలు అసాధ్యమేమీ కాదనీ నిరూపించింది.

ట్రంప్ అధ్యక్షపీఠమెక్కిన వారం రోజులకే అమెరికా ఆభిజాత్యానికి డీప్ సీక్ దెబ్బకొట్టినట్టయింది. ఆగ్నేయ చైనాలోని హాంగ్‌జౌకు చెందిన అనామక ఇంజనీర్ల బృందం తమ సాంకేతికతతో ఈ స్థాయి విజయం సాధించడం అనూహ్యం. అనేక అత్యుత్తమ అమెరికా సంస్థలు అపారమైన పెట్టుబడులు, వనరులతో రూపొందించిన ఏఐ నమూనాలతో పోలిస్తే చాలా తక్కువ ఖర్చుతో, పరిమిత వనరులతో చైనాకు చెందిన ఓ స్టార్టప్ కంపెనీ ఇలా ప్రపంచాన్ని కుదిపేయడం విశేషం. ఆవిష్కృతమైన వారం రోజుల్లోనే డీప్ సీక్ సరికొత్త వెర్షన్ వీ3 అనేక సంక్లిష్టమైన, సూక్ష్మమైన ప్రశ్నలకు ఓపెన్ ఏఐ తాలూకు ఛాట్ జీపీటీ కన్నా మెరుగ్గా జవాబులివ్వడం గమనార్హం. సందర్భోచితంగా, కచ్చితత్వంతో, అంతకు మించి సృజనాత్మకంగా అప్పటికప్పుడు సమాధానాలివ్వడంలో డీప్ సీక్ ముందంజలో ఉంది. వివిధ భాషల్లోకి నిర్దుష్టమైన అనువాదాలు అందించడంలోనూ అగ్రరాజ్యపు బడాబాబుల యాప్‌లన్నిటినీ అధిగమించేసింది. డీప్ సీక్ ఛాట్ బోట్ జవాబుల నాణ్యతను ఇవాళ ప్రపంచవ్యాప్తంగా నిపుణులు ప్రశంసిస్తున్నారంటే అది చిన్న విజయమేమీ కాదు.

లెక్కతీస్తే డీప్ సీక్ సాధించిన విజయాలు అనేకం. ఓపెన్ ఏఐ కొన్ని వందల కోట్ల డాలర్ల ఖర్చు చేస్తే, కేవలం 60 లక్షల డాలర్లతో డీప్ సీక్ తన ఏఐ వేదికను అభివృద్ధి చేసిందని కథనం. అలాగే, అత్యాధునిక ఎన్‌విడియా ఏ100 చిప్స్‌ను చైనాకు విక్రయించడంపై షరతులున్న నేపథ్యంలో, వాటిపై ఆధారపడకుండా చౌక రకం, తక్కువ శ్రేణి వాటితోనే ఇంతటి విజయం సాధించింది. పైపెచ్చు, ఓపెన్ ఏఐకి పూర్తి భిన్నంగా డీప్ సీక్ అనేది... డెవలపర్లు ఎక్కడైనా, ఎప్పుడైనా వాడుకొని, దాన్ని తమ అవసరాలకు తగ్గట్టుగా మార్చుకొని, మరింత పెంపొందించుకోవడానికీ వీలున్న 'స్వేచ్ఛా వినియోగ' సాఫ్ట్‌వేర్. ఇన్ని ప్రత్యేకతలున్నందున డీప్ సీక్ ప్రభావం తక్షణమే విస్తృతంగా కనిపించింది. అమెరికాలోని ఏఐ సంస్థల స్టాక్ మార్కెట్ ప్రపంచం తలకిందులైపోయింది. ఓపెన్ ఏఐ తాలూకు ఛాట్ జీపీటీని సైతం రెండో స్థానానికి నెట్టి, యాపిల్ వాళ్ళ యాప్ స్టోర్ జాబితాలో ఈ చైనీస్ యాప్ ఏకంగా అగ్రేసర స్థానాన్ని అధిష్ఠించడం గణనీయమైన అంశం.

మొత్తానికి ఈ స్టార్టప్ తన 'డీప్ సీక్–ఆర్1' మోడల్‌తో ప్రపంచ ఏఐ చిత్రాన్నే మార్చేసింది. ఏఐకి సంబంధించిన ఆర్థిక, సాంకేతిక చలనసూత్రాలను తిరగరాసింది. అదే సమయంలో రాజకీయంగా, మరీ ముఖ్యంగా చైనాకు సున్నితమైన 1989 నాటి తియానన్మెన్ స్క్వేర్ ఊచకోత ఘటన, అరుణాచల్ ప్రదేశ్ లాంటి అంశాలపై జవాబిచ్చేందుకు ఇది నిరాకరించడం విచిత్రం. అంటే, ఆధునిక ప్రపంచంలో ఒకరకంగా సాంకేతిక పురోగతితో పాటు జనానికి ఏది చెప్పాలి, ఏది చూపాలి, ఎంత వివరించాలనే అంశాన్ని ఈ కొత్త సాధనాలతో నిర్ణయించేలా సెన్సార్‌షిప్‌లూ పెరగనున్నాయన్న మాట. పారదర్శకత, ఏఐ వ్యవస్థల్లో సిసలైన స్వేచ్ఛ ఎంత అన్న నైతిక ప్రశ్నలకు ఇది తావిస్తోంది. ఇంతటి సంచలనాత్మక ఏఐ మోడల్ సైతం చైనా ప్రభుత్వ సెన్సార్‌షిప్ సంకెళ్ళలో బందీగా, ప్రభుత్వ నియంత్రణలో పాలక వర్గాల ప్రచారానికే పరిమితమనే భావన కలుగుతోంది.

ఏమైనా, పదే పదే 'ఆత్మనిర్భర భారత్' అంటూ పెడబొబ్బలు పెట్టే మన పాలకులకు డీప్ సీక్ విజయం కళ్ళెదుటి పాఠం. ప్రపంచానికి పెద్దన్నగా భావిస్తూ, అమెరికా అనేక ఆంక్షలు పెట్టి, సుంకాలు విధించినా చైనా తన సొంత కాళ్ళపై నిలబడడం ఎవరికైనా స్ఫూర్తిదాయకం, ఆదర్శం. అవరోధాలను అధిగమించి, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఏఐ, పర్యావరణ సానుకూల టెక్నాలజీ లాంటి అనేక అంశాల్లో డ్రాగన్ సాధించిన విజయం అసామాన్యం. దూరదృష్టితో కూడిన విధాన నిర్ణయాలు, వాటి సమగ్ర ఆచరణ వల్లనే పొరుగునున్న చైనాకు ఇది సాధ్యమైంది. ఆ మార్గాన్ని మనమూ ఇప్పటికైనా చిత్తశుద్ధితో అనుసరించాలి. భారత్‌లోనూ ప్రతిభకు కొదవ లేదు. మన విద్యార్థులు, ఐటీ రంగ నిపుణులు అందరూ పోలోమని అమెరికా వైపు చూడడానికీ, ఆ సంస్థల వైపు ఆకర్షితులు కావడానికీ కారణాలను అన్వేషించాలి. ప్రతిభావంతుల్ని ఇక్కడే స్థిరపడేలా చేసి, వారి సేవలను జన్మభూమికి ఉపకరించేలా చూసుకోవాలి. హెచ్1బీ వీసాల విషయంలో ట్రంప్‌ను మంచి చేసుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తున్న మనం డీప్ సీక్ ఉదంతం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. అదే సమయంలో నియంత్రణ, సెన్సార్‌లకు అతీతంగా సరికొత్త సాంకేతికతల్ని ఎదగనిచ్చేలా చైతన్యవంతమైన చట్టాలు చేయాలి. నైతికత, ప్రజాస్వామ్య సిద్ధాంతాల పునాదిపై నూతన శకానికి దారులు వేయాలి.

# ఆర్థిక యుద్ధం గెలవగలరా?

విశ్లేషణ



టంకశాల అశోక్

అమెరికా కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎన్ని ఉత్తర్వుల తుఫానును సృష్టిస్తున్నా, వాటన్నింటి అంతిమ లక్ష్యం ఆర్థిక సంబంధమైనదే. ఆయన తన మొదటి విడత పాలనా కాలంలో (2017–21) ఇచ్చి ఈసారి మళ్లీ ఇస్తున్న 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) నినాదంలోని ఉద్దేశం కూడా అదే. పౌరసత్వాలపై, వలసలపై ఆంక్షలు; దిగుమతులపై భారీగా సుంకాలు; గ్రీన్‌లాండ్, పనామా కాలువల స్వాధీనం; చైనాపై వాణిజ్య యుద్ధం; చమురు ధరలు తగ్గించాలనీ, తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలనీ అరబ్ దేశాలపై ఒత్తిడులు; ఇతరులు అమెరికా చమురునే ఖరీదు చేయాలనటం; తాము అధిక నిధులు ఇస్తున్నామంటూ డబ్ల్యూహెచ్‌ఓ, ప్యారిస్ ఒప్పందాల నుంచి ఉపసంహరణ; డాలర్‌కు పోటీ రావద్దంటూ బ్రిక్స్ కూటమికి బెదిరింపులు... ఇట్లా దేనిని గమనించినా వాటన్నింటి వెనుక కనిపించేది ఆర్థిక విషయాలే.

## ఆధిపత్యపు గుప్పిటి

ఏ అధ్యక్షుడైనా తమ దేశం ఆర్థికంగా బలంగా ఉండాలనీ, ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలబడాలనీ కోరుకోవటంలో ఆక్షేపించవలసింది ఏమీ లేదు. వాస్తవానికి, రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి బ్రిటిష్ సామ్రాజ్యం కుప్పకూలినప్పటి నుంచి అమెరికాదే అగ్ర స్థానం. అయినప్పటికీ ట్రంప్ ఆర్థిక యుద్ధం అనదగ్గ రీతిలో పై చర్యలను ఎందువల్ల ప్రకటిస్తున్నట్లు? అమెరికా బలానికి మూలస్తంభాలు నాలుగున్నాయి. ఒకటి, ఆర్థిక స్థితి. రెండు, సైనిక శక్తి. మూడు, ఉన్నత విద్యతోపాటు శాస్త్ర–సాంకేతిక రంగాలలోని ప్రతిభా సామర్థ్యాలు. నాలుగు, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యూటీఓ, ఐక్య రాజ్యసమితి వంటి ప్రపంచ వ్యవస్థలపై ఆధిపత్యం. ఈ నాలుగు అమెరికా గుప్పిట్లో ఉన్నంతకాలం అమెరికా సామ్రాజ్యానికి ముప్పు ఉండదు. ఈ పాఠాలను వారు బ్రిటిష్ సామ్రాజ్య పతనం నుంచి నేర్చుకున్నారు. కనుక ఈ ఆధిపత్యాలు చెదరకూడదు.

రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ జర్మనీ ఓడిన తర్వాత సోవియెట్ యూనియన్ నాయకత్వాన కమ్యూనిస్టు శిబిరం బలపడి, అమెరికాకు మొదటి పెద్ద సవాలుగా నిలిచింది. కానీ, సోవియెట్ కూటమి అమెరికాకు సైద్ధాంతికంగా, సైనికంగా మాత్రమే సవాలు అయింది తప్ప, పైన పేర్కొన్న మొత్తం నాలుగు రంగాలలోనూ కాలేకపోయింది. చివరకు పలు స్వీయాపరాధాలవల్ల కుప్పకూలింది. ఇది 1991 చివరి దశ మాట. తర్వాత 30 ఏళ్లపాటు అమెరికాకు ఎదురులేక పోయింది.

## చైనా సవాలు

ఆ విధంగా తమకు ఎదురు లేదని భావిస్తుండగా రష్యా తన అపారమైన సహజ వనరుల బలంతో నెమ్మదిగా పుంజుకోవటం మొదలైంది. దానితోపాటు మరికొన్ని పరిణామాలు అమెరికాకు సరికొత్త సవాలుగా మారసాగాయి. ఈ పరిణామాలలో అన్నింటి కన్నా ప్రధానమైంది చైనా అనూహ్యమైన అభివృద్ధి. అందుకు ఆరంభం ఆ దేశం 2001లో డబ్ల్యూటీఓలో ప్రవేశించటంతో మొదలైంది. 1980–90 మధ్య తెంగ్ శియావ్ పింగ్ ఆర్థిక సంస్కరణలకు పునాదులు వేయగా, డబ్ల్యూటీఓ ప్రవేశంతో అందుకు మహా వేగం



వచ్చింది. పదేళ్లయేసరికి అమెరికా తర్వాత రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. 2017 నాటికైతే పర్చేజింగ్ పవర్ పేరిటీ (పీపీపీ; దేశాల మధ్య కొనుగోలు శక్తిలోని తారతమ్యం) కొలమానాల ప్రకారం అమెరికాను సైతం మించిపోయింది.

ఇక్కడ చెప్పుకోవలసిన ముఖ్యమైన విషయం ఒకటుంది. అది సోవియెట్ యూనియన్ వ్యూహానికీ, చైనా వ్యూహానికీ మధ్యగల తేడా. సోవియెట్ పతనం నుంచి పాఠాలు నేర్చుకున్న చైనా, అమెరికా వలెనే ఒక సమగ్ర వ్యూహాన్ని అనుసరించేందుకు ప్రయత్నిస్తూ వస్తున్నది. ఆర్థికాభివృద్ధి, సైనికాభివృద్ధి, విద్యతోపాటు శాస్త్ర–సాంకేతిక రంగాల అభివృద్ధి, అంతర్జాతీయ సంస్థలలో పలుకుబడిని క్రమంగా పెంచుకోవటం. ఇవిగాక, అమెరికా, యూరోపియన్ దేశాలు ప్రపంచవ్యాప్తంగా గల చిన్న దేశాల సహజ వనరులను, మార్కెట్లను కొల్లగొడుతూ వాటిని తమ చెప్పు చేతలలో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తుండగా, చైనా తన అపారమైన ధన సంపదతో వాటి అభివృద్ధికి సహకరించటంతో పాటు తాను కూడా లాభపడే వ్యూహాన్ని అనుసరించటం మొదలుపెట్టింది.

అమెరికా, యూరప్ ఉత్పత్తుల ఖర్చు పెరగటంతో పరిశ్రమలను తమంతట తామే చైనాకు, ఆగ్నేయాసియా దేశాలకు తరలించటం, అక్కడి నుంచి చవకగా దిగుమతి చేసుకోవటం అనే వ్యూహం తొలుత బాగానే పనిచేసింది. కానీ తర్వాత అదే వారికి సమస్యగా మారింది. అనేక ఆధునిక పరిశోధనలు, ఉత్పత్తుల విషయంలో చైనా తదితర దేశాలు అమెరికా కన్నా ముందుకు వెళ్లి పోయాయి.

## బ్రిక్స్ సవాలు

అమెరికా కూటమికి దీనికిదే ఒక జంకుగా మారగా, చైనా చొరవతో ఏర్పడిన బెల్ట్ అండ్ రోడ్ పథకం, బ్రిక్స్ కూటమి పెద్ద సవాళ్లు అయాయి. ఇండియా కొన్ని కారణాల వల్ల బెల్ట్ పథకంలో చేరలేదుగానీ, 2009లో వ్యవస్థాపితమైన బ్రిక్స్‌లో వ్యవస్థాపక సభ్య దేశం కావటం గమనించదగ్గది. అమెరికా ఏక ధ్రువ ప్రపంచంవల్ల కలుగుతున్న హానిని గుర్తించిన ముఖ్యమైన దేశాలు కొన్ని బహుళ ధ్రువ ప్రపంచం అనే భావనను అజెండా పైకి తెచ్చాయి. ఒకప్పుడు అమెరికా, సోవియెట్ యూనియన్‌లతో ద్విధ్రువ ప్రపంచం ఉండగా, సోవియెట్ పతనం తర్వాత అది ఏకధ్రువంగా మారింది.

దీనితో ఈ కొత్త సవాలును భగ్నం చేసేందుకు అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు చతురోపాయాలను ప్రయోగిస్తున్నాయి గాని సఫలం కావటం లేదు. వారు ఎంత వ్యతిరేకించినా బెల్ట్ పథకపు సభ్య దేశాల సంఖ్య 150కి మించి పోయింది. విశేషమేమంటే, అమెరికా కూటమిలోని యూరోపియన్ దేశాలు కొన్ని కూడా అందులో చేరాయి. బ్రిక్స్‌లో మరికొన్ని పెద్ద దేశాలు కొత్తగా చేరగా డజన్ల కొద్దీ దరఖాస్తు చేశాయి. సరిగా ట్రంప్ అధికార స్వీకరణ చేస్తుండిన రోజులలోనే ఇండోనేసియా చేరగా, తాము కూడా చేరనున్నట్లు మలేసియా ప్రధాని ప్రకటించారు. బ్రిక్స్ కూటమి జీడీపీ ప్రపంచ జీడీపీలో ఇప్పటికే 35 శాతానికి చేరగా, జీ–7 జీడీపీ 30 శాతం దగ్గర ఆగిపోయి ఉంది. మరొకవైపు చైనాతో అమెరికా వాణిజ్య లోటు సంవత్సరాల తరబడిగా తీరటం లేదు. దాదాపు 120 దేశాలతో చైనా వాణిజ్యం అమెరికాను మించిపోయింది.

ఈ విధమైన మార్పులతో కలవరపడినందువల్లనే ట్రంప్ తన మొదటి హయాంలో చైనాపై బహిరంగంగా వాణిజ్య యుద్ధం ప్రకటించారు. సుంకాలు పెంచారు. అమెరికన్ కంపెనీలు అక్కడి నుంచి తరలి వెళ్లకపోతే వాటి ఉత్పత్తులపైనా సుంకాలు పెంచుతామన్నారు. చైనాకు ముడి వనరులు, సాంకేతికతలు అందకుండా వీలైనన్ని ప్రయత్నాలు చేశారు. కానీ, ఆయన పాలన ముగిసే నాటికి, ఆ యుద్ధం విఫలమైనట్లు అమెరికా సంస్థలే తేల్చి చెప్పాయి. చైనాకు కలిగిన నష్టం కన్నా అమెరికా నష్టాలు ఎక్కువని లెక్కలు వేసి చూపించాయి. ఆ తర్వాత బైడెన్ కూడా అదే వ్యూహాన్ని అనుసరించి విఫలమయ్యారు. ఇప్పుడు ట్రంప్ వైఖరి చిత్రంగా ఉంది. ఒకవైపు తిరిగి వాణిజ్య యుద్ధాన్ని ప్రకటిస్తూనే, మరొకవైపు చైనాతో చర్చలు జరపగలమని అంటున్నారు. అమెరికా ఆధిపత్యానికి డాలర్ శక్తి ఒక ముఖ్యాధారం. బ్రిక్స్ కూటమి ప్రత్యామ్నాయ కరెన్సీ సృష్టించగలమని చెప్పలేదు గానీ, వివిధ దేశాల మధ్య వాణిజ్య చెల్లింపులు డాలర్‌కు బదులు స్థానిక కరెన్సీలలో జరిగేందుకు ప్రయత్నించగలమన్నది. ఈ మార్పులు డాలర్‌ను బలహీనపరచగల అవకాశం ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. ఇంతకూ ట్రంప్ ఈ రెండవ విడత వాణిజ్య యుద్ధం ఫలించగలదా అన్నది ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

- సోవియెట్ యూనియన్ వ్యూహానికీ, చైనా వ్యూహానికీ తేడా ఉంది. సోవియెట్ పతనం నుంచి పాఠాలు నేర్చుకున్న చైనా, అమెరికా వలెనే ఒక సమగ్ర వ్యూహాన్ని అనుసరించేందుకు ప్రయత్నిస్తూ వస్తున్నది.
- బ్రిక్స్ కూటమి జీడీపీ ప్రపంచ జీడీపీలో ఇప్పటికే 35 శాతానికి చేరగా, జీ–7 జీడీపీ 30 శాతం దగ్గర ఆగిపోయి ఉంది.
- అమెరికా, యూరప్ ఉత్పత్తుల ఖర్చు పెరగటంతో పరిశ్రమలను తమంతట తామే చైనాకు, ఆగ్నేయాసియా దేశాలకు తరలించటం, అక్కడి నుంచి చవకగా దిగుమతి చేసుకోవటం అనే వ్యూహం తొలుత బాగానే పనిచేసింది. కానీ తర్వాత అదే వారికి సమస్యగా మారింది.

## సోషల్ మీడియా

### ఎందుకు దాస్తున్నారు?



ముందు తిరుపతి, ఇప్పుడు కుంభమేళా. తొక్కిసలాటలు చావులకు కారణమవుతాయి. కానీ మీడియా దీన్ని దాయడానికి ప్రయత్నిస్తున్నదంటేనే వ్యవస్థ ఎంత పాడైందో అర్థమవుతోంది. పార్టీ, ప్రభుత్వం వైపు కాకుండా మీడియా ప్రజల పక్షం వహించాలి.

– అనూషా రవి సూద్, జర్నలిస్ట్

### అభినందనలు



ప్రపంచ మేటి సినిమాటోగ్రాఫర్ల సంస్థ అయిన 'అమెరికన్ సొసైటీ ఆఫ్ సినిమాటోగ్రాఫర్స్'లో జాతీయ అవార్డు గెలుచుకున్న సినిమాటోగ్రాఫర్ రవి వర్మన్ సభ్యులయ్యారని వార్త. అభినందనలు. చాలా సంతోషం.

– భరద్వాజ్ రంగన్, సినీ విమర్శకుడు

### ఇప్పుడే తెలుసు!



తియానన్మెన్ స్క్వేర్ ఘటనను చైనా కృత్రిమ మేధ 'డీప్‌సీక్' సెన్సార్ చేసిందని ఆందోళన చెందుతున్నవారిలో 99 శాతం మందికి, తియానన్మెన్ నిరసనల గురించి డీప్‌సీక్ గురించిన వార్తల ద్వారానే తెలిసింది.

– ఆండ్రియ్ బుర్కోవ్, పరిశోధకుడు

### ఎక్కడ సమస్య?



మనం ఎందుకు కృత్రిమ మేధలో ఇంతగా వెనుకబడి ఉన్నాం? డీప్‌టెక్‌లో స్టార్టప్‌లు రావడం లేదా? ఇన్వెస్టర్లు ధైర్యం చేయడం లేదా? ప్రతిభ లేదా? విశ్వవిద్యాలయాల్లో గట్టి పరిశోధనలు లేవా? ఇంకెందుకు?

– గౌరవ్ ముంజల్, 'అన్‌అకాడెమీ' సహ వ్యవస్థాపకుడు

### అంత వెనక...



ఈ టైమ్ జోన్లు గమ్మత్తుగా ఉంటాయి. ఇండియాలో ఉదయం 8 గంటలు అవుతోంది. జపాన్‌లో మధ్యాహ్నం పన్నెండు గంటలు. కానీ పాకిస్తాన్‌లో మాత్రం క్రీ.పూ. 300.

– జైరా నిజామ్, ఐఐటియన్

## ఇన్ బాక్స్

### ఆదివాసీలకు ప్రాముఖ్యం

ఇవ్వాళ పర్యాటక రంగం ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కీలకంగా మారింది. ప్రభుత్వానికి ఆదాయంతో బాటు పర్యాటక ప్రాంతాల్లోని స్థానికులకు ఉపాధి లభిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకూ పర్యాటకాభివృద్ధికి అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. దక్కన్ పీఠభూమి మధ్యలో ఉన్న తెలంగాణ ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక యుగాల సాంస్కృతిక అవశేషాలతో అలరారుతోంది. హైదరాబాదు, దాని చుట్టుపక్కల ప్రాంతాలు ఇస్లాం కట్టడాలే కాక, బౌద్ధం, జైనం, పారశీక మతాలకు చెందిన అవశేషాలతో గంగా తెహజీబ్ జీవనానికి ప్రతిబింబాలుగా కనిపిస్తాయి. ఎన్నో చారిత్రక కట్టడాలు టూరిస్టులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

సుదీర్ఘ తీర ప్రాంతం గల ఆంధ్రప్రదేశ్ అందమైన బీచ్‌ల అభివృద్ధి ద్వారా ఎంతో మంది యాత్రికులను ఆకర్షించవచ్చు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న ఆదివాసీ ప్రాంతాలు ఎకో టూరిజానికీ, ట్రైబల్ టూరిజానికీ మంచి అవకాశం కల్పిస్తున్నాయి. అలాగే తెలంగాణలోనూ ఎన్నో తెగలవారు జీవిస్తున్నారు. అయితే ఆదివాసీ ప్రాంతాలను టూరిస్ట్ డెస్టినేషన్స్‌గా మార్చాలనుకుంటే తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆదివాసీ ప్రాంతాల్లో అమలవుతున్న ప్రత్యేక చట్టాలు, 'పెసా' రక్షణలకు ఏ మాత్రం భంగం రాకూడదు. పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్ వినియోగం, జీవన విధానాన్ని గాడి తప్పించే చర్యలు తీసుకోవడం, నిర్మాణాలు చేయడం కూడదు. ప్రాజెక్టుల్లో స్థానిక ఆదివాసీల్ని నామమాత్రపు లబ్ధిదారులుగా భావించకుండా, ప్రథమ వాటాదారులుగా తీసుకోవాలి. అందుకు తగ్గ శిక్షణ, వనరులు ప్రభుత్వమే అందించాలి. ఆ యా గ్రామాలు, ఆవాసాలకు లాభంలో నికర శాతం కేటాయించాలి. పర్యాటకులు ఆ ప్రాంతాన్ని ఇష్టపడేలా, స్థానిక సంస్కృతి పట్ల సున్నితంగా, గౌరవంగా వ్యవహరించేలా, ఉత్తమ జీవన విధానాలు ఒకరికొకరికి మార్పిడి జరిగేలా కార్యక్రమాలు రూపొందించాలి. అలాంటి అవగాహన కల్పించాలి. యువతకు గైడ్లుగా మాత్రమే కాకుండా సంస్కృతి ప్రతినిధులుగా వ్యవహరించేటట్లు శిక్షణ కల్పించి ఎదిగేలా ప్రోత్సహించాలి. స్థానిక ఉత్పత్తులకు లాభసాటి మార్కెట్‌తో అనుసంధానం చెయ్యాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

# బడ్జెట్ బతుకునిచ్చేనా?

సందర్భం



డి. పాపారావు

2025, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. గత బడ్జెట్‌లకు భిన్నంగా ఈ బడ్జెట్‌పై అటు కార్పొరేట్ వర్గాలు, ఇటు మధ్యతరగతి – సామాన్య జనాలలో కూడా పెద్ద స్థాయిలో ఆసక్తి, అంచనాలు ఉన్నాయి. దీనికి కారణం ప్రస్తుతం దేశంలో నెలకొంటోన్న ఆర్థిక మాంద్య వాతావరణం. మొన్నటి 2వ త్రైమాసికంలో 5.4 శాతానికి పడిపోయిన వృద్ధి రేటుతో పాటుగా ప్రజల కొనుగోలు శక్తికి కోతలు పెడుతోన్న ద్రవ్యోల్బణం, పెరిగిపోతోన్న నిరుద్యోగం వంటి అనేకానేక సమస్యల వల్ల నేడు దేశీయ ప్రజల స్థితిగతులపై కారుమబ్బులు కమ్ముతున్నాయి. ఫలితంగా కార్పొరేట్ల అమ్మకాలూ, లాభాలూ కూడా నేలచూపులు చూస్తున్నాయి.

కాబట్టి, ప్రస్తుత బడ్జెట్ ప్రజలకు ఉపాధి కల్పించేది, వారి కొనుగోలు శక్తిని పెంచేది, ద్రవ్యోల్బణానికి పరిష్కారం చెప్పేదిగా ఉండాలనేది అందరి ఆకాంక్ష. అయితే, గత మూడున్నర దశాబ్దాలుగా మన దేశంలో అమలవుతూ... గత దశాబ్ద కాలంగా మరింత ముమ్మరం అయిన కార్పొరేట్‌ల, ధనికుల అనుకూల విధానాలను ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం విడనాడగలదా అనేది పెద్ద ప్రశ్న.

ఈమధ్యే వెలువడిన ప్రత్యక్ష పన్నులూ, పరోక్ష పన్నుల వసూలు గణాంకాలు చూస్తే ప్రభుత్వ విధానాలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయో స్పష్టమవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025) లోని 2024 ఏప్రిల్– నవంబర్ కాలంలో కేంద్ర ప్రభుత్వం తాలూకు వ్యక్తిగత పన్ను ఆదాయ వసూళ్ళు అంతకు ముందరి సంవత్సరం అదే కాలం కంటే 23.5 శాతం పెరిగాయి. కాగా, 2025 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ పెరుగుదల అంచనా 13.6 శాతంగా ఉంది. ఇక 2024 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ వసూళ్ళు... అంచనా కంటే (10.5%) అధికంగా (సుమారు 23 శాతం) ఉన్నాయి.

కార్పొరేట్ పన్ను ద్వారా సమకూరే ఆదాయం 2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 12 శాతం పెరుగుతుందని అంచనా వేసుకోగా... వాస్తవంలో అది అంతకు ముందరి సంవత్సరం కంటే 0.5 శాతం తగ్గింది. 2019–20 కాలంలో కార్పొరేట్ పన్నును 10 శాతం మేర తగ్గించడంతో తగ్గిన వసూళ్ళు, తగ్గిపోయిన కార్పొరేట్ల లాభాల మొత్తాల వంటివి దీని వెనుక ఉన్న కారణాలు.

ఏదేమైనా ఇక్కడ కనపడేది మధ్యతరగతి ఉద్యోగస్థులు, వ్యాపారులు, తదితరులు కట్టే వ్యక్తిగత ఆదాయ పన్ను మొత్తాల వసూళ్ళు అంచనాలను మించి పెరగడం... బడా కార్పొరేట్లు కడుతోన్న పన్ను మొత్తాల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడం అనేవి... ప్రభుత్వ కార్పొరేట్లు, ధనికుల అనుకూల విధానాలకు తార్కాణాలు. అలాగే, పరోక్ష పన్ను అయిన జీఎస్‌టీ వసూళ్ళ విషయంలో కూడా 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 2 శాతం పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తే అది 8.7 శాతంగా ఉండడం



గమనార్హం. ప్రభుత్వ విధానాలు జన సామాన్యాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయనేదానికి అంచనాలను మించిన ఈ జీఎస్‌టీ ఆదాయ పెరుగుదల తార్కాణం. అలాగే, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ విధానాలకు మరో మచ్చు తునక ఎక్సయిజ్ ఆదాయం కూడా ఈ కాలంలో అంచనాల కంటే తగ్గుముఖం పట్టడం. దీనికి కారణం పెట్రోలియంపై లభించే భారీ లాభాలకు గాను కంపెనీలపై విధించబడే 'విండ్‌ఫాల్ ట్యాక్స్'ను ఉపసంహరించుకోవడం!

ఏ విధంగా చూసినా పెద్ద మనుషులకో నీతి; సామాన్య, మధ్యతరగతి జనానికో నీతిగా ప్రభుత్వ విధానాలు నడుస్తున్నాయి. అలాగే, ఈ మధ్య కాలంలో ప్రధాన మంత్రి ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ స్వయంగా వాపోయినట్లుగా... కార్పొరేట్ కంపెనీల లాభాలు పెరిగిన స్థాయిలో... వాటి కార్మికులూ, ఉద్యోగుల జీతాలు పెరగడం లేదు.

అలాగే, 2016 నవంబర్‌లో అమలు జరిగిన పెద్ద నోట్ల రద్దు... 2017లో అమలులోకి వచ్చిన జీఎస్‌టీ పన్ను విధానాల వల్ల దేశంలో లెక్కకు మించిన స్థాయిలో సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలు మూతపడ్డాయి. అదే విధంగా అనేకమంది సాధారణ వ్యాపారులు జీవనోపాధిని కోల్పోయారు. ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. అలాగే, 2020లో చుట్టు ముట్టిన కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలోని వైఫల్యాల వలన కూడా దేశంలో నగర ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు తిరిగి తరలి వెళ్ళిపోయిన వలస కార్మికులలోని పెద్ద భాగం, నేటికీ తిరిగి నగర ప్రాంతాలకు పూర్తిగా రాలేదు. అంటే, నిజానికి దేశంలోని ఆర్థిక పరిస్థితులు కోవిడ్ ముందరి కాలం నాటి స్థితికి కూడా ఇంకా చేరుకోలేదన్న మాట. స్థూలంగా నేడు, కార్పొరేట్‌లకు పన్ను రాయితీలు... ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పేరుతో నజరానాలు, అలాగే వాటి బ్యాంక్ ఋణాల రద్దు (రైట్ ఆఫ్)లు ఒక ప్రక్క; సామాన్య మధ్యతరగతి జనాలపై ప్రత్యక్ష (ఆదాయపు పన్ను), పరోక్ష పన్నుల (జీఎస్టీ) భారాలు మరో పక్క నేటి ప్రభుత్వ విధానాలుగా ఉన్నాయి. అంటే, మార్కెట్‌లో తమ కొనుగోళ్ళ ద్వారా కార్పొరేట్ల సరుకులూ, సేవలకు డిమాండ్‌ను కల్పించే జన సామాన్యం కొనుగోలు శక్తిని, చేజేతులా కూలదోస్తోన్న ప్రభుత్వ విధానాలు కూర్చున్న కొమ్మనే నరుక్కునే పిచ్చివాడి తీరుగా ఉన్నాయి. కాబట్టి, ఈ బడ్జెట్‌లోనైనా మన 'స్వదేశీ' విధానాల కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుంటుందా?

**గమనిక:** ఈలోగా, పేద ప్రజానీకానికి ఉపశమనాన్ని ఇచ్చి... వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ ఆదాయం పడిపోతోన్న కోవిడ్ కాలంలో కూడా కొద్దిమేరనైనా ఈ ఆదాయం పెరుగుదలను చూపించగలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల విధానాలూ... అలాగే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో కూడా దేశీయ ప్రజల కొనుగోలు శక్తిని కాపాడిన 'జాతీయ ఉపాధి హామీ పథకం' వంటి వాటిని మన మధ్యతరగతి వర్గం సానుకూలంగా చూడగలగాలి. నిజానికి ఈ వర్గానికి నష్టం చేస్తోంది ప్రభుత్వాల కార్పొరేట్, ధనికుల అనుకూల విధానాలే కానీ... అవి పేద ప్రజలకు ఇచ్చే కొద్దిపాటి రాయితీలు కాదనేది గుర్తించాలి!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

# మోక్ష నిరోధకాలు

భ్రమలో ఉండేవారిని అజ్ఞానం ఎంతో తికమకపరుస్తుంది. అటువంటి వారు అనాత్మను ఆత్మగాను; ఆత్మను అనాత్మగాను తలచి ఒకదానిపై వేరొకదానిని ఆరోపించుకుంటున్నారు. వారి సహజ ప్రకృతి వల్ల సచ్చిదానందం అనే వాస్తవాన్ని మరచిపోతున్నారు. ప్రాపంచిక విషయాల్లోనే సంతోషం ఉందనుకుంటున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

భ్రమలో ఉండేవారు ఆత్మనే పరమాత్మ అనే వాస్తవాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అటువంటి వారికి విగ్రహారాధన మొదటి మెట్టుగా పెద్దలు చెప్పారు. ఆత్మే ఎప్పుడూ బంధరహితంగా ఉంటుందనే సత్యం తెలియనంత వరకు అల్పప్రాణులు అనేక దీక్షలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేయడానికి పూనుకుంటారు. ఎంతకాలం ఈ శరీరమే 'నేను' అనే భావాన్ని కలిగి ఉంటారో అంతకాలం వారె వరూ ఆత్మసాక్షాత్కారం పొందలేరు.


ఆధ్యాత్మిక మార్గం ప్రకారం... శారీరక స్పృహ అజ్ఞాన సూచికే. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన అని మూడు వాసనలు ఉంటాయి. దేహ ధర్మములను ఆత్మపై ఆరోపించడమే 'దేహవాసన'. నేను సాధించాను, నేను పండితుడను, నేను శాస్త్రాన్ని పఠించాను అనే భావన 'శాస్త్రవాసన'. ఈ ప్రపంచమే యథార్థమైనది అని తలచి ప్రపంచంతో సంబంధాన్ని కలిగి ఉండటమే 'లోకవాసన'. వాసనలు ఉన్నంతకాలం మోక్షం లభించదు. వాసనలను దూరం చేయడానికి దివ్య నామ సంకీర్తన, నిరంతర దైవదర్శనం ఉపయోగపడతాయి.

ఆధ్యాత్మిక, ఆచార పర ప్రయాణమే 'అంతరంగ ప్రయాణం'. సద్గుణాలను పెంచుకొని, మనస్సును పరిశుద్ధం చేసికొని జ్ఞానంతో వాటిని కలుష రహితంగా ఉంచాలి. సృజనాత్మకమైన బుద్ధిబలం పెరిగిన కొలదీ తాత్విక చింతన ముందడుగు వేస్తుంది, సత్యాన్వేషణ పట్ల జిజ్ఞాస పెరుగుతుంది. వయసు పెరిగిన కొలది శరీరం ఏ విధంగా పెరుగుతుందో, అదే విధంగా మనలో ఉండే మనస్సు, బుద్ధిబలం (జ్ఞానము) కూడా సద్గుణాలతో వెలగాలి. ఈ భౌతిక ప్రపంచం శాశ్వతం కాదని గుర్తెరగాలి. తర్కంలో చురుకుదనాన్ని పెంచుకొని నిత్య, అనిత్య వస్తు భేదమును సరిగా తెలుసుకోవాలి. ఆ తర్వాత నిరంతర ఆచరణతో, శుద్ధ సంకల్పంతో ప్రయత్నించి జిజ్ఞాసాపరుడు అంతరాత్మ సాక్షాత్కారం పొందగలడు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.5.51 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.51 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.45 నుండి 2.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.23 నుండి 11.11 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** రా.10.03 నుండి 11.35 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.50.

# ఈసారీ.. భారీగానే..




రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు రెండేళ్లుగా బడ్జెట్‌లో భారీగా నిధులు

- కీలక ప్రాజెక్టులపైనే దృష్టిపెట్టి పూర్తి చేస్తున్న రైల్వే శాఖ
- ఈసారీ భారీగానే కేటాయింపులుంటాయని అంచనా

సాక్షి, హైదరాబాద్: పరిమిత ప్రాజెక్టులు.. మొత్తం కేటాయింపుల్లో వాటికే సింహభాగం నిధులు.. కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రాజెక్టుల విషయంలో అనుసరిస్తున్న విధానం. ఈ ప్రయోగం ఇప్పుడు సత్ఫలితాలిస్తోంది. దీనివల్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కొన్ని ప్రాజెక్టులు పూర్తి కాగా, మరో మూడు కీలక ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసే దిశగా రైల్వే శాఖ ముందుకు సాగుతోంది. త్వరలో ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి రానుండటంతో తెలంగాణలో రైలు సేవలు బాగా మెరుగుపడబోతున్నాయి.

### బల్లార్షా-కాజీపేట-విజయవాడ

ఉత్తర-దక్షిణ భారత్‌లను రైల్వే పరంగా జోడించే కీలక మార్గం ఇది. అందుకే దీన్ని గ్రాండ్ ట్రంక్ రూట్‌గా పిలుస్తారు. ఈ మార్గంలో నిత్యం 460 వరకు రైళ్లు పరుగు పెడుతుంటాయి. ప్రస్తుతం దాని ట్రాఫిక్ సాంద్రత ఏకంగా 160 శాతంగా ఉంది. ఈ మార్గంలో కనీసం మరో 250 ప్రయాణికుల, సరుకు రవాణా రైళ్లను నడపాల్సి ఉన్నా, సాంద్రత ఎక్కువగా ఉండటంతో సాధ్యం కావటం లేదు. దీంతో మూడో లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాజీపేట- విజయవాడ మధ్య మూడో లైన్ 2012-13లో మంజూరు కాగా, కాజీపేట-బల్లార్షా లైన్ 2015-16లో మంజూరైంది. కానీ పనులు వెంటనే మొదలు కాలేదు. గత మూడేళ్లుగా వీటికి భారీగా నిధులు కేటాయిస్తుండటంతో ఇప్పుడు పనులు కొలిక్కి వచ్చాయి. ఈ మార్గంలో వంతెనల నిర్మాణం దాదాపు పూర్తయింది. మిగతా పనులు వేగం పుంజుకున్నాయి. దీన్ని రెండు ప్రాజెక్టులుగా చేపట్టారు. కాజీపేట-బల్లార్షా మధ్య 202 కి.మీ. నిర్మాణాన్ని రూ.2,063 కోట్ల అంచనాతో ప్రారంభించారు. రాఘవాపురం-కొలనూరు, కొలనూరు-పొత్కపల్లి, విరూరు-మాణిక్‌ఘర్, బిజిగిర్ షరీఫ్- ఉప్పల్, విరూరు-మాకుడి, పొత్కపల్లి-బిజిగిర్ షరీఫ్, మాకుడి-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య ఇప్పటికే పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.300 కోట్లు కేటాయించారు. ఈసారి కొంత సవరించే అవకాశం ఉంది. భారీగా నిధులు ఇవ్వటంతో హసన్‌పర్తి రోడ్డు-ఉప్పల్, ఆసిఫాబాద్-రేచినిరోడ్, హసన్‌పర్తి-కాజీపేట పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 173.27 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణం పూర్తయింది. 28 కి.మీ. పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. బల్లార్షా- మాణిక్‌ఘర్, రేచిని రోడ్-బెల్లంపల్లి- మందమర్రి, ఆసిఫాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య పూర్తి కావాల్సి ఉంది.

### కాజీపేట-విజయవాడ మూడో లైను

ఈ లైన్ పూర్తి నిడివి 220 కి.మీ. గత బడ్జెట్‌లో దీనికి రూ.310 కోట్లు కేటాయించగా, తర్వాత కొన్ని నెలలకే ఆ మొత్తాన్ని రూ.500కు పెంచారు. దీంతో ఒక్కసారిగా పనుల్లో వేగం పెరిగింది. 104 కి.మీ. నిడివిలో మూడో లైన్ పనులు పూర్తి చేయటంతోపాటు, అన్ని వంతెనలను సిద్ధం చేశారు. మిగతా పనులు మూడొంతులు పూర్తి కాగా, తుదిదశ పనులు మాత్రమే మిగిలాయి. విజయవాడ-కొండపల్లి, కొండపల్లి-చెరువు మాధవరం, చెరువు మాధవరం-గంగినేని-ఎర్రుపాలెం, నెక్కొండ-చింతలపల్లి, చింతలపల్లి-వరంగల్ మధ్య ఇప్పటికే మూడో లైన్ వినియోగంలోకి రాగా, పందిళ్లపల్లి-బోనకల్, ఎర్రుపాలెం-మధిర, విజయవాడ-బెజవాడ క్యాబిన్ మధ్య గత ఏడాది కాలంలో పూర్తయ్యాయి. బోనకల్-మధిర, నెక్కొండ-పందిళ్లపల్లి మధ్య పనులు జరగాల్సి ఉంది. మరో ఏడాదిలో పనులు దాదాపు పూర్తి కానున్నాయి.

### మనోహరాబాద్-కొత్తపల్లి

సిద్దిపేట మీదుగా హైదరాబాద్-కరీంనగర్‌ను రైల్వే ద్వారా అనుసంధానించే 151 కి.మీ. కీలక ప్రాజెక్టు ఇది. 2006-07లో మంజూరైనా ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. మూడేళ్లుగా వేగంగా జరుగుతున్నాయి. గత బడ్జెట్‌లో దీనికి రూ.350 కోట్లు కేటాయించారు. ఇప్పటికే సికింద్రాబాద్-సిద్దిపేట మధ్య రైలు సేవలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇక సిద్దిపేట-సిరిసిల్ల మధ్య ఫార్మేషన్, కటింగ్, లింకింగ్ పనులు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో రెయిల్స్ పరవనున్నారు. ఈ సెక్షన్‌లో దాదాపు 60 వరకు మైనర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. నాలుగు ఆర్‌ఓబీల నిర్మాణం పూర్తి కావచ్చింది. మరో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో సిరిసిల్ల వరకు రైలు నడిపేందుకు వీలు కలగనుంది.

### మరికొన్ని మార్గాల్లో..

- సిరిసిల్ల-కరీంనగర్ మధ్య 40 కి.మీ. మార్గానికి భూ పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవటంతో భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అక్కడ పనులు జరగటం లేదు. భూ పరిహారం రూ.40 కోట్లు చెల్లించాల్సి ఉంది. భూమిని రైల్వేకు అప్పగించి ఉంటే ఈపాటికి చాలా పని జరిగి ఉండేది. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.
- నడికుడి మీదుగా బీబీనగర్- గుంటూరు మార్గాన్ని రెండు వరుసలకు విస్తరించే ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.220 కోట్లు కేటాయించారు. 248 కి.మీ. ఈ మార్గంలో కుక్కడం-నడికుడి సెక్షన్ల మధ్య భూసేకరణ పూర్తయింది. ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. మిగతా చోట్ల భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది.
- 2023-24లో బడ్జెట్‌లో మంజూరు చేసిన ముద్ఖేడ్-డోన్ డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు ప్రారంభమయ్యాయి. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సవరించి మధ్యలో రూ.550 కోట్లు మంజూరు చేశారు.
- 2023-24లో మంజూరు చేసిన భద్రాచలం-డోర్నకల్, మోటమర్రి-విష్ణుపురం డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు మొదలయ్యాయి. గత బడ్జెట్‌లో వీటికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.
- గత బడ్జెట్‌లో మంజూరు చేసిన పాండురంగాపురం-మల్కాజిగిరి కొత్త లైన్, ఎంఎంటీఎస్ రెండో దశ పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

## మధ్యంతర బెయిల్ ఇవ్వండి

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు రాధాకిషన్‌రావు పిటిషన్



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు రాధాకిషన్‌రావు మధ్యంతర బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్ రావు చంచల్‌గూడ జైల్లో ఉంటున్న విషయం తెలిసిందే. సమీప బంధువుల వివాహానికి హాజరు కావాల్సి ఉన్నందున ఈ నెల 30 నుంచి వచ్చే నెల 2 వరకు మధ్యంతర బెయిల్‌కు అనుమతించాలని కోరారు. దీనిపై బుధవారం వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన గురువారం (నేడు) ఉత్తర్వులు వెలువరిస్తామన్నారు. అలాగే, ఇదే కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం మేరకు తనను అరెస్టు చేశారని, సీనియర్ సిటిజన్ అయిన తాను మార్చి నుంచి జైలులో ఉంటున్నానని.. రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

### భుజంగరావు బెయిల్‌పై నేడు తీర్పు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో నిందితుడు, మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం జస్టిస్ కె.సుజన తీర్పు వెలువరించనున్నారు. 2024, మార్చిలో భుజంగరావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నాంపల్లి కోర్టు ఆగస్టులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అప్పటి నుంచి మధ్యంతర బెయిల్ పొడిగిస్తూ ఉండటంతో ఆయన బయటే ఉన్నారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.







## పీడీఎస్‌యూ రెండు వర్గాలు విలీనం

- రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

ఖమ్మం మామిళ్లగూడెం: రెండువర్గాలు (సాదినేనివెంకటేశ్వరరావు/పోటుసూర్యం)గా 2013లో విడిపోయిన పీడీఎస్‌యూ తిరిగి ఒక్కటైంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఖమ్మంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజుతోపాటు ఉపాధ్యక్షులుగా మహేష్, మధు, కిరణ్, శ్రీకాంత్, రాజేశ్వర్, సంతోష్, నవీన్, సహాయ కార్యదర్శులుగా గౌతం, తిరుపతి, మస్తాన్, శ్రీనివాస్, ప్రణయ్, అజయ్, ప్రవీణ్ కోశాధికారిగా రాజాప్రతాప్ ఎన్నికయ్యారు.

## ధన్వాడ బాలుర హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్

- 22 మంది విద్యార్థులకు అస్వస్థత



ధన్వాడ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

ధన్వాడ: నారాయణపేట జిల్లా ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం వికటించింది. వంకాయ, ఆలుగడ్డ కూరగాయతో భోజనం వడ్డించగా.. 540 మంది విద్యార్థులు తిన్నారు. అందులో 22 మంది అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకోగా.. మిగతా విద్యార్థులు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడ్డారు. ఉపాధ్యాయులు డాక్టర్ అనూషకు సమాచారం ఇవ్వడంతో పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు చికిత్సలు అందించారు. పాఠశాలలోనే ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని.. అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇచ్చినట్లు డాక్టర్ తెలిపారు. కాగా, సరిగా ఉడకని అన్నం వడ్డించడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయంపై ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు.

## 2న 'సమగ్ర సర్వే' నివేదిక

- మంత్రివర్గ ఉప సంఘానికి అందజేస్తామన్న అధికారులు
- ఈ అంశంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్
- రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతమైందని వెల్లడి
- ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శమని వ్యాఖ్య
- అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి అభినందన



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్, దామోదర, పొంగులేటి, సీతక్క ప్రభుత్వ సలహాదారు కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను అధికారులు వచ్చే నెల 2న మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించనున్నారు. దానికన్నా రెండు రోజులు ముందే నివేదిక ముసాయిదాను సిద్ధం చేసి అందించనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వెల్లడించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ సర్వే రాష్ట్రంలో సామాజిక సాధికారతతోపాటు భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల సర్వే చేపట్టి చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని.. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం పట్ల ప్రశంసలు అందుతున్నాయని పేర్కొన్నారు.

### విస్తృత స్థాయిలో ప్రక్రియ చేపట్టి..

గత ఏడాది ఫిబ్రవరి 4న సీఎం రేవంత్ నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం.. ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సబ్ కమిటీ ఏర్పాటు, పరిశీలన తర్వాత.. నవంబర్ 6న 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024' ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలో సర్వే పూర్తయింది. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కలిపి దాదాపు లక్ష మంది వరకు ఉద్యోగులు పాలుపంచుకున్నారు. రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వే కోసం గుర్తించగా.. 96 శాతం కుటుంబాల వివరాలను సర్వే బృందాలు సేకరించాయి. కొన్నిచోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, ఇళ్లకు తాళాలు ఉండటం, అందుబాటులో లేకపోవటంతో మిగతా కుటుంబాల వివరాల సేకరణ జరగలేదని అధికారులు సమీక్షలో వివరించారు.

## పందిళ్లపల్లి- మోటమర్రి మధ్య మూడో రైల్వేలైన్ అందుబాటులోకి

- బోనకల్‌లో ఆ ట్రాక్‌ను ప్రారంభించిన సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి



ఖమ్మం జిల్లా బోనకల్ వద్ద మూడో రైల్వేలైన్‌ను ప్రారంభిస్తున్న మాధవి

బోనకల్: ఖమ్మం జిల్లాలో పందిళ్లపల్లి- మోటమర్రి స్టేషన్ల మధ్య మూడో రైల్వేలైన్ పనులు పూర్తికాగా, బోనకల్ రైల్వేస్టేషన్‌లో ఆ ట్రాక్‌ను సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ బ్రిజేష్‌కుమార్ జైన్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కాజీపేట-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అమృత్ పథకం కింద చేపట్టిన పనులను, రైల్వేస్టేషన్ సిగ్నల్ వ్యవస్థను అధికారులు పరిశీలించారు. పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గోవిందాపురం(ఎ) వద్ద అండర్‌బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా, ఇంటర్‌సిటీ, శాతవాహన, పద్మావతి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లను బోనకల్‌లో ఆపాలని, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఆర్‌ఎస్ శ్రీనివాస్, సీఈఈ సురజన్‌రెడ్డి, సీఎస్‌టీఈ గుడిశార్, సీఈ సునిల్‌కుమార్ శర్మ, సీఈఓ సత్య ప్రకాశ్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్లెందుకు తాగడం లేదు?

- పంచాయతీరాజ్ మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: 'మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చు చేసినా.. ప్రజలు ఎందుకు ఆ నీటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదో అధ్యయనం చేయాలి. నియోజకవర్గాల్లో ఎంత మేర మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా చేస్తున్నారు? ఎన్ని గృహాలకు నీరందటం లేదో వివరాలను ఎమ్మెల్యేలకు అందజేయండి' అని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం తాగునీటి సరఫరాపై ఆమె సమీక్షించారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, కావాలని తప్పులు చేస్తే సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. 'ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించండి. ప్రతి మనిషికి 100 లీటర్ల నీటిని ప్రతిరోజు అందించాలి. గ్రామ స్థాయిలో మండల స్థాయిలో క్రీమ్ కమిటీ వేసుకోండి. మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి' అని సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



# రైతులకు 'సౌర' పంట!

▶ మొదటి పేజీ తరువాయి

సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు 4 ఎకరాల స్థలం అవసరం. ఈ ప్లాంట్లు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు 25 ఏళ్ల పాటు కొనుగోలు చేస్తామని హామీ ఇస్తూ ఒప్పందం చేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిర్ణయించిన ధర ప్రకారం యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులు, ఎస్‌హెచ్‌జీలకు డిస్కంలు చెల్లిస్తాయి. భవిష్యత్తులో ఈఆర్సీ నిర్ణయం మేరకు ఈ ధరల్లో మార్పు లుంటాయి. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంటు ద్వారా ఏటా సగటున 15-16 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వ్యవస్థాపకులకు రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

### ఎస్‌హెచ్‌జీలకు భూములు, 90% రుణాలు..

సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ఒక మెగావాట్‌కు రూ.2.97 కోట్ల వ్యయం అవుతుందని రెడ్కో అంచనా వేసింది. ఎస్‌హెచ్‌జీలు 10 శాతం వాటా భరిస్తే, మిగిలిన 90 శాతాన్ని బ్యాంకులు రుణంగా ఇస్తాయి. అంటే, మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు ఎస్‌హెచ్‌జీలు రూ.29.7 లక్షలు పెట్టుబడి పెడితే, బ్యాంకులు రూ.2.61 కోట్లు రుణంగా ఇవ్వనున్నాయి. ప్లాంట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీలకు ప్రభుత్వ, అటవీ, దేవాదాయ భూములను లీజుకు ఇవ్వనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అత్యుత్తమ పనితీరు కలిగిన ఎస్‌హెచ్‌జీలను ఎంపిక చేసి, వారితో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేయిస్తారు. ఇక రైతులు 30 శాతం పెట్టుబడి పెట్టుకుంటే, మిగిలిన 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు 6 శాతం వడ్డీకే రూ.2 కోట్ల వరకు రుణం ఇచ్చేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. రూ.2 కోట్లకు మించిన రుణానికి 9 శాతం వడ్డీ వసూలు చేయనుంది. ఎస్‌బీఐ అధికారులతో బుధవారం ఇంధన శాఖ, సెర్ప్ అధికారులు జరిపిన చర్చల సందర్భంగా ఈ మేరకు నిర్ణయించారు.

### ఏడాదిలోగా పూర్తి చేయాలి..

రాష్ట్రంలోని ఒక్కో 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఎంత సామర్థ్యం మేరకు సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టే అవకాశం ఉందో డిస్కంలు ప్రకటించాయి. దీని ఆధారంగా రైతులు ప్లాంటు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మెగావాట్‌కు రూ.5,000 దరఖాస్తు ఫీజును 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాలి. ప్లాంట్ కెపాసిటీ మెగావాట్‌కు మించితే రూ.10,000 దరఖాస్తు ఫీజుతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఎంపికైన వ్యవస్థాపకులు లెటర్ ఆఫ్ అవార్డు (ఎల్‌ఓఏ) జారీ చేసిన 10 రోజుల్లోగా బ్యాంకు గ్యారెంటీగా మెగావాట్‌కు రూ.5 లక్షల చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్లాంట్ల నిర్మాణం ఈ ఏడాది డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ప్లాంటు నుంచి సబ్ స్టేషన్ వరకు వ్యవస్థాపకులే ప్రత్యేక విద్యుత్ సరఫరా లైన్ వేసుకోవాలి. సబ్ స్టేషన్‌కు 5 కి.మీల పరిధి లోపల ప్లాంటు పెట్టుకునే వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఒకే సబ్ స్టేషన్ పరిధిలో ఒకరి కంటే ఎక్కువ మంది ప్లాంట్లు ఏర్పాటుచేస్తే.. అందరూ కలిసి ఒకే సరఫరా లైన్ వేసుకోవచ్చు. కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు 40 పైసల చొప్పున ఐదేళ్ల పాటు డిస్కంలకు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ (ఎంఎన్‌ఆర్‌ఈ) ప్రోత్సాహకంగా అందిస్తుంది. మెగావాట్‌కు మొత్తం రూ.6.6 లక్షలకు మించకుండా ఈ ప్రోత్సాహం ఉంటుంది.

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తుదారులు పీఎం కుసుమ్ తెలంగాణ వెబ్‌సైట్ www.pmkusum.telangana.gov.in లో ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఏదైనా సబ్‌స్టేషన్ పరిధిలో సామర్థ్యానికి మించి ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు వస్తే రాష్ట్ర ప్రభుత్వ టెండర్ల వెబ్‌సైట్ https://eprocurement.telangana.gov.in ద్వారా రివర్స్ బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఎవరు ప్లాంట్ నిర్మించి తక్కువ ధరకు విద్యుత్ విక్రయించేందుకు ముందుకు వస్తే వారినే ఎంపిక చేస్తారు. ఎస్‌హెచ్‌జీల నుంచి దరఖాస్తులను స్వీకరించడం లేదు. పనితీరు ఆధారంగా సెర్ప్ అధికారులే వారిని ఎంపిక చేస్తున్నారు.

# మహా విషాదం


బుధవారం ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేసేందుకు సిద్ధంగా ఉన్న లక్షలాది మంది భక్తులు

## కుంభమేళాలో తొక్కిసలాట
## 30 మంది మృతి, 60 మందికి గాయాలు

- మంగళవారం అర్ధరాత్రి దాటాకా దుర్ఘటన
- మధ్యాహ్నం దాకా స్నానాల నిలిపివేత.. ఆ తర్వాత కొనసాగింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ
- నిర్వహణ సరిగా లేదంటూ విపక్షాల విసుర్లు


తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన తమ వారిపై పడి రోదిస్తున్న ఓ బంధువు

**మహాకుంభ్ నగర్:** అత్యంత పవిత్రమైన మౌని అమావాస్య రోజు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిద్దామని మహాకుంభమేళాకు వచ్చిన కొందరు భక్తులు అనూహ్యంగా జరిగిన తొక్కిసలాటకు బలయ్యారు. గత కొద్దిరోజులుగా అశేష జనవాహినితో జనసంద్రమైన ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా స్నానఘట్టంతో భక్తకోటి శరణఘోషకు బదులు మరణమృదంగం వినిపించింది. మంగళవారం అర్ధరాత్రిదాటాక 1–2 గంటల ప్రాంతంలో త్రివేణి సంగమ స్థలి సమీపంలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 60 మంది గాయపడ్డారు. దీంతో కొద్దిసేపు పుణ్యస్నానాల క్రతువును మధ్యాహ్నందాకా ఆపేశారు. మృతుల్లో కర్ణాటక, అస్సాం, గుజరాత్ నుంచి వచ్చిన భక్తులున్నారు. మౌని అమావాస్య రోజు ఒక్కరోజే 10 కోట్లమంది భక్తులు రావొచ్చన్న ముందస్తు అంచనాతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అత్యంత పటిష్ట ఏర్పాట్లుచేసినా అపశృతి చోటుచేసుకోవడంతో అక్కడ అంతా విషాదం అలుముకుంది. 30 మంది మృతుల్లో 25 మందిని గుర్తించారు. వారిలో నలుగురు కర్ణాటక వాసులున్నారు. అస్సాం, గుజరాత్ నుంచి చెరో భక్తుడిని గుర్తించారు. గాయపడిన వారిలో 36 మందికి ఇంకా చికిత్స కొనసాగుతోంది. మిగతా వారిని డిశ్చార్జ్‌చేశారు.

### అంతా గందరగోళం, హాహాకారాలు

తెల్లవారుజామున మూడుగంటలకు బ్రహ్మ ముహూర్తంలో స్నానాలు చేయడానికి లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమ స్థలిలోని సంగమ్ నోస్ ఘాట్ వద్ద కూర్చుని వేచి చూస్తుండగా ఒంటిగంట దాటాక బ్యారికేడ్లకు అటువైపుగా ఉన్న భక్తులు కిటకిట ఎక్కువ కావడంతో ఇటువైపు దూకారు. ఎక్కివస్తున్న, నెడుతున్న జనం ధాటికి బ్యారికేడ్లు విరిగిపోయాయి. దీంతో కూర్చున్న వారిపై అటువైపు నిల్చున్న భక్తులు పడ్డారు. వారిపై పక్కనున్న వాళ్లు పడటంతో కిందనున్న వాళ్లు ఊపిరాడక చనిపోయారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినా కోట్లాది జనం కావడంతో అది వెంటనే సాధ్యపడలేదు. కిందపడిన దాదాపు 90 మంది భక్తులను పోలీసులు ఆ జనం మధ్యే భుజాలపై ఎత్తుకుని, అంబులెన్సుల్లోకి ఎక్కించి మేళా ప్రాంగణంలోనే ఏర్పాటుచేసిన తాత్కాలిక సెంట్రల్ ఆస్పత్రికి తరలించారు. అయినాసరే వారిలో 30 మంది చనిపోయారని మహాకుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ ప్రకటించారు. తొక్కిసలాట కారణంగా వెంటనే పుణ్యస్నానాలను పోలీసులు, సహాయక సిబ్బంది ఆపేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని నిర్ధారించుకున్నాక మధ్యాహ్నం రెండున్నర గంటలకు 13 అఖాడాల అమృత్ స్నాన్‌తోపాటు భక్తుల పుణ్యస్నానాలకు అనుమతి ఇచ్చారు.

### జనం మధ్య చిక్కుకున్న అంబులెన్సులు

భయంతో భక్తులు చిందరవందరగా పరుగెత్తడంతో బ్యాగులను వెంటేసుకొచ్చిన కొందరు వాటిని అక్కడే పడేశారు. అవి తగిలి ఇంకొందరు పడ్డారు. చెత్త కోసం ఏర్పాటుచేసిన ఇనుప చెత్త డబ్బాలు తగిలి చాలా మంది పడ్డారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. తొక్కిసలాటలో కిందపడి స్పృహకోల్పోయిన భక్తులను వెంటనే అంబులెన్సుల్లో ఎక్కించినా జనం మధ్యలో ముందుకు కదల్లేక అవి చాలాసేపు అక్కడే ఆగిపోయాయి. పోలీసులు రంగంలోకి దిగి ఎట్టకేలకు వాటికి దారి కల్పించారు. వీఐపీల కోసం కొంత మేర స్థలాన్ని వదిలేయడంతో పక్కన రద్దీ పెరుగుతోంది. ఇకపై వీఐపీ ప్రోటోకాల్ పేరిట జనాన్ని పక్కకు నెట్టేసే విధానాన్ని పాటించబోమని అక్కడి అధికారి ఒకరు చెప్పారు. సాధారణ భక్తులు, అఖాడాల కోసం వేర్వేరుగా ఏర్పాటుచేసిన వరసలు, బ్యారికేడ్ల వద్ద ఘటన జరిగిందని అధికారి పేర్కొన్నారు. కుప్పలుగా భక్తుల దుస్తులు, దుప్పట్లు, బ్యాగులు, చెప్పులు పడి తొక్కిసలాట ప్రాంతం చిందరవందరగా తయారైంది. స్పృహ కోల్పోయిన తమ వారిని తట్టిలేపేందుకు ప్రయత్నిస్తున్న కుటుంబ సభ్యులతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా నిర్వేదం నెలకొంది. ''కర్ణాటక నుంచి మేం 60 మంది బృందంగా వచ్చాం. అన్ని వైపుల నుంచి తోశారు. తప్పించుకునే ఆస్కారం లేకుండాపోయింది'' అని కర్ణాటక నుంచి వచ్చిన సరోజిని అనే భక్తురాలు ఏడుస్తూ చెప్పారు. ''బ్రహ్మముహూర్తంలో స్నానం చేద్దామని కూర్చుని, పడుకుని వేచిచూస్తున్న వారిపైకి వెనక నుంచి ఒక్కసారిగా జనం మీదపడ్డారు. దాంతో తొక్కిసలాట జరిగింది'' అని అస్సాం నుంచి వచ్చిన బాదామా దేవి చెప్పారు. ఇలా జరగాలని గంగమ్మ తలచిందేమో అని జార్ఖండ్‌లోని పలాము నుంచి వచ్చిన రామ్ సుమిరాన్ అనే భక్తుడు అన్నాడు. తొక్కిసలాటకు ముందే ఏదైనా ఉపద్రవం జరగొచ్చని ఊహించిన ప్రయాగ్‌రాజ్ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ మాట్లాడుతున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఘాట్ వద్ద కూర్చుని వేచిచూస్తున్న భక్తులకు ఆయన ''లేవండి. లేవండి. త్వరగా స్నానంచేసి వెళ్లపొండి. వెనక నుంచి ఊహించనంత మంది జనం వచ్చేస్తున్నారు'' అని ఆయన అక్కడి భక్తులకు ముందే హెచ్చరిస్తుండటం ఆ వీడియోలో ఉంది. ''భక్తుల్లో పోకిరీలూ ఉన్నారు. చిన్నారులు ఉన్నారన్న ఇంగితజ్ఞానం లేకుండా నవ్వుతూ మమ్మల్ని తోసేశారు. తొక్కిసలాటలో మా పిల్లలు గాయపడ్డారు'' అని ఆస్పత్రిలో ఉన్న ఒక మహిళ తెలిపింది.

### దుమ్మెత్తిపోసిన విపక్షాలు

నిర్వహణ లోపాలు, వీఐపీల స్నానాల మీదే అధికారుల ధ్యాస, ఘనంగా నిర్వహిస్తున్నామని అతి ప్రచార ఆర్భాటాలతో తొక్కిసలాట జరిగిందని విపక్షాలు యోగి, మోదీ ప్రభుత్వాలపై దుమ్మెత్తిపోశాయి. ''వీఐపీ సంస్కృతి వదిలేయండి. సాధారణ భక్తులను పట్టించుకోండి. ప్రచారంపై దృష్టిపెట్టి పటిష్ట భద్రతను గాలికొదిలేయడం వల్లే తొక్కిసలాట జరిగింది'' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్పీ, టీఎంసీ, శివసేన(యూబీటీ), బీఎస్పీ పార్టీలు యోగి, మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించాయి.


తొక్కిసలాట నుంచి రక్షించి భక్తురాలిని భుజాలపై మోసుకెళ్తున్న పోలీసులు


తొక్కిసలాట జరగ్గానే బాధితుడికి సపర్యలు చేస్తున్న పోలీసులు

### విచారం వ్యక్తం చేసిన ప్రముఖులు

ఘటన జరిగిన విషయం తెల్సి వెంటనే ప్రధాని మోదీ సీఎం యోగికి ఉదయం, మధ్యాహ్నం నాలుగైదు సార్లు ఫోన్‌చేసి తాజా పరిస్థితిపై వాకబు చేశారు. భక్తుల మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ''మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి'' అని మోదీ అన్నారు. రాష్ట్రపతి ముర్ము సైతం దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బుధవారం ఒక్కరోజే 7.5 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసినట్లు ప్రాథమిక సమాచారం. ప్రయాగ్‌రాజ్‌లో బుధవారమే దాదాపు 10 కోట్ల మంది జనం వచ్చేశారని వారు బయటికెళ్లేదాకా కొత్తవారిని అనుమతించొద్దని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. సంగమ్ నోస్ ఘాట్ వైపు వెళ్లొద్దని భక్తులకు యోగి విజ్ఞప్తిచేశారు. ప్రయాగ్‌రాజ్‌కు దారితీసే మార్గాలను మూసేసినట్లు తెలుస్తోంది. వెనక్కి వచ్చే భక్తుల కోసం రైల్వేశాఖ అదనపు రైళ్లను నడపనుంది.

### ముగ్గురు సభ్యులతో జుడీషియల్ కమిషన్

ఘటనకు కారణాలను తెల్సుకునేందుకు జస్టిస్ హర్ష్‌కుమార్, మాజీ డీజీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ వీకే సింగ్‌లతో యోగి ప్రభుత్వం ఒక జుడీషయల్ కమిషన్‌ను నియమించింది. మృతుల కుటుంబాలకు సీఎం యోగి తలో రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ స్వయంగా ఘటనాస్థలికి వచ్చి సమీక్ష జరపనున్నారు.

ఏమిటీ సంగం నోస్? | గత తొక్కిసలాటలు
వివరాలు సాక్షి ఫ్లస్ జాతీయంలో...

# 'ఇస్రో' సెంచరీ!

- జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతం
- దిగ్విజయంగా కక్ష్యలోకి చేరిన నావిక్–02 ఉపగ్రహం
- అందుబాటులోకి రానున్న అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థ
- శ్రీహరికోట 'షార్' నుంచి వంద ప్రయోగాలు పూర్తి



**సూళ్లూరుపేట/సాక్షి, న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో మరో మైలురాయిని అధిగమించింది. సెంచరీ ప్రయోగాలతో రికార్డుకెక్కింది. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) చరిత్రలో ఇప్పటిదాకా 100 ప్రయోగాల చేయగా, వీటిలో 90 ప్రయోగాలు విజయవంతం కావడం విశేషం. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం ఉదయం జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్‌ను ప్రయోగించారు. ఈ ప్రయోగంలో భాగంగా పంపిన ఉపగ్రహంతోపాటు ఇప్పటిదాకా ఇస్రో శ్రీహరికోట నుంచి 548 ఉపగ్రహాలను నింగిలోకి పంపించింది. ఇందులో 433 విదేశీ ఉపగ్రహాలు కాగా, 115 స్వదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి మంగళవారం వేకువజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 27.30 గంటల అనంతరం బుధవారం 6.23 గంటలకు రాకెట్ తొలిసంధ్య ఉదయరేఖలను, మంచు పరదాలను చీల్చుకొని నిప్పులు చిమ్ముతూ నింగివైపునకు అత్యంత వేగంగా దూసుకెళ్లింది. రాకెట్‌లోని అన్ని దశలు అద్భుతంగా పని చేయడంతో 18.10 నిమిషాలకు 2,250 కిలోల బరువు కలిగిన నావిక్–02 అనే ఉపగ్రహం భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు(పెరిజీ), భూమికి దూరంగా 36,568 కిలోమీటర్ల(అపోజీ) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి(భూ బదిలీ కక్ష్య) విజయవంతంగా చేరుకుంది. నావిక్–02 ఉపగ్రహానికి ఇరువైపులా ఉన్న సోలార్ ప్యానెల్స్ విచ్చుకున్నాయని గ్రౌండ్‌స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టిన నావిక్–02 ఉపగ్రహంలోని ఇంధనం సాయంతో మరో రెండు మూడు రోజుల్లో మూడు దశల్లో పెరిజీని పెంచుతూ, అపోజిని తగ్గిస్తూ భూమికి 36 వేల కిలోమీటర్లు ఎత్తులోని జియో ఆర్బిట్‌లోకి పంపిస్తారు.

### త్వరలో మరో మూడు ఉపగ్రహాలు

షార్ నుంచి చేపట్టిన 100వ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో సైంటిస్టులు హర్షం వ్యక్తంచేశారు. ఇది ఇస్రో సాధించిన సమిష్టి విజయమని చైర్మన్ వి.నారాయణన్ అన్నారు. భారతదేశ నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి నావిక్–01, నావిక్–02 ఉపగ్రహాలను ప్రయోగించామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో మూడు ఉపగ్రహాలను ప్రయోగించబోతున్నామని, మన దేశానికి నావిగేషన్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని వి.నారాయణన్ ప్రకటించారు. 46 ఏళ్లలో 100 రాకెట్ ప్రయోగాలు నిర్వహించగా, రాబోయే ఐదేళ్లలో మరో 100 ప్రయోగాలు చేపట్టగలమని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

### న్యూ జనరేషన్ శాటిలైట్లు

నావిగేషన్ విత్ కాన్‌స్టలేషన్(నావిక్) అనేది భారత దేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. దీన్ని ఇస్రో రూపొందించింది. భారత భూభాగంలోనే కాకుండా వెలుపల 1,500 కిలోమీటర్లు దాకా నావిగేషన్ సేవలు అందిస్తుంది. 2023 మే 29న నావిక్–01 ఉపగ్రహానికి అనుసంధానంగా నావిక్–02 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. సొంతంగా నావిగేషన్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంలో భాగంగా 8 ఉపగ్రహాలను ప్రయోగించారు. నావిగేషన్ వ్యవస్థను ఇంకా బలోపేతం చేయడానికి సెకెండ్ జనరేషన్ ఉపగ్రహాలు అవసరమని గుర్తించారు. అందులో భాగంగానే నావిక్ శాటిలైట్లను ఇస్రో ప్రయోగిస్తోంది. అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించడంతో ఇవి న్యూ జనరేషన్ శాటిలైట్లు అని కూడా ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహాలతో భూమి, జల, వాయు మార్గాల స్థితిగతులు, దిక్కులు తెలియజేయడం, ఆపద సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం, వాహన చోదకులకు దిశానిర్దేశం, ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు ఈ ఉపగ్రహ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుంది.

### కొత్త శిఖరాలకు మన అంతరిక్ష ప్రయాణం: మోదీ

షార్ చరిత్రలో వందో రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ''చారిత్రాత్మక 100వ ప్రయోగం సందర్భంగా ఇస్రోకు నా అభినందనలు. ఈ అద్భుతమైన మైలురాయి మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల అంకితభావం, నిబద్ధతను సూచిస్తోంది. ప్రైవేటు రంగం చేతులు కలపడంతో భారత అంతరిక్ష ప్రయాణం ఇక కొత్త శిఖరాలను చేరుకుటుంది'' అని ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# రూ.16,300 కోట్లతో మినరల్ మిషన్

**కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో నిర్ణయం**

**న్యూఢిల్లీ:** గ్రీన్ ఎనర్జీ రంగంలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకువేసింది. రూ.16,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్(ఎన్‌సీఎంఎం) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రానున్న ఏడేళ్లలో ఈ గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి మరో రూ.18,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. దేశ విదేశాల్లో విలువైన ఖనిజాలను అన్వేషించి, తవ్వకాలు సాగించడానికి ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. విండ్ టర్బైన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీలో కాపర్, లిథియం, నికెల్, కోబాల్ట్ తదితర క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోంది. ఆయా ఖనిజాల కోసం విదేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించానికి రూ.16,300 కోట్లతో ఎన్‌సీఎంఎం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 24 రకాల ఖనిజాలను గుర్తించినట్లు చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో వీటి పాత్ర చాలా కీలకమని అన్నారు. దేశ విదేశాలలోఆయా ఖనిజాల అన్వే షణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని తెలిపారు. విదేశాల్లోనూ ఖనిజాల బ్లాక్‌లు సొంతం చేసుకొని, తవ్వకాలు సాగించబోతున్నామని పేర్కొన్నారు.

**ఇథనాల్ ధర రూ.1.69 పెంపు**

సి–హెవీ మొలాసిస్ నుంచి తయారు చేసే ఇథనాల్ ఎక్స్–మిల్లు ధరను ప్రభుత్వం మరో రూ.1.69 పెంచింది. దీంతో లీటర్ ఇథనాల్ ధర రూ.57.97కు చేరుకుంది. ఈ మేరకు బుధవారం కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. బి–హెవీ మొలాసిస్, చెరకు/చక్కెర/చక్కెర సిరప్ నుంచి తయారు చేసే ఇథనాల్ ధరల్లో ఎలాంటి మార్పులేదు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని 2025–26 నాటికే సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.


# వక్ఫ్ నివేదికకు జేపీసీ ఆమోదం

**తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విపక్షాలు**

**న్యూఢిల్లీ:** వక్ఫ్ ఆస్తులు, బోర్డ్ వ్యవహారాల్లో సంస్కరణలు, పారదర్శకత తేవడమే లక్ష్యంగా మోదీ సర్కార్ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును సమీక్షించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఎట్టకేలకు తమ ముసాయిదా నివేదికను బుధవారం ఆమోదించింది. జేపీసీ 38వ సారి సమావేశమై ముసాయిదా నివేదికను ఆమోదించడం కోసం జరిపిన ఓటింగ్‌లో 15 మంది సభ్యులు నివేదికకు అనుకూలంగా, 11 మంది వ్యతిరేకంగా ఓటేశారు. మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓట్లేయడంతో బీజేపీ నేత జగదాంబికాపాల్ నేతృత్వంలోని జేపీసీ ఈ నివేదికను ఆమోదించింది. జేపీసీలో సభ్యులుగా ఉన్న విపక్ష పార్టీల నేతలు ఈ నివేదికపై తమ పూర్తి అసంతృప్తిని వ్యక్తంచేస్తూ నోట్‌లను సమర్పించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆధునికత సాధించే ఉద్దేశ్యంతోనే గత ఏడాది ఆగస్ట్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని బీజేపీ సభ్యులు చెప్పారు. అయితే ఈ బిల్లు ద్వారా ముస్లింల మతసంబంధ వ్యవహారాల్లో కమలదళం ఉద్దేశపూర్వకంగా కలగజేసుకుంటోందని, వక్ఫ్ బోర్డ్ నిర్వహణ అంశాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని విపక్షాలు మండిపడ్డాయి. ఈ నివేదికను గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేస్తామని, శుక్రవారం మొదలయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు జగదాంబికా పాల్ చెప్పారు. వక్ఫ్ బోర్డులోకి ముస్లిమేతర వ్యక్తులను సభ్యులుగా అనుమతిస్తూ సవరణ బిల్లు తేవడాన్ని విపక్షాలు ప్రధానంగా తప్పుబడుతున్నాయి. ప్రతి పౌరుడికీ తన మత సంబంధ వ్యవహారాల్లో పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, మత సంబంధ, దాతృత్వ సంబంధ సంస్థల నిర్వహణపై ఆ మతస్థులకే పూర్తి హక్కు ఉంటుందని విపక్షాలు తేల్చి చెప్పాయి. సవరణ బిల్లుతో ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 26లోని పౌరుల మతస్వేచ్ఛకు భంగం కల్గిస్తోందని ధ్వజమెత్తాయి. నివేదికను ఆమోదించడాన్ని జేపీసీలో కాంగ్రెస్ సభ్యుడు ఇమ్రాన్ మసూద్ తప్పుబట్టారు. ''రాజ్యాంగం ద్వారా మాకు సంక్రమించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. ప్రభుత్వం తరచూ ఉమ్మడి పౌరస్మృతి గురించి మాట్లాడుతుంది. మరి సభ్యుల విషయానికొస్తే హిందూ ఎండోమెంట్ బోర్డ్‌లో హిందూయేతర సభ్యులు లేరు. అలాగే సిఖ్ బోర్డ్‌లో సిఖ్‌యేతర సభ్యుడు లేడు. క్రిస్టియన్ బోర్డ్‌లో క్రైస్తవేతర సభ్యుడు లేడు. ఇదే నియమాన్ని ముస్లింలకూ వర్తింపజేయాలిగదా?. ఇదంతా వక్ఫ్ బోర్డ్‌లను నాశనంచేసే కుట్ర'' అని మసూద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''సవరణల్లో ఒక్కటికూడా వక్ఫ్‌కు మేలుచేసేలా లేవు. సవరణలన్నీ వక్ఫ్ బోర్డ్‌ను నాశనంచేసి, వక్ఫ్ వ్యవహారాల్లో కేంద్రం జోక్యాన్ని పెంచేలా ఉన్నాయి. ఖాళీ వక్ఫ్ స్థలాలను ప్రభుత్వం లాగేసుకునే ప్రమాదముంది. ముస్లిం ప్రజాభీష్టాన్ని ప్రభుత్వం ఆమోదించట్లేదు. ఈ సవరణలను మేం తిరస్కరిస్తున్నాం. సవరణలను ఒప్పుకుంటే మేం మా మసీదులను కోల్పోవాల్సి వస్తుంది'' అని ఏఐఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

# 'ఆప్'ను ప్రజలు క్షమించరు

- యమున నదిలో విషం కలుపుతూ ఉన్నారని అనడం దారుణం: మోదీ
- తనతోపాటు దౌత్యవేత్తలు, జడ్జీలు ఈ నీటిని తాగుతున్నారని వెల్లడి



**న్యూఢిల్లీ:** యమున నదిలో విషం కలుపుతున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తేలడంతో ఆప్ నాయకులు మతితప్పి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని కర్తార్ నగర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆప్ నాయకులకు, చార్లెస్ శోభారాజ్‌కు మధ్య పెద్ద తేడా లేదని అన్నారు. పైకి అమాయకంగా కనిపిస్తూ ప్రజల సొమ్మును దోచుకోవడంలో వారు ఆరితేరిపోయారని దుయ్యబట్టారు. ''వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టినవారు, అద్దాల మేడల్లో నివసిస్తున్నవారు పేదల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. ఓటమి భయంతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీలో యమున నదిని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడు దగాకోరు మాటలు చెబుతోంది. యమునా నదిని శుభ్రం చేస్తామని హామీ ఇస్తే ఓట్లు రావని అంటోంది. ఇది నిజంగా సిగ్గుచేటు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు దొరకడం ఆమ్ ఆద్మీ పార్టీకి ఇష్టంలేదు. ఢిల్లీలోని పూర్వాంచల్ ప్రజలు మురికికూపంలోనే ఛాత్ పూజలు చేసుకోవాలని కోరుకుంటోంది. ఆమ్ ఆద్మీ పార్టీ దేశ చరిత్రలో అతిపెద్ద పాపం చేసింది. ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. మాజీ ముఖ్యమంత్రి(అరవింద్ కేజ్రీవాల్) హరియాణా ప్రజలపై నిందలు వేశారు. యమునా నదిలో విషం కలిపారని అన్నారు. హరియాణాలో ఉన్నది మనుషులు కాదా? వారికి ఢిల్లీలో కుటుంబ సభ్యులు, బంధువులు లేరా? సొంత మనుషులు చావాలని నదిలో విషం కలుపుతారా? యమున నదిలో హరియాణా నుంచి వస్తున్న నీటినే నాతోపాటు ఢిల్లీ ప్రజలు, దౌత్యవేత్తలు, న్యాయమూర్తులు కూడా తాగుతున్నారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం నదిలో విషం కలిపి నాకు హాని కలిగిస్తుందని ఎవరైనా అనుకుంటారా? ఆప్ నాయకులు అసలేం మాట్లాడుతున్నారు? తప్పులను క్షమించే గుణం మన భారతీయుల్లో ఉంది. కానీ, ఉద్దేశపూర్వకంగా పాపాలు చేస్తే ఎవరూ క్షమించరు. ఆప్ పాపాత్ములను మన్నించే ప్రసక్తే లేదు''అని మోదీ అన్నారు.

# యమున నీటిని తాగే దమ్ముందా?

**అమిత్ షా, రాహుల్‌లకు కేజ్రీవాల్ సవాలు**

**న్యూఢిల్లీ:** యమునా నది నీరు విషపూరితంగా మారుతున్న సంగతి నిజమేనని, ఈ నీటిలో అమ్మోనియం స్థాయి ఇటీవల విపరీతంగా పెరుగుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీలోని నీటి శుద్ధి కేంద్రాలు సక్రమంగా పనిచేయకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. నది నీటిలో అమ్మోనియా స్థాయి 7 పీపీఎం ఉందన్నారు. ఇది కచ్చితంగా విషంతో సమానమేనని అన్నారు. కేజ్రీవాల్ బుధవారం మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలకు యమునా నది నీటిని ప్రజల సమక్షంలో బహిరంగంగా తాగే దమ్ముందా? అని సవాలు విసిరారు. ఎగువ రాష్ట్రంలో హరియాణాలో ఈ నదిలో విషపదార్థాలు కలుస్తున్నాయని మరోసారి ఆరోపించారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం నదిని విషతుల్యం చేస్తోందన్నారు.

**కేజ్రీవాల్‌కు హరియాణా కోర్టు సమన్లు**

యమున నదిలో విషం కలుపుతున్నారంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై హరియాణా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హరియాణా ప్రభుత్వంపై ఆయన చేసిన ఆరోపణలను తప్పుపట్టింది. ఫిబ్రవరి 17వ తేదీన తమ ఎదుట హాజరు కావాలని ఆదేశిస్తూ బుధవారం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఆరోపణలపై వివరణ ఇవ్వాలని పేర్కొంది. యమునా నదిని హరియాణా ప్రభుత్వం విషతుల్యం చేస్తున్నట్లు ఆధారమేంటో చెప్పాలని, నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది.

# ఏడాదిలోగా విడాకులివ్వలేం

**హిందూ దంపతుల పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ**

**ప్రయాగ్‌రాజ్:** హిందూ వివాహ చట్టం ప్రకారం.. హిందూ మతంలో వివాహ బంధానికి ఎంతో పవిత్రత ఉందని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. హిందూ దంపతులకు పెళ్లయిన ఏడాదిలోనే విడాకులు మంజూరు చేయలేమని తేల్చిచెప్పింది. అసాధారణమైన పరిస్థితుల్లో తప్ప వారికి విడాకులు ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొంది. పవిత్రమైన వారి బంధాన్ని విచ్ఛిన్నం చేయలేమని వెల్లడించింది. తమకు విడాకులు మంజూరు చేయాలంటూ దంపతులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రా, జస్టిస్ దోనాది రమేశ్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. హిందూ దంపతులు విడాకుల కోసం దరఖాస్తు చేయాలంటే వివాహమైన తర్వాత కనీసం ఏడాదిపాటు ఆగాలని హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 14 సూచిస్తున్నట్లు వెల్లడించింది. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే మినహాయింపు ఉంటుందని సూచించింది. నిశాంత్ భరద్వాజ్, రిషికా గౌతమ్ అనే దంపతులు పెళ్లయిన సంవత్సరంలోగానే పరస్పర అంగీకారంతో విడాకుల కోసం తొలుత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. వారి దరఖాస్తును కింది కోర్టు తిరస్కరించడంతో అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విడాకుల కోసం సంవత్సరంలోగా దరఖాస్తు చేయడం చెల్లదని, దాన్ని తాము విచారించబోమని హైకోర్టు వెల్లడించింది.



**చెన్నైకి చెక్కేశారు!**

అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపిన బిహార్ నేరగాళ్లు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల్ని తప్పుదోవ పట్టిస్తూ వీరు చెన్నైకి పారిపోయినట్లు నగర సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. -8లో




**రుచుల రివ్యూ.. సిటీకి క్యూ..**

విభిన్నమైన ఆహార పదార్థాలకు ప్రసిద్ధిగాంచిన నగరం.. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను చవులూరించే ఘుమఘుమలతోనూ ఆకర్షిస్తోంది. - సిటీప్లస్‌లో

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 32.0/19.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## న్యూస్‌రీల్

### భార్య హత్య కేసులో గురుమూర్తికి 14 రోజుల రిమాండ్



గురుమూర్తి (మాస్కు ధరించిన వ్యక్తి)ని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

**రంగారెడ్డి కోర్టులు:** మీర్‌పేట్ ఠాణా పరిధిలో భార్యను అతికిరాతకంగా చంపేసి ముక్కలుగా నరికిన నిందితుడు గురుమూర్తిని పోలీసులు బుధవారం రంగారెడ్డి జిల్లా 6వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ మేరకు నిందితుడికి వచ్చే నెల 11వ తేదీ వరకు వరకు రిమాండ్ విధించారు. భార్య వెంకట మాధవిని హత్య చేసిన కేసులో గురుమూర్తిని ఇటీవల పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కోర్టులో హాజరుపరిచారు.

### బంజారా చెరువు నడక మార్గంపై నివేదిక ఇవ్వండి

- పీసీబీని ఆదేశించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** షేక్‌పేట్ పరిధిలోని బంజారా చెరువు పూడ్చి నడక మార్గం నిర్మించడంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (సీఈబీ)ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. హమీద్‌కుంట/అంతగాని కుంట/బంజారా చెరువులో చెత్తను డంప్ చేసి.. సుందరీకరణ పేరుతో మధ్య నుంచి నడక మార్గాన్ని నిర్మిస్తున్నారంటూ బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ క్యూ హసన్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చెరువు సుందరీకరణ పేరుతో చెత్తను నింపి రూపురేఖలు లేకుండా చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నడక మార్గం పనులను వెంటనే నిలుపుదల చేసేలా, చెరువును పునరుద్ధరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. చెరువుల సుందరీకరణ కోసం కేంద్రం ప్రత్యేక నిధులు విడుదల చేసిందని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ కుమార్ చెప్పారు. అభివృద్ధి పనుల చేయాల్సిన, చెరువుల పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి దాఖలు చేసిన నివేదికపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తాము తనిఖీలకు వెళ్లిన రోజు ఎలాంటి పనులు జరగడం లేదని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించింది.

### అమెరికాలో రోడ్డు ప్రమాదం

నగర యువకుడి దుర్మరణం



మహ్మద్ వాజిద్ (ఫైల్)

**ఖైరతాబాద్:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరంలోని ఖైరతాబాద్‌కు చెందిన మహ్మద్ వాజిద్ దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాలో నివసించే మహ్మద్ అజీజ్ జలమండలి ఉద్యోగి. ఆయన రెండో కుమారుడు మహ్మద్ వాజిద్ (28) 2021లో ఎంఎస్ చేసేందుకు అమెరికాలోని చికాగోకు వెళ్లాడు. వాజిద్ తమ్ముడు మహ్మద్ మాజిద్ కూడా అక్కడే ఎంఎస్ చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మాజిద్ అనారోగ్యం బారిన పడటంతో మందులు తీసుకువచ్చేందుకు వాజిద్ కారులో బయటకు వెళ్లాడు. ఆ సమయంలో కారును ట్రక్కు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

**పెళ్లి చేసే యోచనలో ఉండగానే..**

మహ్మద్ వాజిద్‌కు ఈ ఏడాది డిసెంబర్‌లో వివాహం చేసే ప్రయత్నాల్లో ఉండగానే.. అతని మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తల్లిదండ్రులను అమెరికా రావాలంటూ వాజిద్ వారం రోజుల క్రితం వీసా కూడా పంపించినట్లు సమాచారం. వారు రెండు మూడు రోజుల్లో వెళ్లేందుకు సిద్ధమవుతుండగానే కుమారుడి మరణవార్త తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అమెరికాలోనే వాజిద్ అంత్యక్రియలు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మహ్మద్ వాజిద్ గతంలో ఖైరతాబాద్ యూత్ కాంగ్రెస్ లీడర్‌గా పని చేశాడని, ప్రస్తుతం అమెరికాలో ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా ఉన్నట్లు తెలిసింది. ఎంఎస్ మక్తాలోని వాజిద్ కుటుంబ సభ్యులను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పరామర్శించారు.





సమావేశాలకు సిద్ధమైన జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్

# ఢీ హెచ్ఎంసీ!



ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నంతో మేయర్, కాంగ్రెస్ నేతలు

- అస్త్రశస్త్రాలతో సిద్ధమైన విపక్షాలు
- యుక్తిగా ఎదుర్కొనేలా కాంగ్రెస్
- ఎవరి ప్రణాళికల్లో వారు
- నేడు బల్దియా సర్వసభ్య సమావేశం
- ప్రశాంతంగా సాగేనా.. రసాభాసగానే ముగిసేనా?

**సాక్షి, సిటీబ్యూరో:** దాదాపు ఏడాది కాలంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో గురువారం జరగనున్న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశాన్ని అన్ని పార్టీలూ సవాల్‌గా తీసుకుంటున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం, ప్రజా సమస్యలపై సాధారణ సమావేశం రెండూ ఒకేరోజు నిర్వహిస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం అంశం ఇప్పటి వరకు హాట్‌టాపిక్‌గా ఉన్నప్పటికీ, దాని సాధ్యాసాధ్యాలు అంచనా వేసిన పార్టీలు ప్రస్తుత సమావేశంలో ప్రజా సమస్యలనే ప్రముఖంగా ప్రస్తావించాలని తమ కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశాయి. విపక్షాలు సంధించే ప్రశ్నల్ని, ఎదురయ్యే పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు తగిన యుక్తి ప్రదర్శించాల్సిందిగా కాంగ్రెస్ తమ పార్టీ కార్పొరేటర్లకు వివరించినట్లు తెలిసింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు బుధవారం మేయర్, కొందరు కార్పొరేటర్లతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ ఎమ్మెల్సీలు, కొందరు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశానికి బయలుదేరేముందు గురువారం ఉదయం మరోసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు మంత్రి పొన్నంతో ఆయన నివాసంలో సమావేశం కానున్నట్లు సమాచారం. మంగళవారం బీజేపీ కార్పొరేటర్లకు జాతీయ, రాష్ట్ర నేతలు దిశానిర్దేశం చేశారు.

**నిధుల కోసం..**

పార్టీలకతీతంగా కార్పొరేటర్లు తమ ఫండ్ కోసం పట్టుబట్టనున్నారు. ఎన్నికలకు మిగిలింది ఏడాది కాలమే. తిరిగి ఓట్లకోసం ప్రజల వద్దకు ఎలా వెళ్లాలని వారిలో వారే చర్చించుకుంటున్నారు. మేయర్ కేవలం స్టాండింగ్ కమిటీ సభ్యులకు మాత్రం రూ.25 కోట్ల ఫండ్ ఇవ్వాలని కమిషనర్‌ను కోరడం కార్పొరేటర్లకు పుండుపై కారం చల్లినట్లుగా మారింది. ఈ నేపథ్యంలో సభ సజావుగా సాగుతుందా.. లేక ఎప్పటిలాగే రసాభాసగానే ముగుస్తుందా? అన్నది కొద్ది గంటల్లో వెల్లడి కానుంది. మొత్తానికి వాతావరణం మాత్రం వాడీవేడిగానే ఉంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

**అడ్డగోలు బడ్జెట్**

బడ్జెట్ అడ్డగోలుగా ఉందని నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. నగర ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులతో వారికి మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఎండగట్టనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారుల అనుభవ రాహిత్యంతో బడ్జెట్ రూపకల్పనే సవ్యంగా లేదని అవి విమర్శిస్తున్నాయి. స్టాండింగ్ కమిటీలో బడ్జెట్ తొలుత ఆమోదం పొందకపోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నాయి. రూ.8 వేల కోట్లకుపైగా ఉన్న బడ్జెట్‌పై సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేయనున్నాయి. సభలో మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నాయి. బీఆర్ఎస్ తమ హయాంలో జరిగిన అభివృద్ధి ఇప్పుడు కనిపించడం లేదని, తాము పూర్తి చేసిన పనులను కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటోందని గళమెత్తనుంది. ఇక కాంగ్రెస్.. తమ ప్రభుత్వంలోని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పనుంది. అంతేకాకుండా ఈ ప్రభుత్వ హయాంలోనే జీహెచ్ఎంసీకి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడాన్ని ప్రస్తావించనుంది.

**కమిషనర్‌కు తొలి సమావేశం**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి పాలకమండలి తొలి సమావేశం ఇది. కొందరు హెచ్ఓడీలు కూడా కొత్త. సభ్యులనుంచి ఎదురయ్యే ప్రశ్నలకు ఎలా స్పందిస్తారో, ఎలాంటి సమాధానాలిస్తారో సభలో వెల్లడి కానుంది. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారితో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 24 మందికి పెరిగినప్పటికీ, వారిలో ఎందరు పార్టీకి అనుకూలంగా గళమెత్తనున్నారో తెలియని పరిస్థితి. బహుశా, ఈ విషయం తెలిసే పార్టీ వారంతా సభలో కలిసికట్టుగా వైరి పక్షాలను ఎదుర్కొనాలని మంత్రి పొన్నం వారికి సూచించారు. సభ అధ్యక్షత వహించే మేయర్‌కు పరిస్థితి క్లిష్టంగానే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### గొడవలతోనే సరిపెడతారా.. సమస్యలు పరిష్కరిస్తారా?

నగరంలో పలు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. రాత్రుళ్లు వీధి దీపాలు వెలగడం లేదని నెలల తరబడిగా ప్రజలు మొత్తుకుంటున్నా పట్టించుకున్న దిక్కు లేదు. సమావేశంలో వీటిని ప్రస్తావిస్తారా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దిగువ సమస్యలను తీర్చాలంటున్నారు.

- చెత్త సమస్యలు ఎప్పటికీ తీరడం లేదు. ప్రతిరోజూ స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటికీ వెళ్లడం లేదు. దీనిపై ఎవరిని సంప్రదించాలో అర్థం కాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.
- చాలా ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. తిరిగి సీఆర్ఎంపీ ఏజెన్సీలకే కట్టబెట్టాలనే యోచనతో కాబోలు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇంజినీర్లు పనులు చేయడం లేదు. కాలనీలతో పాటు ప్రధాన రోడ్లలోనూ గుంతలు కనిపిస్తున్నాయి.
- ప్రజలకు బర్త్, డెత్‌సర్టిఫికెట్ల కోసం అగచాట్లు తప్పడం లేదు. ఫుడ్ సేఫ్టీ లేక ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా, లక్షల బిల్లులు చెల్లిస్తున్నా, ప్రాణాలు పోతున్నా జీహెచ్ఎంసీ నిద్ర పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నా, హోటళ్ల తనిఖీల్లో లోపాలు బట్టబయలవుతున్నా ఎలాంటి మార్పూ లేదు.
- నాలాల కోసం ఏటా వందల కోట్లు ఖర్చు పెడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి
- అక్రమ భవనాల నిర్మాణాలకు హద్దూ పద్దూ లేకుండా వెలుస్తున్నాయి. దాంతో పరిసరాల్లోని ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కళ్లెదుట నిలువెత్తు అక్రమాలు కనిపిస్తున్నా చర్యల్లేకుండాపోయాయి.
- ఇలా వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు మొత్తుకుంటున్నా, ప్రతిసారీ అధికార, ప్రతిపక్ష సభ్యుల గందరగోళాలతోనే ముగిస్తున్నారు. ఈసారైనా చర్చించి పరిష్కరిస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# 'కేంద్రం' కరుణించేనా!



**ఆశలు 'పది'వేలు...**

- మౌలిక సదుపాయాలు, వరద నివారణ తదితరాల కోసం కేంద్రానికి వినతి
- రూ.10,500 కోట్లు ఇవ్వాలని అభ్యర్థన
- ఎదురు చూస్తున్న జీహెచ్ఎంసీ

**సాక్షి, సిటీబ్యూరో:** త్వరలో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో తమకెన్ని నిధులు కేటాయిస్తారోననే ఆశతో జీహెచ్ఎంసీ వర్గాలు ఎదురు చూస్తున్నాయి. విశ్వనగరంగా ఎదిగేందుకు వివిధ సదుపాయాల కల్పనకు సిద్ధమైన జీహెచ్ఎంసీ..గ్రేటర్ నగరంలో రహదారులు, ఫ్లై ఓవర్లు, శ్మశానవాటికలు తదితర మౌలిక సదుపాయాలతో పాటు వాన ముంపు సమస్య పరిష్కారం కోసం కూడా తగినన్ని నిధులు అందించాల్సిందిగా కేంద్రంలోని 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేసింది. చారిత్రకంగానూ పలు వారసత్వ సంపదలు కలిగి ఉన్న నగరంలో వాటిని పరిరక్షించడంతో పాటు పర్యాటకపరంగానూ అభివృద్ధి చేయాల్సి ఉందని విన్నవించింది. పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం నగరాభివృద్ధికి కేంద్రం తగిన విధంగా సహకరించాలని, కేంద్ర మంత్రివర్గంలో నగరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జి.కిషన్‌రెడ్డి తనవంతుగా నగరానికి తగిన నిధులొచ్చేలా కృషి చేయాలని పలు సందర్భాల్లో ప్రస్తావించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం తగిన విధంగా సహకరించగలదనే ఆశాభావంతో జీహెచ్ఎంసీ ఉంది. అందుకనుగుణంగానే రాబోయే ఆర్థిక సంవత్సరం(2025–26) జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను సైతం రూపొందించింది.

**పెరుగుతున్న జనాభాకనుగుణంగా..**

రాజధాని నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా గడచిన దశాబ్దకాలంలో జీహెచ్ఎంసీ రూ.6 వేల కోట్ల అప్పులు చేసి మరీ ఇప్పటికే రూ.18 వేల కోట్ల అభివృద్ధి పనులు చేసిందని ఆర్థిక సంఘానికి వివరించిన జీహెచ్ఎంసీ.. గ్రేటర్ జనాభా ప్రస్తుతం 1.40 కోట్లకు చేరిందని తెలిపింది. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరగనుందని, అందుకనుగుణంగా మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అవసరాన్ని వివరించింది. అందు కోసం రూ.10,500 కోట్ల ఆర్థిక సహాయం అందించాల్సిందిగా కోరింది. వేటికి ఎంత మొత్తం కావాలో వినతిపత్రంలో పేర్కొంది. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి.

- నగరంలో ప్రధాన రహదారుల అభివృద్ధి, సమగ్ర రోడ్డు నిర్వహణ, వరదనీటి కాలువల నిర్మాణం, నాలాల బలోపేతం వంటి పనులు చేయాల్సి ఉందని వివరించింది. ట్రాఫిక్ ఇబ్బందులు, వాయు కాలుష్యం, వరద ముంపు తదితర సమస్యల పరిష్కారానికి రూ.7,500 కోట్లు కావాలని కోరింది.
- నగరంలో పెరుగుతున్న జనాభాతో పాటు చెత్త సమస్యలు పెరుగుతున్నందున డంపింగ్ యార్డుల్లో బయో రెమిడియేషన్ లేదా బయో మైనింగ్ కోసం రూ.1500 కోట్లు కావాలని వివరించింది. బయో మైనింగ్ చేయాల్సిందిగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చేసిన సూచనను ఈ సందర్భంగా ప్రస్తావించింది.
- వర్షాలొస్తే ముంపు సమస్య లేకుండా చేసేందుకు వరద నివారణ, నిర్వహణ పనులకు రూ.800 కోట్లు అవసరమని తెలిపింది.
- ఇంకా, వారసత్వ కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణలకు రూ.200 కోట్లు, జీఐఎస్ ద్వారా ప్రాపర్టీస్ అసెస్‌మెంట్ మేనేజ్‌మెంట్, మాస్టర్‌ప్లాన్ అమలు, తదితర పనుల కోసం రూ.250 కోట్లు కావాలంది.
- ట్రాఫిక్, పూడికతీత, విపత్తు నిర్వహణలు తదితరమైన అంశాల్లో ఆధునిక సాంకేతికతతో ఏఐ వినియోగానికి మరో రూ.250 కోట్లు కావాలని కోరింది.

## గోషామహల్‌లోనే

# పోలీసు స్టేడియం!



- ప్రస్తుతం గ్రౌండ్స్ ఉన్న ప్రాంతంలో నిర్మాణం
- రూ.56 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- దాదాపు 25 ఎకరాలు 'ఉస్మానియా' కోసం సేకరణ
- ప్రత్యామ్నాయంగా ఆరాంఘర్‌లో 12 ఎకరాలు
- అక్కడ బందోబస్తు సిబ్బందికి బ్యారెక్స్ నిర్మాణం

**సాక్షి, సిటీబ్యూరో:** అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌లో శివకుమార్ లాల్ పోలీసు స్టేడియం ఉన్న ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అవసరమైన చర్యలకు ఆదేశించారు. దీంతో స్టేడియంను ఖాళీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కొత్త పోలీసు స్టేడియం కూడా ఆ ప్రాంగణంలోనే నిర్మాణం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర పోలీసు విభాగం నిమగ్నమైంది.

**36 ఎకరాలుగా లెక్కగట్టిన ప్రభుత్వం..**

ప్రస్తుతం గోషామహల్‌లోని పోలీసు స్టేడియం ఉన్న ప్రాంగణంలో ఓ పక్క స్టేడియం, సిటీ సెక్యూరిటీ వింగ్ కార్యాలయం, డాగ్ స్క్వాడ్, అశ్విక దళంతో పాటు శిథిలమైపోయిన కొన్ని పోలీసు క్వార్టర్స్ కూడా ఉన్నాయి. వీటికి ఎదురుగా ఉన్న స్థలం ఖాళీగా ఉండటంతో దాన్ని పోలీసు అధికారులు గ్రౌండ్‌గా వినియోగిస్తున్నారు. ఇందులోనే పోలీసు అమర వీరుల స్తూపం కూడా ఉంది. ఆక్రమణలు పోగా ఈ స్థలం మొత్తం దాదాపు 36 ఎకరాలుగా ప్రభుత్వం లెక్కకట్టింది.


→ ఇందులో నిర్మాణాలు ఉన్న 25 ఎకరాలను ఉస్మానియా ఆస్పత్రి కోసం సేకరించింది. దీనికి ఎదురుగా అమర వీరుల స్తూపంతో ఉన్న 11 ఎకరాలను పోలీసుస్టేడియం నిర్మాణం కోసం కేటాయించింది. స్తూపానికి ఏమాత్రం నష్టం వాటిల్లకుండా, సముచిత ప్రాధాన్యం ఇస్తూ స్టేడియంతో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనికోసం సర్కారు రూ.56 కోట్లు మంజూరు చేసింది. స్టేడియం ప్రాంగణంలో ఉన్న పాత వాహనాలు తదితరాల తొలగింపు పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త నిర్మాణానికి శంకుస్థాపన చేయించనున్నారు. ఇక్కడ ఉన్న సిటీ సెక్యూరిటీ వింగ్ సహా ఇతర విభాగాలను పేట్లబుర్జులోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్-క్వార్టర్స్‌తో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోకి తరలించనున్నారు.

**బ్యారెక్స్ నిర్మాణానికి నిర్ణయం..**

→ ఉస్మానియా ఆస్పత్రి కోసం ప్రభుత్వం గోషామహల్ స్టేడియం ప్రాంగణం నుంచి 25 ఎకరాలు తీసుకుంటున్న నేపథ్యంలో... దీనికి ప్రతిగా ఆరాంఘర్ ప్రాంతంలో 12 ఎకరాలను పోలీసు విభాగానికి కేటాయించింది. ఈ స్థలంలో రాష్ట్ర స్థాయి బ్యారెక్స్ నిర్మించాలని డీజీపీ కార్యాలయం నిర్ణయించింది.

→ గోషామహల్ స్టేడియం ప్రాంతంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ చుట్టు పక్కల ఉన్న రహదారుల పైనా ప్రభుత్వ విభాగాల దృష్టి పెట్టాయి. ప్రస్తుతం అది వాణిజ్య ప్రాంతం కావడంతో పాటు రోడ్లన్నీ ఇరుకుగా ఉంటాయి. ఆస్పత్రి నిర్మాణం ప్రారంభంతోనే ఈ రోడ్ల విస్తరణకూ చర్యలు చేపట్టనున్నారు. ఆస్పత్రి చుట్టూ 30, 60, 100 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీనికోసం ఇప్పటికే అధికారులు సర్వే సైతం ప్రారంభించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న రోడ్ల స్థితిగతులు, సేకరించాల్సిన ఆస్తులు, కూల్చివేతలపై లోతుగా అధ్యయనం చేస్తున్నారని సమాచారం.

# పవర్‌పై నజర్!



- వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్
- సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసిన డిస్కం
- అంచనాలకు మించి ఏర్పాట్లు
- జోన్ల వారీగా అధికారుల ప్రత్యేక సమీక్షలు
- భవిష్యత్ డిమాండ్‌పై చర్చలు

**సాక్షి, సిటీబ్యూరో:** గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చే వేసవిలో గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ నమోదు కాబోతున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంచనా వేసింది. ఆ మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఇప్పటికే సబ్‌స్టేషన్లలోని పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు, ఫీడర్లపై దెబ్బతిన్న జంపర్లు, ఇన్సులేటర్ల గుర్తింపు, ఆయిల్ లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త వాటిని అమర్చే ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన ఒకటి రెండు పనులను కూడా ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ మేరకు బుధవారం ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ (మేడ్చల్, రంగారెడ్డి జోన్ల సీజీఎంలు) క్షేత్ర స్థాయిలో పర్యటించి, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, ఏడీఈలతో ఆయా ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 15లోగా మిగిలిన పనులను సైతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎల్సీలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు.

**ఒక్కో జోన్‌కు ఒక్కో నోడల్ ఆఫీసర్..**

గ్రేటర్ జిల్లాల పరిధిలో 2024లో మే 3న అత్యధికంగా 4,357 మెగావాట్లు (90.86 మిలియన్ యూనిట్లు) విద్యుత్ వినియోగం నమోదైంది. అదే 2025లో ఈ డిమాండ్ 4,800 నుంచి 5000 మెగావాట్లకు (100 ఎంయూలకు) చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది. విద్యుత్ ప్రమాదాలు, భవిష్యత్ డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఒక్కో జోన్‌కు ఒక్కో అధికారిని డైరెక్టర్/సీజీఎం స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించింది.

**డిసెంబర్ 31 వరకు విద్యుత్ కనెక్షన్లు ఇలా..**

| జిల్లా | కనెక్షన్లు |
|---|---|
| హైదరాబాద్ | 21,79,904 |
| రంగారెడ్డి | 19,31,842 |
| మేడ్చల్ | 17,10,269 |
| సంగారెడ్డి | 6,63,678 |
| వికారాబాద్ | 2,44,671 |

**మేడ్చల్ జోన్‌లో 15 శాతం..**

2024 మే నెలలో రికార్డు స్థాయిలో 1,048 మెగావాట్లు (24.35 ఎంయూలు) విద్యుత్ డిమాండ్ నమోదైంది. 2025 సమ్మర్‌లో మరో 15 శాతం అదనపు డిమాండ్ నమోదయ్యే అవకాశం ఉన్నట్లు మేడ్చల్ జోన్ ఇంజినీర్లు అంచనా వేశారు. ఆ మేరకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో బౌరంపేటలో నిర్మించిన 132 కేవీ సబ్‌స్టేషన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. మౌలాలి, ఎల్బీఎం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 50 ఎంవీఏ నుంచి 80 ఎంవీఏకు పెంచారు.

› షాపూర్‌నగర్, మేడిపల్లి, ఎల్బీనగర్, బోడుప్పల్, ఉప్పల్ భగాయత్‌లలో రూ.37.83 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలోని 14 పీటీఆర్‌ల సామర్థ్యం పెంపుతో పాటు 762 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 18 సబ్‌స్టేషన్లు సహా, 145 కొత్త 11 కేవీ లైన్ల ఇంటర్ లింకింగ్ పనులు చేపట్టినట్లు మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ ఎ.కామేష్ ప్రకటించారు.

› ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ ఆఫీసులో మేడ్చల్ ఎస్ఈ రవికుమార్, హబ్సిగూడ ఎస్ఈ బ్రహ్మం, ట్రాన్స్‌కో ఎస్ఈ జి.లక్ష్మణ్‌రాజులు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన పనులను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలపై 1912 కాల్‌సెంటర్ లేదా హబ్సిగూడ కాల్ సెంటర్ 9491039018, మేడ్చల్ కాల్ సెంటర్ 7382618971 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

**రంగారెడ్డి జోన్‌లో 25 శాతం..**

2024లో జిల్లాలో రికార్డు స్థాయిలో 1800 మెగావాట్ల (35 ఎంయూ)విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈ సమ్మర్‌లో విద్యుత్ డిమాండ్ ఏకంగా 2250 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం ఇంజినీర్లు అంచనా వేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే 254 (11కేవీ) ఫీడర్లు, 21(33కేవీ) ఫీడర్లు, 81 పీటీఆర్‌లు, 1055 డీటీఆర్‌లను అదనంగా మంజూరు చేసుకుని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి చేశారు. ఫిబ్రవరి 15లోగా మిగిలిన 50 శాతం పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది.

› ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఎస్ఈ ఆఫీసులో రంగారెడ్డిజోన్ సీజీఎం చీఫ్ ఇంజనీర్ పాండ్య, ట్రాన్స్‌కో సీఈ చిరంజీవి, సైబర్ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్, సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి, రాజేంద్రనగర్ ఎస్ఈ మోహన్‌లతో పాటు ఆయా డివిజన్లకు సంబంధించిన డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమావేశమై, సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై చర్చించారు. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చూడాలని సూచించారు. ఆ మేరకు విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న కోకాపేట్, నార్సింగి, మోకిల, కొండాపూర్, చందానగర్, గచ్చిబౌలి, మణికొండ సహా సన్‌సిటీ, కిస్మత్‌పూర్, ఇబ్రహీంబాగ్, శంషాబాద్, తుక్కుగూడలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## 70 శాతం హైబ్రిడ్ విత్తన తయారీ తెలుగు రాష్ట్రాల్లోనే..


'ఎకో' సంస్థ సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయదుర్గం: దేశంలోని 70 శాతం హైబ్రిడ్ విత్తనాల తయారీ తెలంగాణ, ఏపీలలోనే జరుగుతోందని ఎనేబులింగ్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ విత్ సీడ్ ఆర్గనైజేషన్స్ (ఈసీహెచ్ఆర్ఎస్ఈ-ఎకో) సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దావులూరి పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో బుధవారం ఎకో సంస్థ ఆధ్వర్యంలో విత్తన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పలువురు నిపుణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని గద్వాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు హైబ్రిడ్ విత్తన తయారీకి అనాదిగా కేంద్రాలుగా కొనసాగుతున్నాయన్నారు. హైబ్రిడ్ సీడ్ తయారీ రంగంలో బాల కార్మికులు, మానవ హక్కులు, కనీస వేతనాల అమలు, వ్యవసాయ కార్మికుల కొరత వంటి పలు సమస్యలు ఉన్నాయన్నారు. వీటిపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈసీహెచ్ఓ ఫోరమ్ అధ్యక్షురాలు యూవీఎల్ ఆనంద మాట్లాడుతూ విత్తన పరిశ్రమలో నైతిక పద్ధతులు భవిష్యత్తు కోసం మార్గాన్ని రూపొందిస్తాయన్నారు. అంతకుముందు సంస్థ బ్రోచర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ, ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విత్తన సంస్థలు, ఎంవీ ఫౌండేషన్, ఎకో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీసీల వ్యవహారాలపై సీపీ కన్ను!

ఓ అధికారి, క్లర్క్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలోని వివిధ అధికారుల వద్ద పని చేస్తున్న క్యాంప్ క్లర్క్స్ (సీసీ) వ్యవహారాలపై కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కొందరిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) అధికారులతో లోతుగా ఆరా తీయిస్తున్నారు. ఇప్పటికే పలు ఆరోపణలు నిరూపితమైన నేపథ్యంలో ఓ ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న సీసీపై సస్పెన్షన్ వేటు వేశారు. మరికొందరి అంశాన్నీ కొత్వాల్ సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. నగర కమిషనరేట్‌లో ఏసీపీలు, అదనపు డీసీపీలు, డీసీపీలు, సంయుక్త సీపీలతో పాటు అదనపు సీపీ వద్దా సీసీలు పని చేస్తుంటారు. దాదాపు ప్రతి ఒక్కరూ పరిపాలన విభాగానికి చెందిన వారై ఉంటారు. ఆయా అధికారుల విధి నిర్వహణలో వీరిది కీలకపాత్ర. ఉన్నతాధికారులు, కింది స్థాయి సిబ్బందితో ఉత్తరప్రత్యుత్తరాలతో పాటు ఆయా కార్యాలయాలు, ఏరియాల నిర్వహణలోనూ పాలుపంచుకుంటూ ఉంటారు. సెలవులు, జీతభత్యాలు, ఇతర అలవెన్స్‌లకు సంబంధించిన ఫైళ్లను సదరు ఉన్నతాధికారి వద్దకు తీసుకువెళ్లడం, ఆయనతో సంతకం చేయించి క్లియర్ చేయించడం సైతం వీరి పనే. దీన్ని అవకాశంగా మార్చుకుంటున్న కొందరు సీసీలు రెచ్చిపోతున్నారని కొత్వాల్‌కు సమాచారం అందింది. అధికారులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్న వారు కొందరైతే... వసూళ్లకు పాల్పడుతున్న వారి మరికొందరని ఆరోపణలు వచ్చాయి. దీంతో నగర వ్యాప్తంగా ఆయా అధికారులు, కార్యాలయాల వద్ద పని చేస్తున్న సీసీల కార్యకలాపాలను లోతుగా ఆరా తీయాల్సిందిగా ఆయన ఎస్బీ అధికారులను ఆదేశించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా ఓ సీసీని సస్పెండ్ చేసిన పోలీసు కమిషనర్ మిగిలిన వారి వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మరో అధికారి వద్ద పని చేస్తున్న సీసీకి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. మరోపక్క ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండే ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వ్యవహారశైలినీ నగర కొత్వాల్ సీరియస్‌గా గమనిస్తున్నారు.

## 'మహా హారతి' నిర్వాహకులపై కేసు నమోదు

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్ బోటులో అగ్ని ప్రమాదానికి సంబంధించి..కార్యక్రమ నిర్వాహకులపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నెల 26వ తేదీన నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం హుస్సేన్ సాగర్‌లో బాణసంచా కాలుస్తుండగా ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనలో నాగారంకు చెందిన అజయ్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన టాటా ఏస్ డ్రైవర్ గణపతి మరణించారు. ఘటన జరిగిన అదే రోజు లేక్ పోలీసులు ఫైర్ ఆక్ట్‌తో పాటు (302) ఏ కింద కేసులు నమోదు చేశారు. అయితే ఈ ఘటనలో ఇద్దరు మరణించడంతో నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందనే ఉద్దేశ్యంతో పోలీసులు 304 ఏ సెక్షన్లకు మార్పులు చేశారు. భారతమాత ఫౌండేషన్‌కు చెందిన సుకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కాగా అజయ్ మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నగర సీపీని కోరారు. మూడు రోజుల్లో సమగ్ర సమాచారం అందించాలని అందులో పేర్కొన్నారు.



# చెన్నైకి చెక్కేశారు!

- అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు నిందితుల వ్యవహారం
- దర్యాప్తులో గుర్తించిన నగర పోలీసు బృందాలు
- ఈ ద్వయం యూపీలోనే నేరం చేసినట్లు వెల్లడి
- ముమ్మరంగా గాలిస్తున్న 4 రాష్ట్రాల పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్‌తో పాటు నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపిన బీహార్ నేరగాళ్లు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తు అధికారులకు ఎలాంటి ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీళ్లు రోషన్ ట్రావెల్స్ వద్ద కాల్పుల తర్వాత తిరుమలగిరి నుంచి ఉత్తరాదికి పారిపోయి ఉంటారని అధికారులు భావించారు. అయితే పోలీసుల్ని తప్పుదోవపట్టిస్తూ చెన్నైకి పారిపోయినట్లు తాజాగా వెలుగులోకి వచ్చిందని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని పట్టుకుంటామని, ప్రత్యేక బృందాలు ఆ కోణంలోనే ముందుకు వెళ్తున్నాయని స్పష్టం చేశారు. బీహార్‌లోని హాజీపూర్ జిల్లాకు చెందిన ఇరువురు దుండగులు అక్కడ నుంచే ద్విచక్ర వాహనం తీసుకుని నగరానికి చేరుకున్నారు. ఇక్కడే ఓ లాడ్జిలో బస చేసి బీదర్‌లో రెక్కీ నిర్వహించి మరీ పంజా విసిరింది. ఆపై నగదుతో సహా నగరానికి చేరుకున్న ఇరువురూ బైక్‌ను ఎంజీబీఎస్ పార్కింగ్‌లో పెట్టారు. ఆటోలో బయలుదేరి అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ వద్దకు వచ్చారు. ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్‌కు టిక్కెట్ బుక్ చేసుకున్న తదనంతర పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌ను కాల్చడం, పారిపోవడం జరిగాయి. దర్యాప్తు అధికారులు నిందితుల రాకపోకలు కనిపెట్టడానికి వందల సంఖ్యలో సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్‌కు వెళ్లిన ద్వయం ..అక్కడి నుంచి మరో ఆటోలో గజ్వేల్ వెళ్లే ప్రయత్నం చేసింది. అయితే ఆటోడ్రైవర్ వ్యవహార శైలితో అనుమానించి తిరుమలగిరిలో దిగిపోయారు. అక్కడే నగదును మరో బ్యాగ్‌లోకి మార్చడంతో పాటు తాము ధరించిన వస్త్రాలను మార్చుకున్నారు. అక్కడ నుంచి బోయిన్‌పల్లి వరకు వచ్చిన ఇద్దరు దుండగులూ..మరో ఆటోలో కూకట్‌పల్లి మీదుగా మియాపూర్ చేరుకున్నారు. అర్ధరాత్రి మియాపూర్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి చెందిన తిరుపతి వెళ్లే బస్సు ఎక్కారు. టిక్కెట్ సైతం తిరుపతి వరకు తీసుకున్న ఈ ద్వయం.. కడప బైపాస్ రోడ్డులో దిగిపోయారు. ఆ సమయంలో డ్రైవర్ ఇక్కడ ఎందుకు దిగుతున్నారని ప్రశ్నించగా..పని ఉందంటూ సమాధానం ఇచ్చారు. కడప నుంచి మరో బస్సులో నెల్లూరు, అక్కడ నుంచి ప్రైవేట్ బస్సులో చెన్నై చేరుకున్నట్లు ఇప్పటి వరకు గుర్తించారు. చెన్నై చేరుకున్న నగర పోలీసు బృందాలు అక్కడ నుంచి ఈ ఇద్దరూ ఎక్కడకు వెళ్లారనే కోణంలో ఆరా తీస్తున్నాయి. ఈ ఇద్దరిలో కీలకమైన ప్రధాన నిందితుడు ఏడాదిన్నర క్రితం ఉత్తరప్రదేశ్‌లోనూ ఓ భారీ నేరం చేశాడు. అప్పటి నుంచి ఇతడి కోసం గాలిస్తున్న అక్కడి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆచూకీ చెప్పిన వారికి రూ.4 లక్షల పారితోషికం కూడా ఇస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఈ దుండగుల కోసం తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బీహార్ పోలీసులు సమన్వయంతో గాలిస్తున్నారు.

# రూ.3 వేల కోట్లతో కోహెడ మార్కెట్ నిర్మాణం

- ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


వ్యవసాయ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కోహెడ పండ్ల మార్కెట్‌ను దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.3 వేల కోట్లతో అత్యాధునికంగా నిర్మిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే వేలాది మంది రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని బుధవారం ఎన్టీఆర్ నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయపరమైన కక్షలు ఉన్నవారే ఉద్యోగులపై దాడికి దిగుతున్నారని అన్నారు. ప్రజలకు అన్నం పెట్టే ఏ రైతు కూడా దాడులకు పాల్పడడని అన్నారు. అలాంటి రైతులను కూడా బీఆర్ఎస్ నేతలు రోడ్డునపడేలా చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రెండ్లీగా ఉంటుందని అన్నారు. పది సంవత్సరాలు రైతులను అరిగోస పెట్టిన నాయకులు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని, వారిని రైతులు దూరం పెట్టినా సిగ్గు తెచ్చుకోవడం లేదన్నారు.

ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు జగదీశ్వర్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హుస్సేని ముజీబ్, వ్యవసాయ మార్కెట్ శాఖ సంచాలకులు ఉదయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అర్బన్ ఫైనాన్స్ సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ స్కానర్ మార్చి బురిడీ

మూసాపేట: సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ మోసాలే కాకుండా స్కానర్‌లను కూడా మార్చి మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మూసాపేటలోని జామా మసీదులో మసీదు అభివృద్ధి కోసం విరాళాలు సేకరించేందుకు మసీదు కమిటీ సభ్యులు ఓ యూపీఐ స్కానర్‌తో పాటు ఓ వీడియోను తయారు చేసి ఫేస్‌బుక్‌లో ఈ నెల 23వ తేదీన అప్‌లోడ్ చేశారు. సుమారు 8.5 లక్షల వ్యూస్ వచ్చేంత వరకు మసీదు కమిటీ అకౌంట్‌లోనే డబ్బులు పడ్డాయి. అయితే, బుధవారం వ్యూస్ కోటి దాటడంతో ఎంత నగదు వచ్చిందోనని పరిశీలించగా ఎంబీఎఫ్ ఫౌండేషన్ పేరుతో వీడియో పోస్ట్ చేసి ఉండటం, అక్కడ ఉన్న స్కానర్‌కి డబ్బులు వేయగా తమ కమిటీ అకౌంట్‌కు రాకపోవటంతో చీటింగ్ జరిగిందని గ్రహించారు. సైబర్ నేరగాళ్లు వీడియో డౌన్‌లోడ్ చేసి మసీదు కమిటీ పేరుపై ఉన్న స్కానర్‌ను తీసివేసి..ఆ స్థానంలో వేరే స్కానర్‌ను ఎడిట్ చేసి పోస్ట్ చేశారని వెల్లడైంది. ఎడిట్ చేసిన స్కానర్ వీడియోకు సుమారు 9 లక్షల వ్యూస్ వచ్చాయి. దీనిపై వెంటనే కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసుని సైబర్ క్రైమ్‌కి బదిలీ చేశారు.

## ఆడపిల్ల పుడుతుందనే నెపంతో భార్యను పుట్టింటికి పంపించిన భర్త

అత్తాపూర్: ఆడపిల్ల పుడుతుందని గర్భవతిగా ఉన్న భార్యను పుట్టింటికి పంపించిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హసన్‌నగర్‌కు చెందిన అక్బర్‌ఖాన్‌కు ఐదేళ్ల క్రితం హుమేరా బేగంతో వివాహం జరిగింది. మొదటి సంవత్సరం ఒక ఆడపిల్లకు జన్మనిచ్చినప్పుడే ఆడపిల్లను కన్నావంటూ ఆమెపై దాడి చేశారు. ఆ సమయంలో బాధితురాలు రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో అక్బర్‌ఖాన్‌తో పాటు అత్తమామలపై ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఆమె గర్భం దాల్చడంతో ఆడపిల్ల పుడుతుందేమోనన్న భయంతో హుమేరా బేగంను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీనిపై బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

## సీసీఎస్‌కు సువర్ణ భూమి చీటింగ్ కేసు బదిలీ

బంజారాహిల్స్: తప్పుడు వాగ్దానాలతో మోసగించిన సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 420, 406 కింద కేసు నమోదు కాగా, ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే..కూకట్‌పల్లికి చెందిన ప్రైవేటు ఉద్యోగి వేణుగోపాల్ మరో నలుగురితో కలిసి సువర్ణ భూమి రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులో 2021-23 మధ్య రూ.1.55 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట వద్ద వెంచర్ వేస్తున్నామని సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ బొల్లినేని, డైరెక్టర్ దీప్తి బొల్లినేని నమ్మబలికారు. ప్రాజెక్ట్ పూర్తికాగానే డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి గడువు కూడా విధించారు. అయితే గడువు లోగా వీళ్లు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోగా దురుద్దేశపూర్వకంగా తమను మోసం చేశారని వేణుగోపాల్ గత నెలలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమను కావాలనే మోసం చేయడమే కాకుండా పెట్టుబడులను ఇతర మార్గాల్లోకి తమకు అనుకూలంగా మళ్లించుకున్నారని ఆరోపించారు. ఈ కేసును బంజారాహిల్స్ పోలీసులు సీసీఎస్‌కు బదిలీ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన బ్రహ్మం(32) బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం వచ్చాడు. రాత్రి సమయంలో గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బార్ ముందు జాతీయ రహదారి డివైడర్‌పై మృతిచెంది పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా.. అదే సమయంలో మృతుడి సెల్‌ఫోన్‌కు ఫోన్ రావడంతో అతడి వివరాలు తెలిశాయి. అయితే బ్రహ్మం ఎందుకు లింగోజిగూడెం వద్దకు వచ్చాడు, ఎప్పుడు వచ్చాడు..? వంటి వివరాలు తెలియాల్సి ఉంది. హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లుగా తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇక్రిశాట్ నూతన డైరెక్టర్ జనరల్‌తో ఏయూ వీసీ భేటీ


హిమాన్షు పాఠక్‌తో వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: ఇక్రిశాట్ నూతన డైరెక్టర్ జనరల్‌గా ఎంపికైన డాక్టర్ హిమాన్షు పాఠక్‌తో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య భేటీ అయ్యారు. మార్చిలో బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. రాబోయే కాలంలో ఇక్రిశాట్‌తో ఉన్న భాగస్వామ్యాన్ని మరింత పటిష్టపరిచి నూనె గింజలు, చిరుధాన్యాల, పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు..అలాగే తెలంగాణ రాష్ట్రంలో పంటల సాగు పెంపొందించేందుకు తగు సాంకేతిక సహాయాన్ని అందించాలని జానయ్య కోరారు. దీనికి డాక్టర్ పాఠక్ సానుకులంగా స్పందించారు.

## వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు లైన్‌క్లియర్

కంటోన్మెంట్ పార్కులో ఏర్పాటుకు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలోని పబ్లిక్ గార్డెన్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు హైకోర్టు లైన్‌క్లియర్ చేసింది. కుల, మతమైన విగ్రహాల ఏర్పాటును మాత్రమే సుప్రీంకోర్టు విగ్రహాలు వద్దని చెప్పిందని, మాజీ ప్రధానుల విగ్రహాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అభిప్రాయపడింది. వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. కంటోన్మెంట్ ఏరియాలోని పబ్లిక్ గార్డెన్‌లో వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త జెట్టి ఉమేశ్వర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వేణుకుమార్ వాదనలు వినిపిస్తూ.. 'దాదాపు 13 ఎకరాల పబ్లిక్ గార్డెన్ ప్రస్తుతం కబ్జాలతో సగానికి తగ్గిపోయింది. మిగిలిన ప్రాంతంలో ఇలా రాజకీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది' అని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'పబ్లిక్ గార్డెన్‌ను మరింత సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు విగ్రహ ఏర్పాటు దోహదం చేస్తుంది. పార్కులో ఓ పక్కకు ప్రజలకు ఇబ్బంది లేకుండా విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. 2022లో అనుమతి వచ్చినా.. ఏర్పాటులో ఆలస్యం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం లేదు. కుల, మతపరమైన విగ్రహాలకు సంబంధించి మాత్రమే సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. పిటిషనర్‌కు పిల్ వేసే అర్హత లేదు.. కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం..విగ్రహ ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# నకిలీలకు అడ్డుకట్ట ఎలా?

- జీహెచ్ఎంసీలో అడ్డగోలుగా మ్యుటేషన్లు
- ఆగని ఆస్తుల మార్పిడి
- సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో లోపాల ఫలితం
- బర్త్ సర్టిఫికెట్ల జారీదీ అదే తీరు..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ఆన్‌లైన్ ద్వారా సులభతర సేవలంటూ ప్రవేశపెట్టిన 'సంస్కరణలు' అక్రమార్కులకు వరంగా మారాయి. దాదాపు నాలుగేళ్ల క్రితం సెల్ఫ్ అసెస్‌మెంట్స్, బర్త్ సర్టిఫికెట్ల జారీలో ప్రవేశపెట్టిన విధానాలతో జరుగుతున్న అక్రమాలు, నకి'లీల'లు అడపాదడపా వెలుగు చూస్తున్నాయి. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆన్‌లైన్‌లో సదుపాయం కల్పించడంతో వేల సంఖ్యలో బర్త్ సర్టిఫికెట్లు జారీ కావడం వెలుగు చూసింది. వాటిని సరిచేసే మార్గం లేకపోవడంతో అవి చలామణి కాకుండా ఆపే వ్యవస్థ లేకుండా పోయింది. ఇప్పటికి సైతం ఇళ్ల వద్ద ప్రసవాల పేరిట, ఇతరత్రా కారణాలతో నకిలీ బర్త్ సర్టిఫికెట్లు జారీ అవుతూనే ఉన్నాయని గుర్తించారు. ఇక సెల్ఫ్ అసెస్‌మెంట్ ప్రభావమో ఏమో కానీ..తమ ఆస్తి పన్ను కట్టడానికి వెళ్లిన ఓ ఇంటి యజమాని తన ఇల్లు వేరే వారి పేరిట ఉండటం చూసి అవాక్కయ్యారు. ఈ ఉదంతంపై ఇటీవల మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ స్వయంగా దరఖాస్తు చేసుకుని జీహెచ్ఎంసీ నిర్వాకాన్ని బట్టబయలు చేశారు. తాజాగా తన డివిజన్‌లో ఇతరుల పేరిట ఇల్లు మార్పిడి జరిగిన విషయాన్ని మీడియాకు వివరించారు. మల్లిఖార్జునరావు అనే సీనియర్ సిటిజన్ వినాయకనగర్‌లో నోటరీ డాక్యుమెంట్ ఉన్న 80 గజాల ప్లాట్‌లోని ఇంట్లో దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా కుటుంబంతో నివసిస్తున్నారు. ఇటీవల ఆస్తిపన్ను చెల్లించేందుకు వెళ్తే తన ఆస్తిపన్ను నెంబర్ (పీటీఐఎన్)తో వేరేవారి పేరు ఉండటం చూసి అవాక్కయ్యారు. ఆరాతీస్తే గత డిసెంబర్‌లో తన ఇంటి పీటీఐఎన్ వేరే వారి పేరుకు బదిలీ అయినట్లు తెలుసుకున్నారు. నోటరీ డాక్యుమెంట్ ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడమే కాక వేరే వారి పేరు మీద ఎలా మ్యుటేషన్‌చేశారో అధికారులు స్పష్టత ఇవ్వాలని కార్పొరేటర్ శ్రవణ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య అసలు సమన్వయ లోపం..అధికారులు పట్టించుకోనందునే ఎన్ని పర్యాయాలు..ఎన్ని అక్రమాలు వెలుగు చూసినా, ఇంకా ఆగకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమాలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

# రక్షణ శాఖ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


బంగళా నెంబర్ 190లో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న బోర్డు అధికారులు


కూల్చివేతలను పరిశీలిస్తున్న బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు అధికారులు

కంటోన్మెంట్: రక్షణ శాఖకు చెందిన ఓల్డ్ గ్రాంట్ బంగళాలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై బోర్డు అధికారులు కొరడా ఝులిపించారు. బోయిన్‌పల్లిలోని బంగళా నెంబర్ 190లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కంటోన్మెంట్, డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు సంయుక్తంగా కూల్చేశారు. బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి నిరంతరాయంగా సాయంత్రం వరకు కూల్చివేతలు కొనసాగించారు. ఈ నిర్మాణాల్లో ఏవియేషన్ ట్రెయినింగ్ స్కూల్‌తో పాటు వివిధ సంస్థలకు చెందిన గోడౌన్, వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు సంబంధించిన దాదాపు 18 ఏళ్ల క్రితమే బోర్డు అధికారులు నోటీసులు జారీ చేయగా, కోర్టు వివాదాల కారణంగా కూల్చివేతల్లో జాప్యం నెలకొంది. తాజాగా హైకోర్టు ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టినట్లు బోర్డు అధికారులు స్పష్టం చేశారు. కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, సికింద్రాబాద్ సర్కిల్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ దినేశ్ కుమార్ రెడ్డి, ఏడీఈఓ రాగేశ్ కుమార్, బోర్డు ఇంజనీరింగ్ అధికారులు ఫణికుమార్, ఉమాశంకర్, సాగర్, జిష్ణు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి...

బోయిన్‌పల్లి పరిధిలోని జనరల్ ల్యాండ్ రికార్డ్స్ (జీఎల్ఆర్) సర్వే నెంబర్ 538లో 3.20 ఎకరాల విస్తీర్ణంలోని బంగళా నెంబర్ 190ని జాస్తి శోభకు హెచ్ఓఆర్ కింద అప్పగించారు. వీరి కుటుంబ సభ్యుల పేరిట మాత్రమే బదలాయించుకునే అవకాశం ఉండగా, ఈ స్థలాన్ని పలువురు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. దొడ్డిదారిన రక్షణ స్థలాన్ని కాజేసిన వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టి కిరాయిలకు ఇచ్చేశారు. దీన్ని సవాలు చేస్తూ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేయడంతో కోర్టును ఆశ్రయించి, స్టే ఆర్డర్‌లతో నెట్టుకొచ్చారు. తాజాగా హైకోర్టు కంటోన్మెంట్ అనుకూలంగా తీర్పునివ్వడంతో కూల్చివేతలు చేపట్టారు.

## ధాన్యం పేరుతో దండుకున్న అధికారులను సస్పెండ్ చేయాలి

కాచిగూడ: వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో రూ. కోట్లు దండుకున్న డీఎస్‌ఓ కాశీ విశ్వనాథ్ అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీ విశ్వనాథ్ వనపర్తి డీఎస్‌ఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్నా.. తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించి తన కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బంధువుల అకౌంట్‌లోకి డబ్బులు వేయించున్నారని ఆరోపించారు. పక్క జిల్లా మిల్లులకు కేటాయింపులు చేసినందుకు బస్తాకు రూ.5 తీసుకున్నారని, కొన్ని మిల్లుల నుంచి భారీగా లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. విద్యుత్ కనెక్షన్ లేకున్నా, కేపాసిటీకి మించి కొన్ని మిల్లులకు కేటాయింపులు చేశారని, డబ్బులు ఇచ్చిన వారికి సన్న ధాన్యం, ఇవ్వని వారికి దొడ్డు రకాలు కేటాయించారని, దీనిపై విచారణ జరపాలని కోరారు. కాశీ విశ్వనాథ్ ప్రస్తుతం సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. అధికారుల అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీవీ గౌడ్, సంపత్ కుమార్, గాలి గల్ల సాయిబాబా, మహేందర్ నాయుడు, బత్తుల జితేందర్ గౌడ్, రమేష్ సాగర్, తిరుపతయ్య గౌడ్, దేవర శివ, గౌతమ్ శంకర్, మేఘనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుమతుల ప్రదానం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఆంబిషన్స్ కేరీర్ కౌన్సిలర్స్, వాసవీ క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కామర్స్ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ట్యాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, వైస్ ప్రిన్సిపాల్ తిరుమల రావు, వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎ.దయాకర్, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, కోశాధికారి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం మాయం...

వెంగళరావునగర్ : మెట్రోరైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన రవీందర్‌నాయక్ ఈనెల 28న మధురానగర్ మెట్రోస్టేషన్ వద్ద తన బైక్ పార్క్ చేసి చైతన్యపురి వెళ్లి తిరిగి వచ్చాడు. అనంతరం వాహనాన్ని అక్కడే ఉంచి కాలినడకన పక్కనే ఉన్న వైన్స్‌షాపు వద్దకు వెళ్లి వచ్చేసరికి అతడి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్ : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో సంతోష్ గో స్వామి, షీలా గిరి దంపతులు రోజులుగా నివాసం ఉంటున్నారు. ఈనెల 28న భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల షీలా గిరి మాత్రమే కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వచ్చి చూడగా భర్త కనిపించలేదు. అతడి కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే...
- ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే..



కార్యక్రమానికి హాజరైన ఆటోడ్రైవర్లు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది ఆటోడ్రైవర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఇతరుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఆటోడ్రైవర్లు నడుచుకోవాలన్నారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం, స్టాప్‌లైన్ దాటడం, సిగ్నల్ జంప్, లైసెన్స్ లేకపోవడం, సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడం, నిర్దిష్ట పార్కింగ్ ప్రదేశాల్లో పార్కు చేయకపోవడం, వేరే వ్యక్తులకు ఆటోలు ఇవ్వడం, ఇన్సూరెన్స్ లేకపోవడం తదితరాలు ట్రాఫిక్ ఉల్లంఘనల కిందికి వస్తాయన్నారు. వాటి వల్ల తమతో పాటు ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సురక్షిత డ్రైవింగ్ ద్వారానే ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు తమ సమస్యలను డీసీపీ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా జిల్లాల నుంచి వచ్చే ఆటోలు, టాక్సీలు, రిజిస్ట్రేషన్ కాని ఓలా, ఊబర్ ద్విచక్ర వాహనాల వల్ల తమకు కలిగే నష్టాలను వివరించారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ఆయా సమస్యలకు పరిష్కారం చూపుతామని డీసీపీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నియంత్రణకు చర్యలు

బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద నిరాశ్రయులు, యాచకుల సంఖ్య పెరిగిపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు మృత్యువాతపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి ఓ కారు ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నగరవాసులు పెద్ద ఎత్తును అన్నదానాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే పేషంట్ల సహాయకుల కంటే బయటి వారే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీనిని కట్టడి చేసే క్రమంలో రెండు రోజులుగా సమీపంలోని షెల్టర్ నుంచి



ఫుట్‌పాత్‌పై పోలీసుల బందోబస్తు

నిరాశ్రయులను జీహెచ్‌ఎంసీ షెల్టర్లకు తరలించారు. మరో వైపు అన్నదానాలు చేసేందుకు వచ్చే వారిని ఆస్పత్రి లోపల, అనాథాశ్రమాల్లో చేయాలని అవగాహన కల్పించి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ పోలీసులు ఇక్కడ ప్రత్యేక బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు.

## బీజేపీ నాయకులను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు..

వెంగళరావునగర్ : అకారణంగా బీజేపీ సీనియర్ నాయకులను దూషించిన శ్రావ్య అనే మహిళపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మధురానగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటుగా జూబ్లీహిల్స్ ఇన్‌చార్జిపై అనైతిక వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షులు ఎస్.నవీన్‌కుమార్, పార్టీ సీనియర్ నేతలు జబ్బార్, షాబాగ్, ప్రవీణ్, శివ, అల్లం సంగీత, సుప్రియాగౌడ్, అనంతలక్ష్మి, విజయ్, రూప తదితరులు ఉన్నారు.

## హెబ్రోన్ చర్చి వివాదంపై విచారణ జరిపించాలి




మాట్లాడుతున్న పాస్టర్ శాంసన్

పంజగుట్ట: దశాబ్దాలుగా దైవజనుల సేవలో ఉన్న తమను హెబ్రోన్ చర్చిలోకి రాకుండా అడ్డుకోవడం అన్యాయమని పాస్టర్లు కె.ఎం.శాంసన్, జాన్‌సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డానియల్ ఎఫ్రాయిమ్, కృపావరంతో కలిసి వారు మాట్లాడుతూ .. 1969 నుంచి తాము హెబ్రోన్ చర్చ్‌లో ప్రార్థనలు చేస్తున్నామని, కాని చర్చిలో ప్రస్తుత పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గేటుకు తాళం వేసి భక్తులను లోనికి రానివ్వడంలేదని, హెబ్రోన్‌ను కేవలం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌గా మాత్రమే చెబుతున్నారని అక్కడి భక్తులకు ప్రార్థన చేసుకునే అవకాశం కల్పించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని గేట్లు తెరిపించి ప్రార్థన చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల చర్చిలోకి రౌడీలను, హిజ్రాలను తీసుకుని వచ్చి గొడవ చేయడం దారుణమన్నారు. సొసైటీ, ట్రస్ట్ ఏకమై కార్యక్రమాలు జరుపుకుంటామంటే కూడా అడ్డుపడుతున్నారని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని, దీనిపై కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని పాస్టర్లు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌ఘడ్‌లోని అబుజ్ ప్రాంతంలో కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపి వేయాలని వామపక్ష నేతలు, పలువురు మేధావులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'నక్సల్స్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం - ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తదితరులు మాట్లాడారు. చత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మావోయిస్టుల తరపున గొంతును వినిపిస్తామని, ప్రశ్నిస్తామని, ఇందుకు తమపై కేసులు నమోదు చేసినా తాము వెనుకాడబోమని, నక్సల్స్ పేరుతో ప్రజలను, ప్రశ్నించేవారిని చంపితే ఊరుకోబోమని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనూ ఎన్‌కౌంటర్లు జరిగాయని, అయితే బీజేపీ ఓ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఎదురుపడిన ప్రతి ఒక్కరిని మట్టు పెడుతోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి త్రయం కలిసి సాగిస్తున్న దమన కాండకు అడ్డుకట్ట వేసేందుకు పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించడం సమాజానికి చారిత్రక అవసరమని, ప్రశ్నించకపోతే ఆ సమాజం జీవచ్ఛవం లాంటిదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, నాయకులు పశ్య పద్మ, వీఎస్ బోసు, ఎస్.బాలు, డీజీ నరసింహరావు, చలపతిరావు, కె.మురహరి, రమేష్, ప్రసాద్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి అన్నారు. ఎన్నో ఏళ్లుగా బీసీలు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి

లిబర్టీ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న సదానందు అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులే అందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా దేశంలోనే నెంబర్ వన్ కాబోతుందన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ సిద్ధించిన తర్వాత రూ.1.78.950 కోట్ల పెట్టుబడులు రావడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఒప్పంద పత్రాలు సైతం మార్చుకున్నారన్నారు. తెలంగాణ పారిశ్రామిక రంగంలో దూసుకుపోతుందన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన తప్పనిసరి



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సురేష్‌రెడ్డి

వెంగళరావునగర్ : విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఖైరతాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖైరతాబాద్ ఆర్‌టీఏ కార్యాలయం ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ రెడ్డి మాట్లాడుతూ కేవలం వాహనాల్లో వెళ్లేవారే కాకుండా కాలినడకన వెళ్లే వారు ఫుట్‌పాత్‌పైనే నడుస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమను తాము కాపాడుకోవాలన్నారు. సైకిల్‌పై స్కూల్‌కు వచ్చే విద్యార్థులు సైతం ఎడమ చేతివైపునే రావాలని, సిగ్నల్ పడగానే తప్పనిసరిగా నిలిపివేయాలని, అప్పుడే ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. యువతీ యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతూ రెడ్ సిగ్నల్ పడినా అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి నరసింహ, ప్రభాకర్, విశ్వేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవనిర్మాణ్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవనిర్మాణ్‌నగర్ పర్యటిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ నవనిర్మాణ్‌నగర్ సీఎం వర్కర్స్ క్వార్టర్స్‌లో స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు నిండిపోయి నిరంతరం రోడ్లపై ప్రవహిస్తుందని, వెంటనే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానిక బస్తీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రాంబాబు, సీవరేజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వాటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్థానికులు శ్రీనివాస్, మూర్తి, వెంకటేష్, జ్ఞానేష్, పండు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్

లిబర్టీ: జీహెచ్‌ఎంసీ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ ముద్రించిన 2025 కేలండర్‌ను శాసన మండలి సభ్యులు మీర్జా రహమత్ బేగ్ అధ్యక్షులు డి.దిలీప్‌సింగ్, ఉపాధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ఆవిష్కరించారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేయాలని కోరారు. నగరాన్ని స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీమన్నారు. కార్యక్రమంలో అలం సైపుల్లా, అనీఫ్, రాజేష్, మధు, యశ్వంత్, హరి, అమిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2న గచ్చిబౌలి స్టేడియంలో రన్ ఫర్ చైల్డ్



రన్ ఫర్ చైల్డ్ టీషర్ట్స్ ఆవిష్కరిస్తున్న సేవా భారతి ప్రతినిధులు

పంజగుట్ట: ఆడపిల్లల చదువులు, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ సేవా భారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న గచ్చిబౌలి స్టేడియంలో 'రన్ ఫర్ చైల్డ్' 9వ ఎడిషన్ నిర్వహిస్తున్నట్లు సేవా భారతి ప్రతినిధులు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రన్ టీ షర్ట్స్, మెడల్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా భారతి ఉపాధ్యక్షురాలు సుమలత, ప్రధానకార్యదర్శి జయప్రద, చంద్రశేఖర్ రెడ్డి, స్వప్న మహేరియా మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఉదయం 5:30కి 21కె, 6 గంటలకు 10కె, 6:30కి 5కె రన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభమయ్యే ఈ రన్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 10వేల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీతో పాటు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. రన్ ద్వారా సేకరించిన నిధులను బస్తీల్లో ఉన్న బాలికలకు స్కూల్ తర్వాత ట్యూషన్స్, వారికి చేతివృత్తులు, సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించేందుకు, మురికివాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి వినియోగిస్తామన్నారు. రన్‌కు ఒక్కరోజు ముందు గచ్చిబౌలి స్టేడియంలో రన్‌లో పాల్గొనేవారు టీషర్ట్స్ తీసుకోవచ్చునని అక్కడే ఉడాన్ ఉత్సవ్ పేరుతో మహిళలు చేతివృత్తుల ద్వారా తయారు చేసిన వస్తువుల ప్రదర్శన అమ్మకాలు, సంప్రదాయ వంటల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ సేవా భారతి అధ్యక్షురాలు ఉషా, రన్ అంబాసిడర్ సరిత, శ్రీనివాస్ తాడూరి, అఖిల్ పాల్గొన్నారు.

# యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా..!

- జూబ్లీహిల్స్ డివిజన్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుల వెల్లువ



జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-46 మస్తాన్‌నగర్ ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు



పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ప్రభుత్వ స్థలాలను కొందరు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-46లోని మస్తాన్‌నగర్‌ను ఆనుకుని అంబేడ్కర్‌నగర్ బస్తీ వద్ద ప్రభుత్వం నిర్మించిన ప్లాట్ల పక్కనే సర్కార్ స్థలాన్ని కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికులు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు స్థలంలో ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా నిర్మించే అవకాశాలు ఉన్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పట్టించుకోకపోవడంతోనే స్థలాన్ని కబ్జా చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి కొందరు లీడర్లు విక్రయించినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు వినియోగించాలని కోరుతున్నారు.

### పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో..

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీలో ఓ మహిళకు 50 గజాలు కేటాయించారు. అయితే పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మొత్తం 150 గజాల్లో అక్రమ నిర్మాణానికి తెరలేపారని, ప్రభుత్వ పాఠశాల వెనుకాలే ఈ కబ్జా జరుగుతుందంటూ స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆక్రమించిన 100 గజాలు స్వాధీనం చేసుకుని ఇక్కడ బస్తీ దవాఖానా నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

### గుడి మాటున కబ్జా ప్రయత్నాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలో పర్వతాంజనేయ స్వామి ఆలయం చుట్టూ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో పలుమార్లు ఇక్కడ అక్రమంగా స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్నా ఆక్రమణదారుల ఎత్తుగడలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా పర్వతాంజనేయస్వామి ఆలయానికి దీన్‌దయాల్‌నగర్ బస్తీ వైపు నుంచి దారి ఇచ్చారు. దీంతో వినాయకనగర్ బస్తీ వైపు నుంచి దారిని మూసేసి పూర్తిగా దీన్‌దయాల్‌నగర్ బస్తీ వైపు నుంచే ఆలయానికి రాకపోకలు కొనసాగించాలని ఆలయ కమిటీ నేతలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వినాయకనగర్ బస్తీ వైపు భారీ ప్రహరీ నిర్మిస్తున్నారు. వినాయకనగర్ వైపు నుంచి ఆలయానికి వచ్చే మెట్ల మార్గంలో సుమారు 200 గజాలకు పైగా ప్రభుత్వ స్థలం ఉందని దీన్ని కాజేసేందుకు కొంతమంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని బస్తీలో కొద్ది రోజులుగా చర్చ జరుగుతోంది. ఈ స్థలాన్ని నాలుగైదు ప్లాట్లుగా విభజించి కొందరు లీడర్లు అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారం అంతా ఓ సీనియర్ నేత కనుసన్నల్లోనే జరుగుతూ అన్ని శాఖల అధికారులను మేనేజ్ చేస్తున్నారంటూ పెద్ద ఎత్తున బస్తీవాసులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బస్తీవాసులు కోరుతున్నారు.



వినాయకనగర్ బస్తీ వైపు కడుతున్న ప్రహరీ

### త్వరలో కూల్చివేస్తాం..

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని మస్తాన్‌నగర్ పక్కన, పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటిపై చర్యలు తీసుకుంటాం. పద్మాలయా అంబేడ్కర్‌నగర్ కబ్జాపై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. త్వరలోనే అక్రమ నిర్మాణాలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తాం.

– అనితారెడ్డి, తహసీల్దార్, షేక్‌పేట మండలం

# తెలుగు రాష్ట్రాల్లో టీవీ నగర్ ఏర్పాటుకు కృషి

- జీఎస్ హరి ప్యానెల్ మేనిఫెస్టో విడుదల
- 31న తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు



జీఎస్ హరి ప్యానెల్ సభ్యులు

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జీఎస్ హరి ప్యానెల్ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. బుధవారం ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఒక్కో తెలుగు సీరియల్‌లో ఒక పరభాష ఆర్టిస్ట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వీక్లీ షూటింగ్ డేట్స్ బ్లాకింగ్ పద్ధతిని నిర్మాతలు, ఛానల్స్‌తో మాట్లాడి రద్దు చేస్తాం, అర్హులైన పేద కళాకారులకు పెన్షన్, మెడిక్లెయిమ్ పాలసీ రూ.3 లక్షల నుంచి 5 లక్షలకు పెంపు, తెలుగు రాష్ట్రాల్లో టీవీనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మహిళా సభ్యులకు ప్రత్యేక రక్షణ, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ అవార్డులను తెలుగు టీవీ కళాకారులకు అమలు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ద్వారా మన సభ్యులై ఉండి అక్కడ నివాసం ఉంటున్న వారికి తెల్లరేషన్‌కార్డుల కోసం ప్రయత్నం, టాలెంట్ సెర్చ్ నిర్వహించి ఛానల్స్ వారికి, కొత్త తెలుగు కళాకారులకు మధ్య వారధిలా వ్యవహరిస్తాం, ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) స్కీమ్‌లు అమలుచేస్తాం, ప్రతి సభ్యుడికి వర్క్ కల్పిస్తామని మేనిఫెస్టో ద్వారా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ టీవీ నటుడు విజయ్‌యాదవ్ మాట్లాడుతూ టెలివిజన్ కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా వినోద్‌బాల ఆధ్వర్యంలో 27 ఏళ్ల క్రితం మా తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రారంభమైందని, ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. తెలుగు ఆర్టిస్టులకు మాత్రమే అవకాశాలు ఇవ్వాలన్నదే తమ ప్రయత్నమన్నారు. కరోనా సమయంలో చిరంజీవి ట్రస్ట్, అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో ఆర్టిస్టులందరికీ సహాయం చేశామన్నారు. పేద కళాకారులకు పెన్షన్ ఇప్పిస్తామన్నారు. సమర్థులైన జీఎస్ హరి ప్యానెల్ సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే టెలివిజన్ కళాకారుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జీఎస్ హరి ప్యానెల్ అధ్యక్ష అభ్యర్థి హరి మాట్లాడుతూ పరిశ్రమ సంక్షేమం కోసం తాను నిరంతరం ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అభ్యర్థి గొట్టికొండ భార్గవ, ట్రెజరర్ అభ్యర్థి చెన్నుపాటి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి రాంజగన్, వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థులు జీఎస్ శశాంక్, కృష్ణకిషోర్, ఉమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అభ్యర్థులు బ్యాంక్ శ్రీనివాస్, దీప్తి వాజ్‌పేయి, జాయింట్ సెక్రటరీ అభ్యర్థులు మేక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో మైనారిటీ సంక్షేమం

- ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు వేతనాల్లేవు
- హజ్ క్యాంప్ కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేదు
- నిధుల్లేక పడకేసిన పథకాలు

**సాక్షి, సిటీబ్యూరో:** మైనార్టీ సంక్షేమ శాఖలో ఫైసల్ లేవు. ఉద్యోగులకు వేతనాల్లేవు. పథకాలకు నిధుల్లేవు. మొత్తానికి మైనార్టీ సంక్షేమ శాఖ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. హజ్ కమిటీ, ఉర్దూ అకాడమీ, వక్ఫ్ బోర్డు దారిఫుల్ మారిఫ్, మైనార్టీ స్టడీ సెంటర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ విభాగాల్లో నిధుల్లేక ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలు కావడం లేదని ఓ ఉన్నత అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. 2024 హజ్ క్యాంపులో భాగంగా యాత్రికులకు భోజనాలు, రవాణా, షామియానాలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్లకు ఏడాది గడిచినా ఇంకా డబ్బులు చెల్లించలేదు. ఉర్దూ అకాడమి ఉద్యోగులకు డిసెంబర్ నెలకు సంబంధించిన వేతనాలు అందలేదు. ఉర్దూ అకాడమి, హజ్ కమిటీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చైర్మన్లను నియమించినా వేతనాలు ఇవ్వడంలేదు. గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ దివస్‌ను ఘనంగా నిర్వహించింది. దీని కోసం చేసిన ఖర్చులకు ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉర్దూ అకాడమి ద్వారా ఉర్దూ భాషా అభ్యున్నతికి కోసం వివిధ రకాల పథకాలు ప్రవేశపెట్టారు. కానీ, ఒక్కటి కూడా అమలైనా దాఖలాలు లేవు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పథకాలు పడకేశాయి. స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల అభ్యర్థులకు కోచింగ్ క్లాస్‌లు జరగడం లేదు. ఈ శాఖకు మంత్రి కూడా లేకపోవడం గమనార్హం. మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి అంతగా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. చైర్మన్లు కూడా తమ తమ విభాగాలను గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖకు నిధులు విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో మైనార్టీల అభ్యున్నతి కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మైనార్టీ మత పెద్దలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వ్యవసాయానికి ఏటా రూ. 50 వేల కోట్లు

**అగ్రికల్చర్ విద్యార్థుల ముఖాముఖిలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**


విద్యార్థుల ఇష్టాగోష్టిలో మాట్లాడుతున్న సభాపతి ప్రసాద్‌కుమార్

**ఏజీవర్సిటీ:** 'మాది రైతు ప్రభుత్వం. వ్యవసాయ రంగానికి ఏటా రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. వ్యవసాయ పరిశోధనలతో దేశ, విదేశాలలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరుతెచ్చుకోవడం తెలంగాణ వాసులందరికీ గర్వకారణం' అని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'విద్యార్థులతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని, విశ్వవిద్యాలయాలను విస్మరించిందని ఆరోపించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఇప్పటివరకు 67 రకాల అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు రూపుదిద్దుకున్నాయని, దేశంలో సాగవుతున్న వరి వంగడాలలో 25 శాతం మన విశ్వవిద్యాలయం రూపొందించినవే' అని వివరించారు. విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలు ఎదిగి వ్యవసాయ రంగం అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి నిధులు పెంచాలని, కొత్త నియామకాలు చేపట్టాలని, నూతన వసతిగృహాలు నిర్మించాలని విద్యార్థులు సభాపతిని కోరారు. స్టైపండ్‌ను రూ.5 వేల నుంచి రూ. 20 వేలకు పెంచాలని పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ విద్యార్థులు స్పీకర్‌కు విన్నవించారు. ఈ మేరకు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పీకర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, వైస్ చాన్స్‌లర్ జానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రావాలి

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**బంజారాహిల్స్:** ప్రతి ఒక్కరి జీవితంలో ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత తొలి మెట్టు అని, ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత శాతాల పెంపుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో టీచర్ల కొరత లేకుండా చూస్తామని, జిల్లాను అగ్రగామిగా నిలపాలని అన్నారు. వచ్చే జూన్‌లో విద్యాపరమైన అంశాలపై సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో గత ఏడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో ఈ.వెంకటాచారి, డీఈవో రోహిణి, డీఐఈవో ఒడ్డెన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు కోటాజీ, ఆశన్న, ఇలియాజ్ అహ్మద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

# ఆర్మీ స్కూళ్లకు బాంబు బెదిరింపు


బాంబు ఉందని బెదిరింపు కాల్ వచ్చిన బొల్లారం ఆర్మీస్కూల్


**రసూల్‌పురా:** నగరంలోని రెండు ఆర్మీ స్కూళ్లలో బాంబు ఉందన్న విషయం కలకలం రేపింది. స్కూళ్లలో బాంబులు ఉన్నాయని గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ ద్వారా మెసేజ్ పంపి యాజమాన్యాలను బెదిరించారు. దీంతో యాజమాన్యాలు అప్రమత్తమై విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటికి పంపాయి. బొల్లారం, సన్‌సిటీ ఆర్మీ స్కూళ్లలో బుధవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. బొల్లారం సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్‌ఐ వీరస్వామి, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ రంగంలోకి దిగారు. స్నిఫర్ డాగ్స్ సహాయంతో బొల్లారంలోని స్కూల్‌లోని అన్ని తరగతి గదులు, స్టాఫ్ రూముల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేసి బాంబు లేదని నిర్ధారించారు. కాగా, తమిళనాడు ఈరోడ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఈ తప్పుడు మెయిల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**సన్‌సిటీలో..**

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సన్‌సిటీ ఆర్మీ స్కూల్‌లో బాంబు ఉందంటూ ఆగంతకుడు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఈ మెయిల్ పంపాడు. దీంతో ప్రిన్సిపాల్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, ఆర్మీ సిబ్బంది తరగతి గదులు, ప్రధాన భవనం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రెండు గంటలపాటు తనిఖీలు నిర్వహించిన అనంతరం బాంబు లేదని తేల్చారు. ముందు జాగ్రత్తగా పాఠశాల నిర్వాహకులు విద్యార్థులను మధ్యాహ్నం ఒంటి గంటకే ఇళ్లకు పంపించారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జీ-మెయిల్‌కు వచ్చిన ఐడీని సేకరించిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణ

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే)కు సుదీర్ఘ చరిత్ర ఉందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హెచ్‌యూజే 2025 మీడియా డైరీని ఆ యూనియన్ అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలువురు సీనియర్ పాత్రికేయులు ఈ సంఘంలో సభ్యులుగా విశిష్ట సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ఉప ప్రధాన కార్యదర్శి కల్యాణి రాములు, కార్యదర్శి వరకాల యాదగిరి, హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్ మోహియుద్దీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





# సరఫరాలో సర్దుబాటు

- వేసవిలో అదనపు తాగునీటి సరఫరా ప్రశ్నార్థకమే!
- ప్రస్తుతం రోజువారీ సరఫరా 542 ఎంజీడీలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ట్యాంకర్‌లకు 50% పెరిగిన డిమాండ్
- ఉన్న నీటినే సర్దుబాటు చేసే యోచనలో జలమండలి



**సాక్షి, సిటీబ్యూరో:** వేసవికాలం వస్తూ వస్తూ ఎండలతోపాటు నీటిఎద్దడిని కూడా తీసుకొస్తుంది కదా! అయితే జనవరిలోనే మహానగరంలో వేసవి ఛాయలు గోచరిస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి విషయంలో దాని ప్రభావం ఇప్పటికే కనిపించడం మొదలైంది. గతేడాది పోలిస్తే ఈ నెలలో కొన్ని ప్రాంతాల్లో అదనంగా సుమారు 50 శాతం మేర ట్యాంకర్లకు డిమాండ్ పెరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నగర శివారు గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవంతుల నిర్మాణాలు విస్తరించడంతో భూగర్భ జలాల వినియోగం కూడా బాగా పెరిగింది. మరోవైపు ఆ ప్రాంతాలకు సరైన పైపులైన్ల నెట్‌వర్క్ లేక ప్రజలు విచ్చలవిడిగా బోర్లు తవ్వడంతో భూగర్భజలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. అయితే ప్రస్తుతం సరఫరా చేస్తున్న దాని కంటే ఒక్క మిలియన్ గ్యాలన్ లీటర్ పర్ డే(ఎంజీడీ) నీటిని కూడా అధికంగా నగరవాసులకు ఇచ్చే పరిస్థితిలో జలమండలి లేదు.

### జలాశయాలే ఆధారం..

మహానగరానికి తాగునీటి అవసరాలకుగాను వంద కిలోమీటర్ల దూరంలోని నాగార్జున సాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణాజలాలు, సుమారు రెండు వందల కిలోమీటర్ల దూరంలోని శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను ప్రస్తుతం నగరానికి తరలిస్తున్నారు. మరోవైపు జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌తోపాటు సింగూర్, మంజీరా జలాశయాల నుంచి నీటిని తరలించి నల్లాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్, శ్రీ పాద ఎల్లంపల్లి జలాశయాల నుంచే మహానగరానికి సుమారు 75 శాతం వరకు నీటి తరలింపు ఉంది.

### పెరుగుతున్న నీటి అవసరాలు

నాలుగు దిక్కులా విస్తరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలు కూడా బాగా పెరిగాయి. పదేళ్ల క్రితం నాటి జనాభా అవసరాలకు సరిపోయే తాగునీటి సరఫరా వ్యవస్థే ఇప్పటికీ కొనసాగుతోంది. తాజాగా గోదావరి రెండోదశకు గ్రీన్‌సిగ్నల్ లభించినప్పటికీ ఆ నీరు ఇప్పట్లో వచ్చే అవకాశాలు కనిపించడ లేదు. మరోవైపు ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు సరిపోయే పరిస్థితిలేదు.దీంతో ఈ వేసవిలో నీటిఎద్దడిని అధిగమించడంపై జలమండలి ముందస్తు కసరత్తుకు సిద్ధమైంది.

### జలాల మళ్లింపు...

ప్రస్తుతం శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి తరలిస్తున్న గోదావరి జలాల్లో సుమారు 31 ఎంజీడీలను శివారు ప్రాంతాల్లో గ్రామీణ నీటి సరఫరా పథకం(ఆర్‌డబ్ల్యూఎస్) మిషన్ భగీరథ కింద సరఫరా అవుతోంది. అయితే వేసవి గండం నుంచి నగరవాసులను గట్టెక్కించేందుకుగాను దానిలో సగం నీటిని నగరానికి మళ్లించాలని యోచిస్తోంది. గోదావరి నీటి సరఫరా పథకం మార్గంలోని ట్యాంకర్ల ఫిల్టర్ పాయింట్లకు నీటిని తరలించి ట్యాంకర్ల ద్వారా నగరానికి తరలించేవిధంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

**మహానగరానికి నీటి తరలింపు ఇలా...**

| రిజర్వాయర్ | ఎంజీడీ |
|---|---|
| నాగార్జున సాగర్ | 271.25 |
| శ్రీపాద ఎల్లంపల్లి | 163.51 |
| ఉస్మాన్ సాగర్ | 18.40 |
| హిమాయత్‌సాగర్ | 10.45 |
| సింగూర్, మంజీరా | 109.48 |

**ప్రాంతాల వారీగా నీటి సరఫరా ఇలా..**

| ప్రాంతం | ఎంజీడీ |
|---|---|
| కోర్‌సిటీ | 235.05 |
| జీహెచ్‌ఎంసీ శివారు | 203.98 |
| ఓఆర్‌ఆర్ | 61.26 |
| ట్రాన్స్‌మిషన్ డివిజన్ | 41.80 |
| ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ | 31.00 |

### సూక్ష్మ పర్యవేక్షణతో నీటి సర్దుబాటు

ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. వేసవిలో నీటిఎద్దడి సమస్య ఉండదు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇప్పటి నుంచే భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటిని సర్దుబాటు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. సూక్ష్మ పర్యవేక్షణ చేపట్టి నీటి సరఫరాలో వృథాకు అడ్డుకట్టవేస్తాం. ట్యాంకర్ల తాకిడిని అధిగమించేందుకు ఫిల్టర్ పాయింట్లను పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



-అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

## కుప్పకూలిన నాలాను పరిశీలించిన మేయర్

**అబిడ్స్:** గోషామహల్ ప్రధాన రహదారిలో కుప్పకూలిన నాలాను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఆమె వెంట ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో పాటు జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయానికి చెందిన అధికారులు ఉన్నారు. వెంటనే నాలాకు మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కూలిన నాలా స్థానంలో పదహారు మీటర్ల వరకు పైకప్పు నిర్మించేందుకు రూ.2 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదనలు పంపినట్లు 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. కాగా, మేయర్ విజయలక్ష్మికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా స్థానికులు నినాదాలు చేశారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానాను నిర్మించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ నిరసన తెలిపారు.

## ఉమ్రా యాత్రికులకు స్వాగతం

**శంషాబాద్:** ఉమ్రా యాత్ర పూర్తి చేసుకున్న యాత్రికులు బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఏభై మంది యాత్రికులు ఇరవైరోజుల కిందట ఉమ్రాకు వెళ్లారు. తిరిగి వచ్చిన సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వారికి విమానాశ్రయంలో స్వాగతం పలికి సత్కరించారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

## క్యూ ఫ్లీట్‌తో ఎంబీఎస్‌ఐ భాగస్వామ్యం

**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని ప్రయాణికులకు రవాణా సమస్యలను పరిష్కరించడంలో సీఎన్‌జీ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని క్యూ ఫ్లీట్ అధినేత వినోద్ కుమార్ వర్మ తెలిపారు. ప్రముఖ రైడ్ హెయిలింగ్ సంస్థ క్యూ ఫ్లీట్, షేర్ మొబిలిటీ రంగంలో వాహన నిర్వహణ సేవలందిస్తున్న మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా (ఎంబీఎస్‌ఐ) సంయుక్త భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని క్యూ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మారుతి వ్యాగన్ ఆర్ (సీఎన్‌జీ) వాహనాల విస్తరణను వెల్లడించారు. ఇందులో భాగంగా 51 వాహనాలతో మొదటి బ్యాచ్‌ను అధికారికంగా ప్రారంభించారు.

# విద్యతోనే మనిషికి వికాసం: సీతక్క


వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

**నాంపల్లి:** విద్యతోనే మనిషికి వికాసం చేకూరుతుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో విద్యాధన్ అనే స్వచ్ఛంద సంస్థ 25వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే విద్యా హక్కు చట్టం వచ్చిందని గుర్తు చేశారు. విద్యను ఎవరూ దోచుకోలేరని, పంచుకుంటేనే విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. పదో తరగతి తర్వాత పదేళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపానని, బయటకు వచ్చినంక తిరిగి విద్యార్థిగా చదువును కొనసాగించానని సీతక్క చెప్పారు. పట్టుదలతో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశానన్నారు. అందరికి అందాల్సిన విద్యలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువలు, మానవ సంబంధాలను పటిష్ఠం చేసే విద్యను ప్రోత్సహించాలని కోరారు. పేదలకు విద్యను అందించే విద్యాధన్ ఫౌండేషన్‌కు ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.

# గాంధీ వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

**లంగర్‌హౌస్:** మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని లంగర్ హౌస్‌లోని బాపూఘాట్‌లో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బాపూ సమాధి, బాపూఘాట్ ప్రాంతాలను పూలతో సిద్ధం చేశారు. గురువారం ఉదయం 10.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బాపూ సమాధి వద్ద నివాళులు అర్పించనున్నారు. అనంతరం ధ్యానమందిరానికి వెళ్లి అక్కడ సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి 11 గంటలకు సామూహిక మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటిస్తారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం బాపూఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. అటు ప్రముఖులకు కానీ, కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకుకానీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట గోల్కొండ తహసీల్దార్ అహల్య, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


బాపుఘాట్‌లో పర్యటిస్తున్న కలెక్టర్

# 1న తాగునీటి సరఫరాకు అంతరాయం



**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని పలు ప్రాంతాల్లో ఫిబ్రవరి 1న తాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాసర్లపల్లి సబ్ స్టేషన్‌లోని 132 కేవీ బల్క్‌లోడ్ ఫీడర్ పీటీ మరమ్మతులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఫలితంగా నగరంలోని మీరాలం, కిషన్‌బాగ్, అల్జుబైల్ కాలనీ, శాస్త్రిపురం, సంతోష్‌నగర్, వినయ్‌నగర్, సైదాబాద్, చంచల్‌గూడ్, ఆస్మాన్‌గఢ్, యాకుత్‌పురా, మాదన్నపేట్, మహబూబ్‌మాన్షన్, భోజగుట్ట, షేక్‌పేట్, బొగ్గులకుంట, అఫ్జల్‌గంజ్, ఆళ్లబండ, నారాయణగూడ, అడిక్‌మెట్, శివం రోడ్, చిలకలగూడ, జూబ్లీ హిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖానా, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, రియాసత్ నగర్, ఆలియాబాద్, మైసారం, బండ్లగూడ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుంది. అలాగే హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, సాహెబ్ నగర్, వైశాలినగర్, అల్కాపురి, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, మహేంద్రహిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కానగర్, దేవేందర్ నగర్, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావురి హిల్స్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమా నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, హార్డ్ వేర్ పార్క్, ధర్మసాయి, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జున నగర్, మానిక్ చంద్, చెంగిచెర్ల, భరత్ నగర్, ఆనంద్‌నగర్ క్రాస్ రోడ్స్, పీర్జాదిగూడ, మీర్‌పేట్, కుర్మగూడ, లెనిన్ నగర్, బడంగ్‌పేట్ తదితర ప్రాంతాల్లో కూడా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

## చెత్త వాహనమే పొత్తిళ్లుగా...

అమ్మప్రేమ అక్షరాలకు అందుతుందా.. అందదు! అమ్మ అనురాగం కంటే తియ్యని రాగం ఉంటుందా.. ఉండదు! అని చెప్పడానికి ఈ చిత్రమే సజీవ సాక్ష్యం. ఆ పాప.. అమ్మ కంటిపాప! అమ్మ.. ఆ పాప కంటి వెలుగు! అమ్మ పొత్తిళ్లలో ఆనందంగా గడపాల్సిన చిన్నారి.. దుర్గంధభరిత చెత్త వాహనంలోని ఉయ్యాలలో సేదతీరుతోంది. మబ్బుల్లో లేచి పొద్దుతో పోటీ పడుతూ ఇంటింటా చెత్తను సేకరించే ఆ దంపతులు తమ పసిపిల్లలను కూడా చెత్త వాహనంలోనే తీసుకెళ్తున్న దృశ్యం బుధవారం బంజారాహిల్స్‌లో 'సాక్షి'కెమెరాకు చిక్కింది. ఇంటి పట్టున పిల్లల ఆలనాపాలన లేక వారిని తమ వెంటే తీసుకెళ్తున్నారు ఈ పారిశుధ్య కార్మిక దంపతులు. వాహనంలోపలే ఇలా చీరతో ఉయ్యాల కట్టి లాలిస్తూ తమ పని తాము చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



– బంజారాహిల్స్

## నేడు మాంసం దుకాణాలు బంద్

**సాక్షి, సిటీబ్యూరో:** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని స్లాటర్‌హౌస్‌లు, మాంసం, గొడ్డుమాంసం విక్రయ దుకాణాలు మూసివేయనున్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు.

## ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మార్పులు

**నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ**

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025లో అధికారులు మార్పులు చేశారు. గురువారం(నేడు) నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రవేశ పరీక్ష, అర్హత మార్కులు వంటి అంశాల్లో మార్పులు చేసినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఇంతకు ముందు రాత పరీక్షకు 70 మార్కుల ప్రశ్నపత్రం ఉండగా, తాజాగా దానిని 100 మార్కులకు మార్చినట్లు చెప్పారు. అర్హత మార్కులను ఓసీలకు 45 శాతం, బీసీలకు 40, ఎస్సీ, ఎస్టీలకు 35 శాతంగా స్టాండింగ్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. జ

## మట్టిపాత్రల తయారీపై వర్క్‌షాప్

**సాక్షి, సిటీబ్యూరో:** సాంకేతిక యుగంలో మట్టిపాత్రలు కనుమరుగైపోతున్నాయి. వాటి వాడకం తగ్గిపోతోంది. తరతరాల ఈ సంప్రదాయాన్ని నిలబెట్టుకునేందుకుగాను పలు సంస్థలు ముందుకు వచ్చాయి. ఇందులో భాగంగా మట్టిపాత్రల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాయి. స్టూడియో మైరా అనే సంస్థ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 9 వరకు మట్టిపాత్రల తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. పాత్రల తయారీకి అవసరమైన అన్ని రకాల ముడిసరుకును నిర్వాహకులే అందిస్తారు. వర్క్‌షాపులో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు గంటలపాటు సమయం కేటాయిస్తారు. శిక్షణలో తయారు చేసిన మట్టిపాత్రలను ఎవరివి వారు ఇంటికి తీసుకెళ్లవచ్చు. ఐదేళ్ల పైబడినవారు ఎవరైనా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చు.

## త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం



**మాదాపూర్:** కళాకారులు సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాన్ని ప్రారంభించారు. సంస్కృతి ఫౌండేషన్ 5 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని సంగీత చూడామని విదూషి హరిప్రియ జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాన్ని ప్రారంభించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహించనున్న మ్యూజిక్ ఫెస్టివల్‌లో ప్రతిరోజూ సంగీత కచేరీలు, నాట్య ప్రదర్శనలను నిర్వహించనున్నారు. విద్వాన్ నిహాల్ గాత్ర కచేరి, విద్వాన్ వైద్యనాథన్ బాలసుబ్రమణియ గాత్రం శ్రోతలను ఆకట్టుకుంది. వయోలిన్ విద్వాన్ అనంతసౌరిరాజన్, మృదంగం విద్వాన్ డాక్టర్ పరవస్తూర్ శ్రీనివాసగోపాలన్, కంజీర విద్వాన్ కృష్ణప్రకాశ్ వాద్యసహకారాన్ని అందించారు.

## సిర్పూర్ పేపర్ మిల్లులో 'సీక్రెట్ బ్యాలెట్' నిర్వహించాలి


కార్మిక శాఖ ఉపకమిషనర్ నీలమ్మకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నేత భూపాల్

**చిక్కడపల్లి:** సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపునకు సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో ఉపకమిషనర్ నీలమ్మకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యంతో చర్యలు జరిపి పరిష్కారానికి కృషి చేసే సంఘాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులే కమిటీగా ఏర్పడి యాజమాన్యానికి విన్నవించినా పూర్తిస్థాయిలో పరిష్కరించడంలేదన్నారు. ఉద్యోగ భద్రత లేక కార్మికులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కుశన్న రాజన్న, మధు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడి

**యువకుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు**

**జిన్నారం (పటాన్‌చెరు):** బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లాకు చెందిన కడారి తరుణ్ (20) బతుకుదెరువు కోసం బొల్లారానికి వలసొచ్చి ఇక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఓ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 30, జనవరి, 2025

విభిన్నమైన ఆహార పదార్థాలకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్... ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను చారిత్రక విశేషాల ద్వారా మాత్రమే కాకుండా చవులూరించే ఘుమఘుమల ద్వారా కూడా ఆకర్షిస్తోంది. అలా వచ్చి వెళ్లేవారు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్న అనుభవాలు పలువుర్ని ఆకట్టుకుంటున్నాయి. సిటీ రుచులకు సంబంధించి ఉన్న అభిప్రాయాలపై చర్చోపచర్చలకు దారి తీస్తున్నాయి.
సాక్షి సిటీబ్యూరో

హ్యూ అబ్రాడ్, స్కాట్‌లాండ్




# రుచుల రివ్యూ..
# సిటీకి క్యూ
## నగరానికి వస్తున్న విదేశీయులకు సిటీ ఫుడ్‌పై ఆసక్తి

- సోషల్ మీడియాలో సిటీ వంటకాలపై పోస్టులు
- నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్న రివ్యూలు.. చర్చోపచర్చలు
- తాజాగా తన రివ్యూల ద్వారా ఆసక్తి రేపిన స్కాట్‌లాండ్‌వాసి

నగరానికి ఉన్న గొప్ప వంటల వారసత్వం పుణ్యమాని.. మొఘలాయ్, తెలుగు హైదరాబాదీ రుచులను మిళితం చేసిన సిటీ ఫుడ్ వెరైటీ రుచులను ఇష్టపడే ఎవరికైనా ప్రత్యేకమైన అనుభవాన్ని అందిస్తుంది. బిర్యానీల నుంచి ఇరానీ చాయ్ వరకు, బిస్కెట్ల నుంచి డబుల్ కా మీఠా వరకూ.. ఆహార ప్రియులకు హైదరాబాద్ స్వర్గధామం. ఈ నేపథ్యంలో నగరాన్ని సందర్శించే చాలా మంది విదేశీ సందర్శకులు సిటీ ఫుడ్‌ని ఎంజాయ్ చేయడం సోషల్ మీడియాలో స్పందనను పంచుకోవడం కూడా పరిపాటిగా మారింది.

### స్కాట్‌లాండ్ సే ఆయే మేరా దోస్త్..

సాధారణంగా నగరాన్ని సందర్శించే విదేశీయులు మన రుచుల్ని పొగుడుతూనో, లేదా అరుదుగా బాగోలేదు అనో ఒక్క ముక్కలో తేల్చేస్తారు. అయితే తాజాగా ఒక (స్కాట్‌లాండ్) స్కాటిష్ ట్రావెలర్ మాత్రం భిన్నంగా స్పందించి సోషల్ మీడియాలో తన పోస్ట్‌ల ద్వారా సిటీ ఫుడీస్‌ని ఆకర్షించాడు. స్కాటిష్ అయిన హ్యూ అబ్రాడ్ అనే విదేశీయుడు నగరాన్ని సందర్శించాడు. నగర ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన ప్రసిద్ధ వంటకాలు రుచి చూశాడు. అనంతరం వీటిని అందిస్తున్న హోటల్స్ రెస్టారెంట్స్‌పై తనదైన రీతిలో వీడియో పోస్టులు చేశాడు. అయితే ఇవి ఏదో యథాలాపంగా చేసినట్టు కాకుండా ఈ పోస్టులు చాలా వరకూ వాస్తవానికి దగ్గరగా ఉన్నాయంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

### రేటింగ్స్ సైతం..

హ్యూ అబ్రాడ్ తన వీడియోలలో హోటల్ షాదాబ్‌లో అందించే ప్రసిద్ధ హైదరాబాదీ బిర్యానీని తాను రుచి చూసినట్లు తెలిపాడు. ఆ రుచి అమోఘం అంటూ మెచ్చుకుని షాదాబ్ బిర్యానీకి 10/10 రేటింగ్ ఇచ్చాడు. అదే సమయంలో అనేక మంది ఇష్టంగా తినే నిమ్రా కేఫ్‌లోని ఉస్మానియా బిస్కెట్ రుచిని మాత్రం తీసిపారేశాడు. అదొక 'డ్రై'గా అతను పోస్ట్‌లో పేర్కొన్నాడు. అలాగే షహ్రాన్ హోటల్ కబాబ్‌ల కోసం మొజాంజాహీ మార్కెట్‌ను సందర్శించాడు. అక్కడి బోటీ, కబాబ్ రుచికరమైందిగా అంటూనే.. అందులో ఒక కబాబ్ ముక్కలో వైర్‌ను కనుగొనడంతో తానిచ్చే రేటింగ్ నుంచి ఒక పాయింట్ తగ్గించాడు. అదేవిధంగా మొజాంజాహీ మార్కెట్‌లోని ఒక దుకాణంలో పిస్తా ఐస్‌క్రీమ్‌ను కూడా టేస్ట్ చేసి 'నేను ఇప్పటి వరకు రుచి చూసిన వాటిలో అత్యంత నకిలీ పిస్తా' ఇది అంటూ విమర్శించాడు. రుచి అతి కృత్రిమంగా ఉందని దానికి 3/10 రేటింగ్ ఇచ్చాడు. ఇంకా ఇరానీ చాయ్, బిస్కెట్లు, బుర్హాన్‌పూర్ ఖోవా జిలేబి, మిలన్ జ్యూస్ సెంటర్‌లోని షెహదూద్ మలై ఇంకా ఇతర స్ట్రీట్ ఫుడ్స్‌పై కూడా రివ్యూ అందించాడు.



### లైక్స్.. కామెంట్స్..

స్కాట్‌లాండ్‌వాసి హ్యూ అబ్రాడ్ పోస్టులకు నగరవాసుల నుంచి మంచి స్పందన లభించింది. అనేక మంది ఈ వీడియోలను లైక్ చేశారు. అంతేకాకుండా ఆ వీడియోల శ్రేణి హైదరాబాదీల మధ్య పరస్పరం చర్చకు సైతం దారి తీసింది. చాలామంది స్థానికులు ఆ పోస్టుల్లో నిజాయితీ ఉందని ప్రశంసించారు. అయితే కొందరు మాత్రం అతను నగరంలోని మరింత ఉత్తమమైన, మరింత ప్రమాణాలు పాటించే ఆహార కేంద్రాలను సందర్శించలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొందరు సిటీ వంటకాల నిజమైన సారాన్ని అందించే మరికొన్ని వంటలు, వాటి చిరునామాలను సూచించారు. అంతేకాదు స్థానిక భాషలో విక్రేతలతో ఎలా సంభాషించాలనే దానిపై చిట్కాలను కూడా అతడికి అందించారు. ఏదేమైనా మన రుచులపై విదేశీయుల అభిప్రాయాలకు దక్కుతున్న స్పందనకు స్కాటిష్ టూరిస్ట్ పోస్టులు అద్దం పట్టాయని చెప్పొచ్చు.




ఇలాగే రివ్యూలను, రేటింగ్స్‌ను





## 8న సోనూ నిగమ్.. షో

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంగీతాభిమానుల్ని అలరించేందుకు మరో భారీ సంగీత కార్యక్రమం అందుబాటులోకి వస్తోంది. బాలీవుడ్ సీనియర్, టాప్ సింగర్ సోనూ నిగమ్ నగరంలో సంగీత ప్రదర్శనలో పాల్గొననున్నారు. అభి ముఝే మే కహీ, ముఝుసే షాదీ కరోగీ వంటి పాటల ద్వారా ఎప్పటికీ గుర్తుండే ఈ నటగాయకుడు.. తన లైవ్ పెర్ఫార్మెన్స్ ద్వారా సిటీలోని బాలీవుడ్ మ్యూజిక్ లవర్స్‌ని ఉర్రూతలూగించనున్నారు. వచ్చే నెల 8వ తేదీన గచ్చిబౌలిలోని ది లీగ్ ఆవరణలో సోనూ నిగమ్ ప్రదర్శన ఉంటుంది.




## బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్‌కి తమన్నా

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ డిజైనింగ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌డీసీఐ) సహకారంతో.. బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ మరోసారి సిద్ధమవుతోంది. ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటూ దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో సందడి చేసే వార్షిక ఫ్యాషన్ టూర్ కోసం ఎంపికైన డిజైనర్లు, సెలబ్రిటీల జాబితాను సంస్థ విడుదల చేసింది. దాని ప్రకారం.. తరుణ్ తహిల్యానీ, కనికా ఘోయల్, అక్షితా భన్సాల్ తదితర డిజైనర్లు, అలాగే జాక్వలిన్ ఫెర్నాండెజ్, తమన్నా భాటియా, టైగర్ ష్రాఫ్ తదితర టాప్ సెలబ్రిటీలతో కలిపి దాదాపుగా 70 మంది ప్రముఖులు ఈ టూర్‌లో భాగం పంచుకుంటున్నారు. తొలి ఈవెంట్‌ను ఇటీవలే దివంగతులైన ఫ్యాషన్ దిగ్గజం రోహిత్‌బాల్‌కు అంకితం చేస్తున్నారు.



## మరింత స్పైసీగా..

సాక్షి, సిటీబ్యూరో: చికెన్ ప్రియుల కోసం సరికొత్త ఫ్రైడ్ చికెన్ రుచులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెక్‌డోనాల్డ్స్ రెస్టారెంట్ తెలిపింది. ఇందులో భాగంగా ఫ్రైడ్ చికెన్, ఎంసి స్పైసీ పేరుతో ఘోస్ట్ పెప్పర్‌పై వేడి చేసి అందిస్తున్నామని, అలాగే ప్రత్యేక మసాలా దినుసులు దట్టించిన స్పైసీ చికెన్ వింగ్స్, క్రిస్పీ ఫ్రైడ్ చికెన్ వెరైటీలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించింది.

## అంతరిక్షంలో.. హైదరాబాద్


- ఇస్రో ప్రయోగాల్లో హైదరాబాద్ ఉత్పత్తులు
- నిన్నటి ఎన్‌వీఎస్-02 ప్రయోగంలోనూ భాగస్వామ్యం
- శాటిలైట్ బ్యాటరీ రక్షక కవచాలను తయారు చేస్తున్న 'నాగసాయి'
- చంద్రయాన్-4, గగన్‌యాన్ ప్రాజెక్టులకు సైతం సన్నద్ధం
- ఇస్రో ఆధ్వర్యంలోని 55 ప్రాజెక్టులకు శాటిలైట్ ఉత్పత్తుల తయారీ



సాక్షి, సిటీబ్యూరో: భారతదేశ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఆధ్వర్యంలో శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి విజయవంతంగా ప్రయోగించిన ప్రతిష్టాత్మక 100వ ప్రాజెక్ట్ ఎన్‌వీఎస్-02. బుధవారం ఉదయం ప్రయోగించిన ఈ రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోని దూసుకెళ్లింది. ఎన్‌వీఎస్ సిరీస్‌లో ఈ ప్రయోగం రెండోది కాగా మరో మూడింటిని సిద్ధం చేస్తున్నారు. ఇస్రో చేపట్టిన ఈ ప్రాజెక్టులో నగరంలోని నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తయారు చేసిన ఉత్పత్తులను వినియోగించడం విశేషం. ఈ శాటిలైట్‌లో వినియోగించే అతి సున్నితమైన లిథియం అయాన్ గ్లాజు బ్యాటరీలను సురక్షితంగా అమర్చే 'స్లీవ్స్'ను నాగసాయి ప్రెసిషియన్ సంస్థ తయారు చేసిందని సంస్థ వ్యవస్థాపకులు బీఎన్.రెడ్డి(బొమ్మారెడ్డి నాగభూషణరెడ్డి) తెలిపారు. అయితే ఇస్రో చేపట్టిన ప్రాజెక్టుల్లో నాగసాయి ప్రెసిషియన్ భాగస్వామ్యం అందించిన ప్రాజెక్టుల్లో ఈ ఎన్‌వీఎస్-02 ప్రయోగం 55వది కావడం విశేషం.

- శ్రీహరికోట నుంచి ప్రయోగించిన ఎన్‌వీఎస్ శాటిలైట్‌లో సోలార్ ఆధారంగా బ్యాటరీలు చార్జ్ అవుతాయి. ఈ విద్యుత్ శక్తితో శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ కమ్యూనికేషన్ వ్యవస్థ ఆధారంగానే అంతరిక్షంలోని విషయాలు మనకు చేరుతాయి. ఈ ప్రాజెక్టులో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీలు చాలా సున్నితమైనవి, సంక్లిష్టమైనవి. వేగంగా దూసుకెళ్లే రాకెట్ వైబ్రేషన్లను సైతం సమన్వయపరుస్తూ బ్యాటరీలను సురక్షితంగా, స్థిరంగా అమర్చడం క్లిష్టమైన వ్యవహారం. వీటిని అమర్చే స్లీవ్స్ బాడీ(రక్షణ కవచాలు)ని నగరంలో తయారు చేస్తున్నారు. దీనికి వినియోగించే ముడిపదార్థాలను ఇస్రో నియమాలకు అనుగుణంగా నాగసాయి కొనుగోలు చేసి తయారు చేసి ఇస్రోకు పంపిస్తుంది. వీటిని బెంగళూరు వేదికగా ధూళిసైతం చేరని ప్రత్యేక పరిశోధనా కేంద్రం(బ్యాటరీ డివిజన్)లో బిగించి అక్కడి నుంచి శ్రీహరి కోటకు పంపిస్తారు. ప్రయోగానికి ముందు శాటిలైట్‌లోని అన్ని భాగాలను రెండుసార్లు తనిఖీ చేస్తే ఈ స్లీవ్స్‌ను మాత్రం మూడుసార్లు (ఎన్‌డీపీ మైక్రో టెస్టింగ్) తనిఖీ చేస్తారు.


అంతరిక్షంలోకి పంపిన ఉత్పత్తులు



### 55 ఇస్రో ప్రాజెక్టుల్లో ప్రాతినిధ్యం

1998లో మొదటి భారతీయ సాంకేతికతతో ప్రయోగించిన ఇన్‌శాట్ 2 ఈ ప్రాజెక్టులో భాగంగా ఇస్రోతో మా సంస్థ ప్రయాణం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 55 ఇస్రో ప్రాజెక్టుల్లో మా ప్రాతినిధ్యం ఉంది. ఈ ప్రయోగం కోసం స్లీవ్స్ బాడీని 3 నెలల్లో తయారు చేశాం. ఎన్‌వీఎస్ సిరీస్‌లో ఎన్‌వీఎస్-01, ప్రస్తుత ఎన్‌వీఎస్-02లో నాగసాయి భాగస్వామ్యముంది. ఎన్‌వీఎస్-03 కోసం కూడా ఉత్పత్తులను సిద్ధం చేశాం. మరో వారం రోజుల్లో వాటిని ఇస్రోకు పంపించనున్నాం. దీనిని ఏప్రిల్-మే నెలలో ప్రయోగించే అవకాశముంది. ఈ సిరీస్‌లో 04, 05 ప్రయోగాలు కూడా ఉన్నాయి. వాటికి ఇంకా అనుమతి అందలేదు. వీటితో పాటు ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్ బ్యాటరీలను అమర్చే అల్యూమినియం స్టాండ్స్, నాసిల్స్, స్లీవ్స్‌ను సమకూర్చాం. చంద్రయాన్ 4కు అవసరమైన ఉత్పత్తులను సైతం సిద్ధం చేస్తున్నాం. భారతీయ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గగన్‌యాన్‌లో సైతం కీలక పాత్ర పోషిస్తున్నాం. జీఎస్ఎల్వీ, డీఆర్‌డీఎల్‌కు కూడా సేవలందించాం. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)తో కలిసి పని చేయడంతో పాటు ఏరోస్పేస్, యుద్ధ విమానాల విడిభాగాల తయారీలో కృషి చేస్తున్నాం. టూల్స్ డిజైనింగ్ ఇంజినీరింగ్, ఏరో డైనమిక్స్‌లో నాకున్న అనుభవం ఈ 55 ప్రాజెక్టుల్లో పనిచేయడానికి అవకాశం లభించింది. – బీ.ఎన్.రెడ్డి

## కొత్త ఆలోచనలకు అవకాశాలు బోలెడు

సినీ దర్శకుడు వేణు ఊడుగుల





చార్మినార్: కొత్త ఆలోచనలు, ప్రయోగాలకు సినిమా రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, సిటీ కాలేజీ విద్యార్థుల్లో అలాంటి ప్రతిభ ఉందని సినిమా దర్శకుడు వేణు ఊడుగుల తెలిపారు. సిటీ కాలేజీ సినిమా క్లబ్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్స్ ప్రివ్యూ సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఒక ప్రైవేటు యూనివర్సిటీకి అతిథిగా వెళ్లినా రాని సంతృప్తి సిటీ కాలేజీ విద్యార్థుల సినిమాలు చూస్తే కలిగిందని చెప్పారు. తమకు అందుబాటులో ఉన్న పరికరాలతోనే విభిన్నమైన కాన్సెప్టులతో షార్ట్ ఫిల్మ్స్ తీయడం ప్రశంసనీయం అన్నారు. 'ఇరువురి ప్రయాణం', 'స్క్రిప్ట్' చిత్రాలను రూపొందించిన గిరీష్, మురళికి మంచి భవిష్యత్తు ఉందని కితాబిచ్చారు. సినిమా క్లబ్ విద్యార్థులకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, సూచనలు, సలహాలు అందిస్తానని చెప్పారు. తన సినిమా లొకేషన్స్ కోసం సిటీ కాలేజీకి పూర్వం వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, వారసత్వ కట్టడమైన కాలేజీ భవనంలో ఎటు చూసినా చిత్రీకరణకు అనుకూలమైన వాతావరణం ఉంటుందని అన్నారు. సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మాట్లాడుతూ.. సిటీ కాలేజీ సినిమా క్లబ్ ఏడాది క్రితం ఏర్పాటైనప్పటి నుంచి స్క్రిప్ట్, డైరెక్షన్, నటన, కెమెరా వంటి అన్ని రంగాల్లో విద్యార్థుల ఆసక్తిని అధ్యాపకులు గుర్తించారన్నారు. క్లబ్ కన్వీనర్ డా.చిత్తరంజన్ పర్యవేక్షణలో విద్యార్థులకు తగిన తర్ఫీదు అందిస్తూ సృజనాత్మకతకు దిశానిర్దేశం చేస్తూ మొత్తం ఆరు షార్ట్ ఫిల్మ్స్ రూపొందించారన్నారు. డా.విప్లవ్ దత్ శుక్లా, డా.జె.నీరజ, డా.కోయి కోటేశ్వర రావు, డా.ఝాన్సీల సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో నామమాత్రపు రుసుముకు టికెట్ కొని విద్యార్థులు, అధ్యాపకులు సినిమాలు వీక్షించారు.

## క్లుప్తంగా...

### ఇస్రోకు సీఎం అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ఇస్రో తన 100వ రాకెట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై సీఎం ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జీఎస్ఎల్‌వీ–ఎఫ్15ను ప్రయోగించడం ద్వారా.. ఎన్‌వీఎస్–02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఘనతను సాధించడం దేశానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.

### అంతరిక్ష పరిశోధనలకు గేట్‌వే: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: శ్రీహరికోట నుంచి వందో రాకెట్ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) బృందానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. దేశం కోసం ఇస్రో భవిష్యత్‌లో చేపట్టే ప్రయోగాలన్నీ కూడా విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. భారత అంతరిక్ష పరిశోధనలకు గేట్‌వేగా మారిన శ్రీహరికోట ఏపీలో ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. ఇస్రో వందో ప్రయోగం చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### సాయానికి సిద్ధం
**కుంభమేళా తొక్కిసలాటపై సీఎం రేవంత్**

సాక్షి, హైదరాబాద్: మహాకుంభమేళా దుర్ఘటనలో అవసరమైన సాయం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలను కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడినవారికి సరైన వైద్యం అందించాలని సీఎం కోరారు.

### కుంభమేళా మరణాలపై కేసీఆర్, బండి సంతాపం

సాక్షి, హైదరాబాద్: కుంభమేళాలో భక్తుల మరణాల పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ సంతాపం ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కల్వకుంట్ల కవిత వేర్వేరు ప్రకటనల్లో కుంభమేళా తొక్కిస లాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలతో హరీశ్‌కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న సీహెచ్.ద్వారకా తిరుమలరావు గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్‌కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. కాగా ఈ నెల 31న రిటైర్ కానున్న సీహెచ్.ద్వారకా తిరుమలరావును ఆర్టీసీ ఎండీగా నియమిస్తూ (రీఎంప్లాయ్‌మెంట్ కల్పిస్తూ) ప్రభుత్వం విడిగా మరో ఉత్తర్వు జారీ చేసింది.

### అవి.. అటవీ భూములు కావు

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- బాబు డైవర్షన్ పాలిటిక్స్.. రాజకీయ ప్రత్యర్థులపై వేధింపులు
- అందులో భాగంగానే మాపై భూకబ్జా ఆరోపణలు
- 75 ఎకరాల ప్రైవేటు భూమిని 2001లో కొనుగోలు చేశాం
- అది అటవీ భూమి కాదని 1981లోనే డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్స్ నిర్ధారించింది.. టీడీపీ, కాంగ్రెస్ హయాంలో రెండుసార్లు రెవెన్యూ, అటవీశాఖల సర్వేలోనూ అదే తేలింది
- ఈనాడు, ఈటీవీపై పరువునష్టం దావా వేస్తాం



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### ఆర్టీసీకి మరో 1000 బస్సులు: పొన్నం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ కొత్త గా 1000 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘం ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర కమిటీ బుధవారం మంత్రితో భేటీ అయ్యింది. మంత్రి మాట్లాడుతూ 600 బస్సులను మహి ళా సంఘాల ద్వారా కొంటున్నట్టు వెల్లడించారు. 3,038 ఉద్యోగ నియామకాలకు ప్రభు త్వం అనుమతించిందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. సంఘాలు తమ మనుగడ కోసం.. సమ్మె నోటీసులు ఇచ్చి, కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 2 కి.మీ. నిడివి రూ.332 కోట్ల వ్యయం

**మానేరుపై భారీ రైలు వంతెన** | మనోహరాబాద్ –కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల సమీపంలో మానేరునదిపై 2.4 కిలోమీటర్ల పొడవుతో భారీ రైలువంతెన నిర్మించనున్నారు. ఇందుకు రూ.332 కోట్లు ఖర్చు కానుంది. కరీంనగర్ పట్టణాన్ని సిద్దిపేట మీదుగా హైదరాబాద్‌తో నేరుగా అనుసంధానించే మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టులో భాగంగా ఈ వంతెన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం గోదావరి నదిపై పెద్ద వంతెనలున్నాయి. ఇప్పుడు మానేరుపై నిర్మించే ఈ వంతెన వాటి సరసన చేరనుంది.

**విజయవాడ రైలు వంతెన తరహాలో..**

కృష్ణానదిపై విజయవాడ వద్ద నిర్మించిన రైలు వంతెన తరహాలో ఇనుప గర్డర్లతో దీన్ని రూపొందించబోతున్నారు. రైళ్లు వేగంగా వెళ్లినప్పుడు ఏర్పడే కంపన ప్రభావం పిల్లర్లపై పెద్దగా ప్రభావం చూపకుండా ఇనుప గర్డర్లు అడ్డుకుంటాయి. దీంతో ఈ డిజైన్‌కు మొగ్గు చూపారు.

**భారీ వరద పోటెత్తినా ఇబ్బంది కానిరీతిలో..**

మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట వరకు రైలు సేవలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సిద్దిపేట–సిరిసిల్ల మధ్య పనులు జరుగుతున్నాయి. రైలు సిరిసిల్లకు చేరుకోవాలంటే మానేరు నదిని దాటాలి. సిరిసిల్ల శివారులో రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నారు. అక్కడకు చేరుకునే మార్గానికి కేవలం 10 కి.మీ. దూరంలో మిడ్ మానేరు జలాశయం ఉంది. దీంతో అక్కడ బ్యాక్ వాటర్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వానాకాలంలో నీటి నిల్వ పెరిగి నది మరింత వెడల్పుతో ప్రవహిస్తుంది. గతంలో గరిష్ట నీటిమట్టాన్ని పరిగణనలోకి తీసుకుని అంతకంటే ఎక్కువ నీళ్లు చేరినా రైలు మార్గానికి ఇబ్బంది కాని రీతిలో వంతెనకు డిజైన్ చేశారు. దీంతో 2.4 కి.మీ. నిడివితో నిర్మించాలని నిర్ణయించారు. నదీతీరంలో ఉన్న గోపాలరావుపల్లి వద్ద వంతెన నిర్మాణం ప్రారంభమై.. సిరిసిల్ల వైపు అనుపురం గ్రామపరిధిలో ల్యాండ్ అవుతుంది.

**120 కి.మీ. వేగంతో రైలు ప్రయాణించేలా..**

సాధారణంగా వంతెనలపై రైళ్ల వేగాన్ని కనిష్ట స్థాయికి కుదిస్తారు. ప్రయాణికుల రైళ్లు గంటకు 120 కి.మీ.వేగంతో దూసుకుపోయినా ఇబ్బందికాని విధంగా ఈ వంతెన నిర్మించనున్నారు. అయితే సరుకు రవాణా రైళ్ల గరిష్ట వేగాన్ని 65 కి.మీ.కు అనుమతిస్తారు.

**ఆంగ్ల అక్షరం 'ఎస్'ఆకృతిలో..**

ఈ వంతెన ఆంగ్ల అక్షరం 'ఎస్'ఆకృతిలో మలుపుతో ఉంటుంది. వంతెన నిర్మించే ప్రాంతంలో కొంతభాగం అటవీ ప్రాంతం అలైన్‌మెంట్‌లోకి చొచ్చుకొచ్చింది. మరోవైపు గుట్టలున్నాయి. దీంతో వాటిని తప్పిస్తూ ఎస్ ఆకృతిలో డిజైన్ చేశారు.

**వెంటనే పనులు..**

వంతెన పనులను వెంటనే ప్రారంభించేలా దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలిచింది. గతంలో ఈ సెక్షన్ మధ్యలో భూ పరిహార మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో డిపాజిట్ చేయలేదు. దీంతో పనుల్లో జాప్యం జరిగింది. ఇటీవల ఆ మొ త్తం చెల్లించటంతో పనులు జరుగుతున్నాయి. ఇక మానేరు నది అవతల సిరిసిల్ల నుంచి కరీంనగర్ (కొత్తపల్లి) వరకు భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. పరిహారం మొత్తం రూ.40 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల వద్ద డిపాజిట్ చేయలేదు. దీంతో భూమి రైల్వే ఆధీనంలోకి రాలేదు. ఫలితంగా అక్కడ టెండర్లు కూడా పిలవలేదు. దీంతో ప్రాజెక్టు అనుకున్న సమ యంలో పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో మిగ తా పనులతో ప్రమేయం లేకుండా వంతెన భా గాన్ని వేగంగా నిర్మించి, ప్రాజెక్టులో అపరిమిత జాప్యాన్ని నివారించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. సిరిసిల్ల వైపు లైన్ నిర్మాణం పూర్తయ్యేనాటికి వంతెన సిద్ధమయ్యేలా ప్లాన్ చేస్తోంది. 18 నుంచి 20 నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేయనున్నట్టు పేర్కొంటోంది.

# నాయనమ్మ కళ్లలో ఆనందం చూడాలని

- వడ్లకొండ కృష్ణను హతమార్చిన బుచ్చమ్మ మనవళ్లు
- ఆపై మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి నాయనమ్మకు చూపించిన మనవడు నవీన్
- పరువు హత్య కేసులో ఆరుగురి అరెస్ట్
- నలుగురు నిందితులు ఒకే కుటుంబసభ్యులు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : 'తన మనవరాలు భార్గవి కులాంతర వివాహం చేసుకోవడంతో ఆమె నాయనమ్మ తట్టుకోలేకపోయింది. భార్గవి భర్తను ఎలాగైనా అంతమొందించాలని తన ఇద్దరు మనవళ్లను రెచ్చగొట్టింది'అని పోలీసులు చెప్పారు. సూర్యాపేటలో జరిగిన పరువు హత్య కేసులో పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆ వివరాలు వెల్లడించారు. సూర్యాపేటకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి, పిల్లలమర్రి గ్రామానికి చెందిన కోట్ల నవీన్ స్నేహితులు. కృష్ణ తరచు నవీన్ ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో నవీన్ చెల్లెలు అయిన భార్గవితో కృష్ణకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వీరి పెళ్లికి భార్గవి కుటుంబసభ్యులు అంగీకరించలేదు. భార్గవి, కృష్ణ గత ఏడాది ఆగస్టు 7న నార్కట్‌పల్లి మండలంలోని గోపాలాయిపల్లి గుట్టపై వివాహం చేసుకోగా, భార్గవి తల్లిదండ్రులు సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. పోలీసులు కృష్ణ, భార్గవికి కౌన్సిలింగ్ ఇవ్వగా, తాము మేజర్లమని, ఇష్టపూర్తిగా పెళ్లి చేసుకున్నామని చెప్పారు. కృష్ణ, భార్గవిలు సూర్యాపేటలోనే కాపురం పెట్టారు.

**మహేశ్‌తో కృష్ణ హత్యకు పన్నాగం**

వడ్లకొండ కృష్ణ, సూర్యాపేటకు చెందిన బైరు మహేశ్ స్నేహితులు. దీంతో భార్గవి సోదరులు కోట్ల నవీన్, వంశీలు బైరు మహేశ్ దగ్గరకు వెళ్లారు. కృష్ణను చంపేయాలని, నువ్వే నమ్మించి ఎక్కడికైనా తీసుకురావాలని మహేశ్‌ను కోరారు. అందుకు మహేశ్ ఒప్పుకున్నాడు. కృష్ణ హత్యకు మూడుసార్లు స్కెచ్ వేయగా అది ఫెయిలైంది. ఆ తర్వాత మహేశ్, నవీన్, వంశీలు ఇటీవల కలుసుకొని.. ఈసారి ఎలాగైనా కృష్ణను చంపాలని నిర్ణయించుకున్నారు. వారి ప్లాన్‌లో భాగంగా ఈ నెల 26న ఆదివారం.. ఇద్దరం కలిసి తమ పొలం దగ్గరకు వెళ్దామని మహేశ్ చెప్పగా కృష్ణ అంగీకరించాడు. పథకం ప్రకారం మహేశ్ వెంటనే నవీన్‌కు ఫోన్ చేసి తాము వస్తున్నం .. అలర్ట్‌గా ఉండమని చెప్పాడు. కృష్ణ స్కూటీపై ఇద్దరూ పొలం వద్దకు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే కూర్చున్నారు. అయితే, తనకు మూత్రం వస్తుందని చెప్పి మహేశ్ కొద్ది దూరం వెళ్లి నవీన్‌కు ఫోన్ చేసి, తాను కృష్ణ మెడ అందుకోగానే మీరు రావాలని నవీన్, వంశీకి చెప్పాడు. ఇంటికి వెళ్దామని కృష్ణ స్కూటీని స్టార్ట్ చేయగా, మహేశ్ స్కూటీ వెనకాల ఎక్కి కూర్చున్నాడు. కృష్ణ స్కూటీని కదిలిస్తుండగా మహేశ్.. కృష్ణ మెడ చుట్టూ చేయి వేసి గొంతు నొక్కిపట్టుకున్నాడు. అప్పటికే అక్కడ కంప్లచెట్లలో దాక్కున్న నవీన్, వంశీ పరిగెత్తుకుంటూ వచ్చి కృష్ణను హత్య చేశారు.

**మనవళ్లను రెచ్చగొట్టి...**

భార్గవి కులాంతర వివాహం చేసుకోవడంతో ఆమె నాయనమ్మ బుచ్చమ్మ మనవళ్లను రెచ్చగొడుతూ పరోక్షంగా కృష్ణ హత్యకు ప్రేరేపించింది. కృష్ణను హత్యచేసిన తర్వాత మొదట శవాన్ని నాయనమ్మకు చూపించాలని నవీన్ అనుకున్నాడు. తన ఎర్టీగా కారు డిక్కీలో కృష్ణ శవాన్ని వేసుకొని ఆత్మకూర్.ఎస్ మండలం పాత సూర్యాపేటలో ఉన్న నాయనమ్మ బుచ్చమ్మ వద్దకు వెళ్లి చూపించాడు. అక్కడి నుంచి నవీన్ నల్లగొండలోని తన స్నేహితుడు సాయిచరణ్ వద్దకు వెళ్లి కారులో ఉన్న కృష్ణ మృతదేహాన్ని చూపించగా వెంటనే చరణ్ భయంతో కారు దిగి వెళ్లిపోయాడు. అక్కడి నుంచి పిల్లలమర్రి గ్రామ శివారులో గల చెర్వుకట్ట చివరలో మూసీ కెనాల్ పక్కన కృష్ణ శవాన్ని పడేశారు. కృష్ణ స్కూటీని కూడా తీసుకొచ్చి పక్కనే పెట్టారు. అక్కడి నుంచి పాత సూర్యాపేటకు వెళ్లి కోట్ల బుచ్చమ్మ ఉన్న ఇంట్లో పడుకున్నారు. మృతుడి తండ్రి డేవిడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరిపి మొత్తం ఆరుగురు నిందితులపై అట్రాసిటీ కేసు, హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**నిందితులపై గతంలో పలు కేసులు**

నిందితులైన ఏ1 నవీన్‌పై గతంలో నాలుగు కేసులు, ఏ2 బైరు మహేశ్‌పై రౌడీషీట్‌తోపాటు తొమ్మిది కేసులు ఉన్నాయి. ఏ3 అయిన నవీన్ తండ్రి కోట్ల సైదులుపై ఒక కేసు ఉండగా ఏ4 కోట్ల వంశీపై మూడు కేసులు ఉన్నాయి. ఏ5 కోట్ల బుచ్చమ్మపై రెండు కేసులు ఉన్నాయి. ఏ6 సాయి చరణ్‌పై ఒక కేసు ఉంది. హత్యకు గురైన కృష్ణ అలియాస్ మాల బంటిపై మూడు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

# వేర్వేరుగా ఆపరేషన్ థియేటర్లు.. ఐసీయూ వార్డులు

- అంతర్జాతీయ ప్రమాణాలతో ఉస్మా'నయా' ఆసుపత్రి
- సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కొత్త ఉస్మానియా ఆసుపత్రి అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకోనుంది. ఏకంగా 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రి భవనాలను నిర్మించనున్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు వేర్వేరుగా ఆపరేషన్ థియేటర్లు (ఓటీ), ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకేచోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు ఉండేలా డిజైన్ చేశారు. 26.30 ఎకరాల విస్తీర్ణంలో గోషామహల్‌లో నిర్మించనున్న ఈ కొత్త ఆసుపత్రి భవనానికి ఈ నెల 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఆసుపత్రి నిర్మాణం, డిజైన్లపై బుధవారం సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష జరిపారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రిని వీలైనంత త్వరగా రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కొత్త ఆసుపత్రిలోనే నర్సింగ్, డెంటల్, ఫిజియో కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, ఇతర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

**సీఎం సూచనలకు అనుగుణంగా డిజైన్లు ఖరారు**

కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనానికి సంబంధించి ఇప్పటికే రూపొందించిన డిజైన్లపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. సీఎం సూచనలకు అనుగుణంగా తయారైన డిజైన్లను మంత్రి సమీక్షించి ఖరారు చేశారు. కొత్త ఆసుపత్రిలో అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. పేషెంట్ అటెండెంట్ల కోసం ఆస్పత్రి ఆవరణలోనే ధర్మశాల, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అవయవాల మార్పిడి యూనిట్, ఉద్యోగులు, వైద్య విద్యార్థుల కోసం ప్రత్యేక భవనాలు ఏర్పాటు చేయనున్నారు. రెండు అంతస్తుల్లో సెల్లార్ పార్కింగ్ వ్యవస్థ, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నలువైపులా రోడ్లు ఉండేలా డిజైన్లను రూపొందించారు. మొత్తం 2 వేల పడకలు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం 22 డిపార్ట్‌మెంట్లు ఉండగా, అదనంగా మరో 8 డిపార్ట్‌మెంట్లు ప్రారంభించనున్నారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఓపీ సేవలు, పేషెంట్ల కోసం విశాలమైన వెయిటింగ్ హాళ్లు నిర్మిస్తారు.

# బంగారు కొండే!

▶ మొదటి పేజీ తరువాయి

అనిశ్చితికి ఆజ్యం పోసింది. ఇప్పటికే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో బంగారం ఏడాదికాలంగా ఎగబాకుతూనే వస్తోంది. అనిశ్చితుల్లో ఆదుకునే సురక్షిత పెట్టుబడి సాధనంగా పేరొందిన బంగారంలోకి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పోటెత్తుతున్నాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత మొదలుపెట్టడం కూడా పసిడి ధరలకు దన్నుగా నిలుస్తోంది. 2024లో వరుసగా మూడుసార్లు పావు శాతం చొప్పున ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గించింది. ఈ ఏడాది రేట్ల కోత జోరు తగ్గినా, అక్కడే కొనసాగినా కూడా పసిడికి సానుకూలాంశమేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా వడ్డీరేట్లు తగ్గాలని పదేపదే చెబుతున్నారు. అంటే రానున్న కాలంలో అమెరికాలో వడ్డీరేట్లు మరింత దిగొచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇది కనకానికి మరింత కిక్కిచ్చే అంశం!

**సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల జోరు...**

అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారాన్నే నమ్ముకుంటున్నాయి. 2024 నవంబర్లో అవి 53 టన్నుల పసిడిని కొనుగోలు చేయగా, ఇందులో భారత్ వాటా 8 టన్నులు. నవంబర్లో జరిగిన కొనుగోళ్లతో 2024లో ఆర్‌బీఐ 73 టన్నుల బంగారం కొనుగోలు చేసి రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా నిలిచింది. పోలాండ్ నేషనల్ బ్యాంక్ 90 టన్నులు కొని టాప్‌లేపింది. ఇలా సెంట్రల్ బ్యాంకులు ఎడాపెడా పసిడి కొనుగోళ్లకు దిగడం కూడా రేట్ల పెరుగుదలకు కారణమవుతోంది.

**మన దగ్గర అంతకు మించి..**

అంతర్జాతీయంగా పసిడి ధరలకు మించి భారత్‌లో పుత్తడి జిగేల్‌మంటోంది. గతేడాది చివర్లో పండుగల సీజన్‌కు తోడు, పెళ్లిళ్లు కూడా బాగా ఉండటంతో ఆభరణాలు, రిటైల్ కొనుగోళ్లు దూసుకెళ్లాయి. నవంబర్లో భారత్ 10 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకోవడం దీనికి నిదర్శనం. అంతర్జాతీయంగా గోల్డ్ రష్‌కు తోడు దేశీయంగా ఆభరణాల వర్తకులు, రిటైలర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు, డాలర్‌తో రూపాయి మారకం విలువ అంతకంతకూ దిగజారుతుండటం పసిడి ధరలు జోరందుకోవడానికి ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ చెబుతోంది.

**రూపాయి ఎఫెక్ట్..**

దేశీయంగా బంగారం ధర జనవరి నెలలోనే 5.5 శాతం (రూ.4,360) ఎగబాకగా.. గత వారం రోజుల్లోనే 2 శాతం (రూ.1,700) జంప్ చేసింది. దీనికి ముఖ్యంగా చెప్పుకోవాల్సింది రూపాయి నేలచూపులే. రోజురోజుకూ బక్కచిక్కుతున్న రూపాయి విలువ తాజాగా 86.85 ఆల్‌టైమ్ కనిష్టానికి జారిపోయింది. ఇందులో ట్రంప్ గెలిచిన రోజు నుంచి చూస్తే రూపాయి విలువ 250 పైసల మేర ఆవిరి కావడం గమనార్హం. అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర ఈ నెల 24న ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకి ప్రస్తుతం 2,795 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అయినా భారత్‌లో గత వారం రోజుల్లో పసిడి రేటు పెరుగుతూపోతోంది. డాలరు పుంజుకుని, రూపాయి పడిపోవడం వల్ల బంగారం దిగుమతుల కోసం ఎక్కువ రూపాయలు చెల్లించుకోవాల్సి రావడమే దీనికి కారణం.

**రేటు పైపైకే...!**

బంగారం గడిచిన ఏడాది నిజంగా కనకవర్షమే కురిపించింది. అంతర్జాతీయంగా, దేశీయంగా దాదాపు 25–30 శాతం మేర రాబడులు అందించి అత్యుత్తమ పెట్టుబడి సాధనంగా నిలిచింది. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లో పసిడి దూకుడు ఈ ఏడాది కూడా ఖాయమేనని బులియన్ నిపుణులు కుండబద్దలు కొడుతున్నారు. కాయిన్ ప్రైస్ బులియన్ విశ్లేషకుల తాజా అంచనా ప్రకారం.. ఈ ఏడాది బంగారం 3,150 డాలర్లను తాకే అవకాశం ఉంది. ఏడాది చివరికల్లా 3,150–3,356 డాలర్ల రేంజ్‌లో స్థిరపడొచ్చని లెక్కగట్టారు. ఇక మన రూపాయి ఇలాగే పడిపోతూ.. దేశీయంగా ఆభరణాల డిమాండ్ కూడా పెరిగితే తులం బంగారం అక్షరాలా లక్ష రూపాయలను తాకడం ఖాయమనేది మెజారిటీ నిపుణుల అభిప్రాయం!!

> 'ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు, ట్రంప్ సుంకాల మోత భయాలతో ఇన్వెస్టర్లు పసిడి జై కొడుతున్నారు. అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతకు పాజ్ ఇచ్చినా సరే పుత్తడికి సానుకూలమే'
>
> – దేవేయ గగ్లానీ, యాక్సిస్ సెక్యూరిటీస్ కమోడిటీస్ రీసెర్చ్ ఎనలిస్ట్

**ఒక్కరోజే రూ.910 పెరుగుదల**

కొనుగోళ్ల డిమాండ్‌తో బుధవారం (29న) ఒక్కరోజే 99.9 స్వచ్ఛత బంగారం ధర ఢిల్లీలో 10 గ్రాములకు రూ.910 పెరిగి రూ.83,750కి చేరింది. ఈ నెల 1న బంగారం ధర రూ.79,390 వద్ద ఉండగా.. నెల రోజుల్లో 5.5 శాతం మేర (రూ.4,360) ర్యాలీ చేసింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర సైతం రూ.910 పెరిగి జీవిత కాల గరిష్టం రూ.83,350కి చేరింది. వెండి ధర కిలోకి రూ.1,000 పెరిగి రూ.93,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ రేటు 2,795 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఆయిల్‌పామ్ సాగులో నంబర్ 1 కావాలి

- మార్చిలోగా 19,271 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పూర్తి కావాలి
- రైతులకు, పవర్‌లూమ్‌కు విద్యుత్ అంతరాయాలు ఉండొద్దు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన ఆయిల్‌పామ్ సాగు తీరుతెన్నులపై ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 16,729 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా, మార్చి చివరి నాటికి 19,271 ఎకరాలకు పెరగాలని నిర్దేశించారు. రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జూన్ ఒకటోతేదీ నాటికి పూర్తిచేసి, ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ చేపట్టాలని ఆదేశించారు. బీచ్‌పల్లి, కల్లూరుగూడెంలలో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, పనులు ప్రారంభించాలని కోరారు. రైతులకు, పవర్ లూమ్ పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

**బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు: మంత్రి తుమ్మల**

బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ పూర్తి అసత్యాలు మాట్లాడుతున్నారని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు రూపంలో రూ.73 వేల కోట్ల సాయం అందించిందన్నారు. రైతుబంధు పథకం సాకుతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అన్ని రకాల పథకాలను రద్దు చేశారని మంత్రి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

# 10లోగా పర్యాటక పాలసీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆకట్టుకోవటానికి వీలవుతుందని స్పష్టం చేశారు.

**పర్యాటక ఆదాయం పెరగాలి**

కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనువుగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. ''మేడారం, రామప్ప దేవాలయం, లక్నవరాలను సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో కేరళ తరహాలో బోట్‌హౌస్‌లతో పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూడాలి. రాష్ట్రంలోని బౌద్ధ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలి. సమ్మక్క–సారలమ్మ జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలి..''అని సూచించారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ స్కైవాక్, సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలన్నారు. అనంతగిరితోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగుపర్చాలని చెప్పారు. పరిశ్రమలు, ఇతర రంగాల నుంచి వచ్చే ఆదాయమే కాకుండా పర్యాటక రంగం నుంచీ ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు**

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డును సత్వరం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సూచించారు. యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితోపాటు ఆలయం తరఫున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.

# గోదావరి-బనకచర్ల లింక్‌ను అడ్డుకోండి

- బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం కాల్వ సామర్థ్యం పెంపు
- కేంద్ర జలసంఘం, కృష్ణా, గోదావరి బోర్డులకు తెలంగాణ లేఖ



రాహుల్ బొజ్జా



సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు కార్యరూపం దాల్చకుండా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణా బోర్డు, గోదావరి బోర్డులకు లేఖ రాశారు. దీనిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయగా, తాజాగా సీడబ్ల్యూసీ, కృష్ణా బోర్డు, గోదావరి బోర్డులకు లేఖ రాయడం గమనార్హం. రోజుకు 2 టీఎంసీల వరద/మిగులు జలాలను గోదావరి నుంచి తరలించి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లో వేసేందుకు ఏపీ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించిందని రాహుల్ బొజ్జా లేఖలో ఫిర్యాదు చేశారు. ఇదే ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ నుంచి కుడికాల్వ ద్వారా బొల్లపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను తరలించి, అక్కడి నుంచి 31 కి.మీ. సొరంగం ద్వారా రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు తరలించాలని ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. 2016లోనే గోదావరి–పెన్నా అనుసంధానం తొలి దశలో భాగంగా చింతలపూడి, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టగా, తాము బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు అభ్యంతరం తెలిపామని గుర్తు చేశారు. గోదావరి మిగులు జలాల్లో తెలంగాణ వాటా తేల్చే వరకు గోదావరి–పెన్నా అనుసంధానికి అనుమతించరాదని కోరామన్నారు. తాజాగా గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టులో పోలవరం కుడి ప్రధాన కాల్వ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 38 వేల క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించడం బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధమన్నారు.

**శాశ్వత ప్రాజెక్టుగా తాడిపూడి**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక ఏర్పాట్ల ద్వారా నీటి తరలింపు కోసం తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని రాహుల్ బొజ్జా గుర్తు చేశారు. ఈ పథకం కింద నిర్మించిన 80కి.మీ. కాల్వను గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు కింద 178 కి.మీ. వరకు పొడిగించడంతోపాటు కాల్వ సామర్థ్యాన్ని సైతం 1,400 క్యూసెక్కుల నుంచి 10వేల క్యూసెక్కులకు పెంచాలని ప్రతిపాదించారన్నారు. ఈ నిర్మాణాలతో తాత్కాలిక ప్రాజెక్టు అయిన తాడిపూడి లిఫ్టు శాశ్వత ప్రాజెక్టుగా మారుతుందని అభ్యంతరం తెలిపారు. తెలంగాణలోని ప్రాజెక్టుల నిర్మాణంతో పోలవరం ప్రాజెక్టుకు నీళ్లు అందే అవకాశాల్లేవని వాదిస్తున్న ఏపీ.. చింతలపూడి, పురుషోత్తపట్నం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టుల రక్షణ కోసం గోదావరి జలాల పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరిందన్నారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి/సమ్మక్క బరాజ్ నుంచి నీటి తరలింపునకు బదులుగా పోలవరం నుంచి తరలించాలని ఏపీ చేసిన ప్రతిపాదనలను నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అంగీకరించలేదన్నారు. తదుపరి గోదావరి బోర్డు సమావేశంలో చర్చించడానికి ప్రాజెక్టుకి సంబంధించిన సమగ్ర వివరాలను తెప్పించుకోవాలని బోర్డును కోరారు.

# జమ... ఖర్చుల్లో... ఆమె ఎక్కడ?

ఎక్కడైనా జమ, ఖర్చులదే లెక్క!
దాన్ని బట్టే ఇంటికైనా.. దేశానికైనా జరుగుబాటు!
అప్ప, ఆదా సమంగానే పంచినా బలహీనుల పట్ల ఆపేక్ష సహజం!
అయితే ఆ బలహీనత అర్థమే మారిపోతోంది
ఇంటి బడ్జెట్‌లో అయినా.. దేశ బడ్జెట్‌లో అయినా!
చిత్రంగా ఆ వర్గంలో ఎక్కడా స్త్రీ కనిపించదు!
అమ్మాయి నుంచి ఆంట్రప్రెన్యూర్ వరకు ఎవరికీ
కేటాయింపులు ఉండవు! ఇల్లాలి సేవలకైతే గుర్తింపే కరవు!

మహిళలకు బడ్జెట్‌లో స్థానం కల్పించాలని 'జెండర్ బడ్జెటింగ్' పేరుతో ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ప్రపంచానికి వినిపించేలా గళమెత్తింది. ఆ ప్రాధాన్యాన్ని గ్రహించిన దేశాలు భారత్ సహా జెండర్ బడ్జెట్ మీద దృష్టిపెట్టాయి! కానీ కొన్నేళ్లుగా మన దగ్గర ఆ పదం వినిపించకుండా పోవడమే కాదు... బడ్జెట్‌లో మహిళలు కనిపించడమూ తగ్గుతోంది. ఫిబ్రవరి 1న కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్న సందర్భంగా 'జెండర్ బడ్జెటింగ్' మీద పలు రంగాల్లోని మహిళా నిపుణుల అభిప్రాయాలు ...

– సరస్వతి రమ



## సంక్షేమపథకాలు జెండర్ బడ్జెట్ కిందికి రావు



పదిహేనేళ్లుగా జెండర్ బడ్జెటింగ్‌ను మరచిపోయారు. మహిళలకు ఇస్తున్న పెన్షన్లు, గృహలక్ష్మి, ఉచిత రవాణా సౌకర్యాలు వంటివన్నిటినీ విమెన్ బడ్జెట్ కింద చూపిస్తున్నారు. అధికార పార్టీల సంక్షేమపథకాలు జెండర్ బడ్జెట్ కిందికెలా వస్తాయి? మహిళలకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన, శాఖలన్నిటి కేటాయింపుల్లో మహిళలకుఇస్తున్న వాటా, స్త్రీ చదువు, జీవనోపాధి, ఆంట్రప్రెన్యూర్‌షిప్ గురించి, మొత్తం స్ట్రక్చర్‌ను విమెన్ ఫ్రెండ్లీ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలు, స్త్రీ, పురుష అసమానతలను రూపుమాపడానికి తీసుకుంటున్న చర్యలు విమెన్ బడ్జెట్ కిందికి వస్తాయి. కేరళలో గ్రామ పంచాయతీ బడ్జెట్‌లో కూడా 30 శాతం మహిళలకు కేటాయిస్తారు. సాధారణ బడ్జెట్‌లోనూ ప్రాధాన్యం ఇస్తారు. దాన్ని కేంద్రప్రభుత్వమూ అనుసరించాలి. కిందటేడు కేంద్ర బడ్జెట్‌లో నరేగా(మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్)కు రూ.35 వేల కోట్లు తగ్గించారు. సవరించిన బడ్జెట్‌లో 120కోట్లకు గాను 95వేల కోట్లను కేటాయించి, కేవలం రూ. 60 వేల కోట్లతో సరిపెట్టారు. ఈ కోతలు గ్రామీణ ఉపాధిరంగంలోని స్త్రీల మీద తీవ్రప్రభావం చూపిస్తున్నాయి. వ్యవసాయరంగంలో 58 శాతం మహిళలున్నారు. వాళ్లు ఎక్కువగా కౌలు చేస్తారు. వాళ్ల పేరుమీద పొలాలుండవు. భర్త పేరుమీదో.. ఉమ్మడి కుటుంబ ఆస్తిగానో ఉంటాయి. లేదంటే పిల్లల పేరుమీద ఉంటాయి. ఈ లెక్కన వాళ్లకు ఆర్థిక భద్రత ఏది? పట్టణ ఉపాధి రంగంలో 23 శాతమున్న మహిళల పరిస్థితీ అంతే! నరేగా లాంటివి అక్కడ అప్లయ్ చేయరు. ఇక భద్రత, రక్షణ విషయాలకు వస్తే.. నిర్భయ ఫండ్‌కి గత మూడేళ్లుగా కేటాయింపుల్లేవు. మొదట్లో వెయ్యి కోట్లేమో కేటాయించారు. తర్వాత తగ్గించుకుంటూ వచ్చారు. ఎవరూ దరఖాస్తు చేసుకోవట్లేదని ఇప్పుడు దానికి బడ్జెట్టే లేకుండా చేశారు. అయితే ఎలాంటి పరిస్థితుల్లో అప్లయ్ చేసుకోవచ్చో రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టతనివ్వలేదు. స్త్రీ విద్య, ఆరోగ్యం, ఉపాధి, భద్రత రంగాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటేనే అది జెండర్ బడ్జెట్. అది అత్యంత అవసరం!

**- దేవి,** యాక్టివిస్ట్

## 'అవగాహన'కు ఖర్చు చేయాలి



ఎమ్మెస్సెమ్మీలో 20 వేల కోట్ల రూపాయల మిగులు నిధులున్నట్లుగా డేటా చూపిస్తోంది. దాని అర్థం ఆ స్కీమ్స్ ప్రజలకు చేరట్లేదని! ఆ మిగులును చూసి కేటాయింపులు తగ్గిస్తారు లేదంటే రివర్స్ చేస్తారు తప్ప.. దాన్ని మహిళా సాధికారత మీద అవగాహన కలిగించే కార్యక్రమాలకో, ఆడపిల్లల చదువుకో మళ్లించరు! ఎమ్మెస్సెమ్మీ స్కీమ్స్ గురించి కాలేజీల్లో అవేర్‌నెస్ క్యాంప్‌లు పెట్టండని ప్రభుత్వాన్ని పోరుతున్నాం. కాలేజీస్థాయిలోనే అవగాహన వస్తే చదువైపోయాక ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా తక్కువ పెట్టుబడితోనే ఏదో ఒక వ్యాపారం మొదలుపెట్టుకుంటారు. దీనివల్ల ప్రభుత్వాల మీదా ఒత్తిడి తగ్గుతుంది. యువతలో ఆంట్రప్రెన్యూర్‌షిప్ పెరుగుతుంది. ఓరియంటల్ మహిళా వికాసం, ముద్ర లోన్స్, స్త్రీ శక్తి యోజన.. సింధ్ మహిళాశక్తి యోజనలాంటి వాటితో భారతీయ మహిళా బ్యాంక్ (బీఎమ్‌బీ) లాంటి స్కీమ్స్ ఎన్నో ఉన్నాయి. బీఎమ్‌బీలో రూ. 50 వేల నుంచి రూ. 50 లక్షల వరకు లోన్స్ తీసుకోవచ్చు. ధరావత్తు అవసరం లేదు. అయితే వీటి గురించి ఎవరికీ అంతగా తెలీదు. ఈ కోవలోనిదే స్టార్టప్ ఇండియా స్కీమ్. దీన్ని ఎస్సీ, ఎస్టీ, మహిళల కోసం డిజైన్ చేశారు. ఇంకా గ్రూప్ లోన్స్ ఉన్నాయి. అయిదుగురు మహిళలు కలిసి ఓ సంస్థను పెట్టుకోవచ్చు. ఈరోజున ఒక ఆంట్రప్రెన్యూర్ మహిళ నెలకు రూ. 3 లక్షలు సంపాదిస్తోంది. గ్రామీణ, పట్టణ, దళిత మహిళలందరినీ ఆంట్రప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాలంటే.. వారికోసం ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలకు బడ్జెట్‌లో కేటాయింపులు సమృద్ధిగా ఉండాలి. ఆ కార్యక్రమాలతో ఇల్లిల్లూ తిరిగి చైతన్యం కలిగించాలి. కేక్ తయారీ నుంచి చేపల పెంపకం దాకా అన్నిటికీ ఎమ్మెస్సెమ్మీలో శిక్షణ ఉంది. అవగాహన కల్పించాలంతే!

**- బి.ఎన్. రత్న,** ప్రెసిడెంట్, దలీప్ (దళిత్ ఆదివాసీ విమెన్ ఆంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్)

## ప్రత్యేక కేటాయింపులు కావాలి



ఆంట్రప్రెన్యూర్‌షిప్ స్కిల్స్‌ని డెవలప్ చేసే ట్రెయినింగ్ ప్రోగ్రామ్స్‌కి సరిపోయేంత బడ్జెట్ ఉండట్లేదు. దానికోసం ప్రత్యేక కేటాయింపులు కావాలి. పెట్టుబడి కోసం కూడా మహిళల దగ్గర డబ్బు ఉండదు. అందుకే పది, పదిహేను శాతం సీడ్ క్యాపిటల్ అసిస్టెన్స్ కూడా ఉంటే బాగుంటుంది.

**- అరుణ దాసరి,** ప్రెసిడెంట్ డిక్కీ, తెలంగాణ

## వాళ్లూ జాతీయోత్పత్తిలో భాగస్వాములే!



వ్యవసాయం లాంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు క్షేత్రస్థాయిలో ఈ రోజుకీ ఎలాంటి వసతులు లేవు. కనీసం టాయిలెట్ సౌకర్యం కూడా లేదు. వర్కింగ్ విమెన్స్ హాస్టల్స్, బేబీ కేర్ సెంటర్స్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి మాట్లాడినప్పుడల్లా అది మహిళల మీద అదనపు భారాన్నే మోపుతోంది. వీరి ఈ శ్రమను ఇంటిపనిగానే చూస్తున్నారు తప్ప ఉత్పత్తిలో భాగంగా చూడట్లేదు. ఎలాంటి కూలీ చెల్లించట్లేదు. మహిళా రైతుల ఆత్మహత్యలను లెక్కలోకి తీసుకోవట్లేదు. వాళ్లను అసలు రైతులుగానే గుర్తించట్లేదు. ఒంటరి మహిళలకు అందాల్సిన పెన్షన్లు, ఎక్స్‌గ్రేషియా విషయంలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. నిర్వాసిత (ప్రాజెక్ట్ నిర్మాణాల వల్ల) మహిళలైతే అనేకరకాల అభద్రతలకు లోనవుతున్నారు. వీళ్లంతా జాతీయోత్పత్తిలో భాగస్వాములే! వీళ్లందరి అభివృద్ధి, భద్రత, రక్షణలకు బడ్జెట్‌లో స్థానం ఉంటోందా? నిజాయితీగా సమీక్షించుకోవాలి. నిష్పక్షపాతంగా ఒప్పుకోవాలి. అప్పుడే బడ్జెట్‌లో స్త్రీకి సముచితస్థానం లభిస్తుంది.

**- పద్మ వంగపల్లి,** ఇండిపెండెంట్ జర్నలిస్ట్

## కేర్ ఎకానమీకీ స్థానం ఉండాలి



స్త్రీ, పురుష ఆర్థిక సమానత్వ సాధనలో జెండర్ బడ్జెటింగ్ అనేది కీలకం. ఆర్థిక వనరులను నేరుగా ప్రభావితం చేసే రంగాల్లో స్త్రీలకు ఎంతమేర కేటాయింపులుంటున్నాయి, వాటినెలా ఉపయోగిస్తున్నారు, మహిళల భద్రత కోసం ఎంత కేటాయిస్తున్నారు లాంటివన్నీ పరిగణనలోకి వస్తాయి. కేర్ ఎకానమీ అంటే ఇంట్లో స్త్రీల సేవలు.. ఇంటి పని, వంటపని దగ్గర్నుంచి భర్తకు ఇచ్చే ఎమోషనల్ సపోర్ట్, పిల్లలు.. పెద్దవాళ్ల బాగోగుల దాకా మహిళలు చేసేదంతా జీతం లేని శ్రమ. మరుగునపడిన వీరి సేవలను, శ్రమను ఆదాయ పట్టీలోకి చేర్చాలి. భార్య అన్నిరకాలుగా సహకరిస్తేనే భర్త బయటకు వెళ్లి పనిచేయగలుగుతున్నాడు. అలా ఆమె కూడా ఉత్పత్తిలో భాగమవుతూ, జాతీయ ఆదాయానికి ఊతమవుతోందని గ్రహించాలి. ఈ కేర్ ఎకానమీకీ బడ్జెట్‌లో స్థానం ఉండాలి. స్థూల విధానాలు జెండర్ ఈక్వాలిటీ, సామాజిక న్యాయం, మిలీనియల్ గోల్స్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు దగ్గరగా ఉండాలి. మహిళలు, జెండర్ మైనారిటీల చదువు, ఆరోగ్యం, భద్రత, ఉపాధి, జీవన నైపుణ్యాలు పెంపొందించడం వంటివన్నీ బడ్జెట్‌లో భాగం కావాలి. ఆ కేటాయింపులన్నీ సక్రమంగా ఖర్చవ్వాలి. కానీ అవన్నీ వేరేచోటికి మళ్లుతున్నాయి. జెండర్ ఈక్వాలిటీ మీద ఒకరకమైన ఉపేక్ష కనబడుతోంది.

**- అపర్ణ తోట,** జెండర్ కన్సల్టెంట్ ట్రైనర్, ద పర్పుల్ వరండా

---

● మన(సు)లో మాట

## బాబు పరీక్షలు మాకు పరీక్ష పెడుతున్నాయి!

మా అబ్బాయి ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఉన్నాడు. స్వతహాగా మంచి తెలివైనవాడే. కానీ ఇటీవల పరీక్షలకు సరిగా ప్రిపేర్ కావడంలేదు. మొదటి నుండి చదవకుండా పరీక్షలకు ముందు, తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నాడు. దాంతో మార్కులు బాగా తగ్గుతున్నాయి. బాబు పరీక్షలు మాకు ఒక గండంలాగా అనిపిస్తున్నాయి. బాబు విషయంలో నాకు, మా ఆయనకు మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య నలిగిపోతున్నాను. ఈ విషయంలో ఏం చేయమంటారో సలహా ఇవ్వండి.

**- రాజ్యలక్ష్మి,** హైదరాబాద్

బాబు విషయంలో మీరెంత టెన్షన్‌కు గురవుతున్నారో అర్థమవుతోంది. చదువు, పరీక్షల విషయంలో మీ బాబు ఎదుర్కొంటున్న సమస్య చాలా సాధారణమైనదే. ఎంత బ్రిలియంట్ స్టూడెంట్స్ అయినా, పరీక్షల ముందర కొంత ఒత్తిడిని తప్పకుండా ఎదుర్కొంటారు. ఈ ఒత్తిడి వల్ల మంచి తెలివితేటలు గల విద్యార్థులు కూడా పరీక్షలు సరిగా రాయలేక ర్యాంకు తగ్గిపోతుంది. ఇలాంటి విషయంలో, మీరు ఓపికతో బాబును దారిలో పెట్టే ప్రయత్నం చేయాలి. దీనికి మీవారి సహకారం కూడా చాలా అవసరం. టైమ్ మేనేజ్‌మెంట్, నోట్స్ సరిగా రాసుకోవడం, మెమరీ టెక్నిక్స్ లాంటివి ఇలాంటి విద్యార్థులకు చాలా అవసరం. బాబు చదువుకోవడానికి రోజూవారి ఒక టైమ్ టేబిల్ తయారు చేసి, చదవవలసిన సబ్జెక్ట్స్‌ను చిన్న చిన్న పోర్షన్స్‌గా విభజించి, వాటిని క్రమంగా పెంచుతూ పోవడం లాంటివి బాగా పనిచేస్తాయి. అతని ఏకాగ్రతకు భంగం కలగకుండా ఇంట్లో టి.వి. పెట్టడం, ఫంక్షన్స్ పెట్టుకోవడం, ఇతరుల ఇళ్లలో జరిగే ఫంక్షన్స్‌కు వెళ్లడం లాంటివి లేకుండా చేయండి. వీలైతే బాబుకు తోడుగా మీరు కూడా పక్కన ఉండి ధైర్యం చెప్పండి. ధ్యానం, జాకబ్ సన్స్ రిలాక్సేషన్ అనే టెక్నిక్, ఈ పరీక్షల భయాన్ని బాగా తగ్గిస్తాయి. ఫలితంపై కాకుండా అతని ప్రయత్నం పైన దృష్టి పెట్టమని చెప్పండి. ఇంకా అవసరమైతే మంచి సైకియాట్రిస్ట్ లేదా క్లినికల్ సైకాలజిస్ట్‌కు చూపించి, కౌన్సిలింగ్ ఇప్పించండి. మీ బాబు భవిష్యత్తు కోసం, మీరు మీ వారు చక్కగా చర్చించుకొని, ఒక టీమ్ లాగా ముగ్గురూ కలిసి పని చేయండి. ఆశావాదంతో మీరు, మీ అబ్బాయి ముందుకెళితే, బాబు తన పరీక్షల భయాన్ని పూర్తిగా అధిగమించగలడు.

ఆల్ ది బెస్ట్!



**డా. ఇండ్ల విశాల్ రెడ్డి,**
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

● సింగిల్ పేరెంటింగ్

## సులువుగా సంరక్షణ

కుటుంబంలో పిల్లల భద్రత, బాధ్యత ప్రధానంగా ఉంటాయి. తల్లిదండ్రులు ఇద్దరు తమ పాత్రను పోషిస్తుంటారు. ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ మహిళల పురోగతి -2020' నివేదిక ప్రకారం భారతదేశంలో దాదాపు 1.3 కోట్ల మంది ఒంటరి తల్లులు ఎవరి మద్దతూ లేకుండా తమ పిల్లల సంరక్షణ చూసుకుంటుంటే... 3.2 కోట్లమంది ఒంటరి తల్లులేమో ఉమ్మడి కుటుంబాలలో ఉంటూ కుటుంబ సహకారంతో పిల్లల్ని చూసుకుంటున్నారు. భారతదేశంలో ఒంటరిగా లేదా వారి కుటుంబ సహాయంతో తమ పిల్లలను పెంచుతున్న ఒంటరి తల్లులు పెద్ద సంఖ్యలో ఉన్నారని ఈ డేటా చూపిస్తుంది. ఇలాంటప్పుడు సింగిల్ పేరెంటింగ్ పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపుతోందో తెలుసుకుంటూనే... సులువుగా ఎలా పెంచవచ్చో అవగాహన పెంచుకుందాం..



ఒంటరి తల్లి లేదా తండ్రి పిల్లల పెంపకంలో ఓ వైపు సవాళ్లు ఎదుర్కొంటూ ఉంటే, ఇక వారు ఉద్యోగస్థులైతే ఆ సవాల్ మరింత పెరుగుతుంది. ఉద్యోగాలు చేసే ఒంటరి తల్లిదండ్రులు తమ పనిని, పిల్లల బాధ్యతలను సమతుల్యం చేసుకోవడంలో చాలా సమస్యలను ఎదుర్కొంటారు. అయితే, కొంత అవగాహన, సమయ నిర్వహణతో, సింగిల్ పేరెంటింగ్‌ను సులభతరం చేయవచ్చు.

**ఒంటరిగా బాధ్యత**

తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నప్పుడు/ వారిలో ఒకరు మరణించినప్పుడు/ బిడ్డను ఒంటరిగా పెంచాలని నిర్ణయించుకున్నప్పుడు బాధ్యత ఒక్కరిదే అవుతుంది. ఇది కాకుండా, ఒక స్త్రీ ఒంటరిగా తల్లి కావాలనుకుంటే, ఆమె ఐవిఎఫ్ ద్వారా బిడ్డను కనచ్చు లేదా దత్తత తీసుకోవచ్చు. అలాగే ఒక పురుషుడు సింగిల్ పేరెంట్ కావాలనుకుంటే, బిడ్డను దత్తత తీసుకోవచ్చు/ అద్దెగర్భం ద్వారా బిడ్డను పొందవచ్చు.

**● సవాల్‌తో కూడుకున్నది**

సింగిల్ పేరెంటింగ్ అనేది బిడ్డకు, తల్లిదండ్రులకు ఇద్దరికీ సవాల్‌తో కూడుకున్నదే. ఒంటరి తల్లి/తండ్రి తమ ఉద్యోగ జీవితాన్ని నిర్వహించడం లేదా బిడ్డ బాధ్యతలన్నింటినీ నిర్వర్తిస్తూ ఆర్థికంగా బలంగా ఉండటం అంత సులభమేమీ కాదు. ఆ బిడ్డ కొన్నిసార్లు తన జీవితంలో తల్లి లేదా తండ్రి ప్రేమ పూర్తిగా కోల్పోయినట్లు భావించవచ్చు. ఇది కాకుండా, ఒంటరి తల్లి కొన్నిసార్లు సమాజంలో వివక్షను ఎదుర్కోవచ్చు. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని బలహీనపరుస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులు విడివిడిగా నివసిస్తుంటే, స్నేహితులు అతని కుటుంబం గురించి ప్రశ్నలు అడిగినప్పుడు పిల్లలు ఇబ్బంది పడవచ్చు.

**● కుటుంబం పాత్ర**

కుటుంబ సభ్యులు (పెద్దవాళ్లు) ఒంటరి తల్లిదండ్రులకు సహాయం చేస్తే పిల్లల పెంపకం సులభం అవుతుంది. తల్లిదండ్రులు ఉద్యోగస్థులైతే కుటుంబ సభ్యులు పిల్లల సంరక్షణలో సహాయం చేయవచ్చు. పిల్లలను స్కూలుకు సిద్ధం చేయడం, హోంవర్క్ పూర్తి చేయించడం, వారితో ఆడుకోవడం వంటివి. ఇది కాకుండా, కొన్నిసార్లు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవలసిన స్థితిలో కుటుంబ సభ్యులు వారికి సహాయం చేయగలరు.

**● సమాజానికి భయపడి**

నేటికీ, సమాజంలోని ఒక వర్గం ఒంటరి తల్లిదండ్రులను, పిల్లలను సానుకూల దృష్టితో చూడటం లేదు. ముఖ్యంగా మహిళలు తమ భర్తల నుండి విడిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు ఈ కారణంగానే నేటికీ చాలా మంది బయటపడలేకపోతున్నారు. ఈ నిర్ణయం తీసుకునే స్త్రీలను సమాజంలో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు. ఇది ఒంటరి తల్లుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. సమాజం ఒంటరి తల్లులన, వారి పిల్లలను చిన్న చూపు చూడకుండా సానుకూల దృక్పథం కలిగి ఉంటే ఇది వారికి, వారి పరిస్థితులతో పోరాడటానికి బలాన్ని ఇస్తుంది.

**● పిల్లలపై ప్రభావం**

సింగిల్ పేరెంటింగ్ పిల్లలపై సానుకూల, ప్రతికూల ప్రభావం రెండూ చూపుతాయి. వారి తల్లితో సంబంధం బలపడుతుంది. అదే సమయంలో, వారు తరచూ ఒంటరితనాన్ని కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. పిల్లలు తరచుగా వివిధ రకాల భావోద్వేగ, ప్రవర్తనా సవాళ్లను ఎదుర్కొంటారు. శారీరకంగా– మానసికంగా విచారంగా, గందరగోళంగా అనిపించవచ్చు. తమ ఇంట్లో లేని తల్లి/తండ్రితో వారి సంబంధం గురించి ఆందోళన చెందుతారు. ఇద్దరిలో ఒకరు లేకపోవడం వల్ల పిల్లలు ఒంటరిగా ఉన్నట్లు అనిపించవచ్చు. తల్లిదండ్రులిద్దరు ఉన్న సహచరుల కుటుంబ వాతావరణాన్ని పోల్చుకుని బాధపడుతుంటారు. కొన్ని సందర్భాల్లో తమ భావోద్వేగాలను ఎదుర్కోవడానికి ఇదొక మార్గంగా ఎంచుకుంటారు.

మీ బిడ్డను పెంచడంలో మునిగిపోయి మీ పట్ల మీరు నిర్లక్ష్యంగా ఉండవద్దు. మీ ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎందుకంటే, మీ బిడ్డను తీర్చిదిద్దవలసింది మీరే అన్న విషయం మరచిపోరాదు.

**– నిర్మలారెడ్డి,**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

### ఈ తప్పులు చేయొద్దు


సింగిల్ పేరెంటింగ్‌లో కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా పిల్లలను చెడగొట్టగలదు. కొన్ని విషయాల్లో అవగాహన, అర్థం చేసుకోవడం మేలు కలిగిస్తుంది... ● ఒంటరి తల్లిదండ్రులు తమ పిల్లలకు అవసరమైన దాని కంటే ఎక్కువ సమయం కేటాయిస్తారు. ఇది పిల్లల స్వాతంత్ర్యాన్ని కోల్పోయేలా చేస్తుంది. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడం కూడా అవసరం ● ఒంటరి తల్లిదండ్రులు ఇద్దరు పాత్రలను ఒకరే పోషిస్తారు కాబట్టి అన్నింటా అతిగా కూడా ఉండవచ్చు. 'అతి' ప్రేమ, అతి రక్షణ.. వంటివి పిల్లలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి ● ఒంటరిగా ఎందుకు ఉండాల్సి వచ్చిందో మీ బిడ్డకు ఎప్పుడూ అబద్ధం చెప్పవద్దు. వాస్తవాన్ని వివరించాలి. ● పిల్లల ప్రతి డిమాండ్‌నూ నెరవేర్చవద్దు. ● మీ బిడ్డను వేరే ఏ బిడ్డతోనూ పోల్చవద్దు.



**- ప్రొ. పి. జ్యోతిరాజ,** సైకాలజిస్ట్, లైఫ్‌స్కిల్ నిపుణులు

---

● డ్రైవింగ్ ఫోర్స్



## నా దారి రహదారి

అవని నుంచి అంతరిక్షం వరకు మహిళలు అసాధారణ విజయాలు సాధించి తమ సత్తా చాటుతున్నా.... ఇంకా లింగవివక్షతతో కూడిన బోలెడు ఆశ్చర్యాలు మిగిలే ఉన్నాయి. ఫిలింనగర్ బస్తీలో మక్కల మాధవి బస్ డ్రైవర్‌గా స్టీరింగ్ పట్టినప్పుడు... 'ఇదేంటి!' అని ఆశ్చర్యపోయిన వాళ్లే ఎక్కువ. 'పెద్ద బస్సు నడపడం నీ వల్ల ఏమవుతుందమ్మా!' అని నిరాశ పరిచిన వారే ఎక్కువ. అయినా సరే...'నా దారి రహదారి' అంటూ మాధవి దూసుకువెళుతూ తన డ్రైవింగ్ స్కిల్స్‌తో శభాష్ అనిపించుకుంటోంది...

హైదరాబాద్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ బస్తీలో నివసించే మక్కల మాధవి భర్త రాజేష్ 'జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్' బస్సు డ్రైవర్‌గా గత పది సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఇదే బస్సులో మాధవి అటెండర్‌గా పని చేసేది. భర్త బస్సు నడుపుతున్న తీరు చూసి డ్రైవింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. స్కూల్ మైదానంలో భర్త ద్వారా డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకొని ఏడాది క్రితం నుంచే బస్సు నడపడం మొదలుపెట్టింది. స్కూల్ చైర్మన్, ప్రిన్సిపాల్‌తోపాటు టీచర్లు కూడా ఆమె పట్టుదలకు ఫిదా అయ్యారు. ప్రోత్సహించారు. పూర్తి అనుభవం వచ్చాకే స్కూల్ బస్సు నడుపుతానని జేహెచ్‌పీఎస్ యాజమాన్యానికి తెలియజేసింది.

డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లిన మాధవిని చూసి 'బక్కపల్చగా ఉన్న ఈమె బస్సు ఏం నడుపుతుంది!' అని అధికారులు వ్యంగ్యంగా మాట్లాడటమే కాకుండా బస్సు నడపడానికి తిరస్కరించారు. అయితే మాధవి ఏమాత్రం నిరాశ పడలేదు. మూడోసారి వెళ్లి ఒకసారి తాను బస్సు నడపడం చూడాలని, నచ్చక పోతే లైసెన్స్ ఇవ్వొద్దని వేడుకుంది. ఎత్తు, ఒంపుల్లో బస్సును నడిపించి ఎలాగైనా అనర్హురాలిగా చేసి పంపాలనుకున్న అధికారులు మాధవి బస్సు నడిపించే తీరు చూసి ఆశ్చర్యపోయారు. అభినందించారు. పరీక్షలో పాస్ కావడంతో మాధవికి డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేశారు. స్కూల్ యాజమాన్యం కూడా ఆమెను మరింత ప్రోత్సహిస్తూ పిల్లలను తీసుకురావడం, ఇంటి దగ్గర దింపేందుకు బస్సు నడిపే బాధ్యతను అప్పగించింది.

### గో ఎ హెడ్

డ్రైవింగ్ చేస్తానని చెప్పినప్పుడు నా భర్త కాస్త భయపడ్డాడు. అయితే నాకు నేర్పించే క్రమంలో గ్రౌండ్‌లో నా డ్రైవింగ్ చూసి ఆయనకు భయం పోయింది. దీంతో మెల్లమెల్లగా ప్రతిరోజూ అదే గ్రౌండ్‌లో రెండు గంటలపాటు డ్రైవింగ్ ప్రాక్టీస్ చేసేదాన్ని. బస్సు డ్రైవింగ్ పూర్తిగా వచ్చాక ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. స్కూల్ యాజమాన్యం, టీచర్లు వెన్ను తట్టి ప్రోత్సహించడం, బస్సు నడుపుతున్నప్పుడు గో ఏ హెడ్ అని పిల్లలు అరవడం నాకు ఉత్సాహాన్ని ఇచ్చింది.

**– మక్కల మాధవి**

**– పురుమాండ్ల నరసింహారెడ్డి,**
సాక్షి, హైదరాబాద్



## సలీమా టెటె, నిక్కీ ప్రధాన్‌కు ఇళ్ల స్థలాలు అందజేసిన జార్ఖండ్ ప్రభుత్వం

రాంచీ: నిలకడైన ప్రదర్శనతో భారత మహిళల హాకీ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న జార్ఖండ్ ప్లేయర్లు సలీమా టెటె, నిక్కీ ప్రధాన్‌లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించిన ఈ ఇద్దరికీ రాంచీలో ఇంటి స్థలం ఇస్తామని జార్ఖండ్ ప్రభుత్వం 2021లో ప్రకటించింది. బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్... సలీమా టెటె, నిక్కీ ప్రధాన్‌కు 3750 చదరపు అడుగుల (416 గజాలు) ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.35 లక్షలను కూడా ప్రభుత్వమే ఇస్తుందని సొరెన్ ప్రకటించారు. 'మాట నిలబెట్టుకున్నాం. ఈ ఇద్దరికీ ఇంటి స్థలాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సలీమా, నిక్కీ జాతీయ జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించారు. అలాంటి జార్ఖండ్ ఆణిముత్యాలను గౌరవించుకోవడం మా బాధ్యత' అని హేమంత్ అన్నారు.

# అందరి చూపు కోహ్లి వైపు



**2012 తర్వాత రంజీ మ్యాచ్ ఆడనున్న భారత స్టార్**

- నేటి నుంచి రైల్వేస్‌తో ఢిల్లీ పోరు
- ఉదయం గం. 9:30 నుంచి జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో టన్నులకొద్దీ పరుగులు చేసిన భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి 2012 తర్వాత దేశవాళీ బాట పట్టాడు. రంజీ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడేందుకు కోహ్లి సిద్ధమయ్యాడు. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా రైల్వేస్‌తో గురువారం నుంచి ప్రారంభం కానున్న పోరులో కోహ్లి ఢిల్లీ జట్టు తరఫున బరిలోకి దిగుతున్నాడు. గ్రూప్ దశలో ఆడిన 6 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క దాంట్లోనే గెలిచిన ఢిల్లీ జట్టుకు నాకౌట్ చేరే అవకాశాలు పెద్దగా లేకపోయినా... కోహ్లి బరిలోకి దిగుతుండటంతో ఫలితంతో సంబంధం లేకుండా ... తమ ఆరాధ్య ఆటగాడిని చూసేందుకు భారీగా అభిమానులు మైదానానికి తరలి రానున్నారు. గత ఆరో రౌండ్ మ్యాచ్‌ల్లో ఆడిన భారత క్రికెటర్లు రిషభ్ పంత్, రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ తదితరులు ఆకట్టుకోలేకపోగా... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు కోహ్లి భారీ ఇన్నింగ్స్ ఆడితే చూడాలని అభిమానులు ఆశ పడుతున్నారు. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి కాగా... ఢిల్లీ జట్టుకు ఆయుశ్ బదోనీ సారథ్యం వహిస్తున్నాడు. 'ఐపీఎల్‌లో కోహ్లికి ప్రత్యర్థిగా ఆడాను. ఇప్పుడు నా నాయకత్వంలో వరుస మ్యాచ్‌ల్లో పంత్, కోహ్లి లాంటి దిగ్గజాలు ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. కోహ్లి నాలుగో స్థానంలోనే బ్యాటింగ్ చేస్తాడు. అనవసర ఒత్తిడికి లోను కాకుండా స్వేచ్ఛగా ఆడమని కోహ్లి మాకు సూచించాడు' అని బదోనీ అన్నాడు.

**కేఎల్ రాహుల్ కఠోర సాధన**

చాన్నాళ్ల తర్వాత రంజీ బరిలోకి దిగనున్న భారత ఆటగాడు కేఎల్ రాహుల్ బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా నేటి నుంచి బెంగళూరులో హరియాణా జట్టుతో తలపడనున్న కర్ణాటక జట్టులో రాహుల్ బరిలోకి దిగనున్నాడు. నెట్ సెషన్‌లో తీవ్రంగా శ్రమించిన రాహుల్... స్పిన్, పేస్ అనే తేడా లేకుండా అందరి బౌలింగ్‌లోనూ సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేశాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన జట్టులో స్థానం దక్కించుకున్న రాహుల్... ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేసి తన జట్టును రంజీ ట్రోఫీలో నాకౌట్ దశకు చేర్చాలని భావిస్తున్నాడు.

**సిరాజ్ పాత బంతితో ప్రాక్టీస్**

గత మ్యాచ్‌లో స్టార్ ఆటగాళ్లతో బరిలోకి దిగి కూడా జమ్మూ కశ్మీర్ జట్టు చేతిలో ఓటమి పాలైన ముంబై జట్టు... ఎలైట్ గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో మేఘాలయాతో పోరుకు సిద్ధమైంది. రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన ముంబై నాకౌట్ చేరాలంటే ఈ మ్యాచ్‌లో బోనస్ పాయింట్ విజయం సాధించడంతో పాటు ... ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా అనుకూలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో రోహిత్, యశస్వి, శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉండనున్నారు. మరి రహానే సారథ్యంలోని ముంబై టీమ్ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాలి. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా విదర్భతో జరగనున్న మ్యాచ్‌లో హైదరాబాద్ తరఫున మొహమ్మద్ సిరాజ్ బరిలోకి దిగనున్నాడు. ఈ గ్రూప్ నుంచి విదర్భ ఇప్పటికే నాకౌట్ బెర్త్ దక్కించు కోగా... హైదరాబాద్‌కు అవకాశాలు లేవు. అయితే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన హైదరాబాదీ సిరాజ్ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడనేది కీలకం. పాత బంతితో సిరాజ్ పెద్దగా ప్రభావం చూపలేకపోతుండటంతోనే అతడిని ఎంపిక చేయలేదని రోహిత్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో... ప్రాక్టీస్‌లో ఈ హైదరాబాదీ మెరుపు తగ్గిన బంతితో సాధన చేశాడు. గ్రూప్ 'బి'లోనే ఉన్న ఆంధ్ర జట్టు విజయనగరం వేదికగా రాజస్తాన్‌తో ఆడనుంది.


# తిలక్ వర్మ... పైపైకి...



**కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్ అందుకున్న భారత బ్యాటర్**

**దుబాయ్:** హైదరాబాదీ యువ బ్యాటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న తిలక్ వర్మ ఒక స్థానం మెరుగు పరుచుకొని 832 పాయింట్లతో కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో నిలిచాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో 'టాప్' ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. హెడ్ కంటే 23 రేటింగ్ పాయింట్లు వెనుకబడి ఉన్న తిలక్... ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోని మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో విశేషంగా రాణిస్తే అగ్రస్థానానికి చేరే అవకాశం ఉంది. అదే జరిగితే పిన్న వయసులో ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో 'టాప్' ర్యాంక్‌కు చేరిన ప్లేయర్‌గా 22 ఏళ్ల తిలక్ రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు పాకిస్తాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ (23 సంవత్సరాల 105 రోజులు) పేరిట ఉంది. భారత్ నుంచి సూర్యకుమార్ (4వ ర్యాంక్), యశస్వి జైస్వాల్ (9వ ర్యాంక్) టాప్-10లో చోటు దక్కించుకున్నారు. ఇక మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఏకంగా 25 స్థానాలు ఎగబాకి టాప్-5లోకి వచ్చాడు. ఇంగ్లండ్‌తో మూడో టి20లో ఐదు వికెట్లతో అదరగొట్టిన వరుణ్ 679 పాయింట్లతో ఐదో ర్యాంక్‌కు చేరాడు. భారత్ నుంచి అర్ష్‌దీప్ (9వ ర్యాంక్), రవి బిష్ణోయ్ (10వ ర్యాంక్) టాప్-10లో ఉన్నారు. మరోవైపు టెస్టు బౌలింగ్ ర్యాంక్‌ల్లో భారత స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# స్మిత్, ఖ్వాజా అజేయ శతకాలు


స్మిత్

**ఆస్ట్రేలియా 330/2 • లంకతో తొలి టెస్టు**

**గాలె:** పదేళ్ల తర్వాత టీమిండియాపై టెస్టు సిరీస్ విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టు... శ్రీలంక పర్యటనలోనూ అదే జోరు కొనసాగిస్తోంది. తొలి టెస్టులో స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 81.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (147 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (104 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకాలతో కదంతొక్కారు. వర్షం కారణంగా నిర్ణీత సమయం కంటే ముందే ముగిసిన తొలి రోజు ఆటలో స్మిత్ టెస్టు క్రికెట్‌లో 10,000 పరుగులు పూర్తిచేసుకున్న నాలుగో ఆస్ట్రేలియా ప్లేయర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన 15వ ఆటగాడిగా స్మిత్ నిలిచాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 57; 10 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించగా... లబుషేన్ (20) ఆకట్టుకోలేకపోయాడు. ఖ్వాజా, స్మిత్ జంట అబేధ్యమైన మూడో వికెట్‌కు 195 పరుగులు జోడించింది. ఈ మ్యాచ్ ద్వారా జోష్ ఇంగ్లిస్ టెస్టు అరంగేట్రం చేశాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్, జెఫ్రీ వండర్సే చెరో వికెట్ పడగొట్టారు.


ఖ్వాజా

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


# ధినిధి ఖాతాలో 3 స్వర్ణాలు



**డెహ్రాడూన్:** జాతీయ క్రీడల్లో తొలి రోజు బుధవారం కర్ణాటక స్విమ్మర్లు పతకాల పంట పండించారు. ఐదు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలతో అదరగొట్టారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల కర్ణాటక అమ్మాయి ధినిధి దేసింగూ ఏకంగా మూడు పసిడి పతకాలను సొంతం చేసుకుంది. 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 100 మీటర్ల బటర్‌ఫ్లయ్ వ్యక్తిగత విభాగాల్లో బంగారు పతకాలు నెగ్గిన ధినిధి... 4×100 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలేలోనూ స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. కర్ణాటకకే చెందిన శ్రీహరి నటరాజన్ పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 4×100 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాల్లో పసిడి పతకాలు సాధించాడు.

# సాక్షి సినిమా

## ఒకే టైటిల్‌తో...


• శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'పరాశక్తి' అనే టైటిల్ ఖరారు చేశారు. మరోవైపు విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన సినిమాకి కూడా 'పరాశక్తి' టైటిల్ ఖరారు చేయడం విశేషం. శివ కార్తికేయన్ హీరోగా రూపొందుతోన్న 'పరాశక్తి'కి సుధ కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. రవి మోహన్, అథర్వ, శ్రీలీల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ని విడుదల చేశారు. 'సైన్యమై కదిలిరా... పెను సైన్యమై కదిలిరా...' అంటూ శివ కార్తికేయన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ సినిమాలో ఆయన విద్యార్థి సంఘం నాయకుడుగా కనిపించనున్నారని తెలుస్తోంది.

• విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'పరాశక్తి' చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించారు. మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిల్మ్స్ కార్పొరేషన్ పై 'పరాశక్తి'రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ''విభిన్నమైన కథతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.


• విజయ్ ఆంటోనీ

## స్టిల్ మేము బ్యాచిలర్సే!


• సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటించగా రావు రామేశ్, అన్షు కీలక పాత్రలు పోషించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేశ్ దండా, ఉమేష్ కేఆర్ బన్సల్ నిర్మించిన 'మజాకా' ఫిబ్రవరి 21న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి మొదటి పాట బ్యాచ్‌లర్ యాంథమ్‌ను విడుదల చేశారు. 'అరె స్టేటస్ సింగిలే... అయ్యో... పార్ట్‌నర్ దొరకట్లే... అయ్యో... ఒంటరి ముచ్చట్లే... స్టిల్ మేము బ్యాచిలర్సే...' అంటూ ఈ పాట సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని ధనుంజయ్ సీపాన ఆలపించగా, రఘు మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ''ఈ బ్యాచిలర్ సాంగ్‌ని సందీప్ కిషన్-రావు రమేశ్‌లపై వైజాగ్ బీచ్‌లో చిత్రీకరించాం. బ్యాచ్‌లర్స్ జీవితంలో ఉండే స్ట్రగుల్స్, జాయ్స్‌ను హైలైట్ చేసేలా ఉన్న ఈ సాంగ్ కుర్రాళ్లను ఆకట్టుకుంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

## మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి


• కవిత

దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు, నటులు మోహన్‌బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ తదితరుల వద్ద వందకు పైగా సినిమాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా చేసిన ధర్మ 'సంహారం' చిత్రంతో డైరెక్టర్‌గా మారారు. ఆదిత్య, కవిత జంటగా ధర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సంహారం' చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో ధర్మ మాట్లాడుతూ- ''తనకు, తన అక్కకు అనుకోని ఘటనలు ఎదురైనప్పుడు తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌తో ఓ అమ్మాయి దుష్టులను ఎలా ఎదుర్కొంది? అనే కథాంశంతో ఈ సినిమా తీశాం. మహిళలు తమని తాము కాపాడుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ఆవశ్యకమని ఈ చిత్రంలో చూపించాం'' అని చెప్పారు.

## పల్లెటూరిలో నవ్వులు


• 'బద్మాషులు' పోస్టర్

మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, సి. రామశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే హాస్య భరిత చిత్రం 'బద్మాషులు'. ప్రతి సన్నివేశంలో కడుపుబ్బా నవ్వుకుని, ఆ అనుభూతిని నలుగురూ పంచుకునేలా ఉంటుంది. ఈ చిత్రంలోని ప్రతి పాత్ర నిజ జీవితంలో మనకి తారసపడే వారిలాగే ఉంటూ నవ్విస్తుంటుంది. పూర్తి వినోదంతో పాటు గొప్ప సందేశం ఇచ్చే సినిమా ఇది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తేజ కూనూరు, కెమేరా: వినీత్ పబ్బతి.

# రాయలసీమ రమ్మంటోంది

**రాయలసీమ నేపథ్యం సినిమాలంటే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన ఎన్నో సినిమాలు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఇటీవలి కాలంలో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్' కూడా రాయలసీమ నేపథ్యంలో రూపొందిన సినిమాయే. కాగా ప్రస్తుతం 'రాయలసీమ రమ్మంటోంది' అంటూ కొందరు తెలుగు హీరోలు రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేస్తున్నారు. ఈ సినిమాల వివరాల్లోకి వెళితే...**

## అఖండ తాండవం



బాలకృష్ణ కెరీర్‌లో రాయలసీమ నేపథ్యంలో రూపొందిన 'సమరసింహారెడ్డి, నరసింహారెడ్డి, ఇటీవలి కాలంలో 'అఖండ, డాకు మహారాజ్' వంటి సినిమాలు ప్రేక్షకులను అలరించాయి. హీరో బాలకృష్ణ-దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన 'అఖండ' (2021) మూవీ అనంతపురం నేపథ్యంలో ఉన్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ మూవీకి సీక్వెల్‌గా బాలకృష్ణ- బోయపాటి శ్రీను కాంబినేషన్‌లోనే 'అఖండ 2: తాండవం' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ సంయుక్త ఓ కీ రోల్ చేస్తున్నారు.


ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'అఖండ 2: తాండవం' కూడా 'అఖండ' సినిమా మాదిరి అనంతపురం నేపథ్యంలోనే ఉంటుందని ఊహించవచ్చు. ఈ సినిమాను సెప్టెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నవ్వించేకి వస్తుండా!



'కదిరి నరసింహ సామి సాచ్చిగా ఈ తూరి నవ్వించేకి వస్తుండా!' అని ఇటీవల తన కొత్త సినిమా గురించి వరుణ్ తేజ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. దీంతో వరుణ్ తేజ్ నెక్ట్స్ మూవీ రాయలసీమ నేపథ్యంలో ఉంటుందని స్పష్టమైపోయింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ వియత్నాంలో జరుగుతున్నాయి. పనిలో పనిగా ఈ మూవీ చిత్రీకరణ కోసం లొకేషన్లను కూడా వెతుకుతున్నారు మేకర్స్. ఈ పనుల కోసం హీరో వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ ప్రస్తుతం వియత్నాంలోనే ఉన్నారు. హారర్-కామెడీ జానర్‌లో రూపొందనున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మార్చి మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ సినిమా ప్రధానంగా అనంతపురం నేపథ్యంలో ఉంటుందని, 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించనున్నాయి.

## 19వ శతాబ్దంలో...



'టాక్సీవాలా' (2018) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో మరో చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీ రాయలసీమ నేపథ్యంలో సాగుతుంది. 19వ శతాబ్దంలో 1854-1878 మధ్య కాలంలో జరిగిన కొన్ని చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందనున్నట్లుగా తెలుస్తోంది. భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన కాలంలో జరిగిన కొన్ని చారిత్రక అంశాలను ఈ మూవీలో ప్రస్తావించనున్నట్లు తెలిసింది. వచ్చే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూట్ ప్రారంభం కానుందట. ఈ మూవీలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' చిత్రాల్లో విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా జంటగా నటించిన విషయం తెలిసిందే. అలాగే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలకు అమితాబ్ బచ్చన్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూలను మేకర్స్ సంప్రదించారనే వార్త ప్రచారంలో ఉంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## యాక్షన్ లవ్‌స్టోరీ



'ఏజెంట్' మూవీ తర్వాత అక్కినేని అఖిల్ తర్వాతి ప్రాజెక్ట్‌పై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. కానీ అఖిల్ తర్వాతి చిత్రం చిత్రీకరణ ఆల్రెడీ మొదలైందని, రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ లవ్‌స్టోరీ ఫిల్మ్‌కి 'లెనిన్' అనే టైటిల్ అనుకుంటున్నారని ఫిల్మ్ నగర్ సమాచారం. ఈ చిత్రంలో అఖిల్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ దర్శకుడు మురళీ కిశోర్ 'లెనిన్'ని తెరకెక్కిస్తున్నట్లుగా తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థలు ఈ మూవీని నిర్మిస్తున్నాయని సమాచారం.

## మాస్ సంబరాలు



'ఏటి గట్టు సాచ్చిగా చెబ్తాండ ఈ తూరి నరికినానంటే అరుపు గొంతులో నుంచి కాదు... తెగిన నరాలొన్నించొచ్చాది!... 'సంబరాల ఏటిగట్టు' చిత్రం కోసం సాయిదుర్గా తేజ్ చెప్పిన డైలాగ్ ఇది. దాదాపు రూ. 100 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ మూవీని కొత్త దర్శకుడు రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం రాయలసీమ నేపథ్యంలో ఉంటుందని తెలిసింది. ఐశ్వర్యా లక్ష్మీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం తొలి భాగం సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది.

## రాజకీయం... ప్రతీకారం



అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'రాచరికం'. సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరి 1న విడుదల కానుంది. పూర్తిగా రాయలసీమ నేపథ్యంలో సాగే ఫిల్మ్ ఇది. లవ్, యాక్షన్, రాజకీయాలు, ప్రతీకారం వంటి అంశాలతో ఈ చిత్రం రూపొందింది.

రాయలసీమ నేపథ్యంలో మరికొందరు కుర్ర హీరోలు సినిమాలు చేస్తున్నారు. ఇంకొందరు రాయలసీమ కథలు వింటున్నారు.

– ముసిమి శివాంజనేయులు

సాక్షి బిజినెస్
గురువారం
30-1-2025

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 632 | 76,533 |
| నిఫ్టీ ▲ | 206 | 23,163 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 19,588 | ▽ 145 |
| డోజోన్స్ | 44,797 | ▽ 53 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 8,558 | ▲ 24 |
| డాక్స్ | 21,638 | ▲ 207 |
| షాంఘై | 3,251 | ▽ 2 |
| నికాయ్ | 39,415 | ▲ 398 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 80,975 | ▲ 662 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 80,651 | ▲ 660 |
| వెండి (కిలో) | 90,680 | ▲ 930 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 86.05 | 87.07 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 105.20 | 108.00 |
| € | యూరో | ఎస్‌బీఐ | 88.77 | 91.39 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 54.62 | 55.98 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.19 | 55.39 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 60.95 | 65.62 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.13 | 23.69 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.19 | 23.74 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 11.01 | 12.83 |



# డీప్‌సీకర్ లియాంగ్

- చైనాలో ఝెజియాంగ్ ప్రావిన్స్‌లో విద్యాభ్యాసం
- ఆరేళ్ల కిందట హెడ్జ్ ఫండ్ ఏర్పాటు
- రెండేళ్ల క్రితమే డీప్‌సీక్‌తో ఏఐ మోడల్స్‌కు శ్రీకారం

అత్యంత శక్తిమంతమైన చౌక ఏఐ అసిస్టెంట్‌తో కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్న డీప్‌సీక్ సృష్టికర్త లియాంగ్ వెన్‌ఫెంగ్ (40) ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు టెక్ ప్రపంచంలో ఎక్కడా కనీసం వినబడని, కనబడని లియాంగ్ పేరు ఇప్పుడు ఎలాన్ మస్క్ (టెస్లా), శామ్ ఆల్ట్‌మన్‌ను (ఓపెన్ ఏఐ) మించి మార్మోగిపోతోంది. ఆయన గురించి మరింతగా తెలుసుకోవాలనే ఆసక్తి ఏర్పడింది. లియాంగ్ దక్షిణ చైనాలోని అయిదో శ్రేణి పట్టణమైన గ్వాంగ్‌డాంగ్‌లో జన్మించారు. ఆయన తండ్రి ఒక స్కూల్ టీచరు. ఈ–కామర్స్ దిగ్గజం ఆలీబాబా సహా టెక్ దిగ్గజాలకు కేంద్రమైన ఝెజియాంగ్ ప్రావిన్స్‌లో లియాంగ్ విద్యాభ్యాసం చేశారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ, 2010లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేశారు.

**హెడ్జ్‌ఫండ్‌తో వ్యాపార రంగంలోకి..**

లియాంగ్ 2015లో ఇద్దరు క్లాస్‌మేట్స్‌తో కలిసి హై–ఫ్లయర్ అసెట్ మేనేజ్‌మెంట్ పేరిట చైనాలో ఒక హెడ్జ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. సంక్లిష్టమైన అల్గోరిథంలతో ట్రేడింగ్ వ్యూహాలను అమలు చేసే ఈ ఫండ్ చాలా వేగంగా ఎదిగింది. కేవలం ఆరేళ్ల వ్యవధిలోనే ఫండ్ పోర్ట్‌ఫోలియో ఏకంగా 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.19 లక్షల కోట్లకు) చేరింది. అదే సమయంలో స్వంత ఏఐ ప్రాజెక్టు కోసం అంటూ శక్తివంతమైన ఎన్‌విడియా చిప్‌లను వేల సంఖ్యలో ఆయన కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. అటుపైన 2023లో కృత్రిమ మేధకు సంబంధించిన డీప్‌సీక్ స్టార్టప్‌ను ప్రారంభించారు. సాధారణ ఏఐ అవసరాలకు ఉపయోగపడే కోడర్, ఎల్‌ఎల్ఎం, వీ2 లాంటి మోడల్స్‌ను చకచకా ప్రవేశపెట్టి, బైట్‌డ్యాన్స్, బైదులాంటి దిగ్గజాలకు కాస్త కుదుపునిచ్చారు. కట్ చేస్తే, 2025 జనవరి వచ్చేసరికి అత్యంత సంక్లిష్టమైన రీజనింగ్ సామర్థ్యాలతో, ఓపెన్ఏఐ జీపీటీ–4కి పోటీగా డీప్‌సీక్–ఆర్1 ఏఐ అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టారు. ఒకవైపు బడా టెక్ దిగ్గజాలన్నీ తమ తమ మోడల్స్‌ను అభివృద్ధి చేసేందుకు మిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరిస్తూ, యూజర్ల నుంచి చార్జీలు కూడా వసూలు చేస్తుండగా.. డీప్‌సీక్ చాట్‌బాట్‌ను అత్యంత చౌకగా కేవలం 6 మిలియన్ డాలర్లకే (దాదాపు రూ. 52 కోట్లు) తయారు చేసి షాకిచ్చారు. పైగా ఇది అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో దీన్ని ఓపెన్‌సోర్స్ మోడల్‌గానే ఉంచుతామంటున్నారు. కృత్రిమ మేధ విషయంలో చైనాను అగ్రస్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని లియాంగ్ చెబుతున్న నేపథ్యంలో అమెరికన్ టెక్ దిగ్గజాలు దీనికి ఎలా చెక్ పెట్టబోతున్నాయనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**– సాక్షి, బిజినెస్ డెస్క్**

# మైండ్‌స్పేస్ చేతికి సస్టెయిన్ ప్రాపర్టీస్

- హైదరాబాద్‌లో 18.2 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్
- సంస్థ విలువ రూ. 2,038 కోట్లు



**న్యూఢిల్లీ:** మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ సస్టెయిన్ ప్రాపర్టీస్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి సంస్థ విలువను రూ. 2,038 కోట్లుగా లెక్కగట్టి ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఈక్విటీ వాటా కోసం రూ.613 కోట్లు చెల్లించనుండగా, రూ.1,400 కోట్ల రుణభారం మైండ్‌స్పేస్ రీట్‌కు బదిలీ అవుతుంది. ప్రతిగా సస్టెయిన్ ప్రాపర్టీస్ షేర్‌హోల్డర్లకు మైండ్‌స్పేస్ రీట్‌లో యూనిట్లు లభిస్తాయి. ఒక్కో యూనిట్‌కు రూ. 379.08 రేటు చొప్పున 1,61,68,090 యూనిట్లను సస్టెయిన్ ప్రాపర్టీస్ షేర్‌హోల్డర్లకు జారీ చేసే ప్రతిపాదనకు మైండ్‌స్పేస్ రీట్ బోర్డు ఆమోదముద్ర వేసింది. మార్చి ఆఖరు నాటికి డీల్ ముగిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ డీల్‌తో సస్టెయిన్ ప్రాపర్టీస్‌కి హైదరాబాద్‌లో కామర్జ్‌వన్ రాయ్‌దుర్గ్ పేరిట ఉన్న 18.2 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్.. మైండ్‌స్పేస్ రీట్ చేతికి దక్కుతుంది. యూనిట్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చేలా ఈ డీల్ ఒక మైలురాయిగా ఉంటుందని మైండ్‌స్పేస్ రీట్ సీఈవో రమేష్ నాయర్ తెలిపారు. ఆదాయాలు, కంపెనీ పోర్ట్‌ఫోలియోలు మెరుగుపడేందుకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కే రహేజా కార్పొరేషన్ గ్రూప్‌నకు చెందిన మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ 2020 ఆగస్టులో స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టయ్యింది.

# ఐటీ, ఫైనాన్స్ షేర్ల ర్యాలీ

- దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు
- సెన్సెక్స్ లాభం 632 పాయింట్లు



**ముంబై:** దిగువ స్థాయిల్లో ఐటీ, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ రాణించాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలు కలిసొచ్చాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 632 పాయింట్లు పెరిగి 76,533 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 206 పాయింట్లు బలపడి 23,163 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. మిడ్ సెషన్‌లో కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ.., వెంటనే తేరుకున్నాయి. ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 698 పాయింట్లు బలపడి 76,600 వద్ద, నిఫ్టీ 226 పాయింట్లు ఎగసి 23,183 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి.

ఆసియాలో జపాన్ నికాయ్ ఇండెక్సు 1% లాభపడింది. సెలవుల కారణంగా చైనా, హాంగ్‌కాంగ్, సింగపూర్, తైవాన్, ఇండోనేషియా, దక్షిణ కొరియా మార్కెట్లు పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా మార్కెట్లు పావుశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

→ అధిక వేల్యుయేషన్ల ఆందోళనలు, క్యూ3 ఫలితాలు నిరాశతో ఇటీవల నష్టాలు చవిచూసిన చిన్న, మధ్య తరహా షేర్లకు ఒక్కసారిగా డిమాండ్ లభించింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.28%, మిడ్‌క్యాప్ ఇండెక్సు 2.54% చొప్పున లాభపడ్డాయి.

→ ఇండెక్సుల వారీగా అత్యధికంగా రియల్టీ సూచీ 3.10% ర్యాలీ చేసింది. ఇండస్ట్రియల్ 3%, క్యాపిటల్ గూడ్స్ 2.75%, ఐటీ 2.50% పెరిగాయి. ఫార్మా ఇండెక్స్ 2% లాభపడింది.

→ డిసెంబర్ క్వార్టర్ నికర లాభం రెండింతల వృద్ధి నమోదుతో సంస్థ భెల్ షేరు 6.50% లాభపడి రూ.200 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 7% ర్యాలీ చేసి రూ.200 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,283 కోట్లు పెరిగి రూ.69,606 కోట్లకు చేరింది.

→ ఫిబ్రవరి 1న(శనివారం) సాధారణ బడ్జెట్ సందర్భంగా ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తామని మల్టీ కమోడిటీ ఎక్స్చేంజీ(ఎంసీఎక్స్) తెలిపింది. ఉదయం 9.00 నుంచి సాయంత్రం 5.00 గంటల మధ్య కమోడిటీ ట్రేడింగ్ ఉంటుందని సమాచారం ఇచ్చింది. ఇప్పటికే బడ్జెట్ రోజున ఎక్స్చేంజీలు పని చేస్తాయని ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలియజేశాయి.





# ఇంటి కలకు భరోసా!

- అమ్మకాలు పెరగాలంటే ప్రోత్సాహకాలు కల్పించాల్సిందే
- సింగిల్ విండో ద్వారా సులభతర అనుమతులు
- అందుబాటు ధరల ఇళ్ల నిర్వచనాన్ని సవరించాలి
- మౌలిక రంగం హోదా కల్పించాలి
- గృహ రుణం వడ్డీ చెల్లింపులకు మరింత పన్ను రాయితీ
- రియల్ ఎస్టేట్ రంగం డిమాండ్లు



గత బడ్జెట్‌లో అందించిన పలు ప్రోత్సాహక చర్యలకు కొనసాగింపుగా, 2025 బడ్జెట్‌లోనూ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి పలు కీలక చర్యలు ఉంటాయని పరిశ్రమ వర్గాలు ఆశావహంగా ఉన్నాయి. ముఖ్యంగా 2024 ద్వితీయ భాగంలో ఇళ్ల అమ్మకాలు బలహీనడపడ్డాయి. అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో (అఫర్డబుల్ హౌసింగ్) ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో పన్నుల ఉపశమనంతోపాటు, రియల్ ఎస్టేట్ రంగానికి మౌలిక రంగం హోదా కల్పించాలని, అనుమతులకు సింగిల్ విండో విధానం తీసుకురావాలని ఈ రంగం కోరుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన విస్తరణ, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, స్టాంప్ డ్యూటీ తగ్గింపు వంటి చర్యలకు గత బడ్జెట్‌లో చోటు కల్పించడం గమనార్హం.

**పరిశ్రమ వినతులు**

- మౌలిక రంగం హోదా కల్పించాలి. దీనివల్ల డెవలపర్లకు తక్కువ రేట్లకే రుణాలు అందుబాటులోకి వస్తాయి. కొనుగోలు దారులకు ఈ మేరకు ధరల్లో ఉపశమనం లభిస్తుంది.
- రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌కు పలు రకాల అనుమతులు పొందేందుకు ఎంతో కాలం వృథా అవుతోంది. అన్ని రకాల అనుమతులకు సింగిల్ విండో (ఏకీకృత విభాగం) తీసుకురావాలి.
- గతేడాది ఇళ్ల అమ్మకాలు క్షీణించడాన్ని రియల్టీ రంగం ప్రధానంగా ప్రస్తావిస్తోంది. అందుబాటు ధరల విభాగం (రూ.45 లక్షల్లోపు/60–90 చ.మీ కార్పెట్ ఏరియా)లో 2017 నుంచి అమ్మకాల్లో స్తబ్దత నెలకొంది. గత నాలుగేళ్లలో ధరలు పెరిగినందున ఈ విభాగం ధరల పరిమితిని సవరించాలి.
- ఆదాయపన్ను పాత విధానంలో సెక్షన్ 24 కింద గృహ రుణ వడ్డీ చెల్లింపులపై రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉండగా, దీన్ని మరింత పెంచాలి. కొత్త విధానంలోనూ వెసులుబాటు ఇవ్వాలి.
- మరింత మంది డెవలపర్లు ఆఫీస్ స్పేస్ విభాగంలోకి అడుగు పెట్టేందుకు వీలుగా అద్దె ఆదాయంపై పన్ను ప్రయోజనాలు కల్పించాలి.
- దేశవ్యాప్తంగా జీసీసీల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు కల్పించాలి. ప్రాపర్టీ లీజులకు జీఎస్‌టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సదుపాయం అందించాలి.

**– సాక్షి, బిజినెస్ డెస్క్**

"గృహ రుణం వడ్డీ రూ.2లక్షల పరిమితి చాలా సంవత్సరాలుగా మార్పునకు నోచుకోలేదు. ఈ కాలంలో వడ్డీ రేట్లతోపాటు ఇళ్ల ధరలు కూడా పెరిగిపోయాయి. ఫలితంగా డిమాండ్ తగ్గింది. ఈ పరిమితిని రూ.5లక్షలకు పెంచాలి"
– శైష్ చౌరారియా, క్రెస్ట్ వెంచర్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్



"రుణాల వ్యయాలు సవాలుగా మారాయి. వీటిని తగ్గిస్తే కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి చేయూత లభిస్తుంది. దీనికితోడు ప్రభుత్వం టైర్ 2, 3 పట్టణాల్లో మౌలిక నదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. దీనివల్ల అనుసంధానత పెరిగి రియల్ ఎస్టేట్ వృద్ధికి ఊతం లభిస్తుంది"
– స్వరాజ్ ఆనంద్, నియో డెవలపర్స్ సీవోవో



## ఐటీసీ హోటల్స్ @ రూ. 188

- స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టింగ్
- తొలి రోజు 5 శాతం డౌన్



**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన ఐటీసీ హోటల్స్ ఎక్స్చేంజీలలో లిస్టయ్యింది. బీఎస్ఈలో రూ. 188 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై అమ్మకాలు ఊపందుకోవడంతో 5% లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ. 179 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈలో రూ. 180 వద్ద లిస్టయ్యి 4.5% నష్టంతో రూ. 172 దిగువన ముగిసింది. ఒక దశలో రూ. 171 తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 37,170 కోట్లుగా నమోదైంది.

**రుణరహితం...**

ఐటీసీ హోటల్స్ రుణరహిత కంపెనీ. అంతే కాకుండా రూ. 1,500 కోట్ల నగదు, తత్సమాన విలువను కలిగి ఉంది. వెరసి వృద్ధి ప్రణాళికల అమలుకు అంతర్గత నిధులను వెచ్చించే వీలుంది. కంపెనీలో ఐటీసీకి 40 శాతం వాటా ఉంది. రానున్న ఐదేళ్లలో పోర్ట్‌ఫోలియోను 200 హోటళ్ల(18,000 గదులు)కు చేర్చుకునే యోచనలో ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మారుతీ లాభం స్పీడ్ | టాటా మోటార్స్ లాభం డౌన్ | ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడుల జోరు

# భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

» 2025 జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్
» పది నుంచి డిగ్రీ వరకు పలు అర్హతలతో ఉద్యోగ నియామక పరీక్షలు
» ముందస్తు సన్నద్ధతతో విజయం సాధించే అవకాశం

# కేంద్ర కొలువులకు సిద్ధమా!



ఎస్ఎస్‌సీ జాబ్ క్యాలెండర్

**సర్కారీ కొలువు.. నేటి యువతలో ఎక్కువ మంది లక్ష్యం! ఇందుకోసం ఆయా నియామక పరీక్షల నోటిఫికేషన్ల కోసం వేచి చూసే పరిస్థితి! ఏ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియని సందిగ్ధత!! ఇలాంటి సందేహాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఇటీవల 2025 సంవత్సరానికి సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖలు, విభాగాల్లో.. 2025-26 సంవత్సరంలో గ్రూప్-డి,సి,బి ఉద్యోగాల భర్తీకి చేపట్టే నియామక పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ జాబ్ క్యాలెండర్ 2025-26 వివరాలు, నిర్వహించనున్న పరీక్షలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...**

## సెలక్షన్ పోస్ట్ ఎగ్జామినేషన్ ఫేజ్–13

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 ఏప్రిల్ 16;
- **పరీక్ష:** 2025 జూన్/జులై.
- ఇది ఎస్ఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే నియామక పరీక్షల్లో కీలకమైనది. ఇందులో లెవల్–1 నుంచి లెవల్–6 వరకు పలు పోస్ట్‌లు ఉన్నాయి. మల్టీ టాస్కింగ్, గ్రేడ్–సి,గ్రేడ్–బి,గ్రేడ్–డి ఉద్యోగాలు సైతం ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.పదో తరగతి,ఇంటర్మీడియెట్,బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా ఎస్ఎస్‌సీ ఈ ఎంపిక ప్రక్రియను చేపడుతుంది. 2025కు సంబంధించి సెలక్షన్ పోస్ట్ ఎగ్జామినేషన్–ఫేజ్–13ను నిర్వహించనున్నారు.
- **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ పేరుతో రెండు దశల్లో ఎంపిక జరుగుతుంది. తొలిదశలో ఆన్‌లైన్‌లో 100 ప్రశ్నలు–200 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల (జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో టైపింగ్, డేటాఎంట్రీ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీపై స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.

## సీజీఎల్ ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025, ఏప్రిల్ 22;
- **పరీక్ష తేదీ:** 2025 జూన్/జులై.
- బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని గ్రూప్–బి, గ్రూప్–సి కేడర్స్‌లో ఉద్యోగాల ఎంపికకు నిర్వహించే పరీక్ష.. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్ఈ). కేంద్ర ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సహా సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్,ఇంటెలిజెన్స్ బ్యూరో,రైల్వే శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహా పలు శాఖల్లో గ్రూప్–బి హోదాలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అదే విధంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్‌లో గ్రూప్–సి హోదాలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ శాఖలో గ్రూప్–బి హోదాలో సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ (ప్రివెంటివ్ ఆఫీసర్), ఇన్‌స్పెక్టర్ (ఎగ్జామినర్), సీబీఐలో సబ్ ఇన్‌స్పెక్టర్(గ్రూప్–బి) తదితర పోస్ట్‌లను ఈ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.
- **రెండు దశల రాత పరీక్ష:** సీజీఎల్ఈ పరీక్షను టైర్–1, టైర్–2 పేరుతో రెండు దశలుగా నిర్వహిస్తారు. టైర్–1 పరీక్ష 100 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటుంది. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (25 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. టైర్–1లో అర్హత సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో టైర్–2 పరీక్ష నిర్వహిస్తారు. టైర్–2 పరీక్ష మొత్తం నాలుగు పేపర్లలో జరుగుతుంది.

## ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ దళాల్లో ఎస్ఐ పోస్టులు

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 మే 16; పరీక్ష తేదీ: 2025 జులై/ఆగస్ట్.
- కేంద్ర సాయుధ దళాలు, ఢిల్లీ పోలీస్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌ల భర్తీకి ఎస్ఎస్‌సీ ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. కేంద్ర సాయుధ దళాల పరిధిలో.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో–టిబెటిన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమాబల్ విభాగాలు, ఢిల్లీ పోలీస్ విభాగంలో ఈ పోస్టులు ఉంటాయి.
- **మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ:** ఈ పోస్ట్‌లకు ముందుగా రాత పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ పేరిట దేహ దారుఢ్య పరీక్షలు, అనంతరం పేపర్–2 పేరుతో మరో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా వైద్య పరీక్షలు ఉంటాయి. ఈ నివేదిక ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. పేపర్–1లో నాలుగు విభాగాల్లో 200 ప్రశ్నలు–200 మార్కులతో రాత పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ విభాగాల నుంచి 50 ప్రశ్నల చొప్పున ఉంటాయి.
- రెండో దశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఫిజికల్ ఈవెంట్ల తర్వాత దశలో పేపర్–2 పేరుతో మరో రాత పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ అనే ఒకే విభాగంలో.. 200 ప్రశ్నలు–200 మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది. దీనికి కూడా రెండు గంటల సమయం కేటాయిస్తారు.

## ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025, మే 27
- **పరీక్ష తేదీ:** 2025 జులై/ఆగస్ట్.
- ఇంటర్మీడియెట్ అర్హతతోనే కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల పరిధిలో గ్రూప్–సి పోస్ట్‌ల భర్తీకి నిర్వహించే పరీక్ష.. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సీహెచ్ఎస్ఎల్). ఎల్‌డీసీ, డేటాఎంట్రీ ఆపరేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్–ఎ తదితర పోస్ట్‌ల భర్తీకి ఈ పరీక్షను నిర్వహిస్తారు. మొత్తం రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలిదశలో టైర్–1, రెండో దశలో టైర్–2 పరీక్షలు ఉంటాయి.
- టైర్–1 పరీక్షలో నాలుగు విభాగాలు (ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 100 ప్రశ్నలతో 200 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో టైర్–1 పరీక్ష జరుగుతుంది. టైర్–1 పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా టైర్–2 పరీక్ష నిర్వహిస్తారు.

## మల్టీ టాస్కింగ్(నాన్–టెక్నికల్), హవాల్దార్(సీబీఐసీ, సీబీఎన్) ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 జూన్ 26; పరీక్ష: 2025 సెప్టెంబర్/అక్టోబర్.
- పదో తరగతి అర్హతతో గ్రూప్–సి ఉద్యోగాల్లో కొలువుదీరేందుకు అవకాశం కల్పించే పరీక్ష.. మల్టీ టాస్కింగ్ (నాన్–టెక్నికల్), హవాల్దార్(సీబీఐసీ, సీబీఎన్)ఎగ్జామినేషన్. ఈ పరీక్ష ద్వారా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో హవాల్దార్ పోస్ట్‌ల భర్తీ చేపడతారు.
- ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్ట్‌ల ఎంపిక ప్రక్రియలో మూడు దశలు ఉంటాయి. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌ను కేవలం హవాల్దార్ పోస్ట్‌ల అభ్యర్థులకే నిర్వహిస్తారు.
- ఎంటీఎస్, హవాల్దార్ పోస్ట్‌ల ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష రెండు సెషన్లుగా 270 మార్కులకు ఉంటుంది. సెషన్–1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ (20 ప్రశ్నలు–60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ (20 ప్రశ్నలు–60 మార్కులు), సెషన్–2లో జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు–75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (25 ప్రశ్నలు–75 మార్కులు) విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.

## స్టెనోగ్రాఫర్ గ్రేడి–సి,గ్రేడ్–డి ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025, జూలై 29
- **పరీక్ష తేదీ:** 2025 అక్టోబర్/నవంబర్.
- ఇంటర్మీడియెట్ అర్హతతో కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి ఉద్యోగాల భర్తీకి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. తొలిదశలో రాత పరీక్షను మూడు విభాగాల్లో (జనరల్ ఇంటెలిజెన్స్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు–100 మార్కులు) 200 మార్కులకు నిర్వహిస్తారు. రాత పరీక్ష తర్వాత దశలో స్కిల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్టెనోగ్రఫీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇంగ్లిష్ భాషలో నిమిషానికి 100 పదాలు, హిందీ భాషలో నిమిషానికి 80 పదాలు ప్రాతిపదికగా డిక్టేషన్ ఇస్తారు. ఇంగ్లిష్ కంప్యూటర్ టైపింగ్‌కు సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి పోస్ట్‌ల అభ్యర్థులు 50 నిమిషాల్లో, గ్రేడ్–సి పోస్ట్‌ల అభ్యర్థులు 40 నిమిషాల్లో సదరు డిక్టేషన్ టైపింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. హిందీకి సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి అభ్యర్థులు 65 నిమిషాల్లో, గ్రేడ్–సి అభ్యర్థులు 55 నిమిషాల్లో.. సదరు డిక్టేషన్‌ను కంప్యూటర్‌పై టైపింగ్ చేయాల్సి ఉంటుంది.

## జూనియర్ ఇంజనీర్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్) ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025, ఆగస్ట్ 5; పరీక్ష తేదీ: 2025 అక్టోబర్/నవంబర్.. డిప్లొమా అర్హతతో కేంద్ర ప్రభుత్వ శాఖలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో.. జూనియర్ ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి ఉద్దేశించిన పరీక్ష ఇది. ఈ పరీక్షకు బీటెక్ ఉత్తీర్ణులు కూడా పోటీ పడే అవకాశం ఉంది. ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని దాదాపు పది శాఖలు, సంస్థల్లో జూనియర్ ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీ చేపడతారు.
- **రెండు పేపర్లలో రాత పరీక్ష:** రాత పరీక్షల్లో మెరిట్ ఆధారంగా జూనియర్ ఇంజనీర్ కొలువులు ఖరారు చేస్తారు. పేపర్–1, పేపర్–2 పేరుతో రెండు పేపర్లలో పరీక్ష ఉంటుంది. తొలిదశగా పేపర్–1ను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ పేపర్ మూడు విభాగాల్లో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, పార్ట్–ఎ(సివిల్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్), పార్ట్–బి (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), పార్ట్–సి (మెకానికల్ ఇంజనీరింగ్) విభాగాలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్‌ల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్–ఎ/పార్ట్–బి/పార్ట్–సికి 100 మార్కులు ఉంటాయి. అభ్యర్థులు తాము డిప్లొమా లేదా బీటెక్‌లో చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా పార్ట్–ఎ లేదా పార్ట్–బి లేదా పార్ట్–సిలలో ఏదో ఒక విభాగంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- పేపర్–2ను పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లతో డిస్క్రిప్టివ్ విధానంలో 300 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–ఎ జనరల్ ఇంజనీరింగ్ (సివిల్ అండ్ స్ట్రక్చరల్), పార్ట్–బి జనరల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), పార్ట్–సి జనరల్ ఇంజనీరింగ్ (మెకానికల్) పేరుతో పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా సంబంధిత సబ్జెక్ట్ విభాగంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.

## కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 ఆగస్టు 26;
- **పరీక్ష తేదీ:** 2025 నవంబర్/డిసెంబర్.
- హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతో పీజీ ఉత్తీర్ణతతో.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో హిందీ అనువాదకుల(ట్రాన్స్‌లేటర్) పోస్ట్‌ల భర్తీకి నిర్వహించే పరీక్ష ఇది. ఈ పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాల్లో.. జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు. అభ్యర్థులు పీజీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను మెయిన్ సబ్జెక్ట్స్ లేదా ఎలక్టివ్స్‌గా చదివుండాలి. హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి, అదే విధంగా ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేయడంలో డిప్లొమా లేదా సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **రాత పరీక్ష:** రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 జనరల్ ఇంగ్లిష్, జనరల్ హిందీల నుంచి 100 ప్రశ్నలు–100 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–2లో ట్రాన్స్‌లేషన్ అండ్ ఎస్సే రైటింగ్ విభాగాలు (200 మార్కులు) ఉంటాయి. ట్రాన్స్‌లేషన్‌కు సంబంధించి హిందీలో ఒక ప్యాసేజ్, ఇంగ్లిష్‌లో ఒక ప్యాసేజ్ ఇస్తారు. వీటిని ఇంగ్లిష్, హిందీలలోకి అనువదించాల్సి ఉంటుంది. అదే విధంగా అభ్యర్థులకు ఏదైనా ఒక అంశంపై హిందీ, ఇంగ్లిష్‌లలో ఎస్సే రాయాల్సి ఉంటుంది.

## కానిస్టేబుల్ (జీడీ) ఎగ్జామినేషన్

- **నోటిఫికేషన్ తేదీ:** 2025 నవంబర్ 11;
- **పరీక్ష తేదీ:** 2026 మార్చి/ఏప్రిల్.
- కేంద్ర సాయుధ దళాల్లో.. కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ), అస్సాం రైఫిల్స్‌లో రైఫిల్‌మెన్ (జీడీ) పోస్ట్‌ల భర్తీకి నిర్వహించే పరీక్ష ఇది. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సశస్త్ర సీమాబల్, ఐటీబీపీ, అస్సాం రైఫిల్స్(రైఫిల్‌మెన్),సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (సిపాయి)లో పోస్ట్‌ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తారు.
- **మూడంచెల ఎంపిక ప్రక్రియ:** ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఎంపిక ప్రక్రియను మూడంచెల్లో నిర్వహించనున్నారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఈ మూడు దశల తర్వాత డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ పరీక్షలు కూడా ఉంటాయి. ముందుగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. గంటన్నర వ్యవధిలో నాలుగు విభాగాల్లో (జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్/హిందీ) జరుగుతుంది. ఒక్కో విభాగం నుంచి 80 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌కు చెందిన కేంద్రాల్లో రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లోనూ అర్హత సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ ఉంటుంది. మొత్తం నాలుగు దశల్లో (రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లు) అభ్యర్థులు చూపిన ప్రతిభ, ఇతర రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు. అదే విధంగా మొత్తం నాలుగు దశల్లో కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

# ఆదాయపన్నుకు 'సిక్కిం'దే లేదు



- సాక్షి, సెంట్రల్ డెస్క్


ఏటా బడ్జెట్ వస్తుందంటే చాలు.. తమకు ఏమైనా ఊరట లభిస్తుందేమోననే ఆశ వేతన జీవుల్లో కనిపిస్తుంది. ఆదాయపన్నులో ఏమైనా రాయితీలు కల్పించారా అనే లెక్కల్లో మునిగిపోతారు. మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉండే మనదేశంలో పన్ను కట్టే ఉద్యోగుల నుంచి కార్పొరేట్ కంపెనీల వరకు బడ్జెట్ రోజున ఐటీ శ్లాబ్‌ల గురించి ఆరా తీస్తారు. అయితే, దేశం మొత్తం ఈ లెక్కలతో బిజీగా ఉన్నా.. ఒక్క రాష్ట్రం లోని ప్రజలు మాత్రం తమకేం సంబంధం లేనట్టుగా ఉంటారు. ఎందుకంటే వారు ఆదాయపన్ను అనేదే కట్టరు. అదేంటి పన్ను కట్టకుంటే కేంద్ర ప్రభుత్వం ఊరుకుంటుందా అనే డౌట్ వస్తుందా? అవును ఆ వెసులుబాటు ఇచ్చిందే కేంద్రం. ఇంతకీ ఆ రాష్ట్రం ఏంటో తెలుసా?.. సిక్కిం. 330 ఏళ్లకుపైగా రాచరిక రాజ్యంగా స్వతంత్రంగా ఉన్న సిక్కిం.. 1975లో 22వ రాష్ట్రంగా భారత్‌లో విలీనమైంది. అయితే ఆ సమయంలో సిక్కిం ఓ షరతు పెట్టింది. తాము భారత్‌లో విలీనమైనా.. తాము అంతకుముందు తమ పాలనలో ప్రజలకు పన్నులు విధించలేదని, ఇప్పుడు కూడా ఆ విధానాన్నే అనుసరిస్తామని స్పష్టంచేసింది. దీనికి భారత ప్రభుత్వం అంగీకరించడంతో సిక్కిం ప్రజలకు ఆదాయ పన్ను కట్టే భారం తప్పింది. ఈమేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 371ఎఫ్ ప్రకారం సిక్కింకు ప్రత్యేక హోదా ఉంటుంది.

### తలసరి ఆదాయంలో నంబర్‌వన్..

దేశంలో సేంద్రియ రాష్ట్రంగా గుర్తింపు పొందిన సిక్కిం తలసరి ఆదాయం కూడా అదుర్స్. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.5,88,000 తలసరి ఆదాయంతో దేశంలోనే సిక్కిం టాప్‌లో నిలిచింది. 2023–24 ఆర్థిక సంవత్సరం జాతీయ సగటులో సిక్కిం తలసరి ఆదాయం 320 శాతంగా ఉంది. ఇది దేశంలోనే అత్యధికం. ఇక సిక్కిం తలసరి స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ) దేశ తలసరి జీడీపీ కంటే మూడు రెట్లు ఎక్కువ.

### ఎవరికి మినహాయింపు ఉంటుంది?

ఇదంతా విన్న తర్వాత అర్జెంటుగా సిక్కిం వెళ్లిపోతే ఈ ఐటీ బాధలేమీ ఉండవు అనుకుంటున్నారా? అలాంటి పప్పులేమీ ఉడకవు.. 1975 కంటే ముందు నుంచి అక్కడ ఉన్న సిక్కిం నివాసితులకు మాత్రమే ఈ పన్ను మినహాయింపు వర్తిస్తుంది. వేరే ప్రాంతాల నుంచి అక్కడికి వలస వెళ్లినవారికి ఇది వర్తించదు. ఈ మేరకు 2008లో కేంద్ర ప్రభుత్వం ఆదాయపన్ను చట్టంలో సెక్షన్ 10 (26 ఎఎఎ)ను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఒక వ్యక్తి సిక్కింకి చెందిన వారు అయి ఉండి ఏ రకంగానైనా ఆదాయం సంపాదిస్తున్నట్లయితే పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. అలాగే ఆ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కంపెనీ వేరే రాష్ట్రంలో ఉండి డివిడెండ్‌లు, సెక్యూరిటీల ద్వారా ఆదాయం వస్తే కూడా పన్ను మినహాయింపు ఉంటుంది.



## సమస్యలు 'డబుల్'

ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 170లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన 256 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా ఇళ్ల తలుపులు, కిటికీలు, మరుగుదొడ్డి సామగ్రి, సింథటిక్ ట్యాంకులు చోరీ అయ్యాయి. ఇళ్ల వద్ద పిచ్చి మొక్కలు మొలిచి పశు, పక్ష్యాదులకు ఆవాసాలుగా మారాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# వస్త్రోత్పత్తుల నాణ్యతనూ గుర్తించొచ్చు..

- హైదరాబాద్‌లో బీఐఎస్ లేబొరేటరీ ప్రారంభం
- కేంద్ర ప్రభుత్వ క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లలో కీలకం

సాక్షి, హైదరాబాద్: వస్త్రోత్పత్తుల నాణ్యతను పరిశీలించేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్‌లో లేబొరేటరీని ప్రారంభించింది. వస్త్రోత్పత్తుల నాణ్యత పరిశీలనకే ప్రత్యేకించిన ఈ లేబొరేటరీని బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ బుధవారం ప్రారంభించారు. టెక్స్‌టైల్ రంగంలో నాణ్యతా పరీక్షల వాతావరణాన్ని అత్యాధునిక సాంకేతికత, వసతులతో ఏర్పాటైన ఈ లేబొరేటరీ బలోపేతం చేస్తుంది. 'కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లను సరఫరా చేయడంలో ఈ లేబొరేటరీ కీలకంగా పనిచేస్తుంది. టెక్స్‌టైల్ ఉత్పత్తులు జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకునేలా చేయడంలో దీని పాత్ర అత్యంత కీలకం. త్వరలో నూలును పరిశీలించే సౌలభ్యం కూడా అందుబాటులోకి రానుంది. వస్త్రోత్పత్తుల నాణ్యతను పరిశీలించేందుకు లేబొరేటరీ ఏర్పాటైన ఇదే భవనంలో బంగారం నమూనాల స్వచ్ఛతను పరిశీలించే ప్రయోగశాల కూడా ఉంది. ఈ లేబొరేటరీలో ఏర్పాటు చేసిన యూనివర్సల్ టెస్టింగ్ మెషీన్ (యూటీఎం) పరికరం ద్వారా వస్త్రోత్పత్తుల నాణ్యత, మన్నికను పరిశీలిస్తారు' అని తివారీ వెల్లడించారు. కార్యక్రమంలో బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (లేబొరేటరీస్) నిషత్ సుల్తానా, దక్షిణ ప్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మీనాక్షి గణేశన్, హైదరాబాద్ బ్రాంచ్ ల్యాబొరేటరీ హెడ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఎలా పనిచేస్తుంది...

యూనివర్సల్ టెస్టింగ్ మెషీన్‌లో వస్త్రాలకు ఉపయోగించే దారానికి కంట్రోల్డ్ టెన్సిల్ ఫోర్స్‌ను వినియోగిస్తారు, ఈ దారం తెగే వరకు లాగుతారు. ఎక్కడైతే దారం తెగుతుందో.. వినియోగించిన బలాన్ని లెక్కించి ఎంత నాణ్యమైందో రూఢీ చేసుకుంటారు. దీని ఆధారంగా మన్నిక, నాణ్యతను గుర్తిస్తారు.

# ఖాతాలు తెరుస్తారు.. లావాదేవీలకు సహకరిస్తారు

**ప్రైవేట్ బ్యాంకుల అధికారుల కాసుల కక్కుర్తి** | **సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్న వైనం**

- రెండు కేసుల దర్యాప్తులో వీరి పాత్ర గుర్తించిన పోలీసులు
- మూడు బ్యాంకులకు చెందిన ముగ్గురు కటకటాల్లోకి..
- వీరితో పాటు 10 రాష్ట్రాలకు చెందిన మొత్తం 52 మంది అరెస్టు

సాక్షి, హైదరాబాద్: నేపాల్, చైనాల్లో కూర్చుని, దేశ వ్యాప్తంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని, యాప్‌ల ద్వారా వివిధ రకాలైన సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితులతో స్థానిక ప్రైవేటు బ్యాంకుల మేనేజర్లూ కుమ్మక్కవుతుండటం ఆందోళన కలిగించే అంశం. రెండు కేసుల దర్యాప్తు నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు వీరి పాత్రను గుర్తించారు. ఆర్బీఎల్, కొటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంకులకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రత్యేక బృందాలు పది రాష్ట్రాల్లో చేసిన దాడుల్లో వీరితో సహా 52 మందిని పట్టుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ నిందితులపై నగరంలో 33, రాష్ట్రంలో 74, దేశ వ్యాప్తంగా 576 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించామన్నారు. డీసీపీ దార కవిత, ఏసీపీ ఆర్‌జీ శివ మారుతిలతో కలిసి బుధవారం ఐసీసీసీలో



సీజ్ చేసిన ఖాతాబుక్‌లను చూపుతున్న సీపీ సీవీ ఆనంద్

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ వివరాలు వెల్లడించారు.

### సేవింగ్‌కు ఒక రేటు కరెంటుకు ఒక రేటు..

సైబర్ నేరాల సూత్రధారులకు బాధితులతో నగదు డిపాజిట్ చేయించుకోవడానికి సేవింగ్స్ ఖాతా, కాజేసిన భారీ మొత్తాలను డ్రా చేసుకోవడానికి కరెంట్ ఖాతాలు అవసరం. దీనికోసం వీళ్లు నేపాల్‌కు చెందిన కొందరిని దళారులుగా మార్చుకుంటున్నారు. వీరు దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో సంచరిస్తూ స్థానిక మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులను సంప్రదిస్తున్నారు. నిబంధనలేవీ పట్టించుకోకుండా బ్యాంకు ఖాతాలు తెరిచి ఇవ్వాలని, లావాదేవీల్లో నిబంధనల ఉల్లంఘనలను కూడా చూసీ చూడనట్లు వదిలేయాలని చెప్పి ఒప్పందాలు చేసుకుంటున్నారు. సేవింగ్ ఖాతాకు రూ.50 వేల వరకు, కరెంట్ ఖాతాకు రూ.80 వేల వరకు తీసుకుంటున్న బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నారు. ఆయా ఖాతాలకు సంబంధించిన నెట్ బ్యాంకింగ్‌ను ఆపరేట్ చేయడానికి అవసరమైన వివరాలన్నీ టెలిగ్రామ్ యాప్ ద్వారా సూత్రధారులకు చేరుతున్నాయి.

### కేసుల దర్యాప్తులో వెలుగు చూసిన లింకులు

నేపాల్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తి ద్వారా బెంగళూరు విద్యారణ్యపురలోని ఆర్‌బీఎల్ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ శుభం కుమార్ ఝా, మల్లీశ్వరంలోని యాక్సిస్ బ్యాంక్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ హరూన్ రషీద్, ఫ్యాబ్రికేషన్ వ్యాపారి ఆర్.మోహన్ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లోకి ప్రవేశించారు. వివిధ బ్యాంకుల్లో 20 బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు వీరు సహకరించారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి రూ.23 కోట్లు కాజేశారు. హైదరాబాద్‌లో గత ఏడాది జరిగిన రూ.93 లక్షల ట్రేడింగ్ ఫ్రాడ్ కేసు దర్యాప్తులో బెంగళూరు లింకులు గుర్తించిన పోలీసులు ఆ ముగ్గురినీ కటకటాల్లోకి పంపారు. అలాగే గతంలోనే జరిగిన, రూ.2.06 కోట్లతో ముడిపడి ఉన్న మరో ట్రేడింగ్ ఫ్రాడ్ కేసు దర్యాప్తులో హైదరాబాద్ జేఎన్టీయూలో ఉన్న కొటక్ మహీంద్రా బ్యాంక్ సేల్స్ మేనేజర్ కాటా శ్రీనివాస్ పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో ఇతడితో పాటు తమ పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరవడానికి సహకరించిన వారినీ పోలీసులు అరెస్టు చేశారు.

### తొలిసారిగా క్రిప్టో కరెన్సీ స్వాధీనం

ఈ ఫ్రాడ్‌లో పలువురు నిందితులు నగరానికి చెందిన వారే అని తేలింది. వీరంతా టెలిగ్రామ్ యాప్ ద్వారా నేరగాళ్ల నెట్‌వర్క్‌లోకి ప్రవేశించారు. వీరి నుంచి రూ.47.5 లక్షల నగదుతో పాటు క్రిప్టో కరెన్సీ రూపంలో ఉన్న రూ.40 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రిప్టో కరెన్సీని సీజ్ చేయడం నగర పోలీసు చరిత్రలో ఇదే తొలిసారి. కాగా ఈ ఖాతాల ద్వారా జరిగే ప్రతి లావాదేవీకి గాను కాటా శ్రీనివాస్‌కు ఒక శాతం కమీషన్‌గా ముట్టడం గమనార్హం.

### పలు మోసాల్లో నిందితులుగా..

ఈ కేసులో వీరితో పాటు అరెస్టు అయిన 52 మంది నిందితులు ఆన్‌లైన్ లేదా ఫోన్ కాల్ ద్వారా ఎర వేసి, వివిధ రకాలైన పేర్లు చెప్పి నగర వాసుల నుంచి రూ.8.83 కోట్లు కాజేసిన కేసుల్లోనూ నిందితులుగా ఉన్నారు. సోషల్‌మీడియా గ్రూపుల ద్వారా ఎర వేసి, పెట్టుబడుల పేరుతో స్వాహా చేసే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌తో పాటు డిజిటల్ స్కామ్స్ కేసుల్లోనూ వీళ్లు నిందితులుగా ఉన్నారు. కాగా వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.2.87 కోట్లు ఫ్రీజ్ చేశారు. 'సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్నాం. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అందులో భాగంగా పిరామల్ ఫైనాన్స్ సంస్థతో కలిసి పని చేస్తున్నాం..' అని కమిషనర్ చెప్పారు.

# గేమింగ్ యాప్‌ల యాక్సెస్ ఆపేయండి

**గేమింగ్ ఫెడరేషన్, ఫాంటసీ స్పోర్ట్స్ సీఈవోలు, వ్యవస్థాపకులకు పోలీసుల అల్టిమేటం**



శిఖాగోయెల్

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు తెలంగాణలో యాక్సెస్ లేకుండా చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) ఆ సంస్థల నిర్వాహకులను కోరింది. రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనంతో అప్పులై ఆత్మహత్యలు చేసుకుంటున్న యువత వివరాలతో బుధవారం ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్(ఏఐజీఎఫ్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్, ప్రధాన గేమింగ్ ప్లాట్‌ఫాం వ్యవస్థాపకులు, సీఈవోలతో టీజీసీఎస్‌బీ కీలక సమావేశం నిర్వహించింది. తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్ ప్రతికూల ప్రభావాన్ని నియంత్రించడానికి చర్యలను అన్వేషిస్తున్నట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ స్పష్టం చేశారు. రాష్ట్రం తీసుకొచ్చిన గేమింగ్ చట్టం, చట్టపరమైన నిబంధనలు, గేమింగ్ కార్యకలాపాలకు వర్తింపచేసే అంశంపై నొక్కి చెప్పారు. ఈవారంలో తెలంగాణలో నమోదైన కేసులకు సంబంధించిన గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు నోటీసులు జారీ చేసిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. రాష్ట్రంలో వారి ప్లాట్‌ఫారమ్‌లను నిలిపివేయాలని ఆదేశించినట్టు శిఖాగోయెల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జియోఫెన్సింగ్, కఠిన కేవైసీ నిబంధనలు పాటించని, స్థానిక చట్టాలను ఉల్లంఘించే గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నియంత్రణ చర్యలు, అందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను కూడా ఈ సమావేశంలో చర్చించారు. భారతీయ, ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను పర్యవేక్షించడానికి, రాష్ట్ర నిర్దిష్ట చట్టాల నిబంధనలకు అనుగుణంగా ఉండేలా కేంద్రీకృత నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖకు అధికారికంగా నివేదిక ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు శిఖాగోయెల్ తెలిపారు.

### ప్రజలకు విజ్ఞప్తి..

ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే నష్టాలపై జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలకు విజ్ఞప్తి చేసింది. గేమింగ్ వ్యసనం, ఆర్థిక బాధలు.. తీవ్ర మానసిక ఆరోగ్య పరిణామాలకు దారి తీస్తుందని పేర్కొంది. చట్టవిరుద్ధమైన గేమింగ్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థల గురించి టీజీసీఎస్‌బీకి తెలపాలని కోరింది. ఆన్‌లైన్ గేమింగ్, వ్యసనాల కారణంగా ఆర్థిక ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొంటే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా www. cybercrime. gov. in సంప్రదించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ విజ్ఞప్తి చేశారు.

## ఏటికొప్పాక బొమ్మల శకటానికి జ్యూరీ అవార్డు


సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 76వ రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని చేతి వృత్తుల కళా ప్రాముఖ్యత చాటుతూ, రాష్ట్ర వారసత్వ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటి కొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన శకటానికి ఈ అవార్డు లభించింది. 30 ఏళ్ల తర్వాత దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శించే శకటానికి అవార్డు లభించిందని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.

## టెన్త్ విద్యార్థులకు పరీక్షల వరకు అల్పాహారం

- డీఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు అల్పాహారం అందించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి బుధవారం అన్ని జిల్లాల డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. టెన్త్ పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ స్కూల్‌లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. వీరికి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20 వరకు మొత్తం 38 పని దినాల్లో అల్పాహారం అందిస్తారు. ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున బడ్జెట్ మంజూరు చేసినట్టు నర్సింహారెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉడికించిన పెసలు, బొబ్బర్లు, శనగలు, పల్లీ బెల్లం, మిల్లెట్ బిస్కెట్లు, ఉల్లి పకోడీని రోజుకో వెరైటీ చొప్పున అందించాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగించాలంది. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమన్వయం చేసుకోవాలని డీఈవోలకు సూచించింది.

## నోటిఫికేషన్ నాటి ఇన్‌కం ట్యాక్స్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిందే: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇచ్చిన నోటిఫికేషన్ నాటి ఇన్‌కం ట్యాక్స్ సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. నోటిఫికేషన్‌కు ముందు, ఆ తర్వాత ఇచ్చిన సర్టిఫికెట్‌ను అనుమతించాలని కమిషన్‌కు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు దాఖలైన అప్పీల్‌ను కొట్టివేసింది. 2022లో గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. 2024లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందే అభ్యర్థులు 2021–22 ఇన్‌కం ట్యాక్స్ సర్టిఫికెట్‌ను సమర్పించాలని ఆదేశించింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్–2 పోస్టుకు దరఖాస్తు చేసిన సిద్దిపేటకు చెందిన కె.తిరుపతి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం 2022–23, 2023–24 సంవత్సరాలకు ఐటీ సర్టిఫికెట్లు సమర్పించగా టీజీపీఎస్సీ నిరాకరించింది. కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, తిరుపతి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పిటిషన్‌ను కొట్టివేస్తూ.. కమిషన్ నిర్ణయాన్ని సమర్థించారు. దీంతో తిరుపతి అప్పీల్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ అభినందకుమార్ షావిలి, జస్టిస్ ఎ.లక్ష్మీనారాయణ ధర్మాసనం బుధవారం అప్పీల్‌ను కొట్టివేసింది. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను ప్రస్తుత సంవత్సరాలకే జారీ చేయాలని, గత ఏడాదికి విడుదల చేయరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. దీంతో 2021–22 సర్టిఫికెట్ సమర్పించడం సాధ్యంకాదన్నారు. నోటిఫికేషన్ ప్రకారం 2021–22 సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని కమిషన్ తరఫు న్యాయవాది చెప్పారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



అజీంగఢ్ అతిథిగృహం



ధ్వంసమైన కిటికీలు

# అజీంగఢ్‌కు గడ్డు రోజులు

నిజాం కాలంనాటి చారిత్రక కట్టడం | గతంలో పలు సినిమాల చిత్రీకరణ

## నేడు శిథిలావస్థకు చేరుతున్న పురాతన కట్టడం



పగిలిన అజీంగఢ్ కోట మెట్లు

ఒకప్పుడు ఎంతోమంది ఇంజనీర్లు సహా ఇంకెందరో సేదదీరారు ఆ కోట నీడలో.. ఇంకెన్నో చిత్రాల్లోని సన్నివేశాలు చిత్రీకరించారు అక్కడే.. పురాతన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది.. ప్రభుత్వ నిరాదరణతో శిథిలావస్థకు చేరింది. అదే నిజాం కాలం నాటి అజీంగఢ్ కోట. - దేవరకొండ

**నిజాం నాటి కట్టడం**

1980వ దశకంలో అజీంగఢ్ కోటలో రెండు తెలుగు సినిమాల్లోని పలు సన్నివేశాలను చిత్రీకరించారు. 1940–43 సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి నిజాం కాలంనాటి ఇంజనీర్ ఖాజా అజ్మొద్దీన్.. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో దుందుభి వాగుపై ప్రాజెక్టును నిర్మించారు. ఈ క్రమంలో ప్రాజెక్టుకు మంజూరు చేసిన నిధులు.. నిర్మాణం పూర్తయ్యాక కూడా కొన్ని మిగిలాయి. దీంతో డిండి మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలోని బాపన్‌కుంట వద్ద అజీంఘడ్ అనే పేరుతో రాతి కోటను నిర్మించారు. ఆ కోటను ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక కూడా ఇంజనీర్లకు విశ్రాంతి భవనంగా ఉపయోగపడింది. నిజాం పరిపాలన అనంతరం స్థానికంగా ఉన్న నీటిపారుదల శాఖ అతిథి గృహంతో పాటు అజీంగఢ్ కోట ఇరిగేషన్ శాఖ అధీనంలోకి వెళ్లాయి. అప్పటి నుంచి ఆ శాఖ పర్యవేక్షణలోనే కోట నిర్వహణ కొనసాగుతోంది.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు ఎనిమిదేళ్ల క్రితం జరిగిన కృష్ణా పుష్కరాల్లో భాగంగా అజీంగఢ్ మరమ్మతులకు దాదాపు రూ.20 లక్షలు కేటాయించింది. దీంతో అధికారులు అజీంగఢ్ కోటలో మెట్ల నిర్మాణం, నూతనంగా తలుపులు, కిటికీలు, భవనానికి రంగులు తదితర మరమ్మతులు చేపట్టి.. ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. రాతితో పటిష్టంగా నిర్మించిన ఈ కోటను డిండి–దేవరకొండ వెళ్లే మార్గమధ్యలో రాకపోకలు సాగించే వారు చూసి అబ్బుర పడుతుంటారు. కానీ కోట నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పర్యాటకులకు ఆహ్లాదం పంచడం లేదు.

**రెండు తెలుగు సినిమాల చిత్రీకరణ**

ఈ కోటలో 1980వ దశకంలో రెండు తెలుగు సినిమాలకు సంబంధించి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. నాగేశ్వరరావు, అన్నపూర్ణ నటించిన 'ఆత్మగౌరవం' చిత్రంలోని పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. చంద్రమోహన్, విజయశాంతి జంటగా నటించిన 'అమాయక చక్రవర్తి' సినిమాను దాదాపు 30 శాతం ఇక్కడే చిత్రీకరించారు.

**వైభవం కోల్పోతున్న అజీంగఢ్**

ఎంతో చరిత్ర కలిగిన అజీంగఢ్ కోట ప్రస్తుతం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. అప్పటి ఇంజనీర్ల ప్రతిభతో ఎంతో సుందరంగా నిర్మించిన ఈ కోట నిర్వహణ లోపంతో పర్యాటకులకు నిరాశే మిగులుతోంది.
మొత్తం రాతితో చెక్కు చెదరకుండా నిర్మించిన కోట ప్రస్తుతం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. ప్రభుత్వాలు, అధికారులు కోట అభివృద్ధికి చర్యలు చేపట్టి.. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలనేది ఇక్కడి ప్రజల ఆకాంక్ష. కాంగ్రెస్ ప్రభుత్వం అజీంగఢ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే.. డిండి మండల అభివృద్ధి మరింత సాధ్యపడుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్, డీఎస్ జగన్, డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో తొక్కిసలాట బాధాకరం

**మంత్రి కోమటిరెడ్డి**



సాక్షి, హైదరాబాద్: మహాకుంభమేళాలో తొక్కిసలాట జరిగి.. పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలు, పెద్ద సంఖ్యలో గాయపడిన భక్తులకు ఆయన సానుభూతిని తెలియజేశారు. మహా కుంభమేళాకు వెళ్లే తెలంగాణ భక్తులు.. ప్రశాంతంగా పుణ్యస్నానాలు ఆచరించాలని బుధవారం ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్‌లో మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మహా కుంభమేళా మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: మహా కుంభమేళా తొక్కిసలాటలో పలువురు భక్తుల మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్ రైతు దీక్ష అట్టర్ ఫ్లాప్ షో

**టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: నల్లగొండలో మాజీ మంత్రి కేటీఆర్ నిర్వహించిన రైతు దీక్ష అట్టర్ ఫ్లాప్ షో అని, దీక్షలో నిజమైన రైతులెవరూ లేరని పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ బ్రోకర్లు, పంది కొక్కుల్లా దోచుకున్న దొంగలు దీక్షలో ఉన్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ హయాంలో 7 వేల మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు బిల్లా రంగాలు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఇంకోసారి నల్లగొండ జిల్లాకు కేటీఆర్ వస్తే గుడ్డలూడదీసి కొడతామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన మంత్రి పదవి త్యాగం చేసి ప్రజల కోసం పని చేశారని, నాగార్జునసాగర్, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా నీళ్లిచ్చిన చరిత్ర కాంగ్రెస్ అని గుర్తుచేశారు. రైతులకు ఉచితంగా యూరియా ఇస్తామన్న కేసీఆర్ హామీ ఏమైందని నిలదీశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని రమేశ్‌రెడ్డి విమర్శించారు.

## సెక్యులర్ విలువలకు పాతర

**బీఆర్‌ఎస్ నేత ఇంతియాజ్ అహ్మద్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సెక్యులర్ విలువలను మంటగలుపుతోందని బీఆర్‌ఎస్ నేత ఇంతియాజ్ అహ్మద్ విమర్శించారు. మైనారిటీలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఆయన పార్టీ నేతలు అబ్దుల్ కలీమ్, బైకాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మైనారిటీ డిక్లరేషన్, సబ్‌ప్లాన్ పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు పెంచలేదని, వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మైనారిటీలు బుద్ధి చెబుతారని ఇంతియాజ్ అహ్మద్ హెచ్చరించారు.

### రహస్య కెమెరాల విక్రయాలపై 28లోగా వివరణ ఇవ్వండి

**కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లో రహస్య కెమెరాల విక్రయాలపై ఫిబ్రవరి 28లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేసింది. రహస్య కెమెరాల విక్రయానికి విధివిధానాలు లేకపోవడంతో.. మార్కెట్, ఆన్‌లైన్‌లో నేరుగా విక్రయిస్తున్నారని పేర్కొంటూ హెవెన్స్‌హోమ్స్ సొసైటీ వ్యవస్థాపకురాలు వరలక్ష్మి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. వీటిని కొనుగోలు చేసిన కొందరు.. వాష్‌రూమ్‌లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో, ఎక్స్‌రే గదుల్లో అమరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కెమెరాల క్రయవిక్రయాలపై ఎలాంటి విధివిధానాలు లేవని తెలిపారు. దీనివల్ల విచ్చలవిడిగా వీటి దుర్వినియోగం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలుకు సమయం కావాలని కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరారు. దీంతో వచ్చే నెల 28 వరకు సమయమిచ్చిన ధర్మాసనం.. తదుపరి విచారణ వాయిదా వేసింది.

### ఎస్‌వీఐటీకి ఎడిట్ ఆప్షన్ ఇవ్వండి

**జేఎన్‌టీయూకు హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు, అధ్యాపకుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకునేలా స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ)కి ఎడిట్ ఆప్షన్‌ను ఇవ్వాలని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)ను హైకోర్టు ఆదేశించింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్తర్వులు ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. గత అక్టోబర్ 14, 21, 24 తేదీల్లో ఎస్‌వీఐటీ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఈ నెల 30లోగా నిర్ణయం తీసుకోవాలని జేఎన్‌టీయూ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)కి స్పష్టం చేసింది. ఎడిట్ ఆప్షన్‌తో పాటు ఈ మెయిల్ ఐడీని పునరుద్ధరించాలని, ఎస్‌వీఐటీ అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయడానికి ఫిబ్రవరి 2 చివరి తేదీగా పేర్కొంది. మహబూబ్ కాలేజీ (ప్రస్తుతం ఎస్‌వీఐటీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.



**రంగుల చీరలతో రక్షణ**

మొక్కజొన్న, వరి పంటలకు రక్షణ కోసం కంచెలా ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన రంగురంగుల చీరలు ఆకట్టుకుంటున్నాయి. మనసుకు ఆహ్లాదం పంచుతున్నాయి. అడవి పందులు, ఇతర వన్యప్రాణుల బారినుంచి తమ పంటలను రక్షించుకునేందుకు.. ఒక రైతు పాతచీరలను ఒకదానితో ఒకటి జతచేసి బెదురు(కంచె)లా అమర్చాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామ శివారులో రహదారి పక్కనే ఇది కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# 'కృష్ణా'తీరం.. ఆధ్యాత్మిక తరంగం

ఒక్కొక్క ఊరిలో ఒక్కొక్క విశిష్టత | ఆదరణ లేక మరుగున పడిన ఆధ్యాత్మిక క్షేత్రాలు | పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపరచాలంటున్న స్థానికులు

తెలంగాణ – కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా మండలానికి ఓ విశిష్టమైన స్థానం ఉంది. జీవ నదులు.. రాజుల సంస్థానాలు.. రుషులు తపస్సు చేసిన ప్రాంతాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాలు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో ఘనకీర్తి సముపార్జించుకున్న ప్రాంతం కృష్ణా మండలం. ఒక్కొక్క ఊరు ఒక్కొక్క విశిష్టతతో ప్రసిద్ధికెక్కాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రసిద్ధ ప్రాంతాలు ఆదరణకు నోచుకోక మరుగున పడ్డాయి. చారిత్రాత్మక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధిపరచాలని స్థానికులు కోరుతున్నారు. - కృష్ణా



నారాయణపేట జిల్లాలోని కృష్ణా మండలంలో 22 కిలోమీటర్ల మేర కృష్ణానది, 3 కిలోమీటర్ల మేర భీమా నది ప్రవహిస్తోంది. ఈ రెండు నదులు తంగిడి గ్రామంలో కలుస్తాయి. నదీ తీర ప్రాంతాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆలయాలు ఉన్నాయి. కుసుమర్తి గ్రామంలో కర్ణాటక నుంచి తెలంగాణలోకి ప్రవేశించే భీమా నది ఒడ్డున కృష్ణ ద్వైపాయన మఠం ఉంది. ఆ రుషి మంత్రాలయం గురు రాఘవేంద్ర మహాస్వాములకు ముందే ఈ ప్రాంతంలో తపస్సు ఆచరించారు. ఆయన తపస్సుకు సాక్షాత్తు భగవంతుండు ప్రత్యక్షమైనట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. ఇక్కడ వేద పాఠశాల కూడా నిర్వహించినట్టు ఇక్కడి పురోహితులు చెబుతున్నారు.

**తంగిడిలో సంగమ క్షేత్రం..**

కృష్ణా, భీమా నదులు కలిసే తంగిడి సంగమ క్షేత్రంలో ఎందరో రుషులు తపస్సు ఆచరించినట్టు ఆధారాలున్నాయి. నది అటువైపు కర్ణాటక ప్రాంతంలో ప్రసిద్ధ శివాలయం ఉంది. అక్కడ ఇప్పటికీ ఈ ప్రాంత విశిష్టత గురించి శిలా శాసనాలు ఉన్నాయి. ఇటువైపు కొంతకాలం క్రితం దత్త పీఠాధిపతి విఠల్ బాబా దత్త భీమేశ్వర ఆలయం నిర్మించారు.

- గుర్జాల్ గ్రామ సమీపంలోని కృష్ణానది మధ్యలో ఒక బండపై శివలింగం, నంది విగ్రహాలు ఉన్నాయి. అవి కదిలిస్తే కదులుతాయి. కానీ నది ప్రవాహానికి అంగుళం కూడా కదలవు. ఇక్కడ నది ఒడ్డునే సిద్ధలింగ మహాస్వాములు తపస్సు ఆచరించి.. ఓ మఠం ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అక్కడ పూజలు నిర్వహిస్తూ.. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.



ముడుమాల్ నదిలో విశాలమైన, సుందరమైన ప్రదేశం



కృష్ణా, భీమా నదుల సంగమ క్షేత్రం

- కృష్ణా గ్రామంలో నది ఒడ్డున దత్తాత్రేయ మందిరం, శివాలయం ఉన్నాయి. ఇక్కడ కూడా రుషులు తపస్సు ఆచరిస్తూ.. స్థానికులకు తమ మహిమలను చూపించే వారు. అందులో ఒకరైన శ్రీ క్షీరలింగేశ్వర మహాస్వాములు 47 రోజులపాటు కేవలం ఒకమారు మాత్రమే పాలు సేవించి ఘోర తపస్సు ఆచరించారు. ఆయన శిష్యులు ఇక్కడ ఏటా మకర సంక్రాంతి పండగ రోజు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.
- ముడుమాల్ గ్రామంలో నది ఒడ్డున మంత్రాలయ రాఘవేంద్ర స్వాముల సమకాలికులైన గురు యాదవేంద్ర మహాస్వాములు తపస్సు ఆచరించారు. గురు రాఘవేంద్ర స్వాములు ప్రజల్లో దైవభక్తిని పెంపొందించేందుకు ఇక్కడి నుంచి ధర్మ ప్రచారం ప్రారంభించారు. అలా వెళ్లిన గురురాఘవేంద్ర స్వాములు తుంగభద్ర నది ఒడ్డున ప్రస్తుత మంత్రాలయంలో మఠం ఏర్పాటు చేశారు. ఇక్కడున్న ఆయన సమకాలికుడు యాదవేంద్ర మహాస్వామి మాత్రం కేవలం పూజలు, తపస్సుకే ప్రాధాన్యం ఇచ్చి ఇక్కడే ఉండిపోయారు. ఇక్కడ ఏటా ఫిబ్రవరి 22న యాదవేంద్ర స్వాముల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు విధిగా మంత్రాలయ పీఠాధిపతులు హాజరవుతారు. ఇక్కడ నాలుగు ద్వారాలతో కూడిన శివాలయం ఉంది. ఎక్కడైనా ఆలయ గర్భగుడికి ఒకే ద్వారం ఉంటుంది. కాని ఇక్కడ మాత్రం శివాలయ గర్భగుడికి నాలుగు ద్వారాలు ఉండటం విశేషం. ముడుమాల్ సంస్థానం రాజులు ఈ ఆలయంలో పూజలు నిర్వహించే వారని.. యుద్ధ సమయంలో సైన్యంతో తూర్పున ఉన్న ద్వారం నుంచి ప్రవేశించి, పశ్చిమాన ఉన్న ద్వారం గుండా బయటికెళ్లే వారని చరిత్ర చెబుతోంది.



ముడుమాల్‌లోని నదిలో పూజలు చేస్తున్న ఉడిపి పీఠాధిపతి విశ్వప్రియ తీర్థస్వామి (ఫైల్)

- మాగనూర్ మండలం కొల్పూర్‌లో కృష్ణానది ఒడ్డున సత్యపూర్ణ తీర్థ మహాస్వాముల మఠం ఉంది. ఈయన కూడా మంత్రాలయ రాఘవేంద్రస్వామి సమకాలికులే. ఈయన భక్తులు కోరిన కోర్కెలను తీర్చే స్వామిగా ప్రసిద్ధికెక్కారు.
- ముడుమాల్ గ్రామంలో రాజులు సంస్థానాలను ఏర్పాటు చేసుకొని పరిపాలించారు. కృష్ణా, మాగనూర్ మండలంలోని గ్రామాలతో పాటు కర్ణాటకలోని పలు గ్రామాలను ఈ రాజులు పరిపాలించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కొల్పూర్ సంస్థానంలో నది అటువైపు ఉన్న కర్ణాటక ప్రాంతంతో పాటు ఇటువైపు ఉన్న కొన్ని గ్రామాలను వారు పరిపాలించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్ వజ్రం కూడా కొల్పూర్ ప్రాంతానికి చెందినదిగా ప్రచారం ఉంది. ఈ వజ్రం.. చేపల వేటగాడికి నదిలో దొరికిందని.. అది కొల్పూర్ దొరకు ఇవ్వగా, ఆయన నిజాం ప్రభువుకు అప్పగించినట్లు ప్రచారంలో ఉంది. కొల్పూర్‌లో ఇప్పటికీ రాజమందిరాలు ఉన్నాయి. వీరి వంశీకులే ప్రస్తుతం కర్ణాటకలోని ప్రసిద్ధ దేవసూగూర్ సూగురేశ్వర ఆలయాన్ని నిర్మించారు. సంస్థానాధీశులకు చెందిన లక్షలాది ఎకరాలు భూములను ఆచార్య వినోభాబావే స్వచ్ఛందంగా సేకరించి, పేదలకు పంచిపెట్టారు.



కాశీలోని విశ్వనాథ మందిరం మాదిరిగా నాలుగు ద్వారాలున్న ముడుమాల్ శివాలయం

**ఇక్కడే నిలువు రాళ్లు..**

ముడుమాల్ సమీపంలోని నది ఒడ్డున ఉన్న నిలువురాళ్లు దేశంలో మరెక్కడా కనిపించవు. ఈ నిలువు రాళ్లు ఆదిమానవులు ఏర్పాటు చేసుకున్నవని.. పురావస్తు శాఖకు చెందిన ప్రొఫెసర్ పుల్లారావు పరిశోధన ద్వారా ప్రపంచానికి తెలిసింది. సూర్య కిరణాలు ఒక వరుస నుంచి.. మరో వరుసకు ప్రయాణించే సమయాన్ని.. ఆది మానవులు రుతువులుగా భావించే వారని ప్రొఫెసర్ పేర్కొన్నారు. మహోన్నతమైన, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నిలువురాళ్లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, మఠాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## సర్పమా.. మేఘమా!



అనంతపురంలో సూర్యోదయం వేళ ప్రకృతి తన సుందర రూపాన్ని ఆవిష్కరించింది. ఇందులో భాగంగా సర్పం ఆకారంలో ఉన్న మేఘం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ దృశ్యాన్ని పలువురు తమ సెల్‌ఫోన్‌ల్లో చిత్రీకరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

## 'తల'కెక్కదా గురూ..!



ప్రయాణాల్లో హెల్మెట్ తప్పకుండా ధరించాలంటూ నెల్లూరులో పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తుండగా..ప్రజలు మాత్రం ఇవేమీ తమకు పట్టవంటూ ర్యాలీ పక్క నుండే హెల్మెట్ లేకుండా ఇలా ప్రయాణిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

## ఉరిమే ఉత్సాహం..మా సొంతం



విశాఖలో 27వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కాలేజీల క్రీడలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. ఇందులో భాగంగా ఓ విద్యార్థి ఇలా హైజంప్ చేస్తున్నాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## క్లుప్తంగా...

### ఏపీపీఎస్సీ స్టాండింగ్ కౌన్సిల్‌గా శీనాకుమార్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది జి.శీనాకుమార్ నియమితులయ్యారు. ఈయన హైకోర్టులో ఏపీపీఎస్సీ తరఫున వాదనలు వినిపించనున్నారు. అలాగే రాష్ట్ర వక్ఫ్‌బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది మహ్మద్ సలీం పాషా నియమితులయ్యారు. హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా ఉండ్రాజవరపు కనకరాజు నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఐఎఫ్ఎస్ అసోసియేషన్ ఏపీ చాప్టర్ ఏకగ్రీవం

సాక్షి, అమరావతి: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అసోసియేషన్ ఏపీ చాప్టర్ కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఖజూరియా, ఉపాధ్యక్షుడిగా రాహుల్ పాండే, ప్రధాన కార్యదర్శిగా ఎం.శివప్రసాద్, జాయింట్ సెక్రటరీగా యేసోదా బాయి, కోశాధికారిగా జి.కృష్ణప్రియ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి అభినందించారు.

### ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌చార్జ్‌గా రవిసుభాశ్

సాక్షి, అమరావతి: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఇన్‌చార్జ్‌గా ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవా) ట్రస్ట్ సీఈవో పట్టానొట్టి రవిసుభాశ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు.

### 'నిబంధనలకు విరుద్ధంగా స్టాండింగ్ కౌన్సిల్ నియామకం'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నిబంధనలకు విరుద్ధంగా స్టాండింగ్ కౌన్సిల్‌ను నియమించారని మైనార్టీ నాయకుడు ఎం.అర్షద్ అయూబ్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టులో వక్ఫ్ బోర్డు తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన ఎండీ సలీం పాషాకు హైకోర్టులో న్యాయవాదిగా పదేళ్ల ప్రాక్టీస్ లేదని, ఆయన 2019లో హైకోర్టు న్యాయవాదిగా నమోదయ్యారని తెలిపారు. బుధవారం న్యాయశాఖ విడుదల చేసిన జీవో నం.29 స్టాండింగ్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. అర్హతలేని వ్యక్తిని స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ జారీచేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### '1/70పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి'

సాక్షి, అమరావతి: ఏజెన్సీలో అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని ఇటీవల స్పీకర్ అయ్యన్న ప్రకటించడాన్ని ఖండిస్తున్నట్టు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, దీనిపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతం రాజ్యాంగం 5వ షెడ్యూలు కిందకు వస్తుందని, దీన్ని ధిక్కరించే అధికారం ప్రభుత్వానికి లేదని తెలిపారు.

సృష్టిలో వెలకట్టలేనిది, అత్యంత విలువైంది ప్రాణం. నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు, సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉన్నా కొందరు చిన్నచిన్న విషయాలకే మనోస్థైర్యాన్ని కోల్పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. సమస్య ఏదైనా పరిష్కారం వైపు ఓర్పుగా అడుగులు వేయాలే తప్ప.. భయపడి బలవన్మరణానికి పాల్పడితే.. తమను నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గమనంలో ఉంచుకోవాలి. తమపై ఆధా రపడిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటే.. ఎంతటి కష్టం ఎదురైనా అలవోకగా జయించవచ్చు.



## క్షణికావేశం తీరని శోకం

పెరుగుతున్న ఆత్మహత్యలు | అర్ధాంతంగా ముగుస్తున్న జీవితాలు | మానసిక దృఢత్వం అవసరమంటున్న నిపుణులు



రాజమహేంద్రవరం రూరల్: కుటుంబ కలహాలు.. ఆర్థిక సమస్యలు.. ఇంట్లో వాళ్లు మందలించారని.. భార్య కాపురానికి రాలేదని.. పరీక్షల్లో తప్పామని.. ఉన్నత విద్యలో బ్యాక్‌లాగ్స్ ఉండిపోయాయని.. ప్రేమ విఫలమైందని.. స్నేహితులు వంచించారని.. అనారోగ్య సమస్యలు.. వ్యసనాలకు బానిసలవడం.. ఇలా వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో ఇటీవల పెరుగుతోంది. చిన్నచిన్న విషయాలకే విభేదాలు.. గొడవలు.. ఉద్వేగం.. కుంగుబాటుతో కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, పరిష్కారానికి కొంత సమయం ఎదురుచూసే ధైర్యం లేక అర్ధాంతరంగానే తనువు చాలిస్తూ.. కన్నవారిని, నమ్ముకున్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెడుతున్నారు. ఈ విధంగా ఈ నెలలో జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ పది మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. మరి కొంత మంది ఆత్మహత్యా యత్నానికి పాల్పడి, త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధిక శాతం మంది 40 ఏళ్ల వయస్సు లోపే వారే ఉంటున్నారు. కానీ, 50 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో కూడా ఈ ధోరణి అధికంగా ఉంటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### తీరిక లేని జీవితాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. పెద్దలు క్షణాల్లో సమస్యను పరిష్కరించి, మేమున్నామని భరోసా ఇచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. నేటి పరుగుల ప్రపంచంలో కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా ఆలోచనా విధానాలు మారిపోతున్నాయి. ఫలితంగా చిన్నచిన్న సమస్యలకే చాలా మంది ఆత్మస్థైరాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో పంచుకోలేక వారిలో వారే కుంగిపోతూ ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారు.

### అవగాహన లేక..

సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశమే చాలా సందర్భాల్లో బలవన్మరణాలకు దారి తీస్తోంది. జీవితం, సమస్యలపై సరైన అవగాహన లేకపోవడం కూడా కారణమే. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న వారు సమస్యను తప్పించుకోవాలని చూస్తున్నారే తప్ప.. బతికి ఉన్నవారిని సరికొత్త సమస్యల్లోకి నెట్టేస్తున్నామన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి అధ్వానంగా మారుతుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్న బిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు. అలాగే, పెద్దలు బలవన్మరణాలకు పాల్పడితే.. వారిపై ఆధారపడిన భార్యాపిల్లలను ఓదార్చడం ఎవ్వరి తరమూ కాదు. అందువలన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పోరాడి పరిష్కరించుకోవాలే తప్ప తప్పించుకునేందుకు ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని మానసిక నిపుణులు చెబుతున్నారు.



### ఈ లక్షణాలుంటే జాగ్రత్త పడాల్సిందే..

- ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు కొన్ని అసాధారణ లక్షణాలు కలిగి ఉంటారు.
- ఒంటరితనాన్ని కోరుకుంటారు.
- సకాలంలో ఆహారం తీసుకోరు.
- అతిగా నిద్ర పోతారు.
- రాత్రి వేళల్లో నిద్ర పోకుండా ఎక్కువగా ఆలోచిస్తూంటారు.
- కొన్నిసార్లు అసలు దేనికీ స్పందించరు.
- బతికి ఉండటం వ్యర్థమని.. చనిపోవాలనుకుంటున్నానని ముందుగానే పరోక్షంగా సంకేతాలిస్తూంటారు.
- ఇలాంటి వాటిని ప్రారంభంలోనే కుటుంబ సభ్యులు గుర్తించాలి. వారితో ప్రేమగా మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి తోడ్పాటునివ్వాలి. దీంతో పాటు మానసిక వైద్యుని వద్దకు తీసుకుని వెళ్తే ప్రయోజనం ఉంటుంది.

## యూపీ స్కూళ్లను కొనసాగించండి: ఏపీఎస్టీఏ

సాక్షి, అమరావతి: ఉన్నతీకరణకు నోచుకోని ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలలను కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 6, 7, 8 తరగతుల్లో 60 మందికి పైగా విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.చందనరావు ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**తరగతుల ఏకపక్ష తరలింపును అంగీకరించం: ఎస్టీయూ**

జీవో 117 రద్దు అనంతరం ప్రతిపాదిత పాఠశాలల ఏర్పాటుపై ఇచ్చిన మెమోకు, విద్యా హక్కు చట్టానికి భిన్నంగా పాఠశాల విద్య డైరెక్టర్ మౌఖిక ఆదేశాలు ఇవ్వడాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఖండించింది. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన దానికి భిన్నంగా తరగతులను తరలించడాన్ని ఒప్పుకోమని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**డీవైఈవో మెయిన్స్ వాయిదా వేయాలి: ఏపీటీఎఫ్ అమరావతి**

మార్చి 26, 27 తేదీల్లో నిర్వహించే డిప్యూటీ డివిజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరీక్షలు 80 శాతం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులే రాస్తున్నారని, మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షల విధుల్లో ఉపాధ్యాయులు ఉంటారని, ఈ నేపథ్యంలో మెయిన్స్‌ను వాయిదా వేయాలన్నారు.

**కూటమి ప్రభుత్వంలో టీచర్లకు అవమానాలు: ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్**

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వంలోని నాయకులు, అధికారులు రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఉద్యోగ ఉపాధ్యాయులపై బహిరంగంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు.

## అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి

**సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి**

- రాష్ట్రపతికి లేఖలు రాసిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు



కార్వేటినగరంలో అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రపతికి లేఖలు రాస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: అంగన్‌వాడీ కార్యకర్తలను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా బుధవారం చిత్తూరు జిల్లా కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ సిబ్బంది సిఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అలాగే హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు విజయ, మమత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడిలను నిర్లక్ష్యం చేస్తున్నారని కోర్టు తీర్పు ప్రకారం ఐసీడీఎస్‌ను సంస్థాగతం చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు అవుతున్న ఇప్పటివరకు సంస్థాగతం చేయకపోవడం దారుణమన్నారు. శిశు, మరణాలు రేటు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల కొద్ది పని చేస్తున్న అంగన్‌వాడీలపై పనిభారం పెంచడంతో రకరకాల పద్ధతుల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీల వద్ద డబ్బులు వసూలు చేసే కార్యక్రమం తీవ్రమైందన్నారు. చిత్తూరు జిల్లాలోనే అత్యధికంగా పోషణ వాటిక సెంటర్లను నిర్వహించడం అధికారులకు కాసుల పంటగా మారిందన్నారు. దీంతో అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని ఆరోపించారు. అధికారుల ఒత్తిడి మానక పోతే నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టులో ఒకరిద్దరు నాయకులుగా చెలామణి అవుతూ అధికారులకు తొత్తులుగా ఉంటూ అంగన్‌వాడీలను బెదిరించే పనులు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డెమ్మ (శ్రీరంగరాజపురం) పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## పూలు విలవిలలాడేనని..



పెరవలి: కొద్ది రోజులుగా మార్కెట్‌లో పూల ధరలు పడిపోవటంతో రైతులు విలవిలలాడుతున్నారు. మరోవైపు పూలకోత కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కడియపులంక తరువాత చెప్పుకోదగిన కాకరపర్రు పూల మార్కెట్టు నేడు పూలు కొనేవారు లేక కళావిహీనంగా కనిపిస్తోంది. ప్రస్తుతం శుభ ముహూర్తాలు, పండగలు లేకపోవటంతో పూల వినియోగం తక్కువగా ఉందని, అందువల్లనే ధరలు తగ్గాయని చెబుతున్నారు. దిగుబడి ఉన్నా తగినంత ధర లేక రైతులు.. ఉపాధి దొరకక కూలీలు.. అమ్మకాలు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

- సగానికి పైగా తగ్గిన ధరలు
- మరోవైపు గణనీయంగా దిగుబడి
- రేటు లేక తోటల్లోనే వదిలేస్తున్న రైతులు
- ఉపాధి దొరకక కూలీలు, మహిళలకు ఇబ్బందులు

**ధరలు పడిపోయాయిలా..**

ఇరవై రోజుల క్రితం కిలో చామంతి, జాజుల ధర రూ.300 పలికింది. నేడు పూల నాణ్యతను బట్టి కిలో రూ.60 నుంచి రూ.120కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అవి కూడా వ్యాపారుల వద్ద రెండు మూడు రోజుల పాటు నిల్వ ఉండిపోతున్న పరిస్థితి. అప్పటికీ అమ్ముడుపోకపోతే పూలు పాడైపోవడంతో గత్యంతరం లేక వాటిని నాలుగో రోజున రోడ్ల పక్కన పారబోస్తున్నామని వ్యాపారులు వాపోతున్నారు. పూల మాలలు అల్లించడం, గ్రేడింగ్ వంటి పనులు చేయిద్దామన్నా కనీస కూలి ఖర్చులు కూడా రావడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

**కూలీలకు పనులు కరవు**

పూల సాగు, వ్యాపారానికి సంబంధించి కూలీలు రకరకాల పనులు చేస్తూ ఉపాధి పొందుతుంటారు. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై ఇంటింటికీ పూలు అమ్ముకునే చిరు వ్యాపారులు కూడా ఉంటారు. నిత్యం పూల కోత కోసే కూలీలకు వారానికి ఒక్క రోజు మాత్రమే పని లభిస్తోంది. అలాగే, పూల దండలు కట్టే మహిళలు కూడా దండలు కట్టే పనుల్లేక ఆదాయం కోల్పోతున్నారు.



కొనేవారేరీ..!: కాకరపర్రులో ఖాళీగా పూల మార్కెట్టు

**పూల ధరలు పడిపోయాయిలా..**
(కిలోకు రూ.లలో)

| పూల రకం | 20 రోజుల క్రితం | ప్రస్తుతం |
|---|---|---|
| బంతి | 80.00–120.00 | 40.00 |
| చామంతి | 300.00 | 60.00–80.00 |
| జాజులు | 350.00 | 150.00 |
| కనకాంబరాలు | 1,000.00 | 500.00 |
| మల్లెలు | 1,000.00 | 500.00 |
| గులాబీలు | 350.00 | 150.00 |





### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,610 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

### ద్వారకాతిరుమలపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీపై బుధవారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తుల లేక వెలవెలబోయాయి.

### వైభవంగా ధ్వజారోహణం

కడప కల్చరల్ : తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం నుంచి ప్రధాన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహించారు. అర్చక బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజపూజ నిర్వహించారు.

### శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో బుధవారం శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరునికి విశేష అభిషేకాలు జరిపించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను చప్పరాలపై కొలువుదీర్చి ఊరేగింపుగా భరద్వాజతీర్థానికి వేంచేపు చేశారు. అనంతరం ఆదిదంపతులకు పసుపు, చందన, కుంకుమ, విభూది, పాలు, నారికేళం, పెరుగు, పంచామృతం తదితర ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో భక్తులకు అన్నదానం చేశారు.





### టెక్‌ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ పోస్టర్‌ను బుధవారంవిడుదల చేశారు. వీసీ ఉమ మాట్లాడుతూ విద్యుత్సావ్-2కే25, మెకెరెనా-2కే25 పేరుతో జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్‌ను వర్సిటీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, ఎస్ఓఈటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

### ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్, బీఎస్సీ (నర్సింగ్) కోర్సులకు 2025 సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను దేశవ్యాప్తంగా మార్చి 16న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 21 ఆఖరు తేదీ అని, అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేట హిందూహైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని గాని లేదా దగ్గరలోని ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని గాని లేదా 0866–2565253 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

### దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (దూర విద్యా కేంద్రం) గతేడాది అక్టోబర్, నవంబర్‌ల్లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు కార్యాలయంలో ఫలితాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఫిబ్రవరి 11లోగా ఒక్కో పేపర్ కు రూ .770 చెల్లించి ఫిబ్రవరి 14వ తేదీలోగా దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు అందేలా పంపాలని సూచించారు. దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సిటిపి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# సన్నిధి



ఉపమాక అంటే ఉపమానం లేనిది, సాటిలేనిది అని అర్థం. ఇటువంటి క్షేత్రం మరెక్కడా ఉండదని అర్థం స్ఫురించేలా పురాణాలలో ఉపమాక అనే పదాన్ని ఉపయోగించారు. ఉపమానం చెప్పలేని వేల్పు వేంకటేశ్వరుడు కనుకే ఈ క్షేత్రం ఉపమాక వేంకటేశ్వరాలయం. స్వామివారు ఎల్లప్పుడూ ఉత్తర ద్వార దర్శనం ఇస్తుండటమే ఇక్కడి ప్రత్యేకత. అంతేకాదు, ఎక్కడా లేని విధంగా స్వామివారు షడ్భుజాలతో.. లక్ష్మీ సమేతుడై, అశ్వాన్ని అధిరోహించి దర్శనమివ్వడం మరో ప్రత్యేకత.

నిత్యం ఉత్తర ద్వార దర్శనమిచ్చే

# ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం



‘కలౌ వేంకటనాయక’ అన్నట్లుగా, కలియుగంలో శ్రీమన్నారాయణుడు వేంకటేశ్వరస్వామి అవతారంలో వేంచేస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఇందుకు నిదర్శనమే ఉపమాక వేంకటేశ్వరస్వామి. ఒకసారి ఆ ప్రాంతాన్ని దర్శించిన వారు ఆ స్వామిని దర్శించుకోవడానికి పదే పదే వెళ్లి తీరతారని స్థానికులు చెబుతారు.

**స్థల పురాణం**

ఒకప్పుడు సోమకుడు అనే రాక్షసుడు బ్రహ్మ వద్దనుండి వేదాలను దొంగిలించి సముద్రంలో దాక్కున్నాడు. బ్రహ్మదేవునికి విష్ణువు హయగ్రీవ మూలమంత్రం ఉపదేశించి, గరుడాచలం వద్ద ‘బంధుర’ అనే సరస్సు దగ్గర తపస్సు చేయమని చెప్పాడు.

శ్రద్ధాభక్తులతో బ్రహ్మ చేసిన తపస్సుకు సంతసించిన శ్రీమన్నారాయణుడు మత్స్యావతారం ధరించి సోమకుని సంహరించి, వేదాలను తెచ్చి బంధుర సరస్సు వద్దనున్న బ్రహ్మకు ఇచ్చాడు. బ్రహ్మ తపస్సు చేసిన క్షేత్రం ఉపమాక పేరుతో ప్రసిద్ధమౌ తుందని, అక్కడ ఆచరించిన పూజ, తపస్సు, దాన, పుణ్యాదిక కర్మలు ఇతోధికంగా ఫలప్రదాలవుతాయని విష్ణువు ఆనతిచ్చాడు. కశ్యపుడు కూడా ఇక్కడ తపస్సు చేసి విష్ణువు అనుగ్రహం పొందాడు.

ద్వాపర యుగంలో గరుత్మంతుడు శ్రీకృష్ణ భగవానుడిని ఎల్లవేళలా తన వీపుపై ఉండాలని కోరాడు. దక్షిణ సముద్రతీరంలో గరుడ పర్వతం ఉందని, కలియుగంలో వేంకటాద్రి నుండి వేట నెపంతో తాను ఈ క్షేత్రానికి వస్తానని, శ్రీ లక్ష్మీ సమేతుడై తాను ఉపమాకలో









గూఢంగా నివసిస్తానని విష్ణువు గరుడునికి వరమిచ్చాడు.

మాట నిలబెట్టుకోవడం కోసం శ్రీ కృష్ణుడు... ఉపమాక గ్రామంలో ఉన్న గరుడ పర్వతం మీద కొలువయ్యాడని, శ్రీమన్నారాయణుడు గరుత్మంతునికి ఇచ్చిన వరప్రభావంతో కలియుగంలో షడ్భుజాలతో, లక్ష్మీ సమేతుడై, అశ్వాన్ని అధిరోహించి దర్శనమిస్తాడు. 6వ శతాబ్దంలో తూర్పు గోదావరి జిల్లా కాండ్రేగుల సంస్థానాధిపతి శ్రీకృష్ణభూపాలుడు స్వామివారికి ఆలయం నిర్మించాడని కూడా స్థల గాథలలో చెబుతారు. శ్రీ రామానుజాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించాడని అంటారు.

17వ, 18వ శతాబ్దములలో పిఠాపురం సంస్థానానికి చెందిన ప్రభువులు ఇక్కడి దేవునికి విలువైన కిరీటమును సమర్పించారట. కలియుగంలో వెంకటేశ్వరస్వామి మొదట ఇక్కడే వెలిశాడంటారు. అయితే స్వామి భారాన్ని మోయలేని గరుడాద్రి కుంగిపోతుండగా వెంకన్న తన రెండో పాదాన్ని ఏడుకొండలపై మోపి అక్కడే వెలిసి, రాత్రిళ్లు మాత్రం ఇక్కడ పవళిస్తారనీ. అందుకే కొండపై ఉన్న ఈ ఆలయాన్ని పగటిపూట మాత్రమే తెరచి ఉంచుతారనీ అంటారు.

ఇక్కడి వేంకటేశ్వరుడు ఆరు భుజాలు, పంచాయుధాలతో దర్శనమిస్తాడు. ఇందులో ఐదు భుజాలు దుష్ట శిక్షణకు, ఒక హస్తం అభయ ముద్రలో ఉంటూ, భక్తులకు అభయమిస్తుంటాడు. పంచామృతాభిషేక సమయంలో స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తే, సంతానప్రాప్తి కలుగుతుందని నమ్మకం. స్వామి వారికి తమ కోరికను విన్నవించి, అది నెరవేరిన తరవాత కాలి నడకన కొండపైకి వస్తాననుకుంటే ఆ కోరిక నెరవేరుతుందని, నెరవేరిన వెంటనే కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకోవాలని స్థానికులు చెబుతారు.

ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు (ఫిబ్రవరి) స్వామివారికి వార్షిక కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామి వారికి అలంకరించే పురాతన కాలంనాటి వజ్రాభరణాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ. వైకుంఠ ఏకాదశినాడు స్వామివారికి ఒకే సమయంలో ఎనిమిది వాహనాలతో తిరువీధి సేవ నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ వేడుకలు ముగిసిన తర్వాతి రోజు నుంచీ సుమారు ఇరవై రోజులపాటు ఉపమా

గుర్రం మీద కూర్చుని, కింద వామభాగంలో ఎడమవైపున లక్ష్మీదేవిని కలిగి కనువిందు చేస్తూ ఉత్తర దిక్కుగా చూస్తున్నట్లు ఉంటుంది. ఆలయాన్ని కూడా ఇదే విధంగా నిర్మించారు. దీంతో భక్తులకు ఏడాది పొడవునా ఉత్తర ద్వార దర్శనమే. ...అన్ని క్షేత్రాలలో సంవత్సరానికి ఒక్కరోజు లభించే ఉత్తర ద్వారదర్శనం, ఇక్కడ నిత్య వైకుంఠ ద్వార దర్శనంగా విలసిల్లుతోంది. దూరం నుంచి ఈ పర్వతం గరుడ పక్షి ఆకారంలో కనిపిస్తుంది. అందుకే ఈ కొండను గరుడాద్రి అంటారు భక్తులు దగ్గరుండి మూలవిరాట్‌కు నిత్యం పంచామృత అభిషేకం చేయించుకోవచ్చు.

శ్రీ వెంకటేశ్వర స్వామికి ఏటా కల్యాణం జరిపించేందుకు ఉత్సవ మూర్తులనూ, ఆలయాన్ని సంరక్షించేందుకు వేణుగోపాల స్వామినీ కొండ దిగువన ప్రతిష్ఠించిన నారదమహర్షి ఇక్కడి ఉపాలయాలనూ తానే స్వయంగా నిర్మించాడని ప్రతీతి. బ్రహ్మ, కశ్యపుడు వంటివారు కలిసి ఇక్కడ చేసిన తపస్సు ఫలితంగా ఒక తటాకం ఏర్పడిందని, తర్వాతి కాలంలో అదే బంధుర సరస్సుగా మార్పు చెందిందనీ పురాణ కథనం. ఇందులో స్నానమాచరిస్తే సకల పాపాలూ తొలగుతాయని భక్తుల విశ్వాసం.

### ఎక్కడ ఉంది?

విశాఖపట్టణం నుంచి 85 కి.మీ. దూరంలో, తుని రైల్వే స్టేషన్ నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రం విశాఖపట్నం జిల్లా నక్కపల్లిలో ఉంది. విశాఖ పట్నం నుంచి, తుని నుంచి రోడ్డు సౌకర్యం ఉంది.

● నిర్మల వాణి

## మీలోనే పరమాత్మ...



భగవంతుడు ఎప్పుడు అవతారాలు తీసుకున్నా అప్పుడు మంగళప్రదమైన, పవిత్రతతో కూడిన గొప్ప గొప్ప కార్యాలు జరిగాయి. కానీ ఇప్పుడు ఇంతవరకు ఎన్నడూ జరగనటువంటి అతి గొప్పదైన పవిత్రమైన దైవకార్యం జరిగే సమయమాసన్నమయింది. కలియుగ చీకటి ఛాయలు సమస్త ప్రపంచాన్ని చుట్టుముడుతున్న ఈ సమయంలో మీ చేతిలోని కాగడాలు ఉన్నతంగా ప్రజ్వలిస్తూ, ఆ వెలుగులో మీరు పవిత్రతను, ఆనందాన్ని, సౌభాగ్యాన్ని పొందగలుగుతారు.

దీనికోసం మీలోని దీపాన్ని (ఆత్మ జ్యోతిని) పరిశుభ్రంగా ఉంచుకోవటం అవసరం. పాపాలు, గత జన్మ కర్మలు, అహంకారం తో సహా అన్నీ తుడిచి పెట్టుకుపోవాలి. ఎందుకంటే, అహం కమ్ముకున్నంతకాలం ఆత్మదర్శనాన్ని పొందలేరు. చిత్తం ప్రకాశవంతమైనప్పుడు ఆ ఆత్మప్రకాశం వెలుగులో అహంకారం లీలలను సాక్షీ స్థితిలో వీక్షిస్తూ అహంకారం పట్ల, అది చేసే చేష్టలు, అది కలిగించే భావనలను పరిశీలించుకోవటం ద్వారా అహంకారం తగ్గటం ఆరంభమవుతుంది.

మానవ మేధస్సును అర్థం చేసుకోవడం అంత సులువు కాదు. దానికన్నా, దైవాన్ని అర్థం చేసుకోవడం చాలా సులువు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ అలానే ఉంటాడు. ఆయనకు ద్వంద్వ వైఖరులు లేవు. మనిషికి అనేక చిత్ర విచిత్రమైన లక్షణాలున్నాయి. అన్ని రకాల జంతువులు, పాము దగ్గర నుండి తేళ్ళు, ఏనుగులు, గుర్రాలు, సింహాల వరకు అన్ని గత జన్మల లక్షణాలు ఉన్నాయి. దానికి కారణం మనిషికున్న అహంకారమే. ఈ సమయంలో మీరు చేరిన అహంకార శిఖరం దగ్గర ఆగి వెనక్కి తిరిగి చూసుకునే సమయమాసన్నమయింది. అణకువతో దానిని అంగీకరించి మీలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నించండి. ఆత్మ గురించి తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీ దృష్టిని వ్యర్థమైన, నిర్జీవమైన విషయాలపై ఉంచుతూ మీకు మీరే సంకెళ్లేసుకుంటున్నారు. తద్వారా మీరు అరిషడ్వర్గాలకు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు) బానిసలవుతున్నారు. ఈ స్థితిలో మీరు ఆగి, అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకున్నట్లుగా ఆత్మావలోకనం చేసుకుంటే మీలోనే నివసించే పరమాత్మను కనుగొనగల్గుతారు.



పరమపూజ్య మాతాజీ నిర్మలాదేవి

● ఇస్లాం వెలుగు

## విలువలే సాఫల్యానికి సోపానం



దైవప్రవక్త ముహమ్మద్ (సం) ప్రవచనం ప్రకారం, ప్రళయం రోజున దైవం మూడురకాల వ్యక్తుల పాపాలను క్షమించి వారిని పరిశుద్ధపరచడు. పైగా వారిని తీవ్రంగా శిక్షిస్తాడు. వారిలో ఒకరకం మనిషి, అవసరానికి మించి ప్రయాణ సామగ్రి ఉన్నా, తోటిప్రయాణీకులకు వాటిని ఇచ్చి ఆదుకోనివాడు. రెండోరకం వ్యక్తి, ప్రాపంచిక లాభాలను దృష్టిలో ఉంచుకొని, రాజ్యాధినేతకు అనుకూలంగా ప్రమాణాలు చేసేవాడు. మూడోరకం మనిషి, తన వ్యాపార వస్తువులను అమ్ముకోడానికి, దేవునిపై ప్రమాణాలు చేసేవాడు. తరువాత ప్రవక్త మహనీయులు, ఖురాన్ లోని వాక్యం పఠించారు.‘కొందరు తమ వాగ్దానాలను, దేవుని విషయంలో చేసిన ప్రమాణాలను అతి స్వల్పమూల్యానికి అమ్ముకుంటారు. ఇలాంటి వారికి పరలోకంలో ఎలాంటి ప్రతిఫలం లభించదు. దైవం వారితో మాట్లాడడు. ప్రళయదినాన వారివైపు కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధపరిచే ప్రసక్తి అంతకన్నాలేదు. పైగా వారికి నరకంలో అత్యంత వ్యధాభరితమైన శిక్ష పడుతుంది.’

ప్రవక్త మహనీయులు మూడురకాల మనస్తత్వాలను ప్రస్తావించారు. ఒకటి: అవసరానికి మించి ఉన్నప్పటికీ, అవసరార్థులైన తోటివారికి ఇవ్వకపోవడం, వారిని ఆదుకోకపోవడం మానవత్వం అనిపించుకోదని, ఇలాంటి అమానవీయ చర్యలను దైవం హర్షించడని, ఇలాంటి నేరానికి పాల్పడినందుకు తీవ్రంగా శిక్షిస్తాడని చెప్పారు. నిజానికి ఇది ప్రయాణ సందర్భానికే పరిమితమైన హితవుకాదు. నిత్యజీవితంలో అడుగడుగునా ఆచరించవలసిన అమృత ప్రవచనమిది. ప్రవక్తమహనీయులు,‘నువ్వు కడుపునిండా తిని, నీ పక్కవాడు పస్తులుంటే నీలో విశ్వాసంగాని, మానవత్వంగాని లేదని తీవ్రంగా హెచ్చరించారు. మరోరకం మనిషి, స్వార్థంకోసం, స్వలాభం కోసం అధికారంలో ఉన్నవారికి వత్తాసు పలుకుతూ తన పబ్బం గడుపుకుంటాడు. తన పప్పులు ఉడుకుతున్నంతవరకూ, తనమాటసాగుతున్నంత వరకూ వారి చర్యలకు మద్దతు పలుకుతూ, సమర్థిస్తూ ఉంటాడు. ఇక లాభం లేదనుకున్నప్పుడు ప్లేటు ఫిరాయిస్తాడు. ఇలాంటి ఊసరవెల్లి రాజకీయాలను ఈనాడు మనం కళ్ళారా చూస్తున్నాం. ఇలాంటి కుటిల, స్వార్థపర, అవినీతి పరులకుకూడా వినాశం తప్పదు.

మూడోరకం మనిషి, తన సరుకును అమ్ముకోడానికి దేవునిపై ప్రమాణాలుచేసి నాసిరకం సరుకును నాణ్యమైన సరుకని, ఇదిగో ఇంతకు కొన్నాను, ఇంతకు అమ్ముతున్నాను. అంతా పారదర్శకం. అని ప్రమాణంచేసి మోసం చేసి తన వ్యాపార ప్రయోజనాలు నెరవేర్చుకుంటాడు. సర్వశక్తిమంతుడైన దేవునిపై ప్రమాణం చేసిన కారణంగా ప్రజలు అతని మాయమాటలు ఇట్టే నమ్మేస్తారు. దీనివల్ల అతనికి తాత్కాలిక లాభాలు సమకూరినా, నిజమేమిటో ప్రజలకు కొద్దికాలంలోనే తెలిసిపోతుంది. ఇలాంటి వంచకులు, మోసకారులైన వ్యాపారులకు ఇహలోకంలో, పరలోకంలోకూడా తీవ్రవినాశనం తప్పదు. అందుకని ప్రాపంచిక జీవితంలో నైతిక విలువలు పాటిస్తూ పాపభీతితో జీవితం గడపడం వివేకవంతుల లక్షణం. అలాంటి వారే దైవశిక్షనుండి రక్షించబడి స్వర్గసౌఖ్యాలకు అర్హులు కాగలుగుతారు.

– ముహమ్మద్ ఉస్మాన్‌ఖాన్

● జెన్ పథం

## నాకన్నా నీకే ఎక్కువ అవసరం



ఆయన ఓ తాత్విక గురువు. జ్ఞాని. ఓసారి ఒక ధనవంతుడు ఆయనను చూడ్డానికి వచ్చాడు. రాగానే దణ్ణం పెట్టి చేతిలో ఉన్న ఓ సంచి ఆయనకు ఇచ్చాడు. గురువు ఆ సంచీని తీసుకుని దానివంక నవ్వుతూ చూశారు. ‘‘ఏమిటిది’’ అని అడిగారు గురువు.‘‘మీ ఆశ్రమానికి నా వల్ల చేతనైన విరాళం ఇవ్వాలనిపించింది’’ అని అన్నాడు.‘‘ఇందులో ఏముంది’’ అన్నారు గురువు. ‘‘వెయ్యి బంగారు నాణాల’’న్నాడు ధనవంతుడు.

‘‘సంతోషం’’ అంటూనే ధనవంతుడి వంక చూసి ‘‘మీ దగ్గర ఇంతకన్నా ఎక్కువ బంగారు నాణాలు ఉండే ఉంటాయి కదూ...’’ అని అడిగారు గురువు.

‘‘అవునండీ ఉన్నాయి’’ అన్నాడు ధనవంతుడు.

‘‘అవన్నీ మీకు చాలినంతగానే ఉన్నాయా’’

గురువు ప్రశ్నించారు.

ధనవంతుడు ఆలోచనలో పడ్డాడు.

కాస్సేపు తర్వాత ధనవంతుడు ‘‘లేదు స్వామీ, ఇంకా కూడా కావలసి వస్తోంది. అందుకే రాత్రీ పగలూ అని చూసుకోకుండా శ్రమిస్తున్నాను’’ అన్నాడు ధనవంతుడు.

గురువు ఆ మాటలు విని ‘‘ఈ నాణాల అవసరం నాకన్నా మీకే ఎక్కువగా ఉంది, మీ దగ్గరే ఉంచుకోండి’’ అంటూ తన చేతిలో ఉన్న డబ్బు సంచీని తిరిగి ఇచ్చేశారు గురువు.

మనిషికి డబ్బు అవసరమే. అది తీరని ఆశ. ఎంతున్నా చాలదు అనుకునే మనస్తత్వం ఉన్న వాళ్ళకు ఎవరికైనా డబ్బు ఇవ్వాల్సి వచ్చినా వారిలో ఇస్తున్నప్పుడు ఆనందముండదు. లోలోపల ఏదో తరిగిపోతున్నట్టే అనిపిస్తుంది. కనుక ఉన్నదానితో తృప్తి పడే మనసున్నప్పుడే ఎవరికైనా సాయం చేయాలనిపిస్తుంది.

– జయా

## తీర్థం 3 సార్లు ఎందుకు తీసుకోవాలి?

ధర్మ సందేహం

తీర్థం విశిష్టత ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇంట్లో, దేవాలయంలో లేదా ఇంకెక్కడైనా దేవుడిని దర్శించుకున్న తర్వాత తీర్థం తీసుకుంటాం.

కాని తీర్థాన్ని మూడుసార్లు ఎందుకు తీసుకోవాలి అన్నది ఎప్పుడైనా ఆలోచించారా? ఇప్పుడు అదే విషయం గురించి తెలుసుకుందాం..!! దేవునికి పూజ చేసిన తర్వాత తీసుకునే తీర్థంలో పంచామృతాలు, తులసి దళాలు, సుగంధ ద్రవ్యాలు, మంత్ర శక్తులు ఉంటాయి. దీంతో ఆ తీర్థం అత్యంత పవిత్రంగా మారుతుంది. తీర్థం తీసుకోవడం ద్వారా మన ఆరోగ్యం, ఆధ్యాత్మికత మెరుగవుతాయి. మొదటిసారి తీసుకున్న తీర్థంతో శారీరక, మానసిక శుద్ధి జరుగుతుంది. రెండవసారి పుచ్చుకున్న తీర్థంతో న్యాయ, ధర్మప్రవర్తనలు చక్కదిద్దుకుంటాయి. ఇక మూడవది పవిత్రమైన పరమేశ్వరుని పరమ పదం అనుకుని తీసుకోవాలి. మన పురాణాల ప్రకారం తీర్థం అంటే తరింపజేసేది అని అర్థం. దీన్ని మూడుసార్లు తీసుకుంటే.. భోజనం చేసినంత శక్తి వస్తుందని అంటారు.



తీర్థం తీసుకునేటప్పుడు ఆరోగ్యకరమైన భావంతో తీసుకోవాలి. ఈ తీర్థం నాకు మంచి చేస్తుంది, నా ఆరోగ్యాన్ని, నా ఆధ్యాత్మికతను మెరుగు పరుస్తుంది అనే సద్భావంతో తీసుకోవాలి. పూజారులు తీర్థం ఇచ్చేటప్పుడు అకాల మృత్యుహరణం సర్వ వ్యాధి నివారణం! సమస్త పాపక్షయ కరం శ్రీ పరమేశ్వర పాదోదకం పావనం శుభం!! అనే మంత్రం జపిస్తూ తీర్థాన్ని ఇస్తారు. మూడు సార్లూ కుడిచేతి కింద ఎడమ చేతిని ఉంచి తీర్థం తీసుకోవాలి. కుడిచేయి చూపుడు వేలు మధ్యలోకి బొటనవేలిని మడిస్తే గోముఖం అనే ముద్ర వస్తుంది. ఈ ముద్రతో తీర్థాన్ని తీసుకోవాలి.

సువార్త

## ప్రేమతో సాహసించడం...

‘నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించడం’ ఒక పెద్ద సాహసం. కార్యములలో గొప్పది, ఘనమైనది సాహసం. సాహస కార్యం అంటే పొరుగు వానిని ప్రేమించడం. క్రీస్తువలె శత్రువును ప్రేమించడం. దేవునికి ఇష్టమైన కార్యాల చిట్టా లేదా ఇలాంటి ఒక పెద్ద జాబితాను పౌలు దగ్గర ఉండుటను మనం కనుగొంటాము.

నీ చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రేమించడం, అందు శాంతి, సమాధానాలు నెలకొల్పడం క్రీస్తు కార్యాభివృద్ధి అంటున్నాడు పౌలు. ఈ అభివృద్ధి విషయమై మీరు ఎప్పటికిని ఆసక్తులై ఉండవలసినదే అంటూ తన జీవితాన చూపిన మాదిరితో కూడా ఉన్నతంగా బోధ చేస్తున్నాడు. వట్టి మాటలతో కాక, చేతలతో చేసేది ఏదైనా సాహసమే. అది క్రీస్తు ద్వారా దేవదేవుణ్ణి మెప్పించేదిగా ఉండాలి. దేవునికి మహిమ కలిగించేవి ఏవైనా అవి మొదటగా పరిశుద్ధంగా, సాహసోపేతంగా ఉండక తప్పదు. పరిశుద్ధ జీవిత అభ్యాసాన్ని మించిన సాహసం ఇలలో మరి ఏది లేదు.

స్వచిత్తాన్ని పక్కనపెట్టి దేవుని చిత్తానికి తలవంచడం అనేది పరిశుద్ధతకు ఆది, మొదలు అనవచ్చు. పరిశుద్ధతను అలవరచుకొన్న మీదట ఎలాంటి సంతృప్తికి తావులేదు.‘క్రియలు లేని విశ్వాసం మృతం’ అనునది మరొక ఉన్నత బోధ. రక్షణ పొందాక జీవితాంతం అనగా అనుదినం భక్తిని, విశ్వాసాన్ని కార్యరూపంలో ప్రదర్శించి తీరవలసిందే. కాబట్టి, క్రీస్తును బట్టి క్రైస్తవ జీవితం క్రియలతో, మరి ముఖ్యంగా సాహస కార్యాలతో కూడుకొన్నది.



ఈ సందర్భంగా క్రీస్తు సాహసోపేత జీవితాన్ని మననం చేసుకోక తప్పదు. ‘నీ చిత్తమే సిద్ధించును గాక!’ అనడంతోనే ఆయన జీవితం చరిత్ర కెక్కింది. ఒక వ్యక్తిలో లోబడే గుణం, అట్టి తత్వం ఉంటే దేవుడు అతడిని ఎలాగైనా తన వైపుకు తిప్పుకుంటాడు. రిక్తునిగా దాసుని స్వరూపం ధరించుకొన్న క్రీస్తును ఒక యజమానిగా దేవుడు తన ఇష్టానుసారంగా మలచుకొన్నాడు. ఇది క్రీస్తునాథుని ఉన్నత జీవిత విధానం. క్రీస్తు వారి పన్నెండు మంది శిష్యులతో పాటు పౌలు ఇలా అంటున్నాడు. ‘మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము’– 1కొరింథీ 1 : 23, 24. దీని ఉన్నతభావం ఏమంటే యేసే క్రీస్తు ( మెస్సీయ ) అయి ఉన్నాడు. కాబట్టి మేము అద్భుతములు, ఆశ్చర్య కార్యములు చేసిన యేసును కాక సిలువలో ఘోరంగా మరణించిన క్రీస్తునే, నేడు దేవుని కుడి పక్కన కూర్చొని ఉన్న క్రీస్తునే, దేవుని అభిషిక్తుడనే మేము ప్రకటిస్తున్నాము. మరియ తనయుడిని కాదు మేము ప్రకటించేది, పూర్వమే ఆదిలోనే అపవాది మోసంలో పడ్డ ఆదాము హవ్వల దగ్గర స్త్రీ సంతానంగా చెప్పబడ్డ విమోచకుడైన క్రీస్తునే, దేవుడు తన సంకల్ప ప్రకారంగా అనాదిలోనే నిర్ణయించుకొని ఆయన చేత ఈ భూమి మీదకు పంపబడ్డ క్రీస్తునే మేము ప్రకటిస్తున్నాము. దేవుని అనాది ప్రణాళిక చొప్పున మరణించిన క్రీస్తునే మేము ప్రకటిస్తున్నాము.

‘క్రీస్తు కూడా మీ కొరకు బాధపడి మీరు తన అడుగు జాడల యందు నడుచు కొనునట్లు మీకు మాదిరి ఉంచిపోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు. ఆయన శ్రమ పెట్టబడియు బెదిరింపక, న్యాయంగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను’ (1 పేతురు 2 : 21 – 23) అంటూ ఈ విధంగా సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించారు. పౌలు అయితే ఒక అడుగు ముందుకు వేసి ఇలా అంటున్నాడు. ‘నేను, యేసు క్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య ఎరుగకుందునని నిశ్చయించు కొంటిని’ (1కొరింథీ 2 : 2 ). అపొస్తలుల బోధను అనుసరించి అత్యున్నత సమాచారం ఏమంటే, ‘ఏలయనగా మనమింకను బలహీనులమై ఉండగా క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు. మంచి వాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై ఉండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను’ ( రోమా 5 : 6,7,8 ). దేవుని దయాపూర్వక సంకల్పానికి క్రీస్తు బద్ధుడెన వాడై మానవాళి మీద ప్రేమతో చనిపోవ తెగించాడు. ప్రేమతో సాహసించి ప్రాణం పెట్టాడు. తన నిండు యవ్వనప్రాయాన్ని బలిగా అర్పించాడు. ఇదే సత్య సువార్త.

– జేతమ్

## బిజినెస్ రీల్

### డిజిటల్ చెల్లింపుల్లో రెండంకెల వృద్ధి



ముంబై: దేశవ్యాప్తంగా 2024 సెప్టెంబర్ నాటికి డిజిటల్ చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 11.11 శాతం పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. ఆర్‌బీఐ డిజిటల్ పేమెంట్స్ ఇండెక్స్ ప్రకారం.. 2024 సెప్టెంబరులో సూచిక 465.33 నమోదైంది. అదే ఏడాది మార్చిలో ఇది 445.5 ఉంది. ఈ కాలంలో దేశవ్యాప్తంగా చెల్లింపుల మౌలిక వసతులు, పనితీరు వృద్ధి చెందింది. ఆర్‌బీఐ ఇండెక్స్ ఐదు విస్తృత కొలమానాలను కలిగి ఉంటుంది. ఇది వివిధ కాలాల్లో దేశంలో డిజిటల్ చెల్లింపుల తీరు, వ్యాప్తిని కొలవడానికి వీలు కల్పిస్తుంది.

### ప్లాస్టిక్ పదార్థాల రీసైక్లింగ్‌లోకి ఆర్‌ఎస్‌ఆర్‌ఎల్




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్యావరణ నిర్వహణ సేవల్లో ఉన్న రీ సస్టేనబిలిటీ, రీసైక్లింగ్ (ఆర్‌ఎస్‌ఆర్‌ఎల్) తాజాగా ప్లాస్టిక్ పదార్థాల రీసైక్లింగ్ కేంద్రాలను స్థాపిస్తోంది. ఇందుకోసం ఆర్తి సర్క్యులారిటీతో చేతులు కలిపింది. సంయుక్త భాగస్వామ్య కంపెనీ ద్వారా తొలి ప్లాంటును హైదరాబాద్‌లో నెలకొల్పుతున్నట్టు బుధవారం ప్రకటించింది. దశలవారీగా ఇతర నగరాల్లో ఇటువంటి కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తారు. రీసైక్లింగ్ ద్వారా 2030 నాటికి రోజుకు 500 టన్నులు ఉత్పత్తి చేయాలని నిశ్చయించినట్టు రీ సస్టేనబిలిటీ ఎండీ మసూద్ మాలిక్ ఈ సందర్భంగా తెలిపారు. ముడి పదార్థాలు, ఇంధనాలు, రీసైకిల్ చేసిన పాలిమర్ ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగించేందుకు వీలుగా అధునాతన సర్క్యులర్ మెటీరియల్స్‌ను ఉత్పత్తి చేయడానికి ప్లాస్టిక్స్‌తో సహా విభిన్న వ్యర్థాల నుండి వనరులను వేరుపర్చడం, సేకరణ, రీసైక్లింగ్‌పై ఈ కేంద్రాలు దృష్టి సారిస్తాయి.

### బోర్డు సమావేశాలు

ఎల్‌అండ్‌టీ, బయోకాన్, అదానీ ఎంటర్‌ప్రైజస్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, డాబర్ ఇండియా, గెయిల్, దీపక్ ఫెర్టిలైజర్స్, దొడ్ల డైరీ, కళ్యాణ్ జ్యువెలర్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, జిందాల్ స్టీల్, పోకర్ణ, ప్రజ్ ఇండస్ట్రీస్, ప్రెస్టేజ్ ఎస్టేట్స్, వారీ ఎనర్జీస్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, స్టార్ సిమెంట్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హైడెల్‌బర్గ్ ఇండియా, అవాస్ ఫైనాన్సియర్స్, అజంతా ఫార్మా, బజాజ్ హోల్డింగ్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా, కేర్ రేటింగ్స్

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-1-2025

| | |
|---|---|
| విశాఖ | 505-00 |
| చిత్తూరు | 553-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 490-00 |
| విజయవాడ | 500-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 480-00 |
| వరంగల్ | 482-00 |
| రిటైల్ ధర | 5.40 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SHRIRAMFIN | 551.2 | 3.98 |
| BEL | 267.85 | 3.72 |
| TATAMOTORS | 754.8 | 3.65 |
| SBILIFE | 1,465.90 | 3.27 |
| TRENT | 5,625.00 | 3.11 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ITCHOTELS | 173.65 | -3.53 |
| MARUTI | 11,953.00 | -1.41 |
| ASIANPAINT | 2,223.70 | -0.81 |
| BHARTIARTL | 1,605.70 | -0.78 |
| BRITANNIA | 5,030.50 | -0.6 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 5,175 |
| ఎన్‌ఎస్‌ఈ | 91,470 |
| ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్) | 3,78,131 |
| ఎఫ్‌ఐఐ | - 2,586 |
| డీఐఐ | + 1.793 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 72.90 (రాత్రి 11.30కు) | $ 73.77 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 75.85 (రాత్రి 11.30కు) | $ 76.49 (క్రితం ముగింపు) |




# కుటుంబానికే ఓటు!

- 78 శాతం ఉద్యోగుల మనోగతమిదే
- ఇండీడ్ తాజా నివేదికలో వెల్లడి

ముంబై: వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై కొన్నేళ్లుగా జరుగుతున్న చర్చలు.. వారంలో 90 గంటలు పని చేయాలన్న ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు దానిపై సోషల్ మీడియాలో వెల్లువెత్తిన నిరసనలు, జోకులు, కామెంట్లు, వాదనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్లోబల్ జాబ్ సైట్ ఇండీడ్ చేపట్టిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాలుపంచుకున్న 78 శాతం మంది ఉద్యోగులు కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇండీడ్ ఫ్యూచర్ కెరీర్ రిజల్యూషన్ రిపోర్ట్ ప్రకారం.. భారతీయ ఉద్యోగుల ప్రాధాన్యతలలో గణనీయ మార్పు వచ్చింది. దాదాపు ఐదుగురిలో నలుగురు (78 శాతం) 2025లో కెరీర్‌లో పురోగతి కంటే జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులతో గడిపేందుకే మొగ్గుచూపుతున్నారు. ఉద్యోగులు తక్కువ ఒత్తిడిని కోరుకుంటున్నారు. మానసిక ప్రశాంతతపై ఎక్కువ దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. ఉద్యోగం, వ్యక్తిగత జీవితం మధ్య మెరుగైన సమతుల్యత కావాలంటున్నారు.

**జాబ్ మార్కెట్‌పై సానుకూలం..**

భారతీయ ఉద్యోగులు జాబ్ మార్కెట్ గురించి ఆశాజనకంగా ఉన్నారని నివేదిక వెల్లడించింది. అభివృద్ధి చెందుతున్న రంగాలు, పరిశ్రమలలో అవకాశాల విస్తరణపై 55 శాతం మంది విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగులు విభిన్న నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి చురుకుగా పని చేస్తున్నారు. ఇందుకు అనువుగా తమని తాము మలుచుకుంటున్నారు. కొత్త ఉద్యోగ అవకాశాలు అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఏ ప్రాంతానికైనా వెళ్లి పనిచేసేందుకూ రెడీ అంటున్నారు. ఎక్కువ సంపాదించడం ముఖ్యం అయినప్పటికీ.. సురక్షిత ఉద్యోగం, న్యాయమైన వేతనం, ప్రత్యేకతను చూపే ప్రయోజనాలను కలిగి ఉండాలని కోరుకుంటున్నారని ఇండీడ్ ఆస్ట్రేలియా, ఇండియా, సింగపూర్ మార్కెటింగ్ డైరెక్టర్ రేచల్ టౌన్స్లీ తెలిపారు. 2024 డిసెంబర్–2025 జనవరి మధ్య చేపట్టిన ఈ సర్వేలో ఉద్యోగ వేటలో ఉన్న 2,507 మంది భారతీయులతో సహా సింగపూర్, జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన 6,126 మంది పాలుపంచుకున్నారు.

**నైపుణ్యాల ఆధారంగానే..**

అధునాతన సాంకేతికతలను స్వీకరించేందుకూ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని నివేదిక వివరించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికత కూడిన రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయని 55 శాతం మంది ఆశాభావంతో ఉన్నారు. ఎమోషనల్ ఇంటెలిజెన్స్, కాన్ఫ్లిక్ట్ రిజల్యూషన్, డేటా లిటరసీ, ఏఐ, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ వంటివి 2025లో కెరీర్ పురోగతికి ఉపయోగపడే నైపుణ్యాలుగా భావిస్తున్నారు. సంప్రదాయ డిగ్రీ-ఆధారిత అర్హతల కంటే నైపుణ్యాల ఆధారిత నియామకాలు ఉంటాయని 59 శాతం మంది భారతీయ ఉద్యోగులు విశ్వసిస్తున్నారు. ఈ ధోరణి సాంకేతికత, ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో ఉద్యోగాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలకు తగ్గట్టుగా అనుకూలత, ప్రత్యేక నైపుణ్యాలను ప్రదర్శించగల అభ్యర్థులకు కంపెనీలు ఎక్కువగా విలువ ఇస్తున్నాయి. ప్రతిభావంతులకే గుర్తింపు, తదుపరి దశలకు వెళ్తారన్న భావన ఉద్యోగుల్లో ఉంది' అని నివేదిక వివరించింది.

క్యూ3 ఫలితాలు

# మారుతీ లాభం స్పీడ్

క్యూ3లో రూ. 3,727 కోట్లు




న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 16 శాతం ఎగసి రూ. 3,727 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 3,207 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 33,513 కోట్ల నుంచి రూ. 38,764 కోట్లకు బలపడింది. స్టాండెలోన్ నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 3,525 కోట్లకు చేరింది. ఈ కాలంలో రూ. 36,802 కోట్ల అమ్మకాలను సాధించింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. 13 శాతం అధికంగా మొత్తం 5,66,213 వాహనాలను విక్రయించింది. వీటిలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఒక త్రైమాసికంలో 99,220 యూనిట్లను ఎగుమతి చేసింది. గతేడాది సాధించిన 5,01,207 యూనిట్ల అమ్మకాలలో 71,785 వాహన ఎగుమతులు నమోదయ్యాయి. సుజుకీ మోటార్ గుజరాత్‌ను విలీనం చేసుకునేందుకు బోర్డు అనుమతించినట్లు మారుతీ పేర్కొంది. ఎండీ, సీఈవోగా హిసాషీ టకూచీ మరో మూడేళ్లు బాధ్యతలు నిర్వహించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది.

**బీఎస్ఈలో మారుతీ షేరు 1.2 శాతం నష్టంతో రూ. 11,973 వద్ద ముగిసింది.**

# రిటైల్‌లోకి డి బీర్స్




న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారంలో ఉన్న దిగ్గజ సంస్థ డి బీర్స్ భారత్‌లో రిటైల్‌లోకి ప్రవేశిస్తోంది. ఈ ఏడాది 15 ఫరెవర్‌మార్క్ బ్రాండ్ స్టోర్లను ప్రారంభించనున్నట్లు బుధవారం తెలిపింది. 2030 నాటికి 100 రిటైల్ స్టోర్లను నెలకొల్పాలని యోచిస్తున్నామని డి బీర్స్ ఇండియా ఎండీ అమిత్ ప్రతిహారి వెల్లడించారు. 'తద్వారా ఆ సమయానికి ఒక మిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫరెవర్‌మార్క్ జ్యువెలరీ బ్రాండ్ ద్వారా రిటైల్‌లో పెట్టుబడి పెడుతున్నాం. ఈ ఏడాది ఢిల్లీలో ఎనిమిది, ముంబైలో 15 స్టోర్లను ప్రారంభిస్తాం. జూన్-జూలైలో తొలి కేంద్రం రానుంది. మార్కెట్ వాటాను పెంచుకోవడానికి సొంతంగా, లేదా ఫ్రాంచైజీ విధానంలో ప్రత్యేక స్టోర్ల ఏర్పాటుపై ఎక్కువ దృష్టి పెడతాం. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వజ్రాభరణాల మార్కెట్‌గా భారత్ నిలిచింది. ఈ పరిశ్రమ ఇక్కడ 10 శాతం మాత్రమే వ్యాప్తి చెందింది. విస్తరణకు భారీ అవకాశం ఉంది' అని తెలిపారు. డైమండ్ వెరిఫికేషన్ టెక్నాలజీతో కూడిన చిన్న పరికరాన్ని కంపెనీ విడుదల చేసిందని, దీనిని భారత్‌లో వాణిజ్యీకరిస్తామని చెప్పారు. వజ్రం సహజమైనదా లేదా కృత్రిమమైనదా అని ఈ పరికరం గుర్తిస్తుందని వివరించారు. సింథటిక్ డైమండ్స్ వల్ల సహజ వజ్రాల పరిశ్రమకు ఎలాంటి ముప్పు లేదని అన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రెండింటినీ వేరు చేయడానికి నాణ్యత ధృవీకరణ అవసరం ఉందని చెప్పారు.

## జీ స్క్వేర్ రియల్టర్స్ రూ. 1,000 కోట్ల పెట్టుబడులు



వచ్చే రెండేళ్లలో ప్రణాళికలు

చెన్నై: కార్యకలాపాల విస్తరణలో భాగంగా రియల్టీ దిగ్గజం జీ స్క్వేర్ రియల్టర్స్ వచ్చే రెండేళ్లలో రూ. 1,000 కోట్లు పైగా ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్, కోయంబత్తూర్ తదితర నగరాల్లో ప్లాట్లను విక్రయిస్తున్న కంపెనీ ఇక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడువ్యాప్తంగా రెసిడెన్షియల్ విభాగంలోకి విస్తరించాలని భావిస్తోంది. విల్లాలు, అపార్ట్‌మెంట్లను కూడా నిర్మించనుంది. ప్లాట్ మార్కెట్లో విజయవంతమైన నేపథ్యంలో గృహాల మార్కెట్లోకి కూడా ప్రవేశిస్తున్నట్లు సంస్థ ఎండీ బలరామజయం తెలిపారు. జీ స్క్వేర్ ఇప్పటివరకు 127 ప్రాజెక్టులను పూర్తి చేసిందని, 15,000 మంది పైగా కస్టమర్లకు సేవలు అందించిందని వివరించారు.

## ఇన్ఫోసిస్, సీమెన్స్ మరింత సహకారం



న్యూఢిల్లీ: ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ తన డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలను జెనరేటివ్ ఏఐతో వేగవంతం చేయడానికి టెక్నాలజీ దిగ్గజం సీమెన్స్ ఏజీతో సహకారాన్ని విస్తరిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 2,50,000 మందికిపైగా సీమెన్స్ నిపుణులకు నైపుణ్యం పెంచే అవకాశాలు, వ్యక్తిగతీకరించిన అభ్యాసం, వృద్ధి అనుభవాన్ని అందించడం ఈ సహకారం లక్ష్యం అని ఇన్ఫోసిస్ తెలిపింది.

## మేధస్సును నమ్ముకోండి.. ఏఐని కాదు..

విద్యార్థులకు ముకేశ్ అంబానీ ఉద్బోధ




అహ్మదాబాద్: దేశ పురోగతి ప్రజల మేథోశక్తితోనే సాధ్యపడుతుందే తప్ప కృత్రిమ మేథస్సు (ఏఐ) లాంటి వాటితో కాదని పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ వ్యాఖ్యానించారు. చాట్‌జీపీటీలాంటి ఏఐ సాధనాలు మనిషి ఆలోచనా శక్తికి ప్రత్యామ్నాయం కాబోవని స్పష్టం చేశారు. 'మన విద్యార్థులకు ఒక సలహా ఇవ్వదల్చుకున్నాను. అదేమిటంటే, మీరు వివిధ విషయాలను నేర్చుకునేందుకు ఏఐని ఒక సాధనంగా ఉపయోగించుకోవడంలో నిపుణులై ఉండొచ్చు, కానీ మీ సొంత ఆలోచనా శక్తిని, ఆలోచించే సామర్థ్యాలను వదిలేయకండి. మీరు తప్పకుండా చాట్‌జీపీటీని వాడుకోవచ్చు. కానీ మనం పురోగమించేది మన ఆలోచనా శక్తితోనే తప్ప ఏఐతో కాదని గుర్తుంచుకోండి' అని పండిట్ దీన్‌దయాళ్ ఎనర్జీ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితకాలం పాటు నేర్చుకుంటూనే ఉండాలని అంబానీ సూచించారు.

'టెక్నాలజీ వేగవంతంగా మారిపోతున్న నేపథ్యంలో నిరంతరం నేర్చుకోవడమనేది ఒక ఆప్షన్ కాదు. మనుగడ కోసం, విజయం కోసం అత్యంత ఆవశ్యకం. కాబట్టి కుతూహలంతో ఉండాలి. నిరంతరం నేర్చుకుంటూ ఉండాలి' అని ఆయన చెప్పారు. ఈ శతాబ్దం ఆఖరుకన్నా ముందే భారత్ సుసంపన్న దేశంగా ఎదుగుతుందని అంబానీ ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఆర్థిక ప్రగతి అనేది మన భూగ్రహాన్ని ప్రమాదంలోకి నెట్టివేయకుండా, వాతావరణ సంక్షోభాన్ని తీవ్రతరం చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత భారత్ సహా ఇతర పెద్ద దేశాలన్నింటి మీదా ఉంటుందన్నారు. మరోవైపు, విద్యార్థులు డబ్బు వెంట పరుగులు తీయకుండా నాణ్యత, శ్రేష్ఠత మీద దృష్టి పెట్టాలని కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ సూచించారు. ఆ రెండూ ఉంటే డబ్బుతో పాటు మిగతావన్నీ కూడా వస్తాయని పేర్కొన్నారు.

# ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడుల జోరు

- 2024లో రూ. 3.94 లక్షల కోట్లు
- 2023లో రూ. 1.61 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి భారీ స్థాయిలో పెట్టుబడులు ప్రవహించాయి. గత క్యాలెండర్ ఏడాది(2024)లో రూ. 3.94 లక్షల కోట్ల నిధులు లభించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇవి రెట్టింపుకాగా.. ఇది మార్కెట్లపట్ల ఇన్వెస్టర్లలో పెరిగిన విశ్వాసాన్ని, దీర్ఘకాలిక పెట్టుబడుల పట్ల ఆసక్తిని ప్రతిబింబిస్తోంది. ప్రధానంగా ఇందుకు క్రమానుగత పెట్టుబడి పథకాలు(సిప్‌లు) ఉపయోగపడుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే కొత్త ఏడాది(2025)లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే వీలున్నట్లు అంచనా వేస్తున్నారు. 2024 డిసెంబర్ ప్రారంభం నుంచి మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) పరిశ్రమలో పెట్టుబడులు తగ్గడం ప్రారంభమైనట్లు జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో, సహవ్యవస్థాపకుడు సంతోష్ జోసెఫ్ పేర్కొన్నారు. ఇందుకు స్టాక్ మార్కెట్ల ఆటుపోట్లు కారణమైనట్లు తెలియజేశారు. చరిత్ర ప్రకారం మార్కెట్ల ఆధారంగానే ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు ప్రవహిస్తుంటాయని వివరించారు. మార్కెట్ల ఒడిదుడుకులు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపుతుంటాయని అందువల్ల ప్రస్తుత హెచ్చుతగ్గుల కారణంగా 2025లో కొత్త ఫండ్ ఆఫర్లు(ఎన్ఎఫ్‌వోలు), ఈక్విటీ ఫండ్‌ల నిధుల సమీకరణ తగ్గే అవకాశముందని అభిప్రాయపడ్డారు.

**పెట్టుబడులు కొనసాగవచ్చు**

పరిస్థితులు సర్దుకున్నాక పెట్టుబడులపై లబ్ధి చేకూరే వీలుండటంతో దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు పెట్టుబడులను కొనసాగించే వీలున్నదని సంతోష్ తెలియజేశారు. గతేడాది మొత్తం ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పథకాలకు రూ. 3.94 లక్షల కోట్లు లభించినట్లు మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్(యాంఫీ) వెల్లడించింది. 2023లో రూ. 1.61 లక్షల కోట్ల పెట్టుబడులు మాత్రమే అందుకున్నట్లు తెలియజేసింది. కాగా.. గతేడాది భారీ పెట్టుబడుల నేపథ్యంలో ఎంఎఫ్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 40 శాతం ఎగశాయి. దీంతో 2024 డిసెంబర్‌కల్లా రూ. 30.57 లక్షల కోట్లకు ఏయూఎం చేరింది. 2023లో రూ. 21.8 లక్షల కోట్లుగా నమోదైంది. మార్కెట్లు నిలకడగా బలపడటం, ఆర్థిక అవగాహన మెరుగుపడటం, ఇన్వెస్టర్లు సిప్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలు 2024లో ఈక్విటీ ఫండ్‌ల ఉత్తమ పనితీరుకు తోడ్పాటునిచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఈక్విటీ పెట్టుబడులపై అవగాహన పెంచుకోవడం ద్వారా సంపద వృద్ధికి వీలు దోహదపడినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ సీఈవో గణేశ్ మోహన్ పేర్కొన్నారు. మార్కెట్లు నిలకడగా బలపడటం, పెట్టుబడుల్లో డిజిటైజేషన్‌తో ఈక్విటీ ఎంఎఫ్‌లు పెట్టుబడులను ఆకట్టుకున్నట్లు తెలియజేశారు.

**థిమాటిక్ ఫండ్స్ స్పీడ్**

గతేడాది ఈక్విటీ పథకాలలో థిమాటిక్ ఫండ్స్ అత్యధికంగా రూ. 1.55 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్ రూ. 32,465 కోట్లు, రూ. 34,223 కోట్లు చొప్పున అందుకున్నాయి. లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ. 19,415 కోట్లు ప్రవహించాయి. పెట్టుబడుల్లో రూ. 2.5 లక్షల కోట్లతో సిప్‌లు ప్రధాన పాత్ర పోషించాయి.

# టాటా మోటార్స్ లాభం డౌన్

క్యూ3లో రూ. 5,578 కోట్లు ● జేఎల్‌ఆర్ అమ్మకాల రికార్డ్




న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 22 శాతం క్షీణించి రూ. 5,578 కోట్లకు పరిమితమైంది. ప్యాసింజర్, వాణిజ్య వాహన అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 7,145 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,10,577 కోట్ల నుంచి రూ. 1,13,575 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,04,494 కోట్ల నుంచి రూ. 1,07,627 కోట్లకు పెరిగాయి. లగ్జరీ కార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్ 7.5 బిలియన్ పౌండ్ల రికార్డ్ ఆదాయాన్ని సాధించింది.

**బీఎస్ఈలో టాటా మోటార్ షేరు 3.3 శాతం జంప్‌చేసి రూ. 752 వద్ద ముగిసింది.**

# బజాజ్ ఫైనాన్స్ మెరుగైన పనితీరు

నికర లాభంలో 18 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ బజాజ్ ఫైనాన్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు ప్రదర్శించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 18 శాతం పెరిగి రూ.4,308 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,639 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.14,166 కోట్ల నుంచి రూ.18,058 కోట్లకు వృద్ధి చెందింది. నిర్వహణలోని ఆస్తుల విలువ 28 శాతం పెరిగి రూ.3,98,043 కోట్లకు చేరినట్టు బజాజ్ ఫైనాన్స్ వెల్లడించింది. 2023 డిసెంబర్ చివరికి నిర్వహణ ఆస్తుల విలువ రూ.3,10,968 కోట్లుగా ఉండడం గమనార్హం. నికర వడ్డీ ఆదాయం 9,382 కోట్లకు బలపడింది. అంతక్రితం ఏడాది డిసెంబర్ త్రైమాసికంలో ఇది రూ.7,655 కోట్లుగా ఉంది. రుణ ఆస్తుల్లో వసూలు కాని మొండి బకాయిలు (స్థూల ఎన్‌పీఏలు) ఇదే కాలంలో 0.95 శాతం నుంచి 1.12 శాతానికి ఎగిశాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.37 శాతం నుంచి 0.48 శాతానికి పెరిగాయి. 2023 డిసెంబర్ త్రైమాసికంలో స్టేజ్-3 ఆస్తులకు సంబంధించి (మొండి బకాయిలు) ప్రొవిజన్ కవరేజీ రేషియో 62 శాతంగా ఉంటే, అది 2024 డిసెంబర్ త్రైమాసికం నాటికి 57 శాతానికి తగ్గింది. బీఎస్ఈలో బుధవారం బజాజ్ ఫైనాన్స్ షేరు 2 శాతం లాభపడి రూ.7,758 వద్ద ముగిసింది.

# ఒలెక్ట్రా లాభం 71 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 71.68 శాతం అధికమై రూ.46.3 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.344 కోట్ల నుంచి రూ.517 కోట్లకు ఎగసింది. ఒలెక్ట్రా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో బుధవారం 1.15 శాతం పెరిగి రూ.1,325.15 వద్ద స్థిరపడింది.

# అంబుజా సిమెంట్స్ లాభం అప్

క్యూ3లో రూ. 2,620 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 2,620 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,091 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,052 కోట్ల నుంచి రూ. 8,415 కోట్లకు బలపడింది. అమ్మకాల పరిమాణం 16.5 మిలియన్ టన్నులను తాకింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. ఈ కాలంలో పలు కంపెనీలను కొనుగోలు చేయడంతో ఫలితాలను పోల్చి చూడతగదని కంపెనీ తెలియజేసింది. సంఘీ ఇండస్ట్రీస్(గుజరాత్), పెన్నా ఇండస్ట్రీస్(హైదరాబాద్), మై హోమ్ ఇండస్ట్రీస్(తమిళనాడు) తదితరాలను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా.. ఇతర ఆదాయంతో కలిపి మొత్తం టర్నోవర్ రూ. 10,681 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ. 8,348 కోట్లకు చేరాయి. స్టాండెలోన్ నికర లాభం రూ. 1,758 కోట్లుకాగా.. నిర్వహణ ఆదాయం రూ. 4,850 కోట్లుగా నమోదైంది.

**అంబుజా సిమెంట్ షేరు బీఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 522 వద్ద ముగిసింది.**

# ఇండియన్ బ్యాంక్ లాభం జూమ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 2,852 కోట్లకు చేరింది. కీలక వడ్డీ ఆదాయం పెరగడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,119 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 16,099 కోట్ల నుంచి రూ. 17,912 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 14,198 కోట్ల నుంచి రూ. 15,759 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం రూ. 4,097 కోట్ల నుంచి రూ. 4,749 కోట్లకు వృద్ధి చూపింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.47 శాతం నుంచి 3.26 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.53 శాతం నుంచి 0.21 శాతానికి దిగివచ్చాయి.

**ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 6 శాతం జంప్‌చేసి రూ. 546 వద్ద ముగిసింది.**

# స్టీల్ స్మిత్...



సుదీర్ఘ ఇన్నింగ్స్‌లకు చిరునామా

10 వేల పరుగుల క్లబ్‌లోకి ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్

అంచెలంచెలుగా అత్యున్నత స్థాయికి ఎదిగిన వైనం

లెగ్ స్పిన్నర్‌గా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆ కుర్రాడు... క్లిష్ట సమయాల్లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ పొందాడు. చిత్రవిచిత్రమైన స్టాన్స్‌తో ప్రత్యర్థి బౌలర్లను తికమక పెట్టడమే పనిగా పెట్టుకున్న అతడు... సుదీర్ఘ ఇన్నింగ్స్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. 'బాల్ ట్యాంపరింగ్' వివాదంతో ఏడాది పాటు ఆటకు దూరమైనా... తిరిగి వచ్చాక తన పరుగుల దాహం తీరనిదని నిరూపించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో రెండు వేర్వేరు దేశాలపై 10కిపైగా సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన ఆ ప్లేయర్... తాజాగా మరో ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 10,000 పరుగులు పూర్తి చేసుకున్న 15వ ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. మనం ఇంత సేపు చెప్పుకున్నది ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ గురించే. శ్రీలంకతో తొలి టెస్టు ద్వారా 10 వేల పరుగుల మైలురాయిని దాటిన నాలుగో ఆస్ట్రేలియా ప్లేయర్‌పై ప్రత్యేక కథనం...

సాక్షి క్రీడా విభాగం

టెక్నిక్‌లో విరాట్ కోహ్లిని సమం చేయలేకపోయినా... నిలకడలో జో రూట్‌ని తలపించకపోయినా... క్లాసిక్ షాట్‌లలో కేన్ విలియమ్సన్‌తో పోటీ పడలేకపోయినా... భారీగా పరుగులు చేయడంలో మాత్రం స్టీవ్ స్మిత్ ఈ ముగ్గురికి ఏమాత్రం తీసిపోడు. ఆధునిక క్రికెట్‌లో 'ఫ్యాబ్-4'గా గుర్తింపు తెచ్చుకున్న ఈ నలుగురిలో ఇప్పటికే ఇంగ్లండ్ మాజీ సారథి రూట్ (12,972) పది వేల పరుగుల మైలురాయి దాటగా... శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు ద్వారా 35 ఏళ్ల స్టీవ్ స్మిత్ (10,103) ఈ క్లబ్‌లో చేరాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ విలియమ్సన్ (9,276), భారత మాజీ సారథి కోహ్లి (9,230) ఈ జాబితాలో కాస్త వెనక ఉన్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారీగా పరుగులు చేయడం అలవాటుగా మార్చుకున్న స్మిత్... 115వ టెస్టులో 10 వేల పరుగుల మైలురాయిని దాటాడు. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా భారత్‌పైనే స్మిత్ ఈ మార్క్ అందుకుంటాడు అనుకుంటే... సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 4 పరుగుల వద్ద అవుటై... 9,999 పరుగుల వద్ద నిలిచిపోయాడు. గతంలో ఆస్ట్రేలియా నుంచి 10 వేల పరుగుల మైలురాయి దాటిన అలెన్ బోర్డర్, స్టీవ్ వా సిడ్నీలోనే ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించగా... తాజాగా స్మిత్ గాలే స్టేడియంలో ఆ జాబితాలో చేరాడు.

### 55 కంటే ఎక్కువ సగటుతో...

మ్యాచ్‌ల సంఖ్య పరంగా చూసుకుంటే స్మిత్ 115వ టెస్టులో 10 వేల పరుగుల మైలురాయి దాటి... సంగక్కరతో కలిసి వేగంగా ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. బ్రియాన్ లారా 111వ టెస్టులోనే ఈ మార్క్ దాటి అగ్రస్థానంలో ఉన్నాడు. ఇన్నింగ్స్‌ల పరంగా స్మిత్ (205) ఐదో స్థానంలో ఉన్నాడు. లారా (195 ఇన్నింగ్స్‌లు), సచిన్ టెండూల్కర్ (195 ఇన్నింగ్స్‌లు), కుమార సంగక్కర (195 ఇన్నింగ్స్‌లు), రికీ పాంటింగ్ (196 ఇన్నింగ్స్‌లు) ముందున్నారు. ఇక టెస్టు క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తి చేసుకున్న వారిలో స్మిత్ మూడో అత్యుత్తమ సగటు (56.44) నమోదు చేసుకున్నాడు. పాంటింగ్ (58.72), టెండూల్కర్ (57.61) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కెరీర్‌లో తొలి 20 టెస్టుల్లో దాదాపు లెగ్‌స్పిన్నర్ గానే జట్టులో చోటు దక్కించుకున్న స్మిత్... ఆ తర్వాత ఆడిన 50 టెస్టుల్లో తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటాడు. వరుసగా 78వ టెస్టు మ్యాచ్‌లో 55 కంటే ఎక్కువ సగటుతో బ్యాటింగ్ చేసిన తొలి ప్లేయర్‌గా స్మిత్ రికార్డుల్లోకెక్కాడు. సచిన్ వరుసగా 65 టెస్టుల్లో 55కు పైగా సగటుతో బ్యాటింగ్ చేశాడు. 2015లో చివరిసారి స్మిత్ సగటు 55 కంటే తక్కువ నమోదైంది. ఆ తర్వాత భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూ ముందుకు సాగిన స్మిత్ రికార్డులు తిరగరాయడమే పనిగా పెట్టుకున్నాడు.

### గోడకు కొట్టిన బంతిలా...

అటు ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్, ఇటు భారత్‌తో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో పరుగుల వరద పారించిన స్మిత్... దశాబ్ద కాలానికి పైగా ఆసీస్ జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. తీవ్ర ఒత్తిడితో కూడుకున్న ఈ రెండు సిరీస్‌ల్లోనూ స్మిత్ తనదైన ముద్ర వేశాడు. చాన్నాళ్లుగా నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ వస్తున్న స్మిత్... ఓపెనర్ డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ తర్వాత ఇన్నింగ్స్ ఆరంభించేందుకు కూడా వెనుకాడలేదు. ఆసీస్ తరఫున వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడి జట్టును గెలిపించడమే తన లక్ష్యమని గతంలో పలుమార్లు వెల్లడించిన స్మిత్... దక్షిణాఫ్రికా సిరీస్‌లో 'బాల్ ట్యాంపరింగ్'తో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆ సంఘటన అనంతరం తన తప్పేం లేదని చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చిన స్మిత్... నిషేధం ముగించుకొని తిరిగి వచ్చాక ఇతర ఆటగాళ్ల సారథ్యంలోనూ అంతే నిబద్ధతతో ఆడాడు. గోడకు కొట్టిన బంతిలా విజృంభించి విమర్శించిన వాళ్ల నోళ్లు మూయించాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌పై ఇప్పటి వరకు 12 శతకాలు బాదిన స్మిత్... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో సెంచరీని కలుపుకుంటే టీమిండియాపై 11 శతకాలు కొట్టాడు. రెండు వేర్వేరు జట్లపై 10కి పైగా టెస్టు సెంచరీలు చేసిన ఏకైక ప్లేయర్ స్మిత్ మాత్రమే అంటే అతడి నిలకడ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇంటా బయటా అనే తేడా లేకుండా పరుగుల దాహంతో దూసుకుపోతున్న స్మిత్ ఇదే జోరు కొనసాగిస్తే... అతడి ఖాతాలో మరిన్ని రికార్డులు చేరడం ఖాయమే!

**టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితా**

| ఆటగాడు | దేశం | మ్యాచ్‌లు | పరుగులు |
|---|---|---|---|
| సచిన్ టెండూల్కర్ | భారత్ | 200 | 15,921 |
| రికీ పాంటింగ్ | ఆస్ట్రేలియా | 168 | 13,378 |
| జాక్వస్ కలిస్ | దక్షిణాఫ్రికా | 166 | 13,289 |
| రాహుల్ ద్రవిడ్ | భారత్ | 164 | 13,288 |
| జో రూట్ | ఇంగ్లండ్ | 152 | 12,972 |
| అలిస్టర్ కుక్ | ఇంగ్లండ్ | 161 | 12,472 |
| కుమార సంగక్కర | శ్రీలంక | 134 | 12,400 |
| బ్రియాన్ లారా | వెస్టిండీస్ | 131 | 11,953 |
| చందర్‌పాల్ | వెస్టిండీస్ | 164 | 11,867 |
| మహేళ జయవర్ధనే | శ్రీలంక | 149 | 11,814 |
| అలెన్ బోర్డర్ | ఆస్ట్రేలియా | 156 | 11,174 |
| స్టీవ్ వా | ఆస్ట్రేలియా | 168 | 10,927 |
| సునీల్ గావస్కర్ | భారత్ | 125 | 10,122 |
| స్టీవ్ స్మిత్ | ఆస్ట్రేలియా | 115 | 10,103 |
| యూనిస్ ఖాన్ | పాకిస్తాన్ | 118 | 10,099 |



# వందన పునరాగమనం

- ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌కు భారత మహిళల హాకీ జట్టు ఎంపిక
- ఫిబ్రవరి 15 నుంచి భువనేశ్వర్‌లో మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో స్వదేశంలో జరిగే అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) మహిళల ప్రొ లీగ్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన ఈ బృందానికి సలీమా టెటె నాయకత్వం వహిస్తుంది. నవనీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. వెటరన్ స్ట్రయికర్ వందన కటారియా జాతీయ జట్టులోకి పునరాగమనం చేసింది. గత ఏడాది జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి గాయం కారణంగా దూరమైన వందన ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకోవడంతో ఆమెను ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల వందన భారత్ తరఫున 317 మ్యాచ్‌లు ఆడి 158 గోల్స్ సాధించింది. 2016 రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం నెగ్గిన టీమిండియాలోనూ వందన సభ్యురాలిగా ఉంది. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో కాంస్యం... 2018 జకార్తా ఆసియా క్రీడల్లో రజతం... 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన భారత జట్టులోనూ వందన భాగస్వామిగా ఉంది. 2021లో 'అర్జున అవార్డు' సొంతం చేసుకున్న వందనకు 2022లో కేంద్రం నుంచి 'పద్మశ్రీ' కూడా వరించింది. వందనతోపాటు డిఫెండర్లు నిక్కీ ప్రధాన్, జ్యోతి ఛత్రి, బల్జీత్ కౌర్, ముంతాజ్ ఖాన్, రుతుజాలకు కూడా జాతీయ జట్టులో స్థానం లభించింది. ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు భువనేశ్వర్‌లో జరిగే భారత అంచె ప్రొ లీగ్‌లో భారత్‌తోపాటు జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్, ఇంగ్లండ్ జట్లు పోటీపడతాయి. భారత జట్టు తమ మ్యాచ్‌లను ఫిబ్రవరి 15, 16వ తేదీల్లో ఇంగ్లండ్‌తో... 18, 19వ తేదీల్లో స్పెయిన్‌తో... 21, 22వ తేదీల్లో జర్మనీతో... 24, 25వ తేదీల్లో నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

**భారత మహిళల హాకీ జట్టు**

సవిత పూనియా, బిచ్చూ దేవి ఖరిబం (గోల్‌కీపర్లు), సుశీలా చాను, నిక్కీ ప్రధాన్, ఉదిత, జ్యోతి, ఇషికా చౌధరీ, జ్యోతి ఛత్రి (డిఫెండర్లు). వైష్ణవి విఠల్ ఫాల్కే, నేహా, మనీషా చౌహాన్, **సలీమా టెటె** (కెప్టెన్), సునెలితా టొప్పో, లాల్‌రెమ్‌సియామి, బల్జీత్ కౌర్, షర్మిలా దేవి (మిడ్ ఫీల్డర్లు), నవనీత్ కౌర్ (వైస్ కెప్టెన్), ముంతాజ్ ఖాన్, ప్రీతి దూబే, రుతుజా పిసాల్, బ్యూటీ డుంగ్‌డుంగ్, సంగీత కుమారి, దీపిక, వందన కటారియా.

# 'స్వర్ణ' శిరీష

- రాష్ట్ర పారాథ్లెటిక్స్ మీట్‌లో రెండు పసిడి పతకాలు
- కాంస్యం నెగ్గిన దివ్య



దివ్య



శిరీష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారాథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లా దివ్యాంగ క్రీడాకారిణులు శిరీష, దివ్య అదరగొట్టారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో శిరీష ఎఫ్40 కేటగిరీలో షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఈవెంట్స్‌లో అగ్రస్థానంలో నిలిచి రెండు స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. దివ్య ఎఫ్47 కేటగిరీలో 100 మీటర్ల రేసులో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. వీరిద్దరూ హయత్‌నగర్‌లోని అకాడమీ స్పోర్ట్స్ సెంటర్‌లో కోచ్ నేనావత్ వినోద్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

# శ్రీకాంత్ శుభారంభం

- తొలి రౌండ్‌లోనే ఓడిన తరుణ్, ఆయుశ్, మిథున్
- మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక జోడీ ముందంజ



బ్యాంకాక్: కొత్త ఏడాదిలో భారత స్టార్ షట్లర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి విజయం అందుకున్నాడు. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రపంచ 47వ ర్యాంకర్ శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-18తో డానిల్ దుబోవెంకో (ఇజ్రాయెల్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 36 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్ ఆరంభంలో వరుసగా ఆరు పాయింట్లు గెలిచి 6-0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఇదే జోరును కొనసాగించి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్‌కు కాస్త ప్రతిఘటన ఎదురైంది. స్కోరు 15-15తో సమమైన దశలో శ్రీకాంత్ ఒక్కసారిగా విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 19-15తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత మూడు పాయింట్లు కోల్పోయిన శ్రీకాంత్ రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి 11-21, 15-21తో చికో వార్డోయో (ఇండోనేసియా) చేతిలో, ఆయుశ్ శెట్టి 15-21, 17-21తో జింగ్ హోంగ్ కోక్ (మలేసియా) చేతిలో, మిథున్ మంజునాథ్ 14-21, 13-21తో షోలే ఐదిల్ (మలేసియా) చేతిలో, సతీశ్ కుమార్ 15-21, 18-21తో అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ (భారత్) 15-21, 21-15, 21-19తో జూన్ వె చీమ్ (మలేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు.



శ్రీకాంత్

మహిళల సింగిల్స్‌లో రక్షిత శ్రీ ముందంజ వేయగా... తాన్యా హేమంత్, తారా షా, శ్రియాన్షి వలిశెట్టి తొలి రౌండ్‌లో ఓడిపోయారు. రక్షిత శ్రీ 21-19, 21-16తో లుయో యు వు (చైనా)పై గెలుపొందగా... తాన్యా 21-15, 11-21, 13-21తో కిసోనా సెల్వదురయ్ (మలేసియా) చేతిలో, తారా షా 15-21, 16-21తో థమనోవన్ నితిత్‌క్రాయ్ (థాయ్‌లాండ్) చేతిలో, శ్రియాన్షి 17-21, 13-21తో పిచమోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు.

మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జంట 21-8, 21-16తో వీరాఫట్-సరారట్ (థాయ్‌లాండ్) జోడీపై విజయం సాధించింది.

# మిథాలీ అడుగు జాడల్లోనే...

**'రికార్డు సెంచరీ'పై గొంగడి త్రిష వ్యాఖ్య**



కౌలాలంపూర్: ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ చేసిన తొలి ప్లేయర్‌గా రికార్డు సృష్టించిన తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష... తన ప్రదర్శనపై దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ ప్రభావం ఉందని వెల్లడించింది. వరల్డ్‌కప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో 'సూపర్ సిక్స్' పోరులో 59 బంతులాడి అజేయంగా 110 పరుగులు చేసిన త్రిష... ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలో హైదరాబాదీ స్టార్ బ్యాటర్ మిథాలీ రాజ్‌ను చూసి నేర్చుకున్నానని వెల్లడించింది. 2023 మహిళల అండర్-19 ప్రపంచకప్‌తో పాటు, గతేడాది అండర్-19 ఆసియాకప్‌లో భారత జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన త్రిష... తాజా సెంచరీని తండ్రి రామిరెడ్డికి అంకితమిచ్చింది. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'మిథాలీ రాజ్‌ను చూస్తూ పెరిగాను. ఆమె ఇన్నింగ్స్‌ను నిర్మించే తీరు నాకెంతో ఇష్టం. నేను కూడా అలాగే చేయాలని ఎప్పటి నుంచో అనుకునే దాన్ని. నా ఆదర్శ క్రికెటర్ మిథాలీ. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే భారీ ఇన్నింగ్స్ ఆడాలనుకున్నా. మొత్తానికి అది స్కాట్లాండ్‌పై సాధ్యపడింది. తొలుత బ్యాటింగ్ చేయడాన్ని ఇష్టపడతా. అప్పుడే మొత్తం 20 ఓవర్లు ఆడి భారీ స్కోరు చేసేందుకు వీలుంటుంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో టాస్ ఓడిపోవడంతో ఆ అవకాశం దక్కింది. క్రీజులో ఉన్నప్పుడు వ్యక్తిగత స్కోరును పట్టించుకోను. సహచరులు సంబరాలు చేసుకునేంత వరకు సెంచరీ పూర్తి చేసుకున్నానని గుర్తించలేదు. చిన్నప్పటి నుంచి మా నాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఈ సెంచరీని ఆయనకే అంకితమిస్తున్నా. అమ్మానాన్న సహకారం లేకుంటే ఇక్కడి వరకు వచ్చేదాన్ని కాదు' అని త్రిష వెల్లడించింది. తాజా ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న త్రిష... వరుసగా రెండో సారి కప్పు ముద్దాడడమే తమ లక్ష్యమని పేర్కొంది.

## ఒంటరిగా ఆధిక్యంలో గుకేశ్



విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో పదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 7.5 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉన్నాడు. మాక్స్ వార్మెర్‌డామ్ (నెదర్లాండ్స్)తో బుధవారం జరిగిన పదో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 34 ఎత్తుల్లో గెలిచాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద 6.5 పాయింట్లతో మూడో స్థానంలో, ఇరిగేశి అర్జున్ 3 పాయింట్లతో 13వ స్థానంలో ఉన్నారు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

## సెమీస్‌లో తమిళనాడు డ్రాగన్స్

రూర్కెలా: పురుషుల హాకీ ఇండియా లీగ్‌లో తమిళనాడు డ్రాగన్స్ జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. యూపీ రుద్రాస్‌తో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో తమిళనాడు డ్రాగన్స్ 'షూటౌట్'లో 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. అయినప్పటికీ నిర్ణీత 10 మ్యాచ్‌ల తర్వాత తమిళనాడు జట్టు 18 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఇప్పటికే శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్, జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్, హైదరాబాద్ తూఫాన్స్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి.



## క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)-చార్లెస్ బ్రూమ్ (బ్రిటన్) ద్వయం 6-4, 6-3తో హేడెన్ జోన్స్-పావ్లె మారిన్‌కోవ్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. మరోవైపు ఫ్రాన్స్‌లో జరుగుతున్న మాంట్‌పెలియర్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో యూకీ-ఒలివెట్టి జంట 7-5, 3-6, 10-8తో జేకబ్ ష్నయిటర్-మార్క్ వాల్నర్ (జర్మనీ) ద్వయంపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెడుంజెళియన్ (భారత్) జోడీ 1-6, 5-7తో ఫ్లావియో కొబొల్లి (ఇటలీ)-జొనాథన్ ఎసెరిక్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.

## సహజ, రష్మిక ఓటమి

పుణే: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్‌లో భారత నంబర్ వన్, తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి, భారతమూడో ర్యాంకర్, తెలంగాణకే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో సహజ 4-6, 3-6తో టాప్ సీడ్ లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్) చేతిలో... రష్మిక 6-7 (2/7), 2/6)తో మూడో సీడ్ పన్నా ఉద్వార్డి (హంగేరి) చేతిలో ఓడిపోయారు.



రష్మిక



సహజ

## మతసంబంధ ప్రాంతాల్లో గతంలో తొక్కిసలాటలు

న్యూఢిల్లీ: మహాకుంభమేళాలో తొక్కిసలాట తర్వాత చాలా మంది దేశంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన తొక్కిసలాట ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఎక్కువ మరణాలు సంభవించిన ఘటనల్లో కొన్ని..

- **2015 జూలై 14:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ప్రారంభోత్సవం వేళ జరిగిన తొక్కిసలాటలో 27 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది గాయపడ్డారు.
- **2005:** మహారాష్ట్రలోని మంధార్‌దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 340 మంది భక్తులు చనిపోయారు
- **2008:** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సిటీలో ఛాముండీ దేవి ఆలయం వద్ద బాంబుపేలుతుందన్న పుకార్లతో తొక్కిసలాట జరిగి 250 మంది చనిపోయారు
- **2008:** హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవీ ఆలయంలో తొక్కిసలాటలో 162 మంది మృతి చెందారు
- **2024 జూలై 2:** యూపీలోని హాథ్రాస్‌లో స్వయంప్రకటిత గురువు భోలేబాబా సత్సంగ్‌లో ఆయన నడిచి వెళ్లిన నేలమీది మట్టిని ముట్టుకుంటే మంచిదని కొందరు మైకులో ప్రకటించడంతో బురదమయ ప్రాంగణంపై జనం ఎగబడ్డారు. ఈ ఘటనలో 121 మంది చనిపోయారు.
- **2013 అక్టోబర్ 13:** మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ ఆలయ నవరాత్రి వేడుకలో తొక్కిసలాట జరిగి 115 మంది చనిపోయారు
- **2011 జనవరి 14:** కేరళలోని పల్మేడులో జనం మీదకు జీపు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగి 104 మంది శబరిమల భక్తులు మృతి చెందారు
- **2010 మార్చి 4:** యూపీలోని క్రిపాలూ మహరాజ్ సమీప రామజానకీ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 63 మంది చనిపోయారు.

## దక్షిణ సుడాన్‌లో కూలిన విమానం

### 18 మంది మృతి

జుబా: దక్షిణ సుడాన్‌లో తేలికపాటి విమానం ఒకటి బుధవారం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనా ఆయిల్ సంస్థ గ్రేటర్ పయనీర్ ఆపరేటింగ్ కంపెనీ ఈ విమానాన్ని అద్దెకు తీసుకుంది. ప్రయాణ సమయంలో ఇద్దరు పైలెట్లతో కలిపి విమానంలో మొత్తం 21 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. యూనిటీ స్టేట్‌లోని చమురు క్షేత్రం వద్ద నున్న ఎయిర్‌స్ట్రిప్ నుంచి దక్షిణ సుడాన్ రాజధాని జుబాలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరిన ఈ విమానం టేకాఫ్ సమయంలో కూలిపోయింది.



బుధవారం ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేసేందుకు గుమిగూడిన భక్తులు



తొక్కిసలాట కారణంగా షాహీ స్నాన్ చేయకుండానే వెనుతిరిగిన సాధువులు



తొక్కిసలాట వేళ భక్తులను దూరంగా తీసుకెళ్తున్న పోలీసు



తొక్కిసలాట తర్వాత భక్తుల దుస్తులు, బ్యాగులతో చిందరవందరగా మారిన ఘటనాస్థలి



ఘటనాస్థలి నుంచి భక్తుల సంచులు, చెప్పలను తొలగిస్తున్న కార్మికుడు

# ఏమిటీ సంగం నోస్?

మహాకుంభమేళాలో సంగం నోస్ అనే ఘాట్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక తొక్కిసలాట జరగడంతో ఈ ఘాట్ వద్దే జనం ఎందుకు ఎక్కువగా పోగుబడ్డారు? అసలు ఈ ఘాట్ విశేషాలు ఏంటీ? అనేవి ఇప్పుడు చర్చనీయాంశాలు అయ్యాయి. గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే ప్రాంతాన్ని త్రివేణీ సంగమ స్థలిగా పేర్కొంటారు. పైన ఉత్తరం దిక్కు నుంచి గంగా నది, ఎడమ వైపు దక్షిణ దిక్కు నుంచి యమునా నది వచ్చి ఒక వంపు వద్ద కలుస్తాయి. ఈ ప్రాంతం ఆకాశం నుంచి చూస్తే దాదాపు మనిషి ముక్కులాగా కనిపిస్తుంది. అందుకే త్రిభుజాకారంలో ఉండే ఈ ప్రాంతానికి జనబాహూళ్యంలో 'సంగం నోస్(ముక్కు)'అనే పేరు కూడా ఉంది. అంతర్వాహిణిగా సరస్వతి నదీ ప్రస్తావనను పక్కనబెడితే ప్రయాగ్‌రాజ్ నగర శివారులో రెండు నదులు కలవకముందు విస్తరించి ఉన్న సువిశాల నదీ తీరాల పొడవునా కోట్లాది మంది భక్తులు కుంభమేళాలో భాగంగా పుణ్యస్నానాలు చేస్తున్నారు. అయితే నదులు కలవకముందు ప్రవాహాల తీరాల వెంట పుణ్యస్నానాలు ఆచరించడం కంటే మూడు నదులు కలిసే ఈ 'సంగం నోస్'వద్ద పుణ్యస్నానం ఆచరిస్తేనే మోక్షం లభిస్తుందనే వాదనా బలంగా వినిపిస్తోంది. చాలా మంది భక్తులు సైతం దీనినే విశ్వసిస్తారు.

### సాధువుల స్నానాలు ఇక్కడే

సాధారణ భక్తుల విషయం పక్కనబెడితే నాగ సాధువులు, అఖాడాల సభ్యులు, ప్రముఖులు అంతా దాదాపు ఈ సంగం నోస్ వద్దే స్నానాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ, అందులోనూ ఇంతటి భక్తజనకోటి లేరుకాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్ధానమవుతుంది. అంతర్వాహిణిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.



### ఇరుకు ప్రాంతాన్ని విశాలంగా విస్తరించి..


సంగం నోస్ వాస్తవానికి ముక్కు చివరలాగా కాస్తంత ముందుకు సాగినట్లు ఉండే నదీతీర ప్రాంతం. ఇక్కడ ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుండటంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు. ఇలా సంగం నోస్ వద్ద తూర్పువైపుగా శాస్త్రి వంతెన సమీపంలో 26 హెక్టార్ల భూభాగం అదనంగా అందుబాటులోకి తెచ్చారు. మరో కిలోమీటరున్నర పొడవునా ఇసుక బస్తాలు వేసి ఘాట్‌ను విస్తరించారు. దీంతో సంగం నోస్ ఘాట్ వద్ద ఒకేసారి ఎక్కువ మంది స్నానాలు చేసే వెసులుబాటు లభించింది. గతంలో 2019 ఏడాది కుంభమేళాలో ఈ ఘాట్‌లో ప్రతి గంటకు 50,000 మంది స్నానాలు చేశారు. విస్తరణ తర్వాత ఈసారి ఇక్కడ గంటకు ఏకంగా 2,00,000 మంది భక్తులు స్నానాలు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. జనవరి 13, 14 తేదీల్లో ఇక్కడే గంటకు 3,00,000 మంది పుణ్యస్నానాలు చేశారు. అయితే సాధువులు హాజరయ్యే 'అమృత స్నానం' రోజున సాధారణ భక్తులను ఈ సంగం నోస్ ఘాట్‌లోకి రాకుండా ఆపేస్తారు. 'అమృత స్నానం' కాకుండా మిగతా రోజుల్లో ఆవలి వైపు ఒడ్డు నుంచి వేరే ఘాట్‌ల నుంచి పడవల్లో ఇక్కడికి చేరుకుని స్నానాలు చేస్తుంటారు. అయితే అమృత స్నానం వంటి రోజుల్లో మాత్రం సంగం నోస్ ఘాట్‌ల వద్దకు పడవలను అనుమతించబోరు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి.

- సాక్షి, నేషనల్ డెస్క్

# కులగణన.. మహిళలకు 33% రిజర్వేషన్

- 300 యూనిట్ల ఉచిత్ విద్యుత్.. రూ.500లకే ఎల్‌పీజీ
- ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు
- ఢిల్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల్లో తమ పార్టీకి అధికారాన్ని కట్టబెడితే కులగణన చేపడతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని తెలిపింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేష్, జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరాలు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ప్రజలకు సామాజిక, ఆర్థిక అంశాల్లో తోడ్పాటును అందించేలా వివిధ సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ హామీలు గుప్పించింది. పూర్వాంచల్ వాసుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం సహా చదువుకున్న నిరుద్యోగ యువతకు ఏడాదిపాటు నెలకు రూ.8,500 ఆర్థిక సహాయం వంటి వాగ్దానాలను ప్రకటించింది.





మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న జైరాం రమేశ్

### యమునా కాలుష్య పాపం రెండు పార్టీలదే: జైరాం రమేశ్

మేనిఫెస్టో విడుదల సందర్భంగా మాట్లాడిన జైరాం రమేశ్, యమునా నదీ కాలుష్య పాపం పూర్తిగా, ఆప్, బీజేపీలదేనని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత వల్లే కాలుష్యం ఢిల్లీ ప్రజలకు పెనుశాపంగా మారిందని ధ్వజమెత్తారు. షీలా దీక్షిత్ హయంలో యమునా కాలుష్యాన్ని నియంత్రించేందుకు జపాన్ ప్రభుత్వంతో కలిసి పనిచేశామని, కాలుష్యాన్ని అరికట్టేలా 7 వేలకు పైగా సీఎన్‌జీ, మెట్రో సర్వీసులను ప్రారంభించామని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేసిన మాదిరే ఢిల్లీలోనే పథకాల అమలు జరుగుతుందని హామీ ఇచ్చారు.

### కాంగ్రెస్ ఇచ్చిన హామీలు

- ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.
- పింఛను రూ.2,500 నుంచి రూ.5,000కు పెంపు.
- వితంతువుల కూతుళ్ల పెళ్లికి రూ.1.1 లక్షల సాయం
- ఢిల్లీ వ్యాప్తంగా 100 ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు. ఈ క్యాంటీన్లలో రూ.5కే భోజనం
- పూర్వాంచల్‌కు కొత్త మంత్రిత్వ శాఖ.
- ప్రతి వార్డులో 24 గంటల డిస్పెన్సరీ, 10 మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు
- రూ. 25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య కవరేజీ
- విద్యార్థుల కోసం 700 పబ్లిక్ లైబ్రరీల ఏర్పాటు.
- మురుగునీటి మౌలిక సదుపాయాల పునరుద్ధరణ ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే యమునా నదిలో విడుదల చేసేలా ప్రణాళిక
- పునరావాస కాలనీలు, అనధికార కాలనీలలో నివసించే ప్రజలకు యాజమాన్య హక్కులు
- 24 గంటల స్వచ్ఛమైన తాగునీరు
- సీనియర్ సిటిజన్లు, వితంతువులు, వికలాంగులకు నెలకు రూ.5,000 పెన్షన్
- 15,000 మంది సివిల్ డిఫెన్స్ వాలంటీర్ల పునర్నియామకం.
- జైన్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు
- 'ప్యారీ దీదీ యోజన'కింద మహిళలకు నెలకు రూ.2,500
- నిరుద్యోగ యువతకు నెలవారీ రూ.8,500 సాయం
- రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్
- కుటుంబాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్
- ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

## చెన్నై విమానాశ్రయంలో రూ. 25 కోట్ల విలువైన గంజాయి సీజ్

సాక్షి, చెన్నై: థాయ్ నుంచి చెన్నైకు వచ్చిన విమానంలో ఖరీదైన గంజాయి పట్టుబడింది. రూ. 25 కోట్లు విలువైన ఈ గంజాయిని సీజ్ చేసిన అధికారులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి మంగళవారం అర్ధరాత్రి చెన్నైకు వచ్చిన విమానంలో కస్టమ్స్ అధికారులు సోదాలు చేశారు. ఇందులోని ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీలు చేశారు. ఇందులో పర్యాటక వీసాపై థాయ్‌కు వెళ్లి వచ్చిన ఓ మహిళతో పాటు ముగ్గురిపై అనుమానాలు నెలకొన్నాయి. వీరిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి విచారించారు. వారి సూట్ కేసులను సోదా చేశారు. ఇందులో కొన్ని ప్యాకెట్లు బయట పడ్డాయి. వాటిని పరిశీలించగా ఖరీదైన గంజాయిగా తేలింది. 23 కేజీల ఈ గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 25.50 కోట్లుగా నిర్ధారించారు. ఈ ముగ్గురిని విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

## కేజ్రీవాల్ రిజర్వేషన్ల వ్యతిరేకి

### దళితులు, మైనార్టీలంటే ఆయనకు గిట్టదు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రిజర్వేషన్ల వ్యతిరేకి అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దళితులు, మైనార్టీలు, పేదలను ఆయనకు ద్వేషిస్తుంటారని అన్నారు. బుధవారం ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడారు. సుపరిపాలన, నీతివంతమైన రాజకీయాల గురించి మాట్లాడుతున్న కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఢిల్లీలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని విమర్శించారు. మద్యం కుంభకోణంలో విచ్చలవిడిగా ప్రజాధనం దోచుకున్నారని ఆక్షేపించారు. యమునా నదిలో స్నానం చేస్తానని, ఆ నది నీటినే తాగునని ప్రగల్భాలు పలికిన కేజ్రీవాల్ ఇప్పుడు తనకు సవాళ్లు విసురుతున్నాడని ధ్వజమెత్తారు. యమునా నది ప్రక్షాళన జరగక ఢిల్లీ ప్రజలు మురికి నీరు తాగుతుంటే కేజ్రీవాల్ మాత్రం అద్దాల మేడలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని ఆక్షేపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం రిజర్వేషన్ల వ్యతిరేకి అని రాహుల్ ఆరోపించారు.

## ఫిబ్రవరి 4న ట్రంప్‌తో నెతన్యాహు భేటీ !

గాజా: వచ్చే నెల నాలుగోతేదీన అమెరికా అధ్యక్షభవనంలో ట్రంప్‌తో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ భేటీకానున్నారు. ట్రంప్ తనను ఆహ్వానించారని నెతన్యాహూ వెల్లడించారు. యుద్ధానికి విరామం ఇచ్చి కాల్పుల విరమణను కొనసాగించాలని హమాస్ సాయుధ గ్రూప్, ఇజ్రాయెల్‌పై అమెరికా ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో నెతన్యాహూ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ రెండోదఫా అధికార పగ్గాలు చేపట్టాక వైట్‌హౌజ్‌ను సందర్శించబోతున్న తొలినేత నెతన్యాహూ కావడం విశేషం. ఇజ్రాయెల్‌లో స్వపక్షం, విపక్షాల నుంచి విమర్శలను ఎదుర్కొంటున్న వేళ నెతన్యాహుకు ట్రంప్ నుంచి పిలుపురావడం దేశంలో ఆయన పలుకుబడిని పెంచుతుందని భావిస్తున్నారు.

# భారీ ప్రయోగాలే లక్ష్యం

- 2040 నాటికి చంద్రుడిపైకి మన వ్యోమగాములు
- ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎంతోమంది అంతరిక్ష పితామహుల కృషి ఫలితంగా శ్రీహరికోట రాకెట్ కేంద్రాన్ని సొంతంగా నిర్మించుకొని, నేటికి వంద ప్రయోగాలు పూర్తిచేసి చరిత్రపుటల్లోకి ఎక్కిందని చైర్మన్ వి.నారాయణన్ అన్నారు. ఇకపై ఆకాశమే హద్దుగా భారీ ప్రయోగాలే లక్ష్యంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆయన బుధవారం షార్‌లోని మీడియా సెంటర్‌లో మాట్లాడారు. ఇస్రో చేపట్టిన వంద ప్రయోగాల్లో పాలుపంచుకున్న అంతరిక్ష పరిశోధకులకు అభినందనలు తెలియజేశారు. రాకెట్ ప్రయోగాలకు సంబంధించి ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. ఇకపై నెలకు రెండు ప్రయోగాలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. షార్ నుంచి సెంచరీ ప్రయోగాలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. వందో ప్రయోగానికి తాను చైర్మన్‌గా ఉండడం తన అదృష్టమన్నారు. ఈ ఏడాది ప్రైవేట్‌గా పీఎస్ఎల్‌వీ-ఎన్1 పేరుతో నూతన ప్రయోగాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ఇస్రో, నాసా సంయుక్తంగా నిస్సార్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నాయని తెలిఆపరు. ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా వాణిజ్యపరమైన ప్రయోగం ఉంటుందన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి గగన్‌యాన్-1 క్రూమాడ్యూల్ ప్రయోగాన్ని హ్యూమన్ రిలేటెడ్ లాంచింగ్ వెహికల్ (హెచ్‌ఆర్ఎల్‌వీ) ద్వారా చేపట్టడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టంచేశారు. షార్ కేంద్రంలో మూడో ప్రయోగ వేదికను ప్రపంచస్థాయి ప్రయోగవేదికగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించబోతున్నామని వి.నారాయణన్ ప్రకటించారు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) ద్వారా 2040 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములను పంపిస్తామని వెల్లడించారు. అలాగే ఈ ఏడాది డిసెంబర్ ఆఖరు నాటికి తమిళనాడులోని కులశేఖరపటన్నం స్పేస్‌పోర్టు కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. డాకింగ్ టెక్నాలజీని ఉపయోగించి అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ నిర్మాణం కూడా చేయనున్నామని తెలిపారు.

## సౌదీ రోడ్డుప్రమాదంలో 9 మంది భారతీయుల దుర్మరణం

### మృతదేహాలను రప్పించేందుకు సాయపడుతున్న భారత్

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ సౌదీ అరేబియా పరిధిలో ఉన్న జిజాన్ పట్టణానికి సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని జెడ్డాలోని భారతీయ కార్యాలయం బుధవారం వెల్లడించింది. అయితే, అసలు ఈ రోడ్డు ప్రమాదం ఎలా జరిగింది?. ప్రమాదానికి కారణాలు, మృతులు భారత్‌లో ఏయే రాష్ట్రాలకు చెందినవారనే ఇతరత్రా పూర్తి వివరాలు మాత్రం ఇంకా తెలియలేదు. ''బాధిత కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల కుటుంబసభ్యులతో నిరంతరం మేం సంప్రతింపులు జరుపుతున్నాం. మృతదేహాలను భారత్‌కు తిరిగి రప్పించే ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది'' అని ఇండియన్ కాన్సులేట్ బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్ చేసింది. ''క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాం. భారత్‌లోని వారి కుటుంబసభ్యులు, బంధువులతో సంప్రతింపుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటుచేశాం'' అని పేర్కొంది. భారతీయులు మరణించిన దుర్ఘటన తెల్సి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ''జెడ్డాలో భారత కాన్సుల్ జనరల్‌తో మాట్లాడా. ఘటన వివరాలను అడిగి తెల్సుకుంటున్నా. ఈ విషాదకాలంలో బాధిత కుటుంబాలకు పూర్తి సాయం అందిస్తాం'' అని మంత్రి జైశంకర్ తన 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు.

# సునీతా విలియమ్స్‌ను తీసుకురండి

- ఎలాన్ మస్క్‌ను కోరిన ట్రంప్
- వ్యోమగాములను వదిలేశారని బైడెన్ సర్కారుపై ఆగ్రహం

వాషింగ్టన్: నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తీసుకురావాలంటూ టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఆయన తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పంచుకున్నారు. 'బైడెన్ ప్రభుత్వం అంతరిక్ష కేంద్రంలో వదిలేసిన ఇద్దరు ధైర్యవంతులైన వ్యోమగాములను తీసుకురావాలని మస్క్‌ను కోరుతున్నా. సునీత, విల్మోర్ కొన్ని నెలలుగా అంతరిక్ష కేంద్రంలో ఎదురు చూస్తున్నారు. వీలైనంత త్వరగా వ్యోమగాములను తీసుకురావాలి. గుడ్‌లక్ ఎలాన్'అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. దీనికి మస్క్ ఎక్స్ వేదికగా స్పందించారు. ''మేం తీసుకొస్తాం. బైడెన్ ప్రభుత్వం ఇంతకాలం వారినలా వదిలేయడం దారుణం''అని మస్క్ వ్యాఖ్యానించారు. పది రోజుల మిషన్ కోసం సునీత, విల్మోర్ 2024 జూన్ 5న బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లాక వ్యోమనౌకలోని థ్రస్టర్ పనిచేయకపోవడం, హీలియం లీక్ కావడంతో వ్యోమగాములను అక్కడే వదిలేసి స్టార్‌లైనర్ క్యాప్సుల్ మాత్రం సెప్టెంబర్ 7న తిరిగి భూమి మీదకొచ్చింది. అంతరిక్షంలో ఎక్కువకాలం ఉండటంతో ఆమె చాలా బరువు తగ్గినట్లు ఇటీవల బహిర్గతమైన ఫొటోల ద్వారా వెల్లడైంది. తన ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను గతేడాది నవంబర్‌లో సునీత తోసిపుచ్చారు. తన శరీరం కొద్దిగా మారిందని, అదే బరువుతో ఉన్నానని చెప్పారు. ఒకవేళ మార్చి నెలాఖరులో వీళ్లిద్దరూ భూమికి తిరిగొస్తే అనుకోకుండా అక్కడే ఉండిపోయి 300 రోజులపాటు అంతరిక్షంలో గడిపిన వ్యోమగాములుగా మరో రికార్డ్ నెలకొల్పుతారు.

### ఎలా నడవాలో గుర్తుంచుకునేందుకు ప్రయత్నిస్తున్నా: సునీత

ఇప్పటికే 7 నెలలుగా అంతరిక్ష కేంద్రంలో ఉండిపోయిన సునీత తాను చదివిన పాఠశాల విద్యార్థులతో సోమవారం మాట్లాడారు. వర్చువల్‌గా జరిగిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో సునీతను విద్యార్థులు అత్యల్ప గురుత్వాకర్షణ స్థితిపై ప్రశ్నలు సంధించారు. ''ఈత కొట్టడం, ఎగరడం వంటి అనుభూతిని మాత్రమే ఆస్వాదిస్తున్నా. ఎక్కువకాలం అంతరిక్షంలో ఉండటం వల్ల తన శరీరం అనేక సర్దుబాట్లకు లోనైంది. చాలాకాలంగా నేను నడవలేదు. కూర్చోలేదు. పడుకోలేదు. నడవడం ఎలా ఉంటుందో గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తున్నా'' అని తెలిపారు. ''ఎలాగోలా తిరిగి రావడానికి మరో నెలరోజుల సమయం పడుతుందనుకున్నా. కానీ ఇన్ని రోజులైనా ఇంకా ఉండాల్సి రావడం కాస్త ఇబ్బందిపెడుతోంది. వృద్ధాప్యంలో ఉన్న నా తల్లితో వీలైనంతసేపు మాట్లాడుతున్నా. అంతరిక్ష కేంద్రంలో బిజీ షెడ్యూల్, కుటుంబంతో క్రమం తప్పకుండా మాట్లాడటం వల్ల తాను ఒంటరిగా ఉన్నట్లు భావించట్లేను''అని సునీత చెప్పారు.


సాక్షి ప్లస్
గురువారం। 30-1-2025

# జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ఏకైక ప్రధాని ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



## మాదిరి ప్రశ్నలు

1. ప్రత్యేక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ మార్లె
సి) లార్డ్ మాంటెగ్ డి) మెక్ డొనాల్డ్

2. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు దేని ఆధారంగా నిర్ణయించారు?
ఎ) అంబేద్కర్, గాంధీజీ డిమాండ్
బి) రౌండ్ టేబుల్ సమావేశాల చర్చలు
సి) సైమన్ కమిషన్ నివేదిక
డి) గాంధీజీ సత్యాగ్రహం

3. భారతదేశంలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏ చట్టం ద్వారా ప్రవేశపెట్టారు?
ఎ) 1909 మార్లె- మింటో సంస్కరణల చట్టం
బి) 1919 మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం
సి) 1935 భారత ప్రభుత్వ చట్టం
డి) పైవన్నీ

4. రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక ఉపాధ్యక్షుడిగా ఎవరు పనిచేశారు?
ఎ) సచ్చిదానంద సిన్హా బి) ఫ్రాంక్ ఆంటోని
సి) హెచ్.సి. ముఖర్జీ డి) వి.టి. కృష్ణమాచారి

5. కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) రచనా సంఘం - బి.ఆర్. అంబేద్కర్
బి) ప్రాథమిక హక్కుల సంఘం - సర్దార్ పటేల్
సి) సారథ్య సంఘం - రాజేంద్రప్రసాద్
డి) రాష్ట్ర వ్యవహారాల సంఘం - జవహర్‌లాల్ నెహ్రూ

6. వివిధ దేశాల రాజ్యాంగాల నుంచి గ్రహించిన అంశాలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
ఎ) ఉమ్మడి జాబితా - ఆస్ట్రేలియా
బి) సమాఖ్య ప్రభుత్వం - కెనడా
సి) ఏకీకృత న్యాయవ్యవస్థ - బ్రిటన్
డి) పైవన్నీ

7. రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టిన వారు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్
బి) బి.ఎన్. రావు సి) కె.ఎం.మున్షీ
డి) జి.వి. మౌలాంకర్

8. ప్రముఖులు, వారి వ్యాఖ్యలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) భారత ప్రభుత్వం అర్ధ సమాఖ్య - కె.సి.వేర్
బి) భారత ప్రభుత్వం కేంద్రీకృత సమాఖ్య - ఐవర్ జెన్నింగ్స్
సి) భారత ప్రభుత్వం బేరమాడే సమాఖ్య - మారిస్ జోన్స్
డి) భారత ప్రభుత్వం సహకార సమాఖ్య - జవహర్‌లాల్ నెహ్రూ

9. కిందివారిలో ముసాయిదా సంఘంలో సభ్యుడు కానివారు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్ బి) కె.ఎం. మున్షీ
సి) మాధవరావు డి) బి.ఎన్. రావు

10. పదో షెడ్యూల్‌లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు?
ఎ) 42వ సవరణ బి) 44వ సవరణ
సి) 61వ సవరణ డి) 52వ సవరణ

11. 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పును ఇచ్చింది?
ఎ) బేరుబారి Vs భారత ప్రభుత్వం- 1960
బి) కేశవానంద భారతి Vs కేరళ రాష్ట్రం - 1973
సి) గోలక్‌నాథ్ Vs పంజాబ్ ప్రభుత్వం- 1967
డి) ఎస్.ఆర్. బొమ్మై Vs భారత ప్రభుత్వం - 1993

12. కిందివాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణం ఏది?
ఎ) ద్వంద్వ ప్రభుత్వం
బి) అధికార విభజన
సి) లిఖిత రాజ్యాంగం
డి) స్వయం ప్రతిపత్తి ఉన్న న్యాయశాఖ

13. ఏ ప్రభుత్వ విధానంలో దేశాధినేత నియంతగా మారే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది?
ఎ) పార్లమెంటరీ ప్రభుత్వం
బి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
సి) సమాఖ్య ప్రభుత్వం
డి) ఏకకేంద్ర ప్రభుత్వం

14. ప్రాథమిక విధుల దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
ఎ) జనవరి 3 బి) జనవరి 9
సి) డిసెంబరు 10 డి) అక్టోబరు 24

15. అల్ప సంఖ్యాక వర్గాల కోసం చేర్చిన ప్రత్యేక హక్కు ఏది?
ఎ) సమానత్వ హక్కు
బి) పీడనాన్ని నిరోధించే హక్కు
సి) మత స్వాతంత్య్ర హక్కు
డి) విద్య, సాంస్కృతిక హక్కు

16. రాజ్యాంగ అధికరణలు - అంశాలకు సంబంధించి కిందివాటిలో సరికానిది?
ఎ) అధికరణ - 16: విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశం
బి) అధికరణ - 20: నేరాన్ని బట్టి శిక్ష
సి) అధికరణ - 25: మత స్వేచ్ఛ
డి) అధికరణ-23:బాల కార్మిక వ్యవస్థ నిషేధం

17. కిందివాటిలో ప్రాథమిక విధి కానిది ఏది?
ఎ) భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయడం
బి) మహిళలను గౌరవించడం
సి) సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం
డి) సోదరభావాన్ని పెంపొందించడం

18. ప్రభుత్వాల కర్తవ్య నిర్వహణకు మార్గదర్శకాలుగా పనిచేసేవి ఏవి?
ఎ) ప్రాథమిక విధులు
బి) ప్రాథమిక హక్కులు
సి) ఆదేశిక సూత్రాలు డి) రిజర్వేషన్లు

19. హెబియస్ కార్పస్ అనేది ఏ భాషా పదం?
ఎ) లాటిన్ బి) గ్రీకు
సి) రోమన్ డి) ఇంగ్లిష్

20. రాష్ట్రపతి ఎన్నికల్లో కింద పేర్కొన్న వారిలో ఎవరికి ఓటు హక్కు ఉండదు?
ఎ) విధాన పరిషత్ సభ్యులు
బి) లోక్‌సభకు రాష్ట్రపతి నియమించిన సభ్యులు
సి) రాజ్యసభకు రాష్ట్రపతి నియమించిన సభ్యులు
డి) పైవారందరూ

21. ఉప రాష్ట్రపతి కాకుండానే రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి ఎవరు?
ఎ) వి.వి. గిరి బి) జాకీర్ హుస్సేన్
సి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
డి) నీలం సంజీవరెడ్డి

22. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
1. మంత్రిమండలి సలహా మేరకు అధికరణ 123 ప్రకారం రాష్ట్రపతి ఆర్డినెన్సులను జారీ చేస్తారు
2. రాజ్యాంగపరమైన సమస్యల పరిష్కారానికి అధికరణ - 143 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు
ఎ) 1, 2 బి) పై రెండూ కావు
సి) 1 మాత్రమే డి) 2 మాత్రమే

23. రాష్ట్రపతి రాజీనామా లేఖను ఎవరికి సమర్పిస్తారు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) ప్రధానమంత్రి సి) ఉప రాష్ట్రపతి
డి) అటార్నీ జనరల్

24. జాతీయ అత్యవసర సమయంలో అన్ని హక్కులు రద్దయినా, రద్దు కానివి ఏవి?
ఎ) అధికరణ - 23, 24
బి) అధికరణ - 29, 30
సి) అధికరణ - 20, 21
డి) పైవేవీ కాదు

25. రాజ్యసభకు పదవిరీత్యా అధ్యక్షుడిగా ఎవరు కొనసాగుతారు?
ఎ) రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్
బి) ఉప రాష్ట్రపతి
సి) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
డి) పైన పేర్కొన్న వారెవరూ కాదు

26. కిందివారిలో రాజ్యసభకు నామినేట్ చేసిన సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన వారెవరు?
ఎ) ఇందిరాగాంధీ బి) ఐ.కె. గుజ్రాల్
సి) హెచ్.డి. దేవేగౌడ
డి) పి.వి. నరసింహారావు

27. జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ఏకైక ప్రధాని ఎవరు?
ఎ) పి.వి.నరసింహారావు
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) లాల్ బహదూర్ శాస్త్రి
డి) మొరార్జీ దేశాయ్

28. ఉప ప్రధానమంత్రికి సంబంధించి కిందివాటిలో సరైన వరుసక్రమం ఏది?
ఎ) సర్దార్ పటేల్, మొరార్జీ దేశాయ్, వై.బి. చవాన్
బి) సర్దార్ పటేల్, వై.బి. చవాన్, మొరార్జీ దేశాయ్
సి) సర్దార్ పటేల్, చరణ్‌సింగ్, ఎల్.కె. అద్వానీ
డి) సర్దార్ పటేల్, మొరార్జీ దేశాయ్, జగ్జీవన్‌రామ్

29. మంత్రిమండలి సమష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించి మంత్రి పదవికి రాజీనామా చేసిన మొదటి కేబినెట్ మంత్రి ఎవరు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్ బి) సి.డి. దేశ్‌ముఖ్
సి) గోవింద వల్లభపంత్
డి) శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

30. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 'కేబినెట్' అనే పదాన్ని ఎన్నో అధికరణలో చేర్చారు?
ఎ) 74 బి) 75 సి) 352 డి) 360

31. భారతదేశంలో భౌగోళిక ప్రదేశం ఆధారంగా అతిపెద్ద నియోజక వర్గం ఏది?
ఎ) లడఖ్ బి) మల్కాజ్‌గిరి
సి) చాందినీ చౌక్
డి) అండమాన్ నికోబార్ దీవులు

32. అధికరణ 330 ప్రకారం లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక సీట్లు కేటాయించారు. ప్రస్తుతం వాటి సంఖ్య?
ఎ) ఎస్సీ - 80, ఎస్టీ - 40
బి) ఎస్సీ - 85, ఎస్టీ - 45
సి) ఎస్సీ - 90, ఎస్టీ - 50
డి) ఎస్సీ - 84, ఎస్టీ - 47

33. ఉత్తరప్రదేశ్ తర్వాత ఎస్సీలకు అత్యధిక సీట్లు ఏ రాష్ట్రంలో కేటాయించారు?
ఎ) బిహార్ బి) తమిళనాడు
సి) పశ్చిమ బెంగాల్ డి) రాజస్థాన్

34. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
1. అధికరణ-110 ప్రకారం ఒక బిల్లు సాధారణమైందా లేదా ఆర్థికపరమైందా అనేది స్పీకర్ నిర్ణయిస్తారు
2. అధికరణ-88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్ సమావేశాల్లో, చర్చల్లో పాల్గొనవచ్చు
ఎ) 1, 2 సరికావు బి) 1, 2 సరైనవే
సి) 1 మాత్రమే సరైంది
డి) 2 మాత్రమే సరైంది

35. రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఎంత?
ఎ) మూడేళ్లు బి) నాలుగేళ్లు
సి) అయిదేళ్లు డి) ఆరేళ్లు

36. పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తున్న అంశాలను నిలిపివేసి మరో ముఖ్యమైన అంశంపై చర్చించాల్సిందిగా ప్రవేశపెట్టే తీర్మానాన్ని ఏమంటారు?
ఎ) అవిశ్వాస తీర్మానం
బి) వాయిదా తీర్మానం
సి) సావధాన తీర్మానం
డి) ఏదీకాదు

37. పార్లమెంటరీ కమిటీల్లో అతి పెద్దది ఏది?
ఎ) ప్రభుత్వ ఖాతాల సంఘం
బి) ప్రభుత్వ అంచనాల సంఘం
సి) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
డి) ఏదీకాదు

38. గవర్నర్‌కు కింది ఏ సందర్భంలో విచక్షణ అధికారం ఉంటుంది?
ఎ) రాష్ట్రంలో అధికరణ 356ను విధించడానికి రాష్ట్రపతికి సిఫారసు చేయడం
బి) విధానసభను రద్దు చేయడం
సి) బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపడం
డి) పైవన్నీ

39. సుప్రీంకోర్టు ప్రారంభ అధికార పరిధిలోకి రాని అంశం?
ఎ) కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
బి) రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
సి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
డి) ఏదీకాదు

### సమాధానాలు

1) ఎ; 2) సి; 3) సి; 4) బి;
5) డి; 6) డి; 7) బి; 8) డి;
9) డి; 10) డి; 11) ఎ; 12) బి;
13) బి; 14) ఎ; 15) డి; 16) డి;
17) ఎ; 18) సి; 19) ఎ; 20) డి;
21) సి; 22) ఎ; 23) సి; 24) సి;
25) బి; 26) ఎ; 27) బి; 28) డి;
29) ఎ; 30) సి; 31) ఎ; 32) డి;
33) సి; 34) బి; 35) డి; 36) బి;
37) బి; 38) డి; 39) డి.

# తెలంగాణ జనసాంద్రత ఎంత?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ జాగ్రఫీ

## తెలంగాణ రాష్ట్ర జనాభా-2011

భారతదేశంలో 1872 నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు.2011లో 15వ సారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు.

- కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై, జాతీయ జనాభా గణాంకాల రిజిస్ట్రార్ జనరల్ 'చంద్రమౌళి' 2011 జనాభా లెక్కల వివరాలను 2011 మార్చి 30న విడుదల చేశారు.
- ప్రపంచ జనాభాలో భారతీయులు 17.7 శాతం ఉన్నారు.
- జనాభా పరంగా భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశంగా ఉంది. చైనా మొదటి స్థానంలో ఉంది.
- 2011 గణాంకాల ప్రకారం దేశ జనాభా 121 కోట్లు

### 2011 జనాభా గణాంకాల ప్రధానాంశాలు

- 2011 జనాభా లెక్కల రిజిస్ట్రార్ జనరల్ - చంద్రమౌళి
- 2011 జనాభా లెక్కల నినాదం 'అవర్ సెన్సస్ - అవర్ ఫ్యూచర్'.
- 2011 జనగణన స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఏడోసారి నిర్వహించింది.
- దేశంలో మొట్టమొదటిసారిగా జనాభా వివరాలను 1872లో లార్డ్ మేయో కాలంలో లెక్కించారు.
- 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా గణాంకాలు సేకరిస్తున్నారు.

**తెలంగాణ రాష్ట్ర జనాభా**

| సం. | జనాభా (కోట్లలో) | జన సాంద్రత | లింగ నిష్పత్తి |
|---|---|---|---|
| 1961 | 1.27 | 111 | 975 |
| 1971 | 1.58 | 138 | 961 |
| 1981 | 2.02 | 176 | 971 |
| 1991 | 2.61 | 227 | 967 |
| 2001 | 3.10 | 270 | 971 |
| 2011 | 3.51 | 307 | 988 |
| ప్రస్తుతం | 3.50 | 312 | |

### రాష్ట్ర జనాభా - 2011

- 2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573.
- తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51,93,978.

గమనిక: ప్రస్తుతం తెలంగాణ జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను(7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 1.90 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వచ్చారు. ఫలితంగా జనాభా సంబంధిత విషయాల్లో మార్పులు జరిగాయి.

- రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం అధిక జనాభా ఉన్న జిల్లాలు 1) రంగారెడ్డి, 2) మహబూబ్‌నగర్.
- రాష్ట్రంలో అత్యల్ప జనాభా ఉన్న జిల్లాలు 1) నిజామాబాద్, 2) ఖమ్మం.

### భాష ఆధారంగా జనాభా వివరాలు

- రాష్ట్రంలో తెలుగు మాట్లాడేవారు 76 శాతం మంది ఉన్నారు.
- తెలంగాణలో ఉర్దూ మాట్లాడేవారు 12 శాతం ఉన్నారు.
- ఇతర భాషలు మాట్లాడేవారు 12శాతం ఉన్నారు

గమనిక: 1948కు ముందు హైదరాబాద్ ప్రాంతంలో అధికార భాష 'ఉర్దూ'.

జనాభా పరిమాణం: రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభాను 'రాష్ట్ర జనాభా పరిమాణం' అంటారు.

జనసాంద్రత: ఒక చదరపు కిలోమీటర్ వైశాల్యంలో నివసించే వారి సంఖ్యను లేదా జనాభాను 'జనసాంద్రత'గా పేర్కొంటారు.

- 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర జనసాంద్రత 307 (ప్రస్తుతం 312).

గమనిక: ఖమ్మం జిల్లా జనసాంద్రత 175 నుంచి 197కు పెరిగింది.

లింగ నిష్పత్తి: ప్రతి వేయి మంది పురుషులకు ఉండే స్త్రీల సంఖ్యనే 'లింగ నిష్పత్తి' అంటారు.

- 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర లింగ నిష్పత్తి 988 (1000 : 988).
- 2011 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి అధికంగా ఉన్న జిల్లాలు - 1) నిజామాబాద్ (1040), 2) ఖమ్మం, కరీంనగర్ (1008).
- 2011 లెక్కల ప్రకారం రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు.. 1) హైదరాబాద్ (954), 2) రంగారెడ్డి (961).

గమనిక: దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి 943.

- దేశంలో అధిక స్త్రీ, పురుష నిష్పత్తి ఉన్న రాష్ట్రం కేరళ (1084).
- దేశంలో అత్యల్ప స్త్రీ,పురుష నిష్పత్తి ఉన్న రాష్ట్రం - హర్యానా (879).
- తెలంగాణలో అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లాలు 1) హైదరాబాద్ (18,172), 2) రంగారెడ్డి (707).
- రాష్ట్రంలో అత్యల్ప జనసాంద్రత ఉన్న జిల్లాలు 1) ఆదిలాబాద్ (170), 2) ఖమ్మం 175 (ప్రస్తుతం - 197).

గమనిక: భారతదేశ సగటు జనసాంద్రత 382.

- దేశంలో అత్యధిక జనసాంద్రత ఉన్న రాష్ట్రం బిహార్ (1106).
- దేశంలో అత్యల్ప జనసాంద్రత ఉన్న రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్ (17).
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాలు 1) ఉత్తరప్రదేశ్, 2) మహారాష్ట్ర.
- దేశంలో అత్యల్ప జనాభా ఉన్న రాష్ట్రాలు 1) సిక్కిం, 2) మిజోరాం.

**తెలంగాణ జనాభా వృద్ధిరేటు**

| దశాబ్దం | వృద్ధిరేటు (శాతాల్లో) |
|---|---|
| 1961-71 | 24.43 |
| 1971-81 | 27.58 |
| 1981-91 | 29.27 |
| 1991-2001 | 18.77 |
| 2001-2011 | 13.58 |

**జిల్లాల వారీగా జనసాంద్రత, లింగ నిష్పత్తి**

| జిల్లాలు | జనసాంద్రత | లింగ నిష్పత్తి |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 220 | 977 |
| రంగారెడ్డి | 707 | 961 |
| హైదరాబాద్ | 18,172 | 954 |
| మెదక్ | 313 | 992 |
| నిజామాబాద్ | 321 | 1,040 |
| ఆదిలాబాద్ | 170 | 1,001 |
| కరీంనగర్ | 319 | 1,008 |
| వరంగల్ | 273 | 997 |
| ఖమ్మం | 197 | 1,008 |
| నల్లగొండ | 245 | 983 |
| మొత్తం | 312 | 988 |

గమనిక: ఖమ్మం జిల్లాలోని ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడానికి ముందు తెలంగాణ జనసాంద్రత 307.

### జనాభా వృద్ధిరేటు

ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట కాలంలో పెరిగే జనాభాను 'జనాభా వృద్ధి' అంటారు. ఏడాది కాలంలో ప్రతి వంద మంది జనాభాకు అదనంగా ఎంత మంది చేరుతున్నారో తెలిపే రేటును 'జనాభా వృద్ధిరేటు'గా పేర్కొంటారు.

- రాష్ట్రంలో 2001-11 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం.
- తెలంగాణలో 2001-11 దశాబ్ద కాలంలో అధిక జనాభా వృద్ధిరేటు ఉన్న జిల్లాలు.. 1) రంగారెడ్డి (48.16 శాతం), 2) మహబూబ్‌నగర్ (15.34 శాతం).
- రాష్ట్రంలో 2001-11 దశాబ్ద కాలంలో అల్ప జనాభా వృద్ధిరేటు నమోదైన జిల్లాలు.. 1) హైదరాబాద్ (2.97%) 2) నల్లగొండ (7.41%).

గమనిక: 2001-11లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7 శాతం.

- దేశంలో అధిక జనాభా వృద్ధిరేటు ఉన్న రాష్ట్రం మేఘాలయ (27.9 శాతం)
- దేశంలో అల్ప జనాభా వృద్ధిరేటు ఉన్న రాష్ట్రం నాగాలాండ్ (-0.6 శాతం).
- తెలంగాణలో పురుషుల జనాభా 1.77 కోట్లు. రాష్ట్ర మొత్తం జనాభాలో 50.2 శాతం పురుషులు ఉన్నారు.
- రాష్ట్రంలో పురుషుల జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాలు.. 1) రంగారెడ్డి (27.01 లక్షలు), 2) మహబూబ్‌నగర్ (20.50 లక్షలు).
- రాష్ట్రంలో పురుషుల జనాభా తక్కువగా ఉన్న జిల్లాలు.. 1) నిజామాబాద్ (12.50 లక్షలు), 2) ఆదిలాబాద్ (13.69 లక్షలు).
- రాష్ట్రంలో స్త్రీల జనాభా 1.74 కోట్లు. మొత్తం జనాభాలో 49.8 శాతం స్త్రీలు ఉన్నారు.
- రాష్ట్రంలో అత్యధిక స్త్రీ జనాభా ఉన్న జిల్లాలు 1) రంగారెడ్డి (25.95 లక్షలు), 2) మహబూబ్‌నగర్ (20.03 లక్షలు).
- రాష్ట్రంలో అత్యల్ప స్త్రీ జనాభా ఉన్న జిల్లాలు 1) నిజామాబాద్ (13.00 లక్షలు), 2) ఆదిలాబాద్ (13.71 లక్షలు).

**తెలంగాణలో జిల్లాల వారీగా జనాభా పరిమాణం**

| జిల్లాలు | పురుషులు | స్త్రీలు | మొత్తం జనాభా |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 20,50,386 | 20,02,642 | 40,53,028 |
| రంగారెడ్డి | 27,01,008 | 25,95,733 | 52,96,741 |
| హైదరాబాద్ | 20,18,575 | 19,24,748 | 39,43,323 |
| మెదక్ | 15,23,030 | 15,10,258 | 30,33,288 |
| నిజామాబాద్ | 12,50,641 | 13,00,694 | 25,51,335 |
| ఆదిలాబాద్ | 13,69,597 | 13,71,642 | 27,41,239 |
| కరీంనగర్ | 18,80,800 | 18,95,469 | 37,76,269 |
| వరంగల్ | 17,59,281 | 17,53,295 | 35,12,576 |
| ఖమ్మం | 12,98,543 | 13,08,523 | 26,07,066 |
| నల్లగొండ | 17,59,772 | 17,29,037 | 34,88,809 |
| మొత్తం | 3,50,03,674 | 1,73,92,041 | 3,50,03,674 |

## మాదిరి ప్రశ్నలు

1. 2001-11 దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్ర జనాభా వృద్ధిరేటు ఎంత?
1) 14.58 2) 13.58
3) 12.58 4) 15.58

2. తెలంగాణ రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి సగటున అత్యల్పంగా ఉన్న జిల్లా ఏది?
1) రంగారెడ్డి 2) ఆదిలాబాద్
3) హైదరాబాద్ 4) కరీంనగర్

3. జనాభా పరంగా (2011 గణాంకాల ప్రకారం) దేశంలో తెలంగాణ రాష్ట్ర స్థానం?
1) 10 2) 11 3) 12 3) 13

4. 2011 జనాభా లెక్కల నినాదం ఏమిటి?
1) అవర్ సెన్సస్ - అవర్ ప్రాపర్టీ
2) అవర్ సెన్సర్ - గ్రోత్
3) అవర్ లైఫ్ - అవర్ ప్రాపర్టీ
4) అవర్ సెన్సస్ - అవర్ ఫ్యూచర్

5. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి రెండు జిల్లాలు వరసగా?
1) రంగారెడ్డి, మహబూబ్‌నగర్
2) నిజామాబాద్, ఖమ్మం
3) మహబూబ్‌నగర్, నిజామాబాద్
4) రంగారెడ్డి, హైదరాబాద్

6. జనాభా గణాంకాలను ఎన్నేళ్లకు ఒకసారి సేకరిస్తున్నారు?
1) 5 2) 10 3) 15 4) ఏడాది

7. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనసాంద్రత ఎంత?
1) 270 2) 352 3) 307 4) 299

8. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర లింగ నిష్పత్తి ఎంత?
1) 967 2) 975 3) 971 4) 988

9. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా వృద్ధిరేటు ఉన్న జిల్లా ఏది?
1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
3) హైదరాబాద్ 4) నల్లగొండ

### సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 1;
6) 2; 7) 3; 8) 4; 9) 1.

## విద్య, ఉద్యోగ సమాచారం

### జిప్‌మర్, పుదుచ్చేరిలో 18 పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **పోస్టుల వివరాలు:** స్పెషలిస్ట్ గ్రేడ్ 2(జూనియర్ స్కేల్), జనరల్ డ్యూటీ ఆఫీసర్.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, కార్డియాలజీ, రేడియో డయోగ్నోసిస్, నెఫ్రాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ /ఎంఎస్/ డీఎన్‌బీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** స్పెషలిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు 40 ఏళ్లు, జనరల్ డ్యూటీ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్ల గరిష్ఠ వయో పరిమితి ఉంటుంది.
» **వేతనం:** స్పెషలిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు రూ.1,24,297, జనరల్ డ్యూటీ ఆఫీసర్ పోస్టులకు రూ.1,03,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును శ్రీ హవా సింగ్, రూమ్ నెం-210, రెండో అంతస్తు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, జిప్‌మర్, పుదుచ్చేరి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.02.2025.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** పుదుచ్చేరి, కరైకల్.
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

### రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో కన్సల్టెంట్ పోస్టులు

గుర్గావ్‌లో రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్).. కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **అర్హత:** సివిల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 63 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, టెక్నికల్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2025
» **ఇంటర్వ్యూ తేదీలు:** 29.01.2025 నుంచి 31.01.2025 వరకు
» **ఇంటర్వ్యూ వేదిక:** రైట్స్ ఆఫీస్ అహ్మదాబాద్, రైట్స్ కార్పొరేట్ ఆఫీస్, గురుగ్రామ్.
» **వెబ్‌సైట్:** www.rites.com

# 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించింది ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### ఇండియన్ ఎకానమీ



### గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్

1. బెంజిమన్ హిగ్గిన్స్ అల్పాభివృద్ధి దేశాలకు సంబంధించిన ఏ అంశం గురించి పేర్కొన్నారు?
ఎ) సామాజిక ద్వంద్వత్వం
బి) సాంకేతిక ద్వంద్వత్వం
సి) అల్పస్థాయి సమతౌల్య స్తంభన
డి) వస్తుమార్పిడి విధానం
2. ఆధునిక అభివృద్ధిలో సాంకేతిక ప్రగతి ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నవారు?
ఎ) కుజ్‌నట్స్ బి) హరాడ్ - డోమార్
సి) మాధుర్ డి) షుంపీటర్
3. రోస్టో వృద్ధి సిద్ధాంతం ప్రకారం స్వయం సమృద్ధి సాధించిన దశగా దేన్ని భావించవచ్చు?
ఎ) అధిక వినియోగ దశ బి) ప్లవన దశ
సి) ప్లవన దశకు ముందున్న పరిస్థితి
డి) పరిపక్వ దశకు గమనం
4. కార్ల్‌మార్క్స్ కింది వాటిలో దేనికి ప్రాముఖ్యం ఇచ్చారు?
ఎ) మూలధన ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు - మూలధన నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
5. రోస్టో రచించిన "The stages of Economic Growth" గ్రంథాన్ని ఏ విధంగా వ్యవహరిస్తారు?
ఎ) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
బి) నాన్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
సి) మూలధన సంచయనం
డి) పైవన్నీ
6. ప్రపంచంలో అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలను మొదటగా వివరించింది?
ఎ) డాల్టన్ బి) థామస్ మాల్థస్
సి) రాబిన్‌సన్ డి) డ్యూసెన్‌బరి
7. 2013-14లో దేశంలో స్థూల దేశీయ పొదుపు రేటు ఎంత?
ఎ) జీడీపీలో 30.6 శాతం
బి) జీడీపీలో 32 శాతం
సి) జీడీపీలో 33 శాతం
డి) జీడీపీలో 34 శాతం
8. "The problems of Industrialization in Eastern & South Eastern European Nations" గ్రంథకర్త?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) రొసెన్‌స్టీన్ రోడాన్ డి) థామస్ మన్రో
9. రాగ్నర్‌నర్క్స్ సిద్ధాంతం ప్రకారం డిమాండ్ కోణంలో విష వలయాన్ని ఛేదించడానికి పేద దేశాల్లో వేటికి డిమాండ్ పెరగాలి?
ఎ) పెట్టుబడి బి) పొదుపు
సి) ఆదాయం డి) వస్తువులు, సేవలు
10. 2016-17లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రపంచ బ్యాంకు ఎంత శాతంగా అంచనా వేసింది?
ఎ) 7.7 బి) 7.8 సి) 7.9 డి) 8.0
11. మూడో ప్రపంచ దేశాలు అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
ఎ) ఆల్‌ఫ్రెడ్ సవి బి) మార్షల్
సి) ఫిషర్ డి) జాన్ రాబిన్‌సన్
12. స్థిర మూల ధనానికి, చర మూలధనానికి మధ్య నిష్పత్తిని తెలిపేది?
ఎ) మూలధన - ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు - మూలధన ఉత్పత్తి నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
13. అభిలషణీయ జనాభా సిద్ధాంతాన్ని మొదటగా చెప్పిన శాస్త్రవేత్త?
ఎ) మాల్థస్ బి) ఎడ్వర్డ్ వెస్ట్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) షుంపీటర్
14. 'జనాభా పెరుగుదల సమాజంలో ఆదర్శవంతమైన మార్పునకు సహకరిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) డ్యూసెన్‌బరి
సి) గౌతమ్ మాధుర్ డి) మాల్థస్
15. బలహీన Spread effects గురించి వివరించినవారెవరు?
ఎ) హరాడ్ బి) ఫీల్డ్‌మన్
సి) గున్నార్ మిర్డాల్ డి) ఎడ్వర్డ్ వెస్ట్
16. వనరులతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా అభిప్రాయపడినవారు?
ఎ) ఫీల్డ్‌మన్ బి) హెబర్లర్
సి) మార్షల్ డి) రాగ్నర్‌నర్క్స్
17. కమ్యూనిజం, సోషలిజం ఆధారిత దేశాలను ఏ దేశాలుగా వర్ణించవచ్చు?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు
18. అంతర్జాతీయ వాణిజ్యం అల్పాభివృద్ధి దేశాల పారిశ్రామికీకరణకు అవరోధమని భావించింది?
ఎ) గున్నార్ మిర్డాల్ బి) హర్షమన్
సి) డాల్టన్ డి) హెబర్లర్
19. విద్యా ప్రమాణాలు, శ్రామిక నైపుణ్యం పెరిగితే మూలధన - ఉత్పత్తి నిష్పత్తి?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది
డి) పెరుగుదలలో పెరుగుదల రేటు ఎక్కువ
20. మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం ఏది?
ఎ) శ్రమ బి) మూలధనం
సి) వ్యవస్థాపన
డి) తక్కువ సాంకేతిక ప్రగతి
21. ద్వి అంతర నమూనాను ప్రతిపాదించింది?
ఎ) చినరీ బి) కార్ల్ మార్క్స్
సి) మహలనోబిస్ డి) ఫీల్డ్‌మన్
22. 'శ్రమ విభజన ప్రత్యేకీకరణను పెంపొందిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) ఆడమ్ స్మిత్
సి) మహలనోబిస్ డి) గౌతమ్ మాధుర్
23. 2013-14లో స్థూల దేశీయ పొదుపులో ప్రభుత్వ రంగం వాటా ఎంత?
ఎ) జీడీపీలో 1% బి) జీడీపీలో 1.3%
సి) జీడీపీలో 1.5% డి) జీడీపీలో 1.6%
24. అంతర్జాతీయ వాణిజ్యం వెనుకబడిన దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నది?
ఎ) మార్షల్ బి) హెబర్లర్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) గౌతమ్ మాధుర్
25. Incremental Capital - Output Ratio (ICOR)ను ఎలా రాబట్టవచ్చు?
ఎ) (పొదుపులో మార్పు) (పెట్టుబడిలో మార్పు)
బి) (మూలధనంలో మార్పు) (ఉత్పత్తిలో మార్పు)
సి) (పెట్టుబడిలో మార్పు) (శ్రమలో మార్పు)
డి) ఏదీకాదు
26. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన కారకం ఏది?
ఎ) మూలధన సంచయనం
బి) జనాభా పెరుగుదల
సి) సహజ వనరుల లభ్యత
డి) పైవన్నీ
27. మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా వృద్ధిరేటును తగ్గించేది?
ఎ) ప్రకృతి బి) తక్కువ ఉపాధి
సి) తక్కువ ఆదాయం డి) పైవన్నీ
28. "Towards A dynamic Economics" గ్రంథకర్త?
ఎ) డోమార్ బి) హరాడ్
సి) రాబిన్‌సన్ డి) ఫీల్డ్‌మన్
29. ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?
ఎ) ఫీల్డ్‌మన్ బి) రాబిన్‌సన్
సి) షుంపీటర్ డి) మహలనోబిస్
30. అల్పాభివృద్ధి దేశాలను ప్రపంచ మురికివాడలుగా పేర్కొన్నవారు?
ఎ) మార్షల్ బి) ఆడమ్‌స్మిత్
సి) రాబిన్‌సన్ డి) కైరన్‌క్రాస్
31. 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించింది ఎవరు?
ఎ) మార్షల్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) ఆడమ్ స్మిత్ డి) మీడ్
32. అల్ప స్థాయి సమతౌల్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలా కాలం చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నవారు?
ఎ) నెల్సన్ బి) లూయిస్
సి) డాల్టన్ డి) జె.బి. సే
33. అల్పాదాయం అనేది అల్పాభివృద్ధి దేశాల్లో విష వలయాలకు కారణమవుతోందని పేర్కొన్నవారు?
ఎ) డాల్టన్ బి) రాబిన్‌సన్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) హెబర్లర్
34. వెనుకబడ్డ దేశాల్లో అమల్లో ఉన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి నిరోధకాలుగా ఉంటాయి. వీటిని ఏమంటారు?
ఎ) సాంకేతిక పూర్వక నిరోధకాలు
బి) వ్యవస్థాపూర్వక నిరోధకాలు
సి) మార్కెట్ సంపూర్ణతలు
డి) పైవన్నీ
35. ఆసియా దేశాల్లో ఉద్యమత్వం లోపించడానికి మూలధన కొరత లేదా ముడి సరకుల కొరత కారణం కాదని పేర్కొన్నది ఎవరు?
ఎ) గున్నార్ మిర్డాల్ బి) ఆడమ్ స్మిత్
సి) జె.బి. సే డి) హెబర్లర్
36. అధిక స్థాయి తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన జనాభా స్థాయిని అభిలషణీయ జనాభాగా పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్, జె.బి. సే
బి) మార్షల్, ఆడమ్ స్మిత్
సి) డాల్టన్, ఎడ్విన్ కానన్
డి) ఏదీకాదు
37. 'పొదుపును ప్రోత్సహించడం ద్వారా లభించే మూలధనాన్ని గుర్తించిన రంగాల్లో పెట్టుబడులుగా మార్చాలి' అనేది ఏ రకమైన వృద్ధి వ్యూహం?
ఎ) ప్లవన దశ బి) సంతులిత
సి) అసంతులిత
డి) పరిపక్వ దశకు గమనం
38. "Rate of Growth and Employment" గ్రంథకర్త?
ఎ) హరాడ్ బి) డోమార్
సి) రాబిన్‌సన్ డి) రాగ్నర్‌నర్క్స్
39. మహలనోబిస్ నాలుగు రంగాల నమూనా ఏ సిద్ధాంతంపై ఆధారపడి ఉంది?
ఎ) ట్రికిల్ డౌన్ వ్యూహం
బి) సోలో సిద్ధాంతం
సి) డోమార్ సిద్ధాంతం
డి) అధిక పెట్టుబడుల సిద్ధాంతం
40. ఆదాయం, డిమాండ్ పెరగడం వల్ల లాభోద్దేశంతో సమకూరే పెట్టుబడి?
ఎ) స్వయం ప్రేరిత పెట్టుబడి
బి) ప్రేరిత పెట్టుబడి
సి) స్థూల పెట్టుబడి డి) నికర పెట్టుబడి
41. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ పోటీ, స్వేచ్ఛా వ్యాపారం, వేతన సరళత ఉండాలని పేర్కొన్నవారు?
ఎ) కీన్స్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) ఫ్రీడ్‌మన్
డి) సాంప్రదాయ ఆర్థికవేత్తలు
42. 'అభివృద్ధి లక్ష్యం అభిలషణీయ స్వర్ణయుగాన్ని సాధించడం' అని పేర్కొన్నవారు?
ఎ) గౌతం మాధుర్ బి) ఆడమ్ స్మిత్
సి) రాబిన్‌సన్ డి) జె.బి. సే
43. 'ఆర్థికాభివృద్ధి నిత్యం కొనసాగే అంతులేని ప్రక్రియ' అని పేర్కొన్నవారెవరు?
ఎ) మార్షల్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) హెగల్ డి) డాల్టన్
44. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఒక స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణించినవారు?
ఎ) షుంపీటర్ బి) గున్నార్ మిర్డాల్
సి) కీన్స్ డి) డ్యూసెన్‌బరి
45. 'ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో శ్రమ సాంద్రత పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న తర్వాత మూలధన సాంద్రత పద్ధతులు ఉపయోగించాలి' అని పేర్కొన్నవారు?
ఎ) ఐక్యరాజ్య సమితి నిపుణులు
బి) ప్రపంచ బ్యాంకు
సి) IMF డి) WTO
46. చిరకాలంలో వాస్తవిక తలసరి ఆదాయం పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా పేర్కొన్నది?
ఎ) డాల్టన్ బి) కానన్
సి) హెగల్ డి) ఆచార్య ఎల్లిస్
47. భారీ పరిశ్రమలు స్థాపించడం వల్ల దశల వారీగా వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి వచ్చి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పినవారు?
ఎ) ఆడమ్‌స్మిత్ బి) ఫీల్డ్‌మన్
సి) డాల్టన్ డి) హెగల్
48. "Business cycles, Capitalism, Socialism and Democracy" గ్రంథకర్త?
ఎ) షుంపీటర్ బి) కానన్
సి) హెగల్ డి) ఎల్లిస్
49. పొదుపు, పెట్టుబడుల మధ్య అంతరాన్ని పూరించడానికి అల్పాభివృద్ధి దేశాలు సాధారణంగా ఏ సాధనాన్ని ఉపయోగిస్తాయి?
ఎ) పన్నుల రేటు పెంచడం
బి) లోటు బడ్జెట్ సి) విదేశీ సహాయం
డి) అంతర్గత రుణాలు
50. "An Operational Research Approach to Indian Planning of 4 sector model" పుస్తక రచయిత?
ఎ) ఆడమ్ స్మిత్ బి) కార్ల్‌మార్క్స్
సి) మహలనోబిస్ డి) మార్షల్

#### సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి; 5) బి;
6) బి; 7) ఎ; 8) సి; 9) డి; 10) బి;
11) ఎ; 12) సి; 13) బి; 14) ఎ; 15) సి;
16) డి; 17) బి; 18) ఎ; 19) సి; 20) బి;
21) ఎ; 22) బి; 23) డి; 24) బి; 25) బి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) ఎ; 30) డి;
31) సి; 32) ఎ; 33) సి; 34) బి; 35) ఎ;
36) సి; 37) సి; 38) బి; 39) ఎ; 40) బి;
41) డి; 42) ఎ; 43) సి; 44) బి; 45) ఎ;
46) డి; 47) బి; 48) ఎ; 49) బి; 50) సి.

# Whose rank is first in a class test?

## MODEL QUESTIONS

***Directions (Q. No. 1-5):*** Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females work in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
1) S, T, U 2) R, S, T
3) Q, T, U 4) P, S, U
5) Can't be determined
2. Which of the following pair of person work in Administration?
1) R, S 2) Q, S 3) R, T
4) Data inadequate
5) None of these
3. Which of the following pair works on second floor?
1) P, S 2) R, S 3) Q, U
4) S, T 5) None of these
4. U works in which department?
1) Accounts 2) HR
3) Administration
4) Either HR or Administration
5) None of these
5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor.
1) R 2) S 3) Q or S
4) Data inadequate
5) None of these

***Directions (Q. No. 6-8):*** Study the following information carefully and answer the given questions:

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.
- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class. (All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
1) D - 15 2) E - 12 3) A - 18
4) D - 12 5) E - 18
7. How much more marks does A have to score to be the topper? (if only one person is on 1st position).
1) 9 2) 6 3) 8 4) 10 5) 12
8. What is the difference between the marks obtained by C and F?
1) 6 2) 7 3) 5 4) 8 5) 9

***Directions (Q. No. 9-13):*** Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

## BANK EXAMS
### REASONING

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
I) M is between R and T.
II) R sits second to the left of W.
III) U does not sit on the immediate right of R.
1) Only I and II
2) Only II and III
3) Only III
4) Only I and III
5) All I, II and III together
10. What is the code for 'cold' in a code language?
I) 'icecream is cold' is written as 'tic jic lic'.
II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
1) Only I 2) Only II
3) Only I and II 4) Only III and I
5) None of these
11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
I) P scored more than only R and S.
II) T's rank is 3rd highest.
III) U did not score the highest marks.
1) Only I 2) Only II 3) Only III
4) I, II and III even together are not sufficient to answer the question.
5) All I, II and III
12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
II) Jeena sits on the extreme end of the line.
III) Jeet sits on the immediate right of Jeevan.
1) Only II 2) Only III
3) Only I and II
4) Only I and III
5) All I, II and III together
13. How is N related to X?
I) M is brother of N; M is grandson of W.
II) S is sister of N.
III) X is mother of M's father.
1) Only I 2) Only II 3) Only III
4) All I, II and III together
5) Even I, II and III together are not sufficient

***Directions (Q. No. 14 - 18):*** Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

**Input:** set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
**Step I:** went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
**Step II:** went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
**Step III:** went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
**Step IV:** went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
**Step V:** went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
**Step VI:** went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
**Step VII:** went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

**Input:** one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.

(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
two thus so one near and 90 88 make 56 12 15 18 21
1) Step V 2) Step VI
3) Step IV 4) Step III
5) There is no such step
15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
1) 3 2) 4 3) 5 4) 2 5) 6
16. How many steps would be required to get the final output?
1) Five 2) Six 3) Four
4) Seven 5) None of these
17. Which of the following represents the position of 'and' in the fifth step?
1) Sixth from the left
2) Seventh from the left
3) Fourth from the right
4) Eighth from the left
5) Sixth from the right
18. Which word/number would be at fifth position from the right in Step VI?
1) 12 2) 18 3) 90
4) and 5) 15

### Answers With Explanations


| Person | Sex | Floor | Department |
|---|---|---|---|
| P | Male | Second floor | Accounts |
| Q | Male | First floor | Accounts |
| R | Male | Ground floor | HR/Administration |
| S | Female | Second floor | Administration |
| T(-) | Female | Ground floor | Accounts |
| U(-) | Female | First floor | HR |

**(1-5):**
1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.


**(6-8):**
E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6

6) 5; 7) 4; 8) 5;
9) 5;


**From I**




**From I and II**





**From I, II and III**





From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

10. 4; From I and III,
icecream is cold → tic jic lic ...(1)
healthy is
icecream → jic mic lic ...(2)
icecream → jic or lic
is → lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements I and III are sufficient
11. 5; From I. P > R, S
**From I and II.** – > – > T > P > R, S
**From I, II and III.**
Q > U > T > P > R, S
Hence all together are sufficient
12. 3;
Thus I and II together are sufficient.
13. 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.

Form I.




Form I& II




**From II.** S is female and Sister of M,
**From III.** X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:
Here N's gender is not defined So, we can't say whether N is Grandson or Granddaughter of X.

**(14-18):**

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

**Input:** one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
**Step I:** two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
**Step II:** two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
**Step III:** two thus so one and 90 88 make 21 56 near 12 15 18
**Step IV:** two thus so one near and 90 88 make 56 12 15 18 21
**Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
**Step VI:** two thus so one near make and 90 12 15 18 21 56 88
**Step VII:** two thus so one near make and 12 15 18 21 56 88 90

14. 3;
15. 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'. The elements are : and, 90, 12 and 15
16. 4;
17. 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.
18. 5;
**Step VI:** two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15